# సరోజినీ నాయుడు

పద్మినీ సెన్‌గుప్త




TL
923.254
N 143 S

భారతీయ

TL
923.254
N 143S

INDIAN INSTITUTE
OF
ADVANCED STUDY
LIBRARY, SHIMLA



# సరోజినీ నాయుడు

అట్టలోపలి వైపున అచ్చువేసిన శిల్పచిత్రంలో కన బడేది శుద్ధోదన మహారాజుకు గౌతమబుద్ధుని తల్లి యైన మహారాణి మాయాదేవి కన్న స్వప్నం గురించి జ్యోతిషికులు వ్యాఖ్యచేస్తూ ఉండిన దృశ్యం. వారికి దిగువ వారి వ్యాఖ్యను వ్రాసుకొంటున్న లేఖకుడు కనిపిస్తాడు. భారత దేశంలో లేఖన కళ చిత్ర శిల్పంలో నిబద్ధమై లభించే దృష్టాంతాలలో ఇదే ప్రాచీనతమమైనది.

నాగార్జున కొండ క్రీ. శ. 3 వ శతాబ్దం.

(జాతీయ పురావస్తు ప్రదర్శనశాల, న్యూఢిల్లీ, వారి సౌజన్యంతో).

భారతీయ సాహిత్య నిర్మాతలు

# సరోజినీ నాయుడు

ఆంగ్లమూలం :

పద్మినీ సెన్‌గుప్త

తెలుగుసేత :

కుందుర్తి

సాహిత్య అకాదెమి

*SAROJINI NAIDU*–Telugu translation by K. Anjaneyulu of Padmini Sen Gupta's original English monograph, Sahitya Akademi, New Delhi, (1989)
SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00

©Padmini Sen Gupta

First edition: 1980
Reprint: 1989

Library IIAS, Shimla
TL 923.254 N 143 S
00117708

సాహిత్య అకాదెమీ
ప్రధాన కార్యాలయం :
రవీంద్రభవన్, 35 ఫిరోజ్‌షా రోడ్, న్యూఢిల్లీ—110 001

విక్రయ విభాగం :
'స్వాతి' మందిర్ మార్గ్, న్యూ ఢిల్లీ - 110 001

ప్రాంతీయ కార్యాలయాలు :
29 ఎల్డామ్స్‌రోడ్, తేనాం పేట, మద్రాస్ - 600 018
బ్లాక్ V బి రవీంద్ర స్టేడియమ్, కలకత్తా - 700 029
172, ముంబయ్ మరాఠి గ్రంథ సంగ్రహాలయ మార్గ్
దాదర్, బొంబాయి : 400 014

TL
923.254
N 143 S

117708
20/12/04
SHIMLA

SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00

*Offset Printing by*
*WELDUN PRINTERS, Madras - 21.*

# వి ష య సూ చి క


| | | పుట |
|---|---|---|
| 1. ఒక వాస్తవ - అభూతకల్పన | .... | 5 |
| 2. చిన్నతనంలో | .... | 12 |
| 3. ఇంగ్లాండులో | .... | 20 |
| 4. తిరుగుప్రయాణం | .... | 25 |
| 5. శబ్ద సౌందర్యజలధి అంచులమీద | .... | 29 |
| 6. స్వర్ణప్రాంగణం | .... | 36 |
| 7. భారతకోకిల పలికింది | .... | 44 |
| 8. గోఖలేతో సాహచర్యం | .... | 49 |
| 9. గాంధీజీ గారాబుసన్నిధిలో | .... | 53 |
| 10. తెగినరెక్కతో నక్షత్రలోకానికి | .... | 59 |
| 11. స్వాతంత్ర్యోద్యమ శంఖారావం | .... | 70 |
| 12. స్నేహానికి సేతువు | .... | 75 |
| 13. స్వాతంత్ర్యరణరంగంలో | .... | 84 |
| 14. హాస్య, అలంకార, స్వేచ్ఛాప్రియ | .... | 91 |
| 15. చివరిరోజుల్లో | .... | 96 |
| 16. భారతీయ ఆంగ్లకవితావ్యాసంగం | .... | 100 |
| 17. కవిత - జీవిత తత్వం | .... | 110 |
| గ్రంథసూచిక | .... | 134 |

# ఒక వాస్తవ అభూత కల్పన

సరోజినీదేవికి తన తండ్రినుండీ, కొంతవరకు తల్లినుండీ స్వాప్నిక లోకాల్లో విహరించే మనస్తత్వం వారసత్వంగా వచ్చింది. "మా పూర్వీకులు వేలాది సంవత్సరాలుగా ప్రకృతి ప్రియులు. అరణ్యప్రాంతాలు, కొండ గుహల వంటివి వారికి యిష్టం. స్వప్నలోక విహారం చేసే స్వభావం వారిది. గొప్ప పండితులు. ఏకాంతధ్యాన నిష్ఠాగరిష్ఠులు. మా నాన్నకూడా ఆదర్శాల కలలపుట. జీవిత లక్ష్యాలు విఫలమైన మహానుభావు డాయన".[1] అందువల్ల సరోజినీదేవి సాహిత్యసేవను గురించి ఒక నిర్ణయానికి రావడానికి యీ కలల దృక్పథంతోనే పరిశీలన చేయాలి. "కలల్లోనే కరిగిపోయిన కుటుంబం మాది" అని ఆమే అంగీకరించింది. సరోజినీనాయుణ్ణి మహా కవయిత్రిగా, మనీషిగా, తత్వవేత్తగా ప్రదర్శించి చూపడానికి వృథాగా ఎంతో ప్రయత్నం జరిగింది. ఆమె యివన్నీ కాదని కాదు. ఆమె కవితలో యీ లక్షణాల మెరుగులన్నీ వున్నాయి. పైగా సమాధిగత యోగినీత్వం కూడా వుంది. కాని నిజానికి ఆమె తళుక్కున మెరిసి మాయమయ్యే క్షణికమైన మెరుపు వంటిది. ఉదయం పూసి సాయంత్రానికి రాలిపడే పూవు వంటిది. ఆమె రాసిన గేయాలు ఏ మాత్రం బరువు లేనివి. "పల్లకి బోయిలు" అనే పేరుతో రాసిన గేయం లోని బోయీలు ఎంత సునా యాసంగా మోశారో, అంత తేలికైనవి. ఆమె ఒక 'పువ్వు', ఒక 'నవ్వు' వంటిది:

---

1. స్వర్ణప్రాంగణం - ది గోల్డెన్ త్రెషోల్డ్, పేజీ 14.

ఒక 'పక్షి', ఒక 'నక్షత్రం' వంటిది. 'కాలం నుదుటి మీద మెరిసిన కాంతిరేఖ.' ఒక 'కన్నీటి బిందువు.'

అద్భుత కల్పనాగాథలతోకూడిన ఆదర్శలోకం "మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్" కథలోని దేవతామూర్తులవలె ఎంతో అందంగా వుంటుంది. సాలెగూడు లోని పురుగు, నువ్వుగింజవంటి స్వల్పపాత్రలతో— గాలిలో తేలాడే దేవతల్తో, దెయ్యాలతో కూడిన కథలవంటివి చాలా సున్నితంగా అందంగా మనోహరంగా వుంటాయి. ఈ స్వాప్నిక సంతోష లోకంలోగానీ, బాధావృత దుఃఖమయ లోకంలోగానీ సరోజినీదేవి ఎవరితోనూ కలవకుండా ఒంటరిగానే వుంటుంది. ఎందుకంటే కాంగ్రెసు ఉద్యమ రాజకీయాల కల్లోలంలోకి దూకిన తర్వాత ఆమె ఊహాలోకాల విహారం వదిలివేయవలసి వచ్చింది. తన కవితల్లోనూ, 1902 ప్రాంతంలో రాసిన ఒక వచన గీతంలోనూ తప్ప ఆమె ఊహాలోక విహారం చేయ లేక పోయింది. ఊహసౌధాలు కట్టుకునే ఆమె అంతరాత్మ ప్రేరణవల్ల యితర స్వాతంత్ర్యోద్యమ యోధులవలెకాక ఆమె విశిష్ట వ్యక్తిత్వంతో విడిగా భాసిస్తుండేది. ఆమె కూడా స్వాతంత్ర్యోద్యమ సంరంభంలో తలమునక లవుతున్నప్పటికీ, స్వాతంత్ర్యవీరులు గాంధీజీ ప్రభావంతో నేర్చుకున్న నడవడి- ఆ తెల్లని దుస్తులు, కఠిన నైతిక నిరాడంబర విధానాలు మొదలైనవి ఆమెకు లేవు. వారందరిలో పంచరంగుల కల్యాణిగా, హాసరేఖా విలాసంతో స్వతంత్ర వ్యక్తిగా ఆమె చూపరు లకు దర్శన మిస్తుండేది. అందుకే ఆమె రాసిన ప్రారంభ కవితల్లో "కలల కవిత" (ది సాంగ్ ఆఫ్ ఎ డ్రీమ్) అనేది అవతరించింది.

ఒకరాత్రి కల వచ్చింది
అడవిలో నేను నుంచున్నాను
ఒంటరితనం గడ్డకట్టిన ఒంటెలాగ—
పూపొదల్లా పుట్టుకొస్తున్న దృశ్యాల్లో
ముసకలు వేస్తోంది మనస్సు
సత్యానికి స్వరకల్పనచేస్తూ పక్షులు పాడుతున్నాయి
ప్రేమకు వ్యాఖ్యానం చెప్తూ చుక్కలు మెరుస్తున్నాయి
శాంతికి స్వాగతం పలుకుతూ సెలయేళ్లు ప్రవహిస్తున్నాయి

ఆ నిద్రాలోకపు అద్భుతారణ్య సీమల్లో....
వెన్నముద్దల్లాంటి వెన్నెల కాంతిలో
అడవిలో ఒంటరిగా నిలబడ్డాను—
ప్రేమపెట్టిన ప్రమిదల్లాంటి నక్షత్రాలు
నాలోని యౌవనం చుట్టూ ముసిరి
నాట్యం చేస్తున్నట్లున్నాయి
సత్యం తీసే కూనిరాగాల సంగీతం వినిపిస్తున్నది
కోటి కోర్కెల కొస లందుకోడానికి
నేల మీదికి వంగాను
దారి ప్రక్క పారే శాంతి ప్రవాహాల్లో
దాహం తీర్చుకోడానికి—
ఆ నిద్రాలోకపు అద్భుతారణ్య సీమల్లో...

17 సంవత్సరాల ప్రాయంలో సరోజినీదేవి కేంబ్రిడ్జిలోని గిర్టన్ కళాశాలలో చదువుతున్నప్పుడు యీ గేయం రాసింది. 1901 లో, మొదటిసారిగా యీ గేయం 'ఇండియన్ లేడీస్ మేగజిన్' లో ప్రకటించబడింది.

సరోజినీదేవి రాసిన ఊహా స్వాప్నిక చిత్రాలన్నింటిలో పరమ మనోజ్ఞ మైనది కవితల్లో రాలేదు. 1902 లో వచన, కవితలో రాసిన ఒక అభూత కల్పనా కథ "నీలాంబుజ"లో ఆ విధమైన స్వాప్నిక చిత్రణ జరిగింది. ఊహాసౌధాలు కట్టే భావకవితాబంధమూ, ఆదర్శవాదమూ కలిసి పోతపోసినట్లుండే ఆమె కవితల లోని సహజ స్వభావమే యీ వచనరూప కవితా ప్రక్రియలో కూడా ఆమె చూపింది. నిజానికి సరోజినీదేవి చిన్నతనంలోనూ, వివాహానంతర జీవితంలో ప్రారంభదశలోనూ యిటువంటి వాతావరణంలోనే కాలం గడిపింది. చదివేవారికి సరోజినీదేవి యింకా ఎక్కువగా యిటువంటి వచన కవితలే రాసి తన శబ్ద మాధు ర్యాన్ని ప్రదర్శించివుంటే బాగుండేది అనిపిస్తుంటుంది. ఎందుకంటే ఆమె కవితల్లో జలపాతధారల్లా ప్రాస సౌందర్యంతో, ఛందోబద్ధంగా శ్రవణప్రేయమైన శబ్దా లంకారాల దొంతరులుగా పరుగులుపెట్టే శబ్దాల లయ విన్యాసం ఒక్కొక్కప్పుడు

విసుగు పుట్టిస్తుంది కూడా. కాని యీ వచన కవితా ప్రక్రియలో శబ్దాలకు నియమాలనుంచి స్వేచ్ఛ లభిస్తుంది. చదవడానికి హాయిగా వుంటుంది. "నీలాంబుజ" రచనలో సరోజినీదేవి ఆంగ్లంలో తాను ఎన్నుకున్న ఛందోబంధాన్నీ, ఆ యుగంలో వున్న నియమ నిబంధనల సంకెళ్ళనూ త్రెంచుకుని కవితా రచనకు సాహసించింది.

'ఇండియన్ లేడీస్ మేగజీన్' లో "నీలాంబుజ" ప్రకటించబడింది. తరువాత నటేశన్ ప్రచురణసంస్థ ప్రకటించిన ప్రసంగ సంకలనంలో కూడా యీ కవితను చేర్చారు. 2 అయినా దీనిని గురించి కొద్దిమందికి మాత్రమే తెలుసు. దీనికి అంతగా ప్రచారం రాలేదు. "బహువర్ణ చిత్రితమైన పర్వత సానువుల వలయం మధ్యలో మండుతున్న పళ్లెంవంటి సరోవరతీరంలో ఒంటరిగా నడుస్తున్న ఆడపిల్ల"వంటి వర్ణనలతో యీ గేయంలో కూడా సరోజినీదేవి అంతశ్చైతన్యంలో పొరాడుతున్న ఒంటరితనపు భావన కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే వుంటుంది. ఈ గేయంలోని పాత్ర "నిద్రమత్తు కండ్లతో", "జలతరంగాల సవ్వడికి తాళం వేస్తున్నట్లు" సరిగా అడుగులు వేసుకుంటూ నడుస్తుంది.

ఇందులోని పాత్ర విచిత్రమైన ఆకర్షణకారి. ఒక ఆడపిల్ల హృదయంలోని ఆలోచనల అందాలనూ, వైవిధ్యాన్నీ ఆదర్శాలతో అల్లినట్లుగా వుంటుంది. "పైపైకి ఎగిసిపోతున్న తన బహుముఖ ఉత్సాహజ్వాల చేతికి అందేవరకు అసంఖ్యాక హృదయాంతరాళాలలో పాతుకున్న ఒక మహా మానవతాభావననూ, విజ్ఞాన మహాంబుధినీ, ఉత్తమజీవితాన్నీ, యీ శాశ్వత విశ్వసౌందర్యరేఖావధులనూ తాకాలనే తన ఉత్సాహపు చేలాంచలాలు అందేవరకు" యీ గేయంలోని పాత్ర నక్షత్రాలవైపు ఆశగా చూస్తుంది. నిజానికి యీ పాత్ర సరోజినీనాయుడే—తనను తాను చిత్రించుకుంది. ఇరవైమూడేండ్ల యువతి, పిల్లల తల్లిగా, సుఖసంతోషాలతో తులతూగే భార్యామణిగా, ఇంగ్లండు, ఇటలీ దేశాలలోని అనుభవాల విదేశీవాసనలు ఘుమ్మంటున్న మనస్సుతో, దేశసేవ చేయడానికీ, కవిత సృజించడానికీ స్వదేశానికి తిరిగివచ్చిన మహిళామణి. ఒక మొగ్గ పూవుగా వికసిస్తున్నది. దాని దళాలు అరుణ భానుని నునులేత కిరణాల వెచ్చదనానికి విచ్చుకుంటున్నాయి. సౌందర్య స్వాగత గీతాలాపనం చేస్తున్నాయి. "నాటినుండి సరోజినీదేవి ఒకానొక శాశ్వత జీవిత రహస్యపు ఛాయల్లోనే దాక్కుని కాలం గడిపింది. విజ్ఞానార్జనా తృష్ణాంబుధి

2. సరోజినీనాయుడు ప్రసంగాలు, రచనలు

లోతుల్లో మునిగిపోయింది. అణచరాని ఏదో ఒక ఆత్మవేదనతో ఉక్కిరిబిక్కిరై పోయింది— చిరుగాలుల సవ్వడిలో, జలబిందువుల గల గలలో, ప్రత్యూష కాంతి మాలలు పలకరిస్తున్న పర్వత శిఖరాలమీద అన్నియుగాలకూ, అన్నిజాతులకూ చెందిన మహాకవుల, వేదాంతుల, ప్రవక్తల, స్యాప్నికుల, బోధకుల పసిడి తునకల పలుకుల్లో అనంత సౌందర్యాన్ని అన్వేషిస్తూ— ఉక్కిరి బిక్కిరైపోయింది."

సరోజినీదేవి ఒక స్వతంత్ర వ్యక్తిగా ప్రపంచంలోకి ప్రవేశించే సమయంలో రాసిన అద్భుతమైన అభూత కల్పనాగాథ "నీలాంబుజ" కావ్యం. దీనిలో సరోజినీ దేవి హైదరాబాదు జీవితచ్ఛాయలు, ఆమె కలిసి మెలిసి తిరిగే వర్గ ప్రజల్లోని స్వర్ణ రజతకాంతులూ, ఇంద్ర ధనుర్వర్ణమాలారోచిస్సులు తళ తళ లాడుతుంటాయి. రాజప్రాసాదాలలో పరదాల వెనకాల భోగభాగ్యాలతో తులదూగే జీవితానికి అడ్డుగా కట్టిన మహా ప్రాకారాలు మొదలైనవి దర్శనమిస్తాయి. బయటిలోకంలో, ప్రకాశమానుడై వెలిగే సూర్యభగవానుడు, పక్షి సంగీతాల కిలకిలారవాలు, వర్ణ వైవిధ్యంతోనిండిన బహు పుష్పశోభితమైన ఉద్యానవనాలు, నిర్మాణాత్మకమైన ఆశ యాల, కార్యక్రమాల కోలాహలం అన్నీ యీ కావ్యంలో చోటు చేసుకున్నాయి. సరోజినీదేవి రాసిన యీ వచన కవితలో ఒక ఆడపిల్ల ఒంటరిగా లోకంలో జీవిస్తుంటుంది. ఆమె మంచి అందకత్తె. "కోలగావున్న సుకుమార ముఖం"లో నుండి ఆమె అందమైన కండ్లు కాంతులు విరజిమ్ముతుంటాయి. ఆమె లోపలి "గేయ లక్షణాన్ని" బయటికి విసిరి వేస్తున్నట్లుగా ఆ కండ్లు మెరుస్తుంటాయి. బంగారు కాంతుల, నీలారుణ మిశ్రమవర్ణాల దుస్తులతో, కురులలో పుష్పగుచ్ఛాల గుసగుసలతో కథానాయిక 'నీలాంబుజ' సరస్తీరం వదలిపెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ "ఒలియాండర్లు, దానిమ్మచెట్లున్న" ఉద్యానవనంలోకి వెళుతుంది. "మంచిగంధపు నూనె పోసిన రాగి పాత్రలలో నిలబెట్టిన ఒత్తుల" వెలుగులో హాలు కనపడీ కనపడని గుడ్డి వెల్తురుతో నిండి వుంది. ఆ అమ్మాయి కొంచెం ఆగింది. "ఆమె ముఖంలో దాగివున్న ఆధ్యాత్మికభావన" సంతోషపు చిరునవ్వు లోంచి బైటికి తొంగిచూసింది. కొంతమంది కన్యకామణులు "బంగారు ఛాయల, ఎర్రరంగు, పచ్చరంగు చీరెలు" ధరించి స్వైరవిహారం చేస్తూవుండడం నీలాంబుజ చూస్తుంది. మరికొందరు మర్యాదాహీనమైన ఎంబ్రాయిడరీ దుస్తులు ధరించి తిరుగు తున్నారు. కొందరు కుషన్ సోఫాలమీద ఆనుకుని దర్జాగా కూచున్నారు, సుగంధ ద్రవ్యాలు నములుతున్నారు, ప్రేమగీతాలు పాడుతున్నారు.

ఈ వర్ణన అంతా పూర్వపు స్వదేశ సంస్థానాలలో స్త్రీలోకంలో అందరికీ పరిచితమైనదే. ఆ వచ్చిన నీలాంబుజకు అందరూ స్వాగతం పలికారు. కాని ఒక క్షణకాలంపాటు పావురాళ్ళతో ఆడుకుని వరండాలోగుండా నడిచి తన గదిలోకి వెళ్ళిపోయిందామె. కిటికీ తలుపులు తెరచి, బంగారుఛాయల కర్టెన్లు తొలగించి, చీకటి గర్భంలోనికి లోతుగా చూస్తూ ఒంటరిగా నిలబడుతుంది. తన బాల్య స్మృతులనూ, ప్రస్తుత భావావేశాన్నీ ప్రకటించడానికి భాషకోసం దేవులాడు కుంటున్నట్లుగా కెవ్వున కేక వేస్తుంది. ఆమె భావనాలోకమంతా మహాకవుల, ప్రవక్తల, స్వాప్నికుల, బోధకుల సూక్తులతో నిండివుంది. ప్రపంచపు వాస్తవ పరిస్థితుల మధ్యలో వుంటున్నప్పటికీ, "మానవ జీవితంలో స్వల్పాతి స్వల్పమైన చిరు సంఘటనలలో సైతం దాగివున్న మహా శాశ్వత ప్రకృతి రహస్యాల లోతుల్లోకి తొంగి చూడాలనే గాఢమైన ఆకాంక్ష ఆమె మనసులో ఎప్పుడూ యిల్లు కట్టుకునే వుంటుంది. క్షణక్షణ పరిణామశీలమైన లోకంలో జరిగే ప్రతి సంఘటనను పరిశీ లించాలనే తహతహ గూడు కట్టుకుని వుంటుంది." ఆమె చిన్నతనం ఉజ్వలంగా భాసించిందే. ఆ దశ యిప్పుడు గడిచిపోయింది. ఇప్పుడామె "గేయకథా పాత్ర"గా మాత్రమే మిగిలిపోయింది. ప్రేమకోసం, జీవితంకోసం ఎదురు తెన్నులు కాస్తూ, "బయటి ప్రపంచానికి కనిపించని కవితా తాత్విక దర్శనం, మాటల రూపంలో చెప్పడానికి వీల్లేని అదృశ్య భావనాలోకం, యీ రెండింటిపట్ల కవియొక్క ఆత్మకు ఏర్పడవలసిన సానుభూతి సహృదయతలను" ఆకాంక్షిస్తున్నది.

క్రిందివైపు ఎవరో నవ్వుతున్న సవ్వడి- సంగీతం వినిపిస్తున్నది. నీలాంబుజ ఆ దిశగా చెవి ఒగ్గి విన్నది. ఆనంద తన్మయత్వం చెందింది. ఒక్క అడుగువేసి ఆగింది. చిరునవ్వు చిలకరించింది— "కనిపించని దుఃఖాశ్రుకణాలు కూర్చి కాలం చేసిన చిరునవ్వు" అది. తన జీవితంలో ఎంతకాలం గడిచిందో, ఎన్నేండ్లు త్వరత్వరగా పరుగెత్తిపోయాయో లెక్క మరచిపోయింది. తన ఆత్మ ఆవేదన పడు తున్న సౌందర్య సిద్ధికోసం ఒంటరితనపు ఒంపులలోకి జీవితం దూసుకుపోయింది. "ఎంతకూ తృప్తిలేని శాశ్వతత్వ కాంక్షాస్వాప్నికలోకంలో తిరుగుతూ, లోపలినుండి పొంగివస్తున్న నునులేత కోర్కెల కోలాహల ధ్వనుల్తో చెవులు బద్దలవుతూ జీవి తంలో తనకు వారసత్వమైన ఆనంద ఫలం అందకపోయెనే అనే ఆవేశంతో వెక్కి వెక్కి ఏడ్చింది."

అయితే మరి రాజకీయాల్లోకి దూకిన యీ యువ రచయిత్రి దేనికోసం అన్వేషిస్తున్నది? తరువాత రాబోయే జీవితంలో "తనకు వారసత్వమైన ఆనంద ఫలం" అందిందా? ఆమెను చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. సరోజినీదేవి మనస్సులో సుఖానుభూతుల మధ్య దాక్కుని ఎప్పుడూ ఏదో ఒక విచారరేఖ తొంగి చూస్తూనే వుంటుంది- తన కవితల్లో, ఉపన్యాసాల్లో, ఊహించిన రంగు రంగుల కలలు ఫలించక కాబోలు, తనకు వారసత్వంగా సంక్రమించిన ప్రకృతి ప్రియత్వ లక్షణాల చెట్లు కూలిన దృశ్యాలు కనిపించి కాబోలు, మాతృభూమి తన అంతరాత్మ స్వాతంత్ర్యంకోసం వేస్తున్న కేకలు వినిపించి కాబోలు!

చేతుల్లో బలం లేదు గాని
చేస్తున్న సేవ అమృతోపమానమే
చీకటి నిద్రలో మేం కన్న కలలు
నీ ఉషోదయ వైభవ సమానమే
నిశ్శబ్దపు అంచుల మీద నడుస్తూ
ఆగామి ఆనందాలు చూశాం
మా దుఃఖావేశాల నూతుల్లోంచి తోడి
మొక్కలకు నీరు పోశాం
మేం చేసిన కృషితో నీ మేలుకునే
ముహూర్తం తళతళా మెరుస్తున్నది
కాపలా కాలం గతించింది; అదుగో చూడు
ఉదయకాంతి విరుస్తున్నది.

సరోజినీదేవిలో ఎప్పుడు చూసినా మనకు ఆ ఒంటరితనపు జీవితమే కొట్ట వచ్చినట్లు కనిపిస్తుంది. శాశ్వతత్వసిద్ధికోసం చేతులు చాస్తున్న ఆమె చిత్రమే గోచరమవుతుంది. తనకు తెలియకుండానే బహుశః ఆమె ఆ సిద్ధి పొందింది— మాతృదేశ సేవలో, మధురాతి మధురమైన కవితలో. ఎందుకంటే ఆమె నిజజీవిత "స్వర్ణప్రాంగణం"లో నిలుచున్నది యీ దశలోనే.

# చిన్నతనంలో...

సరోజినీదేవి 1879 ఫిబ్రవరి 13 వ తేదీన జన్మించింది. కుటుంబంలోని ఎనిమిదిమంది సంతానంలో ఆమె పెద్దది.

సరోజినీదేవి ప్రకటించిన రెండవ కవితా సంకలనం పేరు "కాలవిహంగం" (బర్డ్ ఆఫ్ టైమ్.) దానికి ప్రవేశిక రాస్తూ ఎడ్మండ్ గూస్ యిలా అన్నాడు: "ఆమె దుఃఖంతో బాధతో సహజీవనం చేసింది. ఆమె విశిష్టజీవిత క్రమంలో యిదొక ప్రత్యేక విశేషం. సుఖసంతోషాలు ఆమెకు అనుభవమే. ఓదారటంలోవుండే నిస్పృహావేశం కూడా ఆమెకు పరిచయమే. జీవన బాధాదృశ్యాలవల్ల ఆమె ఊహా వీధుల్లోని సుమహారాలు సువాసనలు కోల్పోయాయి ఆమె భావనాకాశం లోని ధావళ్యం మీద కారు మబ్బులు క్రమ్ముకున్నాయి." భ్రాతృ మరణంతో ఆమె జీవితంలో దుఃఖావేశం తొలిసారిగా తొంగిచూసింది. తరువాత తరువాత అనేక విషాద సంఘటనలు కూడా ఆమెను ముంచెత్తాయి. ఇంతగా విషాద రేఖలు పారిన జీవితానుభవం వుండి కూడా బరువైన చిక్కని కవితలు ఆమె రాయలేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమే. గోఖలే మరణం గురించి రాసిన కవిత తరుచుగా ఉదహరించబడుతుంటుంది. అనేకమంది దానిని ప్రశంసిస్తారు కూడా. అది కూడా చాలా చిన్నదే. అంత మహానాయకుడి మరణం గురించి, తన ఆత్మీయ స్నేహితుణ్ణి గురించి రాయడంలో కూడా చిక్కదనం, బరువైన భావనాబలం అబ్బలేదంటే ఆశ్చర్యం కాదా? తరుచు తన పిల్లలమీదా, చెల్లెళ్లమీదా, స్నేహితుల మీదా కవిత లల్లుతుండేది. అవైనా అంత ప్రధానంకాని స్వల్పగీతాలు, గేయాలు- వారి పేరు దొర్లించి అర్థవివరణ చేయడమో, వారి జీవితంలోని సంఘటనలను అద్భుతాలుగా కల్పించి చెప్పడమో మాత్రమే జరుగుతుండేది.

సరోజినీదేవి అఘోరనాథ ఛటోపాధ్యాయ కూతురు. తల్లి వరదసుందరి. ఛటోపాధ్యాయ మొదట్లో ఛటర్జీ అనే పేరు పెట్టుకున్నాడు, స్వగ్రామం తూర్పు

బెంగాలులోని బ్రహ్మనగరం. అఘోరనాథ ఛటోపాధ్యాయ పూర్వీకులు మహా విద్వాంసులేకాక ప్రకృతి ప్రియులు. అరణ్యాల్లో ధ్యానాదులు సలిపిన తపస్సంప న్నులు. తన తండ్రిగారి జీవితమంతా ఒక అపజయాలపుట్ట అని సరోజినీదేవి అన్నప్పటికీ, ఆయన సాధించిన ఘనకార్యాలను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఆయన సంస్కృత భాషలో గొప్ప విద్వాంసుడు. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యాలను మధించిన మహామేధావి. ఆంగ్లం, హిబ్రూ, ఫ్రెంచి, జర్మన్, రష్యన్ భాషల్లో ఆయన మంచి పండితుడు. ప్రతి దినం ఏదో క్రొత్త విషయం నేర్చుకోవాలనే ఆదర్శం గల ఆజన్మ విద్యార్థి. కలత్తాలో ఆయనకు కేశవచంద్ర సేన్‌తో పరిచయం కలిగింది. బ్రహ్మసమాజోద్యమంలో ఆయన స్థాపించిన నవ విధానశాఖలో అఘోరనాథ ఛటోపాధ్యాయ చేరాడు. కేశవచంద్ర సేన్ స్థాపించిన భారత ఆశ్రమంలో సరోజినీదేవి తల్లి వరదసుందరి ప్రథమంలోనే చేరింది.

అఘోరనాథునికి రసాయన శాస్త్రంలో అభిలాష మెండు.రాను రాను ఆయనకు స్వర్ణయోగం సాధించాలనే ఆసక్తి కలిగింది. హైదరాబాదులో ఒక పాత తాలింఖానాలో కొలిమి ముందర కూచుని తక్కువ రకం లోహాలను కరిగిస్తూ స్వర్ణయోగం సిద్ధికోసం అర్ధరాత్రి దాకా అదే పనిగా కృషి చేస్తుండేవాడు. తండ్రి గారు చేసిన కృషిని గురించి సరోజినీదేవి యిలా రాసింది. "ఓహోహో! యీ ప్రయోగాలు రాత్రింబవళ్ళు నిరంతరంగా జరుగుతున్నాయి. ఎవరైనాసరే వచ్చి ఏదైనా కొత్త పద్ధతి చెప్తే అతనికి సోదర మర్యాద జరుగుతున్నది. అతనికి స్వాగతం లభిస్తున్నది. కవులు సౌందర్యంకోసం, శాశ్వత సౌందర్యసిద్ధికోసం చేసే అన్వేషణ వంటిదే యీ స్వర్ణయోగాన్వేషణ కూడా. అయితే యిది ఒక భౌతికమైన దానికోసం అన్వేషణ. బంగారం చేసే వారూ, కవితలో సౌందర్యం పోత పోసే వారు యిద్దరూ జంట కవులు. ఒక మహాద్భుతాన్ని దర్శించాలని మానవుడిలో వుండే రహస్యాభిలాషకు రూపురేఖలు దిద్దడానికి కృషిచేస్తున్న సృష్టికర్తలు. తండ్రిగారిలో వున్నది ప్రకృతి రహస్యాన్ని భేదించాలనే గాఢమైన అభిలాష. నాది అనంత సౌందర్య సందర్శనాపేక్ష."[1]

హైదరాబాదులో స్థిరపడకముందు అఘోరనాథుడు రసాయన శాస్త్రంలో స్కాలర్‌షిప్ మీద ఇంగ్లండు వెళ్లాడు. ఆయనకు 1877 లో ఎడింబర్గ్ విశ్వవిద్యాల

---

1. స్వర్ణప్రాంగణం (ది గోల్డెన్ త్రెషోల్డ్.) పేజీ. 15

యంలో సైన్సు డాక్టరేటు లభించింది. భారతదేశానికి తిరిగి వచ్చింతర్వాత 1878 లో హైదరాబాదుకు రమ్మని ఆయనకు ఆహ్వానం వచ్చింది. హైదరాబాదుకు వచ్చి ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రారంభించాడు. తరువాత కొన్నాళ్లకు హైదరాబాదు కళాశాలను స్థాపించి దానికి ప్రిన్సిపాల్‌గా నియమితుడైనాడు. అదే యిప్పటి నిజాం కళాశాల. భార్య సహకారంవల్ల క్రమంగా అఘోరనాథునికి మహిళా విద్యపట్ల ఆసక్తి పెరిగింది. స్థానికంగా యితర మహిళామణుల సహాయంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాగంగా మహిళా కళాశాల ప్రారంభించాడు. అఘోరనాథ ఛటోపాధ్యాయ కుల వ్యవస్థకూ, బాల్య వివాహాలకూ వ్యతిరేకి. చాలాకాలంపాటు ఆయన హైదరాబాదులో చేసిన సాంఘిక సేవ అనేక మంది ప్రశంసలకు పాత్రమైంది. కాని ఆయన నెమ్మదిగా రాజకీయరంగంలో తలదూర్చడంవల్ల ఉద్యోగం తాత్కాలికంగా పోయింది. కొద్దికాలంపాటు ఆయన్ను హైదరాబాదునుండి బైటికి వెళ్ళగొట్టారు కూడా. కొన్ని సంవత్సరాల తర్వాత తిరిగి నిజాం కళాశాల ప్రిన్సిపాలుగా ఆయన్ను పిలిపించుకున్నారు. బ్రిటిష్ ఇండియాలో అప్పుడు అమలు జరుగుతున్న ప్రత్యేక వివాహచట్టం హైదరాబాదు సంస్థానంలో కూడా ప్రవేశపెట్టడానికి ఆయనే కారకుడు. 1885 నుండి, భారత జాతీయ కాంగ్రెస్ ఆరంభమైనప్పటినుండి ఆయన దాని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వుండేవాడు.

సరోజినీదేవి బాల్యంలో హైదరాబాదులో వుంటున్న యింటి పరిస్థితులను గురించి ఆమె కవి సోదరుడు యిలా వర్ణించాడు. "అదొక సంస్కృతీ విజ్ఞానాల వస్తు ప్రదర్శనశాల. వివిధరకాలతో నిండిన జంతు ప్రదర్శనశాల వంటిది. మా యింటికి అందరూ అతిథులే. వారిలో కొందరు తాత్విక చింతనా సమాధిలో వుండి పని చేస్తున్నట్లుండేది."2

అఘోరనాథుని యింట్లో అతిథి సపర్యలు, మర్యాదలు పుష్కలంగా జరుగుతుండేవి. ఎవరు వచ్చినా ఏ విధమైన మర్యాదలు జరుగుతుండేవో, ఎంతటి ఆదరణ చూపేవారో ఆర్థర్ సైమన్స్‌కు సరోజినీదేవి రాసిన లేఖలో చూచాయగా తెలుస్తుంది, "స్వర్ణప్రాంగణం" గ్రంథానికి సైమన్స్ రాసిన పీఠికలో యీ లేఖను ఉదహ

---

2. నేనూ- నా జీవితమూ : హరీంద్రనాథ ఛటోపాధ్యాయ.

రించాడు. ఆ లేఖలో సరోజినీదేవి తన ప్రోత్సాహకుడైన సైమన్స్‌ను యింటికి రమ్మని ఆహ్వానించింది. "ఒకసారి దయచేయండి. మార్చినెలలో ఉషోదయాల మధురగానాలు వినిపిస్తూ వుంటా యిక్కడ. హాయిగా మాతో కాలక్షేపం చేద్దురు గాని. బంగారు రంగులు, నీలమణి కాంతులు ధగధగలాడుతూ ఆహ్లాదం వెదజ ఆకాశ సౌందర్యం తిలకింతురుగాని. తెల్లని ఎండలో మెరిసే ఎర్రని లిల్లీపూలు మనసును మిరుమిట్లు గొలుపుతుంటాయి. నీప వృక్షాల నీడలు, చంపక సుమ సుగంధాలు, శిరీషకుసుమ పరిమళాలు నలువైపులా గాలిలో పొరాడుతూ నోరూరి స్తుంటాయి. బంగారు మేనిచాయలు, నీలం రంగులు, రజత వర్ణాలుగల రకరకాల పక్షులు-సాయంత్రం గూళ్ళకు చేరే సమయాన వేలాది పక్షులు ఆనందకోలా హలంతో వినిపించే కమనీయ కలకంఠరావాలు విని తీరవలసిందే. వికసించిన యిక్కడి జీవశక్తి వెచ్చవెచ్చగా వుంటుంది. హృదయానుభూతులతో మహారస వంతంగా వుంటుంది. మీకు తెలుసునో లేదో, నా మేనిలో, రక్తపుబొట్లు ఒక్కొక్కటి తీసి గుండెలో అనుభూతులలో అతకపెట్టి యిక్కడి లిల్లీ పుష్పాలలోని ఒక్కొక్క దళాన్ని నేను పూయిస్తుంటాను. నాలోని ఆత్మ సంగీత సరస్వతిగా అవతారమెత్తి యిక్కడ యిన్నిన్ని పక్షుల రూపాలతో విహాయస వీధుల్లో విహరిస్తుంటుంది. దశ దిశలా వ్యాపించిన యిక్కడి మనోహర పరిమళాలు ఎలా వచ్చాయనుకుంటున్నారు? గాలిలో కలిసిపోయిన నా భావావేశాల పల్లవి చరణాలే అవి. ఇక్కడి స్వర్ణకాంతుల నీలాకాశం ఎక్కడిదని అడుగుతారేమో. అది "యీనేనే, యీమేనే." ఈ మేనిలో ఏ నరాలు, జీవకణాలు, రక్తనాళాలు జీవిత బాధానుభూతులతో కెవ్వుమని అరుస్తూ కేకలు వేస్తుంటాయో, రేపోమాపో, లేక ఏ యిరవై ఏండ్ల తర్వాతనో నశించక తప్పని నాలోని ఒక భాగం మీద శాశ్వతత్వకాంక్షతో, ప్రయత్నపూర్వ కంగా, గట్టిగా, నిరంతరం పోరాడుతూ ఏ మరొక భాగం గెలుపు సాధిస్తుంటుందో అదే యీ అనంతాకాశం. అదే యీ ప్రకృతి."[3]

ఈ బాధానుభవ ప్రసక్తి ఆమె లేఖల్లోనూ, కవితల్లోనూ కనిపిస్తూనే వుంటుంది. ఆమె వ్యక్తిత్వాన్ని గురించి బాగా తెలిసిన మాబోటి వారందరికీ ఆమె ఎప్పుడూ అనుభవిస్తున్న అనారోగ్యపరిస్థితి పరిచయమైనదే, 70 సంవత్సరాలు నిండే వరకూ గుండె ధైర్యంతో అనారోగ్యాన్ని ఎదుర్కొంటూ నిరంతర బాధానుభూతుల

---

3. స్వర్ణ ప్రాంగణం. పేజీ. 17, 18.

పల్లవితో జీనన సంగీతం పాడింది. సరోజినీదేవి లేఖల్లో కనిపించే మనోహరమైన వచన రచనా విన్యాసం మనం కోరుకున్నంతగా దొరకదు. ఆమె యింకా యింకా ఎక్కువగా వచనం రాసివుంటే బాగుండేదికదా అని మనకు అనిపిస్తూ వుంటుంది.

"గోల్డెన్ త్రెషోల్డ్" అనే పేరుతో వ్యవహరిస్తున్న భవనంలోనే సరోజినీదేవి వివాహం జరిగింది. ఆమె తొలి కవితా సంకలనానికి దాని పేరే పెట్టుకుంది. వివాహానంతరమే ఆమె సైమన్స్‌కు లేఖ రాసింది. ఆ వయస్సులో ఆమె నివసించిన ఆ యిల్లు అద్భుత సౌందర్య నిలయంగా వుండేది. అక్కడ వైవిధ్యం ఉట్టిపడుతుండేది. ఆనందం తాండవిస్తుండేది. భోజన భాజనాల్లో దేనికి కొరతలేదు. ఇంటినిండా అతిథు లుండేవారు. హిందూ, మహమ్మదీయ పాశ్చాత్య సంప్రదాయాలకు చెందిన వంటలూ, పిండివంటలూ కొల్లలుగా తయారవుతుండేవి. వరదసుందరి వాటిలో అందెవేసిన చేయి. అందువల్లనే సరోజినీదేవికి వంటలంటే మహాయిష్టంగా వుండేది. రాను రాను ఆమెలో భోజన ప్రియత్వం ఏర్పడింది కూడా. ఇంట్లో పనివాండ్లకు లెక్కలేదు. వారూ ఆ కుటుంబ సభ్యులుగా కలిసి మెలిసి వుండేవారు. ఆ కుటుంబం మీద భక్తి శ్రద్ధల్తో, ప్రేమాభిమానాల్తో మెలగుతుండేవారు.

సరోజినీదేవి తల్లిదండ్రులు తమలో తాము బెంగాలీలో మాట్లాడుకునేవారు. పిల్లలతో హిందూస్థానీలోనూ, పనివాండ్లతో తెలుగులోనూ మాట్లాడుతుండేవారు. వరదసుందరికి చాలా భాషలు వచ్చు. సరోజినీదేవి పెద్ద తమ్ముడు వీరేంద్రనాథ్. అతను 16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించినవాడు. తండ్రి బలవంతం పెట్టేవరకు సరోజినీదేవికి ఆంగ్లభాష నేర్చుకోవాలనే కుతూహలమే వుండేదికాదు. ఆంగ్లంలో మాట్లాడనని భీష్మించుకుని కూచున్నందుకు తండ్రి ఆమెను ఒక రోజల్లా గదిలో పెట్టి తాళంవేసి కఠినంగా శిక్షించాడు. ఆమె ఈ శిక్ష కూడా ఒకందుకు మంచిదే అయినట్లు భావించుకుంది. ఆ రోజునుండి తండ్రి మాట జవదాటకూడదని నిశ్చయించుకుంది, ఆంగ్లం మాట్లాడడమేకాదు. ఆ భాషా సముద్రాన్ని మధించడానికి పూనుకుంది. తన యీ నిర్ణయాన్ని అనంతర జీవితంలో గట్టిగా ఆచరించింది. ఉర్దూ భాష తనకు మంచినీళ్లప్రాయమే అయినా, ఆంగ్లంలో తప్ప మరే యితర భాషలోనూ ఆమె రాయలేదు. ఛటోపాధ్యాయ కుటుంబం తెలుగు దేశంలో స్థిరపడిన బెంగాలీ కుటుంబం కావడంచేత మొత్తంమీద యితర భారతీయ భాషలకంటే ఆంగ్లంలో వ్యవహారం జరుపుకోవడమే వారికి సులువనిపించి వుంటుంది. అయినా

ఆ యింట్లో నాలుగు భాషలు వినిపిస్తుండేవి. తల్లిదండ్రుల మధ్య బెంగాలీ, పిల్లలతో ఇంగ్లీషు, పనివాండ్లతో తెలుగు, ఇంటికి వచ్చిన అతిథుల్తో హిందూస్థానీ, ఉరుదు, ఆంగ్లభాషలు. అప్పటి తన జీవిత పరిస్థితులను గురించి సరోజినీదేవి ఇలా రాసుకుంది. "నాది మొదటినుంచీ కూడా కొత్త కొత్త వాటికోసం కలలుగనే స్వభావమే. అయినా చిన్నప్పటినుంచే కవిత్వం రాయాలనే ప్రాకులాట ఏమీ ఉండేది కాదనుకుంటాను. నా తండ్రివద్ద నాకు అబ్బిన తర్ఫీదు చాలా శాస్త్రీయంగా వుండేది. శ్రద్ధతో పనిచేయించేదిగా వుండేది. నేను గొప్ప గణిత శాస్త్రవేత్తనో, విజ్ఞాన శాస్త్రవేత్తనో కావాలని ఆయనకు మహా పట్టుదల వుండేది. కాని తననుండీ, మా అమ్మనుండీ నాకు సంక్రమించిన కవితాలక్షణం మాత్రం నా మనసులో చాలా బలంగా వుండేది. మా అమ్మ యౌవనంలో వున్నప్పుడు బెంగాలీ భాషలో మధురాతి మధురమైన మంచి మంచి పాటలు రాసింది. ఒకనాడు నాకు పదకొండేండ్ల వయస్సప్పుడు బీజగణితంలో ఒక లెక్క ఎంతకూ రాక తిప్పలు పడుతున్నాను. ఎన్నిసార్లు చేసినా ఆన్సరు తప్పే వచ్చేది. కాని దాని బదులు గుండెల్లోనుంచి దూసుకుని ఒక మంచి కవిత బైటికి పొంగి వచ్చింది. వెంటనే దాన్ని కాగితం మీద పెట్టాను. అదే నా కవితా జీవితానికి అంకురార్పణ. పదమూడేండ్ల వయస్సులో ఒక పెద్ద గేయం వ్రాశాను. పదమూడువందల పంక్తుల గేయం అది. అది రాయడానికి ఆరురోజులు పట్టింది. "సరస్సు కన్య" అని దానిపేరు. అదే సంవత్సరం రెండువేల పంక్తులతో ఒక నాటకం రాశాను. నేను చాలా జబ్బుగా వున్నాననీ, పుస్తకం ముట్టనేకూడదనీ మా డాక్టరు సలహా యిచ్చినప్పుడు ఆయనమీద కోపంతో రాసింది అది. ఆద్యంతాల ఆలోచనే లేకుండా అప్పటికప్పుడు దొర్లిన ఆవేశపు ఊహల్తో దాన్ని మొదలుపెట్టాను. ఈ సమయంలో నా ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. బడి చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. దీనితో యింట్లోనే వుండి విపరీతంగా చదవడం మొదలుపెట్టాను. నేను చదివిన దాంట్లో చాలా భాగం నా వయస్సు 14-16 సంవత్సరాల మధ్యకాలంలో చదివిందే. ఒక నవల కూడా రాశాను. అనేక పత్రికల్లో అసంఖ్యాకంగా రచనలు చేశాను. ఆ రోజుల్లో రచనావ్యాసంగంలో చాలా శ్రద్ధగా పనిచేశాను."4

---

4. స్వర్ణప్రాంగణం, పేజీ. 11-12.

ఏమైనాసరే అమ్మాయిని మెట్రిక్యులేషన్ పరీక్ష ప్యాస్ చేయించాలనే దృఢ నిశ్చయంతోవున్న అఘోరనాథుడు సరోజినీదేవిలోని అనన్యసాధ్యమైన మేధోవికాసాన్ని ఆమె బాలికగావున్న దశలోనే గుర్తించాడు. హైదరాబాదులో ఆడపిల్లలు చదువుకోడానికి తగిన మంచి పాఠశాల వుండేది కాదు. అందుకని సరోజినీదేవిని మద్రాసు పంపారు. అక్కడే ఆమె 12 సంవత్సరాల వయస్సులో మెట్రిక్యులేషన్ ప్రథమశ్రేణిలో ప్యాసయింది. పైగా మద్రాసు విశ్వవిద్యాలయంలో ప్రథమ శ్రేణిలో ప్రథమ స్థానం పొందింది. ఆ రోజుల్లో మద్రాసు విశ్వవిద్యాలయం పరిధి దక్షిణాది కంతటికీ వ్యాపించి వుండేది, అది 1891. పరీక్షలు సులభంగా వుండేవికావు. ఆడపిల్లలు ఉన్నత విద్యాభ్యాసంచేసే ఆచారం కూడా చాలా తక్కువ. అప్పట్లో ఆమె సాధించిన యీ విజయం అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. అఖిలభారత దృష్టిని ఆకర్షించింది. అయితే సరోజినీదేవికి తన విషయం అంతగా ప్రచారం కావడం యిష్టం లేదు. ఆర్థర్ సైమన్స్‌తో ఆమే చెప్పింది: "నిజం చెప్పాలంటే నాకది సంతోషం కలిగించలేదు. అటువంటిది జరగనేలేదు అనిపించింది."

సరోజినీదేవి జీవితంలో ఒక విశేష మేమంటే, ఆ తరువాత ఆమె మరి ఏ యితర పరీక్షా ప్యాస్ కాలేదు. కనీసం ఫలానా పరీక్షకు కూచుందామని కూడా ప్రయత్నం చెయ్యలేదు. దీర్ఘమైన కథాకావ్యాలు, నవలలూ, పత్రికా రచనలు అసలు రాయడమే ఏవిధంగా మానుకున్నదో, అదే విధంగా పరీక్షలను కూడా బహిష్కరించింది. కేవలం గేయాలు మాత్రమే రాస్తూ కాలం వెళ్ళబుచ్చటం ప్రారంభించింది. చివర చివరకు కవిత్వం కూడా మానేసి రాజకీయాల్లోనే మునిగి పోయింది. కొంతకాలం తర్వాత లండన్‌లోని కింగ్స్ కళాశాలలోనూ, కేంబ్రిడ్జిలోని గిర్టన్‌లోనూ చదివినా 18 సంవత్సరాల వయసులో డిగ్రీ లేకుండానే స్వదేశానికి తిరిగి వచ్చింది. అయితే ఆంగ్ల సాహిత్య అధ్యయనంలో ఆమె చేసిన విశేష కృషీ, లండన్‌లోని సాహిత్యలోకంలో ఆమెకు కలిగిన సన్నిహిత పరిచయాలు కేవలం కళాశాల విద్యాస్థాయిలో చూసే ప్రతిభకంటే వేయిరెట్లు గొప్పవి. కొంతకాలం తర్వాత రాయల్ సొసైటీలో ఆమెకు సభ్యత్వం లభించింది. అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లు ప్రసాదించాయి.

మెట్రిక్యులేషన్ పరీక్ష ప్యాసైన తర్వాత సరోజినీదేవి మద్రాసునుండి హైదరాబాదుకు తిరిగి వచ్చింది. 1892 నుండి 1895 వరకు హైదరాబాదులో

తల్లిదండ్రులదగ్గర వుంది. ఈ మూడు నాలుగేండ్లకాలం సరోజినీదేవి జీవితంలో అతి సుఖవంతమైందని చెప్పుకోవచ్చు. అనేక విషయాలను గురించి ఎన్నో గ్రంథాలు చదువుకుంది. కుటుంబంలోని సుఖప్రదమైన జీవిత పరిస్థితులను హాయిగా అనుభవించింది. అన్ని కులాలు, మతాలు, వర్గాలకు చెందిన అనేకమంది స్నేహితులతో యిష్టాగోష్ఠులు జరుపుకుంటూ కాలం వెళ్లబుచ్చింది.

చిన్నతనంలోనే ఆమె "సరస్సు కన్య" కావ్యం రాసినప్పటికీ, మళ్ళీ యిప్పుడు కవిత్వం రాయడం ప్రారంభించింది. ఆ కావ్యం తరువాత ప్రకటించబడిన కవితలన్నీ చిన్న చిన్న ఖండ కావ్యాలు, గేయరూపాలు మాత్రమే. ప్రజారంజక మైన గేయకథా కావ్యాలు గానీ, సానెట్స్ (ఆంగ్లంలో 14 పంక్తులతో కూడిన ఒక ఛందోరూపం) గానీ రాయడానికి ఆమె ప్రయత్నించలేదు.

13-15 సంవత్సరాల మధ్యకాలంలో ఆమె చాలా కవితలు రాసింది. ఆమె తండ్రి వాటిని గ్రంథరూపంలో ప్రకటించాడు.[5]

వీటిలో యీడుకు మించిన ప్రతిభ, పరిపక్వమైన ఆలోచనారీతి కొట్టవచ్చి నట్లు కనిపిస్తాయి. కాని యివి చాలా చిన్న చిన్నవి, నీటిమీది బుడగల్లాంటివి.

1896 లో సరోజినీదేవిని ఇంగ్లాండు పంపించారు. ఆమెను ప్రేమిస్తున్నా నని చెప్పి డాక్టరు నాయుడు తాను పెండ్లిచేసుకుంటానని అడగడమే అంత హడా విడిగా ఆమెను ఇంగ్లండు పంపడానికి ప్రధాన కారణమేమో అనిపిస్తుంది. డాక్టరు నాయుడు కోర్కెను తల్లిదండ్రులు తిరస్కరించడానికి రెండు కారణాలు వున్నాయి. అప్పటికి ఆమె చాలా లేతవయస్కురాలు. కేవలం 16 సంవత్సరాల వయస్సు. అఘోరనాథుడు బాల్య వివాహాలకు పూర్తిగా వ్యతిరేకి. అంతేకాక డాక్టరు నాయుడిది రెండవ సంబంధం. పైగా అతను సరోజినీదేవికంటే 10 ఏండ్లు పెద్ద. రెండో కారణం ఏమిటంటే సరోజినీదేవిని ప్రేమించిన డాక్టరు నాయుడు తక్కువ కులానికి చెందినవాడు. అయితే యిది అంత ప్రధానమైన పట్టింపు ఏమీ కాదు. ఎందుకంటే అఘోరనాథుడు 1898 లో ఆమె ఇంగ్లాండునుండి తిరిగి వచ్చిన

5. కుమారి ఎస్. ఛటోపాధ్యాయ కవితలు. 1896 అక్టోబరు 3. ప్రచురణ: అఘోరనాథ ఛటోపాధ్యాయ: ఇవి 1892-1896 మధ్యకాలంలో సరోజినీదేవి రాసిన తొలి కవితలు.

తర్వాత, మూడేండ్ల క్రితం తాను తిరస్కరించిన డాక్టరు నాయుడికే కూతురు వివాహ మాడడానికి అంగీకరించాడు. అఘోరనాథ ఛటోపాధ్యాయ యీ వర్ణాంతర వివాహానికి అడ్డు నిలిచాడని విమర్శించినవారు ఆయన స్వయంగా సంఘసంస్కర్త అనీ, కులవ్యవస్థను కూలదోయడానికి కృషి చేసినవాడనీ గుర్తుంచుకోవాలి. నిజాం నవాబు సరోజినీదేవికి పెద్ద స్కాలర్‌షిప్ యిచ్చాడు. అందువల్ల ఆమెను, 1895 సెప్టెంబరులో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇంగ్లాండు పంపారు.

## ఇంగ్లాండులో...

విక్టోరియాకాలపు పై వర్గాల ఆంగ్ల సాహిత్య లోకంలోకి పదహారేండ్ల ప్రాయం గల ఒక భారతీయ కన్యామణి పెను తుఫానులా ప్రవేశించింది. అందరినీ విభ్రాంతుల్ని చేసింది. తమకు తామై వేరుగా ముడుచుకు కూచున్న ఒక జాతి ప్రజలకు ఆమె మేలుకొలుపు పాడింది. సంప్రదాయవాదులైన ఆంగ్ల సాహిత్య విమర్శకులందరూ కండ్లు తెరిచారు. బ్రిటిష్‌వారి ఏలుబడి క్రింద వున్న విశాల భారత భూభాగంలో నిద్రాణమై వున్న ప్రతిభా సంపద, సౌందర్య దర్శనమూ వారికి హఠాత్తుగా గోచరమయ్యాయి.

ఎడ్మండ్ గూస్‌కు సరోజినీదేవి పరిచయమైన సమయంలో ఆమె ఎలా వున్నదో చూడండి. ఈ విషయం తరువాత గూస్ రాశాడు. "పదహారేండ్ల పసి బాలిక. వికసించిన పద్మానికి లిల్లీ పుష్పానికి ఎంత తేడా వుంటుందో, ఆమెకూ ఆ యీడు గల ఆంగ్ల బాలికలకూ అంత తేడా వుంది. అప్పటికే ఆమెకు అద్భుతమైన మనః పరిపక్వదశ వచ్చేసింది. ఆశ్చర్యం కలిగే విధంగా సారస్వత మహా

సముద్రాన్ని మథించింది. ప్రపంచ పరిజ్ఞాన రంగంలో పాశ్చాత్య బాలామణుల కంటే ఎంతోదూరం ఆమె ముందుకు పోయింది."[1]

సరోజినీ దేవిని అభిమానించి ప్రోత్సహించిన మరొక సమకాలిక ఆంగ్ల సాహిత్యవేత్త ఆర్థర్ సైమన్స్. తనకు ఆమె కవితలను 1896 లో చదివి విని పించిందని ఆయన రాశాడు. "ఆమె మా అందరి మధ్యలో కూర్చుంది. మాలో ఎవరెవరి తాహతు ఎంతో ఆమె గ్రహించింది. కనిపిస్తున్న ఆమె ముఖ యవనిక వెనకాల ఏ కాంతి ప్రసరిస్తున్నదో మాలో చాలామందికి తెలియదు. ఆమె మాట ల్లోనే చెప్పాలంటే: అది 'మేలుకొంటున్న మానవాత్మ'. ఆమె కండ్లు లోతైన సరస్సుల్లా వుండేవి. వాటిల్లో పడి యింకా యింకా అనంతమైన అగాధపు లోతు ల్లోకి పోతున్న అనుభూతి మాత్రం శ్రోతలకు కలుగుతుండేది." [2]

ఎడ్మండ్ గూస్ యింకా యిలా రాశాడు. "సరోజినీదేవి మా కుటుంబానికి పరిచయం కావడం కేవలం యాదృచ్ఛికంగా జరిగింది. అది మాకు చాలా అదృష్ట కరమైన సంఘటన. ఆమె లండన్‌కు వచ్చింతర్వాత కొద్ది రోజుల్లోనే మా యింటికి పరిచయముయింది. త్వరలోనే మా అందరికీ బాగా సన్నిహితురాలయింది. అంత చలాకీగావుండే వ్యక్తి, జాలిగుండె గలది, తాను కవిత్వం రాస్తున్న సంగతి ఎంతో కాలం మా కెవరికీ తెలియకుండా దాచిపెట్టలేము గదా. అందులోనూ రాస్తున్నది ఆంగ్ల కవిత్వమాయె."

ఆంగ్ల సాహితీ లోకంలో ప్రధానుడైన వ్యక్తితో ఆమెకు పరిచయం కలి గించాలనే ఉద్దేశంతో సరోజినీదేవి సహ విద్యార్థులలో ఒకరు ఆమెను ఎడ్మండ్ గూస్ దగ్గిరకు తీసుకురావడం, పరిచయం ఏర్పరచడం జరిగింది. ఆయన ద్వారా ఆమెకు కావలసినంత ప్రోత్సాహం లభించింది. తరువాత 20 సంవత్సరాలపాటు తన జీవితాన్ని కవిత్వానికి అంకితం చేసే విధంగా ఎడ్మండ్ గూస్ యిచ్చిన ప్రోత్సాహం ఆమె మనస్సుమీద పనిచేసింది. ఆంగ్లభాష చదివే పాశ్చాత్యులకు విజాతీయమైన సంస్కృతిని విశదీకరించే మహోన్నత కృషికి ఆమె జీవితం అంకిత మైంది. ఇదే ఆమె పెట్టుకున్న లక్ష్యంగా భాసించింది.

1. కాల విహంగం పేజీ. 3-4.
2. స్వర్ణ ప్రాంగణం పేజీ. 23.

117708

లండన్‌లోని కింగ్స్ కళాశాలలో సరోజినీదేవి ఉన్నత విద్యాభ్యాసం ప్రారంభించింది. తరువాత కేంబ్రిడ్జిలోని గిర్టన్‌కు వెళ్ళింది. అయినప్పటికీ ఉన్నత విద్యా సంబంధమైన పరిగణనలు, పట్టాలు పొందాలనే అభిలాష ఆమెలో పూర్తిగా నశించినట్లే కనిపించింది. కేంబ్రిడ్జిలో చదువుతున్న కాలంలో తరుచుగా క్లాసులకు పోవడం ఎగ్గొట్టి దగ్గరలోవున్న సుందరమైన అరణ్య ప్రాంతాల్లోకి వెళ్ళి హాయిగా కలలు కంటూ కాలం గడిపే విధానానికి అలవాటు పడింది. ఈ సమయంలోనే ఆమె యింగ్లండులోని గ్రామీణ ప్రాంతాల సౌందర్య నిధులను వెలికితీసి కవిత్వంలో పోత పోసింది. గ్రామసీమల్లోని రకరకాల పూవులు, పక్షులు ఆమె భావనాంబరంలో మిలమిలా మెరిశాయి. ఇందుకే ఆమెను ఎడ్మండ్ గూస్ అంత నిర్దయాత్మకంగా, కఠినాతి కఠినంగా విమర్శించింది.

సరోజినీదేవి రాసిన యీ ప్రారంభ కవితలలో జాతీయ భావన లేకపోయినప్పటికీ అవి కృత్రిమత లేనట్టివి. వీటిలోని సహజ శైలీ సౌందర్యం, గూస్ చేసిన ఘాటైన విమర్శ కారణంగా శాశ్వతంగా చల్లారిపోయింది. అంత చిన్నతనంలోనే కవితావిర్భావం జరిగిన ఆమెను జాతీయమైన కావ్య వస్తువులను గురించి రాయమని ఆయన కోరాడు. ఈ కవితలు రాసేటప్పుడు కవయిత్రి ఆత్మాశ్రయ భావనా పద్ధతిని ఆశ్రయించింది. కాని భారతీయమైన విషయాలతో గేయాలు రాయడం ప్రారంభం కాగానే వస్త్వాశ్రయ విధానం ఆమెను ఆవరించింది. 1896 ప్రాంతంలోనే, అంత పిన్న వయస్కురాలైనప్పుడే సరోజినీదేవి కవితారచనకు అంకితమైపోయింది. తాను కవయిత్రినని తెలుసుకున్నది. తాను అంత గొప్ప కవయిత్రినేమీ కాదని తరువాత కాలంలో ఆర్థర్ సైమన్స్‌తో చెప్పినప్పటికీ, అంతశ్చేతనలో మాత్రం తనను తాను స్పష్టంగా తెలుసుకున్నది. అందుకే తన కవితకు "కవిత్వంలో ప్రేమగీతం" (ది పొయెట్స్ లవ్ సాంగ్) అని పేరు పెట్టుకుంది. రాను రాను కవితాంబుధిలో ఆమె పూర్తిగా మునిగిపోయింది. కవితా భావనల రెక్కలు కట్టుకుని ఆమె అంతరాత్మ ఆకాశవీధుల్లో వీరవిహారం చేయసాగింది. అది ఎంత ఎత్తులకు త్వరత్వరగా ఎగిరిందో అంత త్వరగా ఆమె ఆరోగ్యం కూడా చెడిపోయింది. గాలి వేగంతో తరంగాల తాకిడితో పరువెత్తుతూ ఆమె "మరణించిన తన కలల కళేబరాలను కాల్చివేసుకుంది. "కేంబ్రిడ్జి వద్ద అడవుల్లో కాలక్షేపం చేసూ," జీవిత యుద్ధాలనుండీ, ప్రజల గుంపుల ఘెళ ఘెళలనుండీ తప్పించుకోడానికి, పారిపోవడానికి ప్రయత్నించింది. జీవిత దుఃఖాలను కవితలో బాధా

ప్రదర్శనద్వారా అధిగమించాలని దృఢంగా సంకల్పించుకుంది. ధ్యాన సమాధిలోని యోగి జగచ్చైతన్యాన్ని కోల్పోయినట్లు, కవితా గీతాల తన్మయత్వంలో ఆమె తన వియోగాలనూ, బాధలనూ పూర్తిగా మరిచిపోయింది.

ఇంగ్లాండులో వున్నప్పుడు సరోజినీదేవి, శరీరం కనిపించేంత సన్నని సిల్కులు ధరించేది. షోకుగా, సున్నితంగా వుండేది. వీపు మీదికి జుట్టు విరబోసుకునేది. చూడడానికి చిన్నపిల్ల తరహాలో వుండేదని వ్యాఖ్యానించి "చాలా మితభాషిగా వుండేది. మాట్లాడినా నూతిలో గొంతుకులా సన్నగా మాట్లాడేది. ఆమె పలుకు సంగీతపు సన్నని స్వరంలా వుండేది. ఎక్కడవున్నా ఒంటరితనం ఒంటి మీద పూసుకున్నట్లుండేది" [3] అని సైమన్స్ వర్ణించాడు.

ఎక్కువగా ఆవేశపడడం సరోజినీదేవి శరీరతత్వం. దానివల్ల ఆమె ఏదో తీవ్రమైన బాధానుభూతిని పొందుతున్నట్లు కనిపించేది. నరాలు పనిచేయని కొద్ది ఉన్మాద స్థితి ఆమెకు కలిగినట్లు అనుమానం కూడా వచ్చింది. ఇంగ్లండు నుండి ఆమెను తల్లిదండ్రులు స్విట్జర్లండుకు పంపారు. అక్కడినుండి ఇటలీ. ఇటలీ దేశ సౌందర్యాన్ని చూసి ఆమె పరవశురాలైపోయింది. "ఇది మానవలోకమా, దేవలోకమా?" అనిపించిందామెకు. "ఇది భూలోకమా, స్వర్గమా?". ఈ సమయంలో భావావేశ లక్షణాలతోకూడిన, అద్భుతమైన, మనోజ్ఞమైన ఆమె గద్యశైలి తిరిగి సాక్షాత్కరించింది. "ఈ ఇటలీ దేశాన్ని ప్రత్యూష, దివాకాల స్వర్ణకాంతులతో పోత పోశారు కాబోలు. ఇక్కడి బంగారపు నక్షత్రాలు, మేనెలలో సువాసనలు వెదజల్లే రాత్రి కాంతమేని మీద సన్నగొంతు రాగాలతో సరస నృత్యాలు చేసే మిణుగురు పురువులు కూడా బంగారంతో చేసినవే. అంతా బంగారమే. వరుసలు వరుసలుగా బంగారమే. అవి చేస్తున్న ఆ దేవతా నృత్యాల మృదుమధుర సంగీత స్వరాల సారాన్ని పట్టుకోవాలనిపిస్తున్నది. దానితో, మిణుగురుల వేగవంతమైన తళతళల తైతక్కలవంటి విరుపులతో, మెరుపులతో ఒక మంచి కవిత రాయాలనిపిస్తున్నది. అలా రాస్తే ఎంత అద్భుతంగా వుంటుంది! ఒకనాటిరాత్రి నేనొక తోటలో నుంచుని వున్నాను. నా కురులనిండా మిణుగురులే— అంధకార గర్భంలో హడావిడిగా పరుగెత్తుతున్న నక్షత్ర కన్యల్లా. అప్పుడు అవాఙ్మానసగోచరమైన ఒక వింత అనుభూతిని పొందినట్లుంది. నేనసలు మనిషిని కాదు,

3. స్వర్ణ ప్రాంగణం. పేజీ 16.

దేవతనేమో నన్నంత భ్రాంతికలిగింది''. ఆమె రచన బంగారపు మాటల మూట. శబ్ద సౌందర్యరాసి. ఆమె ఇటలీ దేశపు సహజ ప్రకృతి సౌందర్యాన్ని మంచినీళ్ళ ప్రాయంగా గ్లాసులు గ్లాసులు త్రాగింది. ''ఆహాహా! ఎంత అందం ఎంత ఆనందం! దీనిని అనుభవించడానికి ప్రాణాలతో బ్రతికి వుండడం మనిషికి ఎంత అదృష్టం!''

ఈ విధంగా యీ ''పదిహేడేండ్ల బాలిక'' యూరపు ఖండంలో విశాల విజ్ఞానపు వీథుల్లో, త్రాగినవాని తన్మయత్వంతో కాలం గడిపింది. విచిత్రమైన ఆకర్షణీయమైన పిల్ల. ఇతరుల కష్టాలను ఓపిగ్గా జాలితో వినేది, కాని తన మనస్సులోనే తెలియని ఏదో ఆవేదన చెందుతున్నట్లు ఆవేశపడేది. దానివల్ల మనసు ఆందోళనభరితమై ఆరోగ్యం చెడిపోయేదాకా వచ్చింది. అయినా ఆమెలో ''మన శ్శాంతి కల్పించుకునే జీవలక్షణం ఏదో వుంది. దాని ముందు జీవితంలోని స్వల్ప విషయాలు, అత్యల్ప సంఘటనలు పటాపంచలైపోయేవి. శాంతిజ్వాలల్లో కాలి గాలిలో కలిసిపోయేవి.'' ''తన వయోలక్షణమో, తనజాతి పురావైభవ వయో లక్షణమోగాని యిటువంటి మనశ్శాంతి విజ్ఞత మాత్రం ఆమెకు సంక్రమించింది. యీ మనోనిగ్రహంతోపాటు యితరేంద్రియవ్యథ అని కూడా అనడానికి వీలు లేనంత స్వల్పమైన బాధకూడా వుంది'' అంటాడు సైమన్స్. దుఃఖంరానీ, సంతోషం రానీ ఆమె క్షణంలో ఆవేశలోకాల అంచులదాకా వెళ్ళిపోయేది. ''ఎవరైనా ఒక మిత్రుడు కాస్త ముఖం చిట్లించుకుంటే చాలు'' ఎంతో వేదన పడేది. భావావేశపు యోగినివంటి పిల్ల; విదేశాల్లో విపరీతమైన సంచలనం కలిగించడమేకాదు, ప్రాచ్య నాగరికతా ప్రాభవభరితమైన, అందమైన తన బొమ్మను ఆ దేశాలలో చిత్రించి పోయింది. ఆమెకు సంబంధించిన వింతలలో వింతైన విషయం కవితలలోని శబ్ద విన్యాసవైఖరి. అసంఖ్యాకంగా అందమైన పదబంధాలు ఆమె గీతాల్లో ప్రవాహంలా దూసుకు పోతుంటాయి ఇతరులతో కలిసివున్నప్పుడు ఆమె ''చాలా తక్కువగా మాట్లాడేది.'' తన సౌందర్యంచేత ప్రకాశిస్తూ, రహస్యాలోచనల రథం మీదెక్కి తిరుగుతూ, ఆమె ఆంగ్ల భాషాప్రియుల హృదయవీధులమీద వెలుగులు ప్రసరింప జేసింది. ఆంగ్లరచనాకాశ వీధుల్లో ప్రత్యూష సమయప్రాయంలోనే ప్రకాశ మానంగా భాసించింది.

ఇంగ్లాండుదేశపు వాతావరణం సరోజినీదేవి మనస్సుమీద గాఢమైన ముద్ర వేసింది, ఆమెకు తన కవితావ్యాసంగం ఆంగ్లంలోనే కొనసాగించాలనే భావన బాగా బలపడింది. ఆ కాలపు విమర్శకులు, సాహిత్యవేత్తలనుండి లభించిన ప్రోత్సాహం, వారి ప్రేరణవల్ల భారతీయ హృదయ కవాటాలు తెరిచి పాశ్చాత్యులకు చూపాలని ఆమెలో కలిగిన గాఢమైన ఆకాంక్ష. చివరకు స్థిరమైన ఆశయంగా రూపుకట్టింది. "కృత్రిమంగా ఆంగ్ల వాతావరణాన్ని" అంటిపెట్టుకుని వుండవద్దని ఎడ్మండ్‌గూస్ యిచ్చిన సలహా వృధాకాలేదు. ఆంగ్లభాషను హస్తామలకంగా చేసుకున్న పాండిత్యం, పాశ్చాత్య ఛందోరీతులను కైవసం చేసుకున్న ప్రతిభా సంపద కలిగి నప్పటికి యిక ఆమె ఇంగ్లండు దేశము, అక్కడి గ్రామీణ వాతావరణాన్ని గురించి రాయదలచలేదు; తన భారతీయ దృష్టితో చూస్తే అదంతా విదేశీయంగానే ఆమెకు కన్పించసాగింది, ఏడ్మండ్ గూస్ యిలా రాశాడు. "సరోజినీదేవి నాకు చూపిన పద్యాలు శైలీ సంపన్నాలు. వ్యాకరణరీత్యా నిర్దుష్టమైనవి. మనోనుభూతుల విషయంలో స్వచ్ఛమైనవి. కాని వాటిలోవున్న ప్రధానమైన లోపమేమిటంటే వాటిలో వ్యక్తిత్వమనేది ఏకోశానా లేదు. పదచిత్రాలంకార నిర్మాణంలో గానీ, అనుభూతి వ్యగ్రతలో గానీ అవి పూర్తిగా పాశ్చాత్య భావనాప్రేరితములైనట్టివి. టెన్నిసన్, షెల్లీ ప్రభృతుల ప్రభావంతో రాసినట్లుండేవి. క్రైస్తవ మతలక్షణమైన భౌతిక విషయపరిత్యాగం వాటిలో బీజప్రాయంగాలేదని గట్టిగా చెప్పటానికూడా వీల్లేదు. అవి చూసి నిరాశపడి ఆ కట్టక్రింద పడేశాను; అవి లోపలవుండే కసితీర్చుకోడానికి ఒక పక్షి చేసిన హేళనధ్వనులుగా కనిపించాయి"[1] ఆ విధంగాగూస్ తన నిర్ణయం శిష్యురాలికి బోధించాడు. ఇంగ్లండులోని రాబిన్ పక్షులను గురించీ, స్కైలార్క్‌లను గురించీ కవిత్వాలు రాయవద్దనీ, "ఆంగ్లో - శాగ్జన్ మనోభావాల విందుభోజనాలకు

1, కాల విహంగం పేజి; 4.

వెళ్ళవద్దనీ'', ''అదే పద్ధతిలో అనుకరణలు చేయవద్దనీ'' ఆయన చెప్పాడు. ''భారతీయ హృదయాన్ని బైటికిలాగి ప్రదర్శించమనీ, దేశీయమైన పురాతన మత ధర్మాల మహోజ్వల విన్యాసాన్ని లోతుగా పరిశీలించి చిత్తశుద్ధితో వివరించమనీ, పాశ్చాత్యదేశాల మేధావులు ఆత్మ అనేది ఒకటి వున్నదనే విషయం గురించి ఆలోచించడానికి పూర్వమే ప్రాచ్యదేశాలలోని మానవాత్మను ప్రభావితం చేసిన విజ్ఞాన జ్యోతులను వెదజల్లమనీ ఆయన ఆమెకు నచ్చచెప్పాడు.''

భారతీయ కవయిత్రి ఇంగ్లండును గురించి కవిత రాసే విషయంలో గూస్ ఎందుకు అంత వ్యతిరేక భావం వెలిబుచ్చాడు, అంత ఘాటుగా విమర్శించాడు ? ఎడ్విన్ ఆర్నాల్డ్, మెడోస్‌టేలర్ ప్రభృతులైన తన దేశీయులు, సమకాలికులు భారతదేశాన్ని గురించి రాయలేదా ? కవి అయినవాడు అంతగా జాతీయతకు అంటిపెట్టుపుని మరే యితర భావాలు లేకుండా వుండలేడుగదా. దేశదేశాలలోని భావనా స్రవంతి, ఉద్యమస్ఫూర్తి మొదలైనవి కావ్యవస్తువులలో భాగాలు. బహుశః యిందుకే సరోజినీదేవి కవితలు చిన్న చిన్నవిగా వుండేవి. ఆమె భావనా పరిధి కేవలం భారతదేశం మాత్రమేకాదు, చాలా సంకుచితమైన మహిళాలోకం. ఇది కూడా జానపద ఫణితులలో కూరుకున్నట్టిది. బుద్ధుడు, గోఖలే, గాంధీజీవంటి మహనీయులను గురించి అరుదుగా మాత్రమే కవితలు వెలువడుతుండేవి. అయితే స్వదేశానికి తిరిగి వచ్చినతర్వాత భారతదేశం గురించి పాశ్చాత్యలోకానికి చెప్పడంలో ఆమె పూర్తిగా లీనమైపోయింది, ముఖ్యంగా హిందూ, ముస్లిం సంస్కృతి సమ్మేళనమైన తన హైదరాబాదును గురించి. మిగిలిన సమస్త విషయాలను చూడకుండా కండ్లు మూసుకున్నదా అన్నంతగా ఆమె భావనాలోకాన్ని ఆ కావ్యవస్తువు ఆక్రమించుకుంది. గాంధీజీ నాయకత్వానగల స్వరాజ్యోద్యమంలో ప్రవేశించి, దానిలోని గడ్డు పరిస్థితులను ఎదుర్కుంటూ, నిజమైన జీవితంలోని విషాదమేఘాలమీద విహరిస్తున్న సమయంలోకూడా, ఆమె రాసిన దేశభక్తి గీతాలు మాత్రం చిన్న చిన్నవే. మహిళాలోకం మేలుకోవాలని ప్రబోధించే కవితలుగాని, యితర దేశభక్తి కవితలుగాని చూస్తే అవి కపితాభావన విషయంలో లోతుగానూ వుండవు; హృదయస్పర్శిగానూ వుండవు. అందమైన మాటల, పదబంధాలకూర్పు మాత్రమే పుష్కలంగా కనిపిస్తుంది. ''జీవిత దుఃఖాన్ని కవితా దుఃఖంతో గెలవాలనే'' ఆమె తాత్విక సిద్ధాంతం కూడా పసలేని వాదంగానే వుంటుంది. ఎందుకంటే ఒక మీరాబాయి లాగానో,

ఆండాళ్ లాగానో, యీ భావనలోకూడా ఆమె తన్మయత్వస్థాయిని తాకేలోతుల్లోకి పోలేకపోయింది. సీతాకోకచిలుక ఒక పువ్వుమీదినుంచి మరొకపువ్వుమీదికి దూకి నట్లు, అక్కడ ఒక చుక్కా, యిక్కడ ఒక చుక్కా మధువు గ్రోలుతూన్నట్లు కవితా భావనలోకూడా ఒక విషయం మీది నుంచి మరొక విషయం మీదికి ఆమె గంతులు వేస్తుండేది. నిజానికి పాశ్చాత్యదేశాలలోని వారు మనలను గురించి కల్పించుకున్న ఊహాలోకంలోని పరిస్థితి యిదే. ప్రాచ్యదేశాలన్నీ విదేశీ భావాల మోజులోపడి పర సంస్కృతి ప్రభావితాలని గదా ఆ రోజుల్లో వారి ఊహ, సరోజినీదేవి కవితల్లో సరిగ్గా అదే ప్రతిఫలించింది.''

సరోజినీదేవి 1898 సెప్టెంబరులో హైదరాబాదుకు తిరిగివచ్చింది. రాగానే ఆమెకు అన్నిటికంటే ప్రధాన విషయం తాను ప్రేమించిన యువకుణ్ణి-గత మూడేండ్లుగా ఎవరికోసం తపస్సుచేస్తూ తాను వేచివున్నదో ఆ యువకుణ్ణి పెండ్లి చేసుకోవడం సరోజినీదేవికి జరిగిన వివాహం భారతదేశంలో అనేక సంఘ సంస్కరణలకు పునాది. అది వర్ణాంతరమేకాదు. రాష్ట్రాంతర వివాహం కూడా. ఇంతవరకు భారత ఉపఖండంలో స్వేచ్ఛా జీవితానికి సంకెళ్ళు వేసిన అనేక పాతకాలపు మూఢవిశ్వాసాలు సడలిపోవడానికి ఆమె వివాహం దోహదం చేసింది. ప్రత్యేక వివాహాల చట్టం (1872 సం॥పు 3 వ చట్టం) దేశంలో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం హిందుడననీ, సిక్కుఅనీ, క్రైస్తవుడనీ, ముస్లిం అనీ, జైనుడనీ మతభావన తమ కేమీ లేదని దంపతులు యిరువురు ప్రకటించాలి. సరోజినీదేవి పెండ్లి మద్రాసులో 1898 డిసెంబరు 2 వ తేదీన జరిగింది. ఒక భారతీయ వార్తాపత్రిక యీ పెండ్లి వార్తను ఆసక్తిదాయకంగా ప్రకటించింది. "బ్రహ్మసమాజ సభ్యురాలు, సంస్కృతి పరురాలు, మర్యాదగల ఒక మహిళామణి, రామమోహన్‌రాయ్ సతీమణి తోడు పెండ్లికూతురుగా కూచొని వధువుకు సపర్యలుచేస్తూ ఆ ఉత్సవానికి అందమూ,అలంకారమూ తెచ్చింది. శ్రీ ఎస్. సోమసుందరం పిళ్ళె బి. ఎ, ప్రార్థనాగీతంతో యీ పవిత్ర కార్యక్రమం ప్రారంభమైంది. నిర్ణయించుకున్న కార్యక్రమం జరిగిన తర్వాత రావుబహదూర్ వీరేశలింగం పంతులుగారు పౌరోహిత్యం వహించారు. జీవితంలో దంపతుల పరస్పర బాధ్యతలను గురించి ఆయన సందేశం యిచ్చిన తర్వాత డా॥ అఘోరనాథ్ కూతురిని వరుడి చేతిలో పెట్టి పాణిగ్రహణం చేయించాడు. ఈ పెండ్లి మద్రాసు పట్టణ ప్రాంత వివాహాల రిజిస్ట్రారు శ్రీ ఎస్. పి. బర్డ్ సమక్షంలో

జరిగింది'' అప్పటికే దేశంలో ప్రసిద్ధుడైన సంఘ సంస్కరణోద్యమ నాయకుడు వీరేశలింగంగారి ఆశీర్వాదం ఆ నూతన దంపతులకు లభించింది.

ఆ తరువాత హైదరాబాదులో స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని యౌవనవతి యైన కొత్త పెండ్లికూతురుగా హాయిగా ఆనందంగా ఆమె కుటుంబ జీవితం అనుభ వించడం ప్రారంభించింది, 1901 లో ప్రథమ సంతానం మగశిశువు-జయసూర్య జన్మించాడు — తరువాత మూడేండ్లకాలంలో పద్మజ, రణధీర, లీలామణి పుట్టారు. ప్రపంచం నలుమూలలనుండి స్నేహితులతో అతిథులతో సరోజనీదేవి యిల్లు ఘన మైన మర్యాదలకు మారు పేరైంది. పెండ్లి అయింతర్వాత కొన్ని సంవత్సరాల పాటు సరోజినీదేవి యీయింట్లో పసిపిల్లల నవ్వు దొంతరలమర్మరధ్వనుల మధ్య, తన జీవితాన్నే సర్వసంపన్నవంతంగా చేసిన ప్రేమవాత్సల్యాల పెన్నిధులు ప్రవ్వ కుంటూ కాలం గడిపింది. ఆమె రాసిన ప్రారంభ కవితలలో చాలా భాగం ఆమె జీవితంలోని యిప్పటి వాతావరణాన్నే ప్రతిఫలిస్తుంటాయి. గృహ సౌఖ్యాలను గురించీ, బాలబాలికలను గురించీ తాను మనసారా ప్రేమించిన హైదరాబాదు నగరాన్ని గురించిన విశేషాలన్నీ ఆ కవితలలో ఆమె నిక్షేపించింది.

ఆర్థర్ సైమన్స్‌కు ఆమె యిలా రాసింది. ''నేను మామూలు పద్ధతులలో మసలుకోవడం నేర్చుకున్నాను. ఇతరు లందరిలాగే పైపై మెరుగులతో కాలం గడుపుతున్నాను. ప్రతివారు నన్ను చూసి చాలా హాయిగా వున్నాననీ, ఆనందంగా వున్నాననీ, ధైర్యశాలిననీ అనుకుంటారు, అంటే సుఖంగా జీవితం గడపడానికి ఏ స్వల్ప సాధారణ విషయాలు అవసరమని వారి అభిప్రాయమో అవన్నీ నాలో వారికి కనిపిస్తున్నట్లు అనుకుంటారు. మా అమ్మకు మాత్రం నేను ''చాలా అమా యకపు పిల్ల'' నని మాత్రమే తెలుసు. నలుగురిలో హాయిగా బ్రతికే అదృశ్యమయ జీవిత తత్వాన్ని నేనుకూడా క్షణక్షణ పరిశీలనతో నేర్చుకున్నాను అవును నిజమే. ఇంద్రియానందానికే ప్రాముఖ్యమిచ్చి 'తిను, త్రాగు, హాయిగావుండు, రేపు ఎలాగూ పోయేవాళ్లమేగదా' అని చెప్పిన ఎపిక్యూరస్ సిద్ధాంతంలాగా పైకి కని పించినా నిజానికి యిది చాలా సున్నితమూ, కష్టసాధ్యమైన తత్వమే.'' కాని ఆమెలో కొంత మనోవేదనకూడా లేకపోలేదు. ఇది ఆమె అనారోగ్యంవలా'' బాధలవల్లా; అందుకే ఆమె యిలా రాసుకుంది. ''మృత్యువుతో పెనగులాడుతూ నేను అనేక 'నిన్న' లు గడిపాను. ఈ వాక్యానికి ఎంత అర్థం వుందో దాన్ని పూర్తిగా గ్రహిం చాను. ఇది కేవలం అలంకారం కోసం చెప్పిన మాటకాదు. నా జీవితంలో అక్ష

రాలా నిజమైన విషయం. రేపు నేను యీ లోకాన్ని వీడిపోవచ్చు, నిజానికి మృత్యు గహ్వరంనుండి బైటపడి యింకా రెండు నెలలైనా నిండలేదు; ఎల్లప్పుడూ ఉల్లాసంగా వుండడం కంటే, గత్యంతరం ఏమైనా వుందా? ఉంటే ప్రయోజనం వుందా? నాకు జీవితమో, నా మనస్తత్వమో ప్రసాదించిన అనేక లక్షణాలలో, నవ్వుతూ కాలం గటపడం అనే నా స్వభావం అన్నిటికంటే మిన్నఅయిన, అమూల్యమైన బహూకృతిగా భావించుకుంటాను.''

కేవలం గృహవాతావరణానికి పరిమితమై ఉండడంతోనే సరోజినీదేవి సంతృప్తి జెందలేదు. కవితలు ఒకదానివెంట మరొకటి కుప్ప తెప్పలుగా రాసింది. భారత మహిళల పత్రిక (ఇండియన్ లేడీస్ మేగజిన్) అనే పేరుతో 1901 లో సమకాలికురాలు, స్నేహితురాలైన శ్రీమతి కమలా సత్యనాథన్ ప్రారంభించిన ప్రసిద్ధ పత్రికలో ఆమె కవితలు ప్రకటించడంవల్లా, కవితలు హృదయంగమంగా వుండడంవల్లా, అవి భారతదేశంలోనేకాక, ఆంగ్లభాష మాట్లాడే అన్ని దేశాల్లోనూ పాఠకుల ఆదరాభిమానాలు పొందడంవల్లా, అచిరకాలంలోనే సరోజినీదేవి సుప్రసిద్ధ కవయిత్రిగా పేరు గాంచింది. ఆమె ప్రథమ కవితా సంకలనం ''స్వర ప్రాంగణం'' ప్రకటించగానే యీ విషయం స్పష్టంగా ఋజువైంది.

# శబ్ద సౌందర్య జలధి అంచులమీద...

సరోజినీదేవి వాక్కునుండి శబ్దాలు శరవేగంతో పూలసెలయేళ్ళు పొంగి వస్తున్నట్లు ప్రవహిస్తాయి. శబ్దసౌందర్యజలధి అంచుల మీదే ఆమె తేలుతూ పొంచు కూర్చుని వుంటుంది. ఆమె ప్రసంగాలు విన్నవారికీ, కవితలు చదివినవారికీ ఆమె వాడే శబ్దాలు శ్రవణపేయమైన సంగీత ధ్వనులతో గుండెల్లోకి గ్రుచ్చుకుపోతాయి. ఇంతకూ యీ శబ్దాలు ఆమె చిన్నతనంలో యింట్లో వింటుండే మూడు భాషల్లోవీ కావు. ఆంగ్ల భాషాభాండారం కొల్లగొట్టి తెచ్చిన శబ్దాలవి.

ఆమె యింగ్లీషులోనే ఎందుకు రాసింది? అలా అయితే ఆమె అసలు కవిత్వం ఎందుకు రాసింది, తన ప్రావాహిక వక్తృత్వ గరిమనంతా అంత రమణీయ శబ్దజాలంతో కట్టివేసిం దెందుకు అనే ప్రశ్నలుకూడా వేయవచ్చు. ఆంగ్ల భాషమీద తనకు గల అమోఘమైన అధికారంతో ఆమె శ్రోతల గుండెల్లో విద్యుత్తులు మెరిపించింది. కవిత రాయడానికి తన జీవితం అంకితమైనట్లు భావించుకుంటున్నానని ఆమె స్వయంగా చెప్పుకుంది. ఇదే ఆమె జీవిత లక్ష్యం. ఒక గేయంలో ....

—తమ మతమే తమకు సర్వం
వేదాంతులకు, ప్రవక్తలకు
తమ విజయాలే తమకు గర్వం
రాజులకూ, సైనికులకు
పరాజితులు కోరేది బ్రతుకులో ప్రశాంతి
గెలిచినవారికి పేరాస, ఆక్రమించుకునేకాంక్ష
నాకంటావా, హేభగవాన్!
కవిత్వం బ్రహ్మానందపదవి. [1]

ఈ బ్రహ్మానంద సదృశమైన కవితా గానం ఆమె ఆంగ్లభాషలోనే చేసింది. భారతదేశంలోని పండితులూ, సాహిత్యాన్ని ప్రోత్సహించే విదేశీప్రముఖులూకూడా మాతృభాషలో చేసిన రచనే మేలైనదిగా భావించే సంకుచిత తత్వానికి తల ఒగ్గిన వారేనేమో అనిపిస్తుంది. వారు చేస్తున్న పరిశీలన అంతా అవాస్తవికంగానూ వృథా కాలయాపనగానూ కనిపిస్తుంది. భారతదేశంలోని పుస్తకసమీక్షకులుకూడా యిటువంటి తప్పే చేస్తున్నారు. ఏదైనా ఒక సృజనాత్మక రచన మంచిదా కాదా అని నిర్ణయించుకోడానికి వారివద్ద బహుశః అంతకు మించి వేరే ప్రమాణాలు ఏమీ లేవనుకుంటాను. ఈనాటి భారత కవయిత్రులలో సుప్రసిద్ధ అయిన కమలాదాస్ ఆంగ్లంలోనే రాస్తున్నది. ఇటువంటివారికి "ఇండో - ఆంగ్లియన్" (ఆంగ్ల భాషలో రాసే భారతీయ) రచయితలనే ముద్ర కొత్తగా తగిలిస్తున్నారు. ఈ ముద్రను గురించి

1. కాల విహంగం పేజీ. 103.

యీ గ్రంథంలో మరొకచోట విపులంగా చెప్తాను. అందువల్ల ప్రస్తుతానికి కమలా దాస్‌ను ఈ పేరుతో పిలవదలచుకోలేదు. ఆంగ్లభాషలో భారతీయులైనవారు రచనలు చేయడానికి అభ్యంతరం చెప్తున్న ప్రబుద్ధల భావాలను తిరస్కరిస్తూ వారికి యీ విధంగా జవాబు చెప్పింది కమలాదాస్.

"నేను నూటికి నూరుపాళ్ళు భారతీయ వనితను, నల్లని (బ్రౌన్) దాన్ని. మలబారులో జన్మించాను. మూడు భాషలు మాట్లాడగలను. రెండు భాషల్లో రచనలు చేయగలను. ఒక భాషలో మాత్రమే ఊహల కలలు కనగలను. ఆంగ్లం, నీ మాతృభాష కాదు గనుక ఆ భాషలో రాయవద్దు అంటారు, విమర్శకులు, మిత్రులు, అతిథులు, అన్నలూ, తమ్ములు. అయ్యా! నాపాటికినన్ను వదిలేయండి, నా యిష్టం వచ్చిన భాషలో నన్ను పలకనీయ రెందుకు ? "

అవును, నేనూ అడుగుతున్నాను, సరోజినీదేవిని కూడా విమర్శకులు అలా వదలివేయరెందుకు? కవయిత్రి తోరుదత్తులాగా సరోజినీదేవి కూడా కాలపరీక్షకు తట్టుకుని నిలబడగలిగింది. పూర్వకవులు నిలిచారనడానికి యిదేగదా ఖచ్చితమైన ఋజువు. మాతృభాషలో రచన తప్పనిసరి అయితే డిలాన్ థామస్ వేల్స్‌భాషలోనూ, జేమ్స్‌జాయిస్ తన ఐరిష్ భాషలోనూ ఎందుకు రాయలేదనికూడా మనం అడగవచ్చుగదా! వెస్ట్ ఇండియన్ అయిన నైపాల్, రష్యన్ జాతీయుడైన నొబకోవ్, పోలండు వాడైన కోన్రాడ్, చైనా జాతీయుడు లిన్ యుటాంగ్, హంగరీ దేశస్తుడు కోస్లర్ — యింకా ఎందరో ప్రఖ్యాత ఆంగ్ల భాషాప్రియులు తమ అభిప్రాయాలు ప్రకటించడానికి ఆంగ్లభాషనే ఎందుకు ఆశ్రయించవలసి వచ్చింది? రచయిత అయినవాడు తనకు ఏ భాష కరతలామలకం అయిందో దానిలో మాత్రమే చెప్పగలుగుతాడు. భారతీయులు తమ మాతృభాషను వదిలి ఆంగ్లంలో రచనలు చేస్తున్న పరిస్థితిమీద వ్యాఖ్యానించిన ఒక విమర్శకుడి విషయావగాహనను తిరస్కరిస్తూ శ్రీ అరవిందఘోష్ చెప్పిన జవాబు ఆమోదయోగ్యంగా వుంది. "అతని విషయావగాహనకే అంత ప్రాధాన్యం యివ్వాలా? నేనూ ఆ విధంగానే, అంతటి బాధ్యతతోనే అతనిని అడుగుతున్నాను. తనవంటి పాశ్చాత్యులే, తమ తమ దేశాల్లోని పార్లమెంటులూ, ఫాక్టరీలు యింకా యింకా ఎన్నో వున్నాయిగదా - అవన్నీ వదలి వచ్చి ప్రాచ్యసంప్రదాయానుసారులయి ఆధ్యాత్మిక చింతనలోనో, యోగాభ్యాసంలోనో మునిగి తేలుతూ, వాటిని అలవరచుకుంటున్నా రెందుకు ?"

సరోజినీదేవి వాడిన భాష మాత్రమే ఇంగ్లీషు. ఆమె వాడిన భావచిత్రాలన్నీ భారతీయమైనవే. ఇంగ్లాండులోని పూలనుగురించీ, పక్షులను గురించీ రాసి ఆంగ్ల దేశీయమైన భావచిత్రాలను వాడుకుంటున్నదనీ, షెల్లీ, కీట్సువంటి ఆంగ్ల కవిశేఖరులను అనుకరిస్తుందనే ఆరోపణలు రాకుండా చేసుకునేందుకు ఆమె నిశ్చయించుకుంది. వాటిని వాడకూడదని నిర్ణయించుకుంది. పురాతన సంస్కృతి, సంప్రదాయ వైభవ సంపదలతో, మానవజీవిత సర్వవైవిధ్యంతో, సాధించి తెలుసుకోదగిన అనేక మహారహస్యాలతో, త్రవ్వుకుని గంపలకెత్తుకోదగిన విజ్ఞానపు పెన్నిధులతో — సరోజినీదేవికి తన దేశం తనముందు సాక్షాత్కరిస్తూనే వుంది గదా. ఇంతకంటే మించిన ప్రాచ్యసంప్రదాయ విజ్ఞాన నిధులు యింకేం కావాలి సరోజినీదేవికి ? అందువల్లనే ఆమె పూర్తిగా భారతీయమైన భావచిత్రణలతోనే కవితావ్యాసంగం కొనసాగించింది. తనవైన భారతీయ జీవన దృశ్యాలలోనూ, తన పూర్వీకుల సంప్రదాయాలలోనూ, విహరిస్తూ ఆమె భావనా వీధిలో పండుగ పరవళ్లు త్రొక్కుతుండేది. ఆమె రాసే విషయాలన్నీ భారతీయమైనవే. ఆ అలంకారాలు - ఉపమా, రూపకాదులన్నీ భారతీయులవే. ఎప్పుడో ఒకప్పుడు సకృత్తుగా మాత్రమే పర్షియన్, ఇస్లామిక్ సంప్రదాయాలజోలికి పోతుండేది. ఆమె ఎన్నుకునే కావ్యవస్తువులన్నీ గృహపరిస్థితులకూ, గ్రామీణ జీవితానికి సంబంధించినవే. గేయరచనలో అనుసరించే ఫణితులన్నీ, పడవ నడిపే వాండ్లూ, పంట కోసే వాండ్లూ, గుడ్డలు నేసే వాళ్ళూ పాడుతుండగా విన్న జానపదగీతాల ఫక్కీలో రాసినవే. ఆ పాటల్లోని ఊపూ, తూగూ, ఆమెను మైమరపించేవి, తన్మయత్వంలోకి త్రోసివేసేవి. ఒక ఉదాహరణ :

## బాటసారి పాటగాండ్లు

(వారుపాడే ఒక ఫణితిలోనే రాసిన గేయం)

తెరువరులం తెరువరులం
తిరుగుతుంటాం తిరుగుతుంటాం
దేశదేశాల్ తిరుగుతుంటాం...
గాలి కంఠం కబురు చేస్తే
కాళ్లీడ్చిన చోటకల్లా ... తిరుగుతుంటాం

తంబురాపై పాడుకుంటూ
ఆడుకుంటూ వేడుకుంటూ...తిరుగుతుంటాం...
మారు పాడే అరణ్యాల్లో
రాజవీధుల రాగ లయలో...తిరుగుతుంటాం...
తెరువరులం తెరువరులం
తిరుగుతుంటాం తిరుగుతుంటాం
దేశ దేశాల్ తిరుగుతుంటాం.[2]

చిన్నతనంలో తాను నివసించిన స్వర్ణసౌధం కిటికీలోంచి క్రిందికి తొంగి చూస్తూ యిటువంటి పాటలు వింటున్న సరోజినీదేవి చిత్రం యీ పాట ద్వారా మనం ఊహించుకోవచ్చు, లేదా తన టాంగామీద వీధిలో వెళ్తూ ఆగి ఆ గాయకులతో మాట్లాడుతున్న దృశ్యమైనా మనకు కనిపిస్తుంటుంది. చర్చిలో గంటల ధ్వని, మసీదులో నమాజు లేక గుడిలో పూజారుల మంత్రోచ్చారణ - అన్ని మతాలకు సంబంధించిన ప్రార్థన పాతాల సంగీతానికి ఆమె మనస్సు ఉప్పొంగిపోయేది. ఇదే ఆమెలోని సర్వ మత సామరస్య దృష్టికి బీజాలు వేసింది. దాని కోసమే ఆమె నిరంతరం పోరాడింది,

అసలు యీ వివిధమతాల వ్యత్యాసా లెందుకుండాలి? అన్నిరకాల పూజా పునస్కారాలను గౌరవిస్తూ మానవజాతి అంతా ఎందుకు సమైక్యంగా మనకూడదు? ఆమె కవితల్లో యిటువంటి భావాలు పదే పదే కనిపిస్తుంటాయి.

సాయం ప్రార్థన

అల్లాహో అక్బర్! అల్లాహో అక్బర్!
అడుగో మసీదుగోపురం మీదెక్కి మోజిన్లు పిలుస్తున్నారు
ఓ ఇస్లాం మహాప్రభూ, పలకవయ్యా భగవాన్!

---

2. స్వర్ణప్రాంగణం. పేజి. 28.

అస్తమించే సూర్యుని నీడలు అవిగో నేలమీద పడుతున్నవి
అల్లాహో అక్బర్! అల్లాహో అక్బర్!

అవే మేరియా! అవే మేరియా!
పూజావేదిక లెక్కి ప్రీస్టులు పిలుస్తున్నారు
మేరీ కన్య మేటి కొడుకును కాలుస్తున్న భక్తులార!
ప్రారంభించండి ప్రార్థన గంటలు మ్రోగుతున్నాయి
అవే మేరియా! అవే మేరియా!

అహురా మజ్దా! అహురా మజ్దా!
అవెసా పారుతున్నది అనంతసంగీత నాదంలా
ఆరని కాగడాలవెలుతుర్లో గౌరవంగా తలలు వంచి
వంగివంగి ముట్టించండి ఓ దేవుని భక్తులార!
అహురా మజ్దా! అహురా మజ్దా!

నారాయణ! నారాయణ!
అనాదిగా జరిగే ప్రార్థన ఆలకించండి, ఆరంభించండి
చేతులెత్తి జోడించండి, ఓ బ్రాహ్మణవర్యులార!
గొంతెత్తి పాడండి కోటి నామార్చన గీతాలు
నారాయణ! నారాయణ![3]

హైదరాబాదును గురించిన వర్ణనలతోనూ, హిందూ — ముస్లిం భాగస్వామ్యంగల ఆ నగర జీవిత వైవిధ్య చిత్రణతోనూ సరోజినీదేవి కవితా వ్యాసంగం ప్రారంభమైంది. రకరకాల ఆకర్షణలకు నిలయమైన ఆ నగరం చూడండి.

పావురాయి కంఠంలా తళుకుల్తో మెరుస్తోంది
రంగు రంగు మచ్చలతో అంతులేని ఆకాశం—

3. కాలవిహంగం పే. 45, 46.

అగ్నికణాలతో చేసిన ఆభరణాలు కదుల్తున్నట్లు
నగర ముఖద్వారంనుండి పారే యీ నదీమతల్లి
తెల్లగా మెరుస్తూ స్ఫటిక కాంతుల కవాటాలు తెరుస్తూ
ఏనుగు దంతాల ఒంపుతో ఒయ్యారం ఒలకబోస్తోంది.[4]

రాజకీవి పెల్లుబికే హైదరాబాదు నగరాన్నీ, హిందూ - ముస్లిం సంస్కృతి సంప్రదాయాల కాణాచియై ప్రాచ్య వైభవ స్ఫోరకమైన అక్కడి వాస్తు శిల్ప విన్యాసానికి ఆభరణప్రాయంగా తళతళా మెరిసే తన నివాసభవనం, 'స్వర్ణప్రాంగణా'న్నీ ఆమె మనసారా ప్రేమించి అభిమానించింది. ఇస్లాం కవిత, సంస్కృతుల లోతుల్లో మునకలు వేసింది. "అమీర్ ఖుస్రూ నోటినుండి విని నేను మొదట్లో శబ్దోచ్చారణ నేర్చుకున్నాను. మా నగరంలోని ముస్లిం స్త్రీ పురుషులతోనే నాకు మొదట్లో స్నేహ సహవాసాలు లభించాయి. ముస్లిం పిల్లలతోనే చిన్నప్పుడు నేను ఆడుకుంటుండేదాన్ని." ఆమె దృష్టిలో "శాశ్వతమైన పాటల"కు మించిన పరమ సౌందర్యమేదీ సృష్టిలో ఉండదు. అయినా తన హిందూ సంస్కృతిని, పురాతన పౌరాణిక గాథలనూకూడా ఆమె అభిమానించేది. అయితే తోరుదత్తులాగా సరోజినీదేవి ఎప్పుడూ భారతీయ వీరగాథలతో కూడిన గేయ కథాకావ్యాలు రాయలేదు. ముక్కోటి దేవతల మూర్తులన్నీ ఆమె హృదయానికి సన్నిహితంగానే వుండేవి. కాని ఎక్కువగా సరోజినీదేవి పరదాలోకంలోని ప్రత్యేకతలు, అక్కడి రహస్య విశేషాలు, అమూల్య అలంకారాలు, అందమైన స్త్రీలు, సిగ్గు దొంతరలమధ్య చిందులాడే వధువులూ, వివాహితలూ, వారు ధరించే నగలూ నాణ్యాలూ, సుగంధాలు విరజిమ్మే అందాల దంతపు బరిణలు, సుగంధద్రవ్యాలు, వాసన నూనెలు, సిల్కులు, శాటిన్లు మొదలగు వాటిని చూసి సరదాపడుతుండేది.

దీని తర్వాత అచిరకాలంలోనే ఆమె దేశం మీద పడి తిరుగుతూ, అన్ని ప్రాంతాలను గురించి రాసింది. ఆమె చేసిన ప్రసంగాల్లో దేశభక్తిభావాలు కట్టలు తెగిన కాలువలై పారాయి. రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రి వక్తృత్వ వైభవం చూసి ఆయన బంగారు నాలుకతో పలుకుతాడనేవారు. అయితే సరోజినీదేవి "నైటింగేల్

---

4. స్వర్ణప్రాంగణం.

ఆఫ్ ఇండియా'' లేదా ఎవరో హాస్యపు ధోరణిలో అన్నట్లు "నాటీగాల్' (అల్లరి పిల్ల). ఎవరో అన్న యీ హాస్యోక్తిని ఆమె మనసారా ఆనందించేది. తన మీద తానే వేసుకున్నా, యితరులు వేసినా ఆమె హాస్యోక్తులను బాగా మెచ్చుకుంటూ హాయిగా నవ్వుతూ అనుభవించేది.

## స్వర్ణ ప్రాంగణం

ఆర్థర్ సైమన్స్ యిలా రాశాడు. "ఆమెలోని సౌందర్య తృష్ణే ఆమె నొక కవయిత్రిగా తీర్చి దిద్దింది. సౌందర్య స్పర్శతో ఆమె శరీరంలోని నరాలు శోభాయమానంగా నాట్యం చేసేవి. ఇంగ్లండులో ఆమె వుంటున్నప్పుడు చూసిన వారికి ఆమె సన్నని విగ్రహంలోని అందమంతా ఆమె కండ్లలో గడ్డకట్టినట్లు అనిపించేది. ప్రొద్దుతిరుగుడు పూవు సూర్యునివైపు తిరిగినట్లు ఆమె సౌందర్యం వైపు తిరుగుతూ కాలం గడిపేది. అంతకంతకూ విశాలమవుతున్న ఆమె వ్యక్తిత్వం వైపు చూడగా చూడగా చివరకు ఆమె కండ్లు తప్ప మరేమీ కనిపించేవి కావు.''1 అవును నిజమే. ఆమె సౌందర్యమనే మధువు త్రాగి తైతక్కలాడేది. అయితే అందమైన వాటిని గురించి ఆమె సృష్టించే శబ్దచిత్రాలలో సాంప్రదాయికరీతులుకూడా తొంగిచూస్తూ ఉండేవి.వీటివల్ల కవితకాక చిత్రమైన శైలి అబ్బేదే కాని ప్రకృతిలోని వాస్తవికతకు దూరమైపోతుండేది. ఆమె లేఖిని నుంచి దూకే శబ్దప్రవాహాల వేగం, యిదంతా అతిశయోక్తి యేమో అనిపించేటంత ఉత్సాహభరితంగా వుండేది. ఆధునిక యుగంలోని కవుల లక్షణం జీవితంలోని మౌలికాంశాలనూ, అన్యాయాలనూ, అందవిహీనతలనూ ఎత్తిచూపడం. కాని సరోజినీదేవికి యిటువంటి విషయాలను గురించిన స్పృహ లేదు. ఆమె కవితలో పొంగిపొర్లే ప్రాచ్య సౌందర్య వర్ణనా వ్యామోహం

1. స్వర్ణ ప్రాంగణం.

చూస్తుంటే ఒక్కొకసారి మనసు ఉక్కిరి బిక్కిరవుతుంది. 'చేనేత పారిశ్రామికులు' అనే ఆమె రాసిన కవిత చూడండి. ఇదీ ఆమె చూసిన దృశ్యం. అనేక రంగులు పూసి గీసిన యీ భావచిత్రం కనులకు మిరుమిట్లు గొలుపుతుంది. అన్నీ రంగులే కాని బ్రతుకు బాధా నిత్య సంఘర్షణా మందుకైనా కనిపించవు. అయినా జీవితం రెండు అంచులకూ అతుక్కొని, అంతర్గతంగావున్న జననమరణాల గాథ సూత్రం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ప్రతి ఉషస్సుకు మగ్గమేసీ
అంత అందపు అంగవస్త్రా లెందుకయ్యా నేస్తారు?
పసిడి కరిగిన పోత లిప్పుడు ఎందుకయ్యా పోస్తారు?

శిశిరీరంలో శీతగాలికి వణకిపోయే బిడ్డకోసం
ఇపుడు పుట్టిన శిశువుకోసం యీ వస్త్రం నేస్తున్నాం
జరీపోగుల మిశ్రమంగా పసిడిపోతలు పోస్తున్నాం

రాత్రి దూరిన చీకటింట్లో
అంత వెలుగుల రంగువస్త్రా లెందుకయ్యా నేస్తారు?
కళాకౌశల విలాసార్భాటు లెందుకయ్యా చేస్తారు ?

చిన్నరాణికి పెండ్లిరోజున సన్నవలువల ముసుగుకోసం
డాబుసరిగా ధరించేందుకు ఈ వస్త్రం నేస్తున్నాం
నెమలి ఈకల రంగులన్నీ కలిపి మగ్గం వేస్తున్నాం

వెండి వెన్నెల వెలుగులోనే
అంతచల్లని తెల్ల వస్త్రా లెందుకయ్యా నేస్తారు?
తునిగిపోయే పోగులన్నీ ఎందుకయ్యా ముడేస్తారు?

తెల్లమబ్బుల వెల్లవేసిన నింగిబోలిన శవంకోసం
పైన పరిచే గుడ్డకోసం యీ వస్త్రం నేస్తున్నాం
కాలసర్పం రాల్చిపోయిన సన్నకుబుసం చేస్తున్నాం.

చేనేత పారిశ్రామికులను కోరికోరి పిలుచుకుని యివీ ఆమె వేయదలచిన ప్రశ్నలు: యివీ ఆమె ఊహించి చెప్పకున్న సమాధానాలు. ఏమిటీ ప్రశ్నలూ జవాబులూ? యిదంతా ఒక అవాస్తవికలోకపు అంచులమీద చిత్రించిన దృశ్యం; ఊహల నిచ్చెనలమీదెక్కి చేరుకున్న భావకవితా ప్రపంచం. చేనేత పనివాండ్లు చీకటిపడ్డాక గుడ్డలు నేస్తారా? వెన్నెల వెలుగులో కూచోని పనిచేస్తారా? వారు నేస్తున్న వస్త్రాలలో ఉదయకాంతులు, చీకటి రంగులూ, వెన్నెల వెలుగులూ చూసుకుంటూ కాల గమనాన్ని వర్ణించింది. దాన్ని జీవయాత్రతో సమన్వయించి జనన మరణాలనే ఆద్యంతాల అంచులతో ముడివేసింది. ఆ విధంగా ఆమె కవుల కుండే నిరంకుశ ఊహాకల్పనల హక్కును వినియోగించుకుంది. కాని వాస్తవాలను గురించి పట్టించుకోలేదు. ఇందులో కొంతవరకు సంకేత కవితా లక్షణం కనిపిస్తున్నది. సాహిత్యంలో సింబాలిస్ట్ (సాంకేతికకవితా) ఉద్యమం కొనసాగుతున్న రోజుల్లో ఆమె కవితా వ్యాసంగం సాగిందనే విషయం మనం గుర్తుపెట్టుకోవాలి. ఆర్థర్ సైమన్స్ చెప్పినదాన్నిబట్టి యీ ఉద్యమ మూలపురుషుడు జెరార్డ్ డి నెర్వాల్ (1808-1855). ఆయన ప్రత్యేకమైన ఒక శైలికి సృష్టికర్త. అందులో "కనిపిస్తున్నది యథార్థము కాదు: కనిపించనిది కల్లా కాదు."2

1905లో విలియం హాసిమన్ "స్వర్ణప్రాంగణం" కవితా సంకలనం ప్రచురించినప్పుడు ఇంగ్లాండులో సాహిత్యంలో తుఫాను వచ్చినంత పనయింది. నిజానికి అటువంటి గేయాలు యిప్పుడెవరైనా రాస్తే వాటి ముఖం కూడా చూడరు. 1970లు జరుగుతున్న యీ కాలంలో సాహిత్యలోకంలో అటువంటి వాటికి విలువే లేదు. కాని ఈ శతాబ్దం మొదటి దశాబ్దం జరుగుతున్న సమయంలో ఇంగ్లాండు యింకా విక్టోరియా సాహిత్య యుగ లక్షణాలలోనే మునకలువేస్తూ వుంది. అందుకే ఇండియానుండి వచ్చిన యీ వింతదొంతరలహరివిల్లు వంటి అందాల ఆడపిల్ల రాసిన కావ్యానికి అంత ఆదరణా అంతులేని ప్రశంసా లభించాయి. ఆనాటి సుప్రసిద్ధ కావ్యవిమర్శకులందరూ ఆ కవిత్వాన్ని అంతగా

---

2. సాహిత్యంలో సింబాలిస్ట్ ఉద్యమం: అర్థర్ సైమన్స్ రచన: పే. 4

పొగిడారంటే, అంత మనస్ఫూర్తిగా మెచ్చుకున్నారంటే అందులో ఎంతో హృదయంగమమైన సాహిత్యపు విలువ ఉండి వుండాలి. ఈ కాలంలోనైతే సరోజినీ దేవికి, తన మాటల అలంకారాల మూటలు మోసుకుంటూ చరచరా పరుగెత్తే శైలితో కవయిత్రిగా బైటికి వచ్చి నిలబడడమే కష్టమై వుండేది అనేమాట నిజమే. కాని ఆనాడు, 1905లో ఆమె మీద ప్రశంసావర్షం జోరుగా కురిసిందనే మాట కూడా అంత నిజమే కదా. అంత ఎక్కువగా, సాహిత్యవేత్తలు మనస్ఫూర్తిగా ప్రశంసించిన కారణంగానే ఆమెకు అమరత్వం సిద్ధించింది. ఇక ఆమెకు మరణమనేది లేదు. ఒకవేళ టెన్నిసనో, షెల్లీయో దిగివస్తే మాత్రం యీ రోజుల్లో అప్పటిలాగా ఆదరిస్తారా? కాని వారు తమ తమ కవితా ప్రతిభలను ప్రదర్శించి గట్టిపరుచుకుని వెళ్ళిపోయారు. అవే నేటి కవిత్వానికి పునాదులుగదా. అలాగే సరోజినీ దేవికూడా, స్వల్పంగానే కావచ్చు, తన గేయాలతో తన పరిధిలో తానూ సాహిత్యాన్ని పరిపుష్టంచేసింది. ఆమె రాసిన గేయాలు భారత దేశపు ప్రేమగీతాలు అనే వర్గీకరణలోనో, ఆకాలపు అటువంటి గీత సాహిత్యంలోనో చేరతాయి. తరువాత చాలా కాలం వరకు సమాజంలోని ఒక వర్గం ప్రజలు వాటిని ఆనందంగా చదువుకుంటూనే వుంటారు. పాడుకుంటూనే వుంటారు.

ఆనాటి పత్రికా సమీక్షలు చూస్తే, 1905లో సరోజినీదేవి కవితకు ఎంత పేరువచ్చిందో స్థూలంగా తెలుసుకోవచ్చు.

ఆర్థర్ సైమన్స్‌కు సరోజినీదేవితో కొన్నేండ్ల క్రితం కలిగిన పరిచయాన్ని ప్రస్తావించి ఆమె తెలివితేటలు, ఆవేశం, మర్యాదలను గురించి ఆయన తన పీఠికలో రాసిన కొన్ని భాగాలను ఉదహరించి లండన్ టైమ్స్ పత్రిక యింకా యిలా రాసింది. ''ఇవన్నీ ఆమెలో పుష్కలంగా వున్నాయి. కాని అన్నిటికంటే ముఖ్యమైన విశేషం, ఆమె భారతదేశస్తురాలు అయినప్పటికీ, మా భాషలోని శబ్దమాధుర్యాన్నీ, మాటల సంగీత సౌందర్యాన్నీ, ఆ శబ్దాల ఊపూ, తూగూ, శయ్యా సౌభాగ్యం అన్నీ చేజిక్కించుకుంది. తనపాటల తాళ్ళతో ఆమె ఉయ్యాల ఊగుతుంది....ఆమె కవితకు సంగీతం కూడా వచ్చునేమో అనిపించేట్లు అదే పాడుతుంది. కవయిత్రి మనసులో మొలిచిన భావాలు, ఆవేశాలు తమంతట తామే పాటలుగా తయారై బైటికి పొంగాయేమో అన్నట్లుంటాయి. ''పద్మాసనంలోని బుద్ధదేవునికి'' వంటి ఆమె కవితల్లో భావసమైక్యత, అప్రయత్నపూర్వకమైన

సహజశైలీ మాధుర్యం కనిపిస్తాయి. ఇక్కడే ఆమె ప్రతిభప్రధానంగా దర్శన మిస్తుంది....ఆమె రాసిన వర్ణనాత్మక గేయాల్లో - శైలీ, దృశ్యమూ కలిసి సంగీతం పుట్టించేశక్తి తక్కువగా వుంటుంది. అలాగే తన నలుగురు పిల్లలకోసం రాసిన బాల గేయాల్లో కూడా. ప్రాచ్యసంప్రదాయాలతో, ప్రాశ్చాత్యుల సంస్కృతికి జరిగిన యీ విచిత్ర వివాహం సంతానహీనమై నిష్ఫలం కాలేదు. దీనివల్ల కవయిత్రికి పాత విషయాలను గ్రహించడంలో ఒక కొత్త చూపు అబ్బింది. సాటిలేని మేటిఫలితమే కలిగింది. ఇది కవిత్వం అనడానికి ఏ మాత్రం సందేహంలేదు.''3

మాంచెస్టర్ గార్డియన్ పత్రిక బ్రహ్మానంద పరవశమై పరవళ్లు త్రొక్కుతూ యిలా రాసింది. ''సరోజినీనాయుడు రాసిన స్వర్ణప్రాంగణం అనే సంకలనంలోని నిజమైన సృజనాత్మక కవితలు చదవడం మనసుకు ఆహ్లాదకరమైన అదృష్టమే. దీనిలోని నిరాడంబరత చూస్తుంటే 'బ్లేక్' గుర్తుకువస్తాడు. ఇది కవిత కాదు. సంగీతమే. దీనిలోని పాచ్యలక్షణం కూడా కొత్తకొత్తగా కనిపిస్తుంది. ఈ కవిత క్షణంలో మనసుకుపట్టి హృదయాన్ని ఆకట్టుకుంటుంది.''4

రివ్యూ ఆఫ్ రివ్యూస్ అనే పత్రిక 1905 అక్టోబరు సంచికలో యిలా సమీక్షించింది. ''గడిచిన నెలలో పండినంత కవిత్వపు పంట చాలాకాలంగా రావడమేలేదు. ఇందులో ప్రథమ స్థానం సరోజినీనాయుడు రాసిన ప్రాచ్యగీతాల కవితల సంగీత సంపుటికే యిస్తున్నాను. దీనితో మహిళలు మంచి కవితలు రాయలేరని ఎగతాళిచేసే వారినోళ్ళు శాశ్వతంగా మూతపడినట్లే....యింత గొప్ప కవిత్వం రాసిన రచయిత్రి వయస్సు 26 ఏండ్లంటే ఆశ్చర్యపడక తప్పదు. ఈ భారతనారి కవితలు చదివిన తర్వాత, ''వైజ్ అండ్ అదర్‌వైజ్'' కావ్య సంపుటిలోని కుమారి ఇ. టి. ఫౌలర్ కవిత చదువుతుంటే ఎంత వ్యత్యాసం కనిపిస్తుందంటే వాటిముందు యీ ఆంగ్ల రచయిత్రి కవిత ఎందుకూ కొరగానిదని

---

3. ''భారత మహాపురుషులు, మహిళామణులు'' (మెన్ అండ్ ఉమెన్ ఆఫ్ ఇండియా) 1906 మె నెల సంచిక.

4. ,, ,, ,, ,,

పిస్తుంది. ఉష్ణమండల ఆరణ్యాల్లోని మనోజ్ఞమైన ప్రకృతి దృశ్యాలను వీడి ఊరిబయట ఉద్యానవనంలోకివచ్చి విహరిస్తున్నట్లుంటుంది.''5

టి. పీస్. వీక్లీ యిలా రాసింది. ''చక్కని, చిక్కని, ఉన్నతస్థాయిగల అందమైన కవితల సంకలనం యిది. సరోజినీదేవి కవిత అమోఘంగావుంది. ప్రాచ్య సంస్కృతిని చూడాలనుకుంటే పాశ్చాత్యదేశాలవారు యీ కావ్యం అనే గవాక్షం గుండా చూడొచ్చు.'' మార్నింగ్ పోస్ట్ పత్రికలో ''తూర్పుదేశాలలోని నిత్యజీవితక్రమాన్ని వర్ణించే చిన్న చిన్న కవితలు యీ సంకలనంలో వున్నాయి. స్పష్టత కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది. నిజానికి కండ్లతో చూసినదాన్నే సరిగా చెప్పడంలో, అది కవిత్వం అనిపించేటట్లు చెప్పగలగడమే అందరికీ చేతకాని ఒక ప్రత్యేకమైన కళ....ఈ గ్రంథం ఏదో రాశానంటే రాశాననిపించుకున్న పై మెరుగుల పందిరి కాదు. ఇది అందాన్ని అక్షరాల్తో పోతపోసిన పనితనం. ఒకానొక మానసిక స్వభావచిత్రణ జీర్ణించుకున్న రచన.''6 ది అకాడమీ అనే పత్రిక స్వర్ణప్రాంగణం సంపుటాన్ని ''అందాలు నింపిన క్రొందమ్మి బరిణ''గా వర్ణించింది. ''ఈ కవితలో ఆహ్లాదకరమూ, ఆశ్చర్యకరమూ అయిన విషయ మేమిటంటే దీనిలో ప్రస్ఫుటమవుతున్న ప్రత్యేక వ్యక్తిత్వం మరెవరినుండో తెచ్చి పెట్టుకున్నదికాక, తనంతట తానే స్వయంగా సాధించుకున్న సంపూర్ణత్వసిద్ధి.... ఇటీవల చాలాకాలంగా యింత ఆశాజనకమూ, సృజనాత్మకమూ అయిన కవితా సంకలనం వెలువడలేదు.''7

లిజాలెహమన్ అనేగాయని సరోజినీదేవి రాసిన 15 పాటలకు సంగీత స్వరకల్పన కూడా చేసింది. వీటితో లండన్‌లో ఒక సంగీత కచేరీ చేయాలని కూడా ఆమె ప్రయత్నంచేసింది. ఈ కచేరీ జరిగిందో లేదో చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. కాని సరోజినీదేవి కలిసిమెలిసి తిరిగిన మేధావి వర్గాలవారు మాత్రం యీ భారతనారీమణిని హృదయాలు అర్పించి భ కి గౌరవాలతో ఆదరించే వారు.

---

5. ''భారత మహాపురుషులు, మహిళామణులు'' 1906 మే నెల సంచిక.

6. ,, ,, ,, ,,

7. ,, ,, ,, ,,

సరోజినీదేవి కవితలను అభిమానించి, ప్రోత్సహించిన ఆర్థర్‌సైమన్ ఎడ్మండ్ గూస్‌లు యిద్దరూ ఆనాటి సాహిత్యవేత్తలలో ప్రథమస్థానీయులే. ఆర్థర్ సైమన్స్ (1865-1945) సింబాలిస్టు సంకేతకవితా ప్రక్రియకు చెందినవాడు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంవారు ప్రకటించిన 'ఆంగ్ల సాహిత్యచరిత్ర'లో పేర్కొన్న ప్రకారం ఆయన ఆసక్తికరమైన "సౌందర్యరసవాది". 'సాహిత్యంలో సింబాలిస్టు ఉద్యమం' అనే పేరుతో ఆయన చేసిన అనువాదాలు ఈట్స్‌రాసిన కవితకు దోహదకారులైనట్లు చెప్పుకుంటారు. సింబాలిజమూ, ఆధ్యాత్మికతా అప్పుడప్పుడే ప్రారంభమైన రోజులు. అందువల్లనే ఆధ్యాత్మిక వాసనలతో కవితలు రాసిన యీ భారతనారీమణి విశాల దృక్పథంకల ఆయనను అంతగా ఆకర్షించింది. విదేశీయులు మాత్రం ఆంగ్లంలో కవిత ఎందుకు రాయకూడదు అనుకున్నాడు, సహనభూషణుడైన ఆర్థర్‌సైమన్స్. ఎడ్మండ్ గూస్‌కు తాను చాలా ఋణపడి వున్నానని సరోజినీదేవి భావించుకుంటుండేది. అందుకే ఆయనకు "స్వర్ణప్రాంగణం" సంకలనం అంకితం చేస్తూ "ఈ స్వర్ణ ప్రాంగణంలోకి నాకు తొలిసారిగా దారిచూసిన ఎడ్మండ్‌గూస్‌కు" అని రాసుకుని అంకితాంజలి సమర్పించుకుంది. కాని ఈ గ్రంథానికి పీఠికరాసిన ఆర్థర్‌సైమన్స్‌కు కూడా ఆమె అంతకంటె తక్కువగా ఋణగ్రస్థురాలు కాలేదు. సైమన్స్ సరోజినీ దేవికి లేఖరాసి, ఆమె కవితల్ని సంపుటంగా ప్రచురించమని సలహా యిచ్చాడు. అంతవరకు ఆ కవితలు మనదేశంలోనూ, విదేశాల్లోనూ పత్రికల్లో మాత్రమే ప్రచురించారు. ఇప్పుడామె వాటిని ఒక సంకలనంగా అచ్చువేసి ప్రపంచ ప్రజలకు అందించాలని సంకల్పించుకుంది. ఆయన యిచ్చిన సలహాకు ఆనందోత్సాహాల తోనూ ఆవేశంతోనూ ఆమె జవాబు రాసింది." మీ లేఖ చదవగానే నేను నిజంగా గర్వపడ్డాను. కాని వెంటనే విచారం వేసింది కూడా. అంత "సౌందర్యపూరిత మైన" గీతాలు నిజంగా నేను రాయగలిగాననే అంటారా? ఇవి ప్రపంచానికి సమర్పించుకోదగినంత యోగ్యత కలవని మీరు నమ్మడం సాధ్యమేనా? నేను కళ అంటే ఎంత ఉన్నతార్థంలో ఆలోచిస్తానో మీకు తెలుసుగదా. నేను రాసుకున్న యీ చిన్నచిన్న పాటలు నిజానికి నా దృష్టిలో చెప్పుకోదగినంత రసవంతమైన వేమీకావు. అంతే నేను ఊహించుకుంటున్న ఆ సౌందర్య శిఖరాలను తాక గలిగినంత ఉన్నతమైనవికావు. ఇంకా తన వినయసౌజన్యం స్ఫురింపజేస్తూ యిలా అంది. "నేను నిజానికి కవయిత్రిని కానేకాను. కవి దృష్టి ఉంది, కావాలనే కోర్కెవుంది. కాని గొంతు సరిగ్గా విప్పలేకపోతున్నాను. సౌందర్యం నిండిన

గొప్పతనం ఆత్మగా మండిన ఒక్క మంచి గీతం రాయగలిగితేచాలు సంతోషంగా కవితా సన్యాసంచేస్తాను. సృష్టిలో పక్షులు ఎందుకు పాడతాయో నేనూ అందుకే రాస్తున్నాను. ఈ నాకవిత సర్వం ఐహిక లక్షణం కలదే.'' అయితే సైమన్సు కూడా ఆమె రాసిన "పాటల్లోని యీ పక్షి సంగీతలక్షణమే'' అమూల్యమైన కవితగా వాటిని మలచిందని భావించాడు. "మనం అరుదుగా మాత్రమే చూసే ఒకానొక మానసిక పరిస్థితి నుండి, తూర్పుదేశాల నుండి వచ్చిన ఒక స్త్రీ మానసిక పరిస్థితినుండి చాలా సున్నితంగా తప్పించుకుపోయే పద్ధతిని సూచిస్తుంటాయి యీ గీతాలు. అది కూడా పశ్చిమదేశాలవారి భాషలో, కొంతవరకు వారి ప్రభావంతో కలిగిన భావప్రకటన నైపుణ్యంతో. ఆ మానసిక పరిస్థితిని కూడా అవి పూర్తిగా ఆవిష్కరించవు. కాని దాని సారాంశాన్ని మాత్రం చూపి ప్రదర్శిస్తాయి. ఇంతకూ ఆ గీతాలలో ఏదో వైచిత్రి (మాజిక్) తొంగిచూస్తూనే వుంటుంది.''[8]

'కాలవిహంగం' అనే పేరుతో సరోజినీదేవి ప్రకటించిన రెండో కవితా సంపుటానికి ఎడ్మండ్‌గూస్ పీఠిక రాశాడు. మనం యిదివరకే చెప్పుకున్నట్లు తన శిష్యవతంసమైన సరోజినీదేవిని భారతీయమైన విషయాలను గురించి రాయమని ప్రబోధించింది ఆయనే. 1895-1898 మధ్యకాలంలో సరోజినీ దేవికి ఆయనతో పరిచయం కలిగిన సమయంలో యీ సలహా యిచ్చాడు.

'స్వర్ణప్రాంగణం' సంపుటానికి ఇంగ్లాండులో హృదయపూర్వకమైన ఆదరణ లభించిన మాట అటుంచి భారతదేశం కూడా సంతృప్తితో నవ్వులు పువ్వులై కాచింది, తన ముద్దుల బిడ్డ సరోజినీదేవి ఆంగ్లకవితా ప్రపంచంలో అశేషాదరణ పొందినందుకు. ఆనాటినుండే ఆమె "భారతదేశపు నైటింగేల్''గా ప్రపంచప్రసిద్ధి పొందింది.

---

8. స్వర్ణప్రాంగణం పే. 10

# భారతకోకిల పలికింది

మహాత్ముడు సరోజినీదేవిని రెండు పేర్లతో పిలుస్తుండేవాడు. "నైటింగేల్ ఆఫ్ ఇండియా" అనీ "భారత కోకిల" అనీ. ఈ రెండు పేర్లు ఆమెకు చిరస్థాయిగా నిలిచివుంటాయి. కేవలం కవిత్వం రాసినందువల్లనే ఆమెను కోకిలతోనూ, నైటింగేల్‌తోనూ పోల్చలేదు. ఆమె రాసిన వచనం కూడా ఆ లక్షణాలు కలిగిందే. నాకు బాగా గుర్తు. ఒకసారి ఆమె కవితాగానం విని యింటికి తిరిగి వస్తూంటే, ఆమె శబ్ద సౌందర్యజలరాసిలో మునిగి, తాగిన వాడి తన్మయత్వాన్ని అనుభవించాను నేను. ఆమెవాడే భాష, శైలి, నుడికారం, వక్తృత్వపటిమ అన్నీ సర్వసమగ్రంగా వుంటాయి. ఆమె ప్రసంగాలలో అనేక ముఖ్యాంశాలను గురించిన ప్రసక్తి వుండనే వుండదని విమర్శ జరిగిన మాట నిజమే. కాని గ్రంథ రూపంలో ప్రకటించిన సరోజినీదేవి ఉపన్యాసాలను చదివినప్పుడు ఆమె అనేక విషయాలను గురించి చెప్పిందనీ, సమకాలీనమైన సర్వవిషయాల ప్రస్తావన వాటిలో వున్నదనీ నాకు అనిపించింది. నిజానికి ఆమె చేసిన ప్రసంగాల నన్నింటినీ క్రోడీకరించడమూ, వాటిని ఒక ఉద్గ్రంథం రూపంలో ప్రకటించడమూ జరుగనేలేదు. మన సాహిత్య ప్రచురణ కార్యక్రమంలో యిదొక పెద్ద లోపంగా నేను భావిస్తాను. మద్రాసుకు చెందిన జి. ఏ. నటేశన్‌ద్వారా వాటిని సేకరించడానికి ప్రయత్నం జరిగింది. వాటిని అప్పట్లో ప్రకటించడం దేశానికి మహోపకారమే. అయినా ఆ ప్రసంగాలన్నీ ఆమె ప్రారంభ జీవితకాలానికి సంబంధించినవే. ఆ గ్రంథం ప్రతులైనా లభ్యంగాలేవు.

కవయిత్రిగా మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించడంలో విజయం పొందినప్పటికీ, తనకు మరికొన్ని రకాల ప్రతిభాసంపద కూడా వున్నదని సరోజినీదేవి త్వరలోనే గ్రహించింది. ఇల్లు వదలి దేశం నలుమూలలా పర్యటిస్తూ రాజకీయ, సాంఘిక, మతవిషయిక సమస్యలను గురించి ప్రసంగాలు ప్రారంభించింది. శ్రోతలను మంత్ర ముగ్ధులుగాచేసే ఆమె మాటల్లోని విచిత్రమైన శక్తి ఏమిటి?

ఆమె ప్రసంగం శ్రోతల్లో ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా పిలిచి పీటవేసి కూచోబెట్టి మంచి మాటలు చెప్తున్నట్లుండేది. అదీ ఆమె ఉపన్యాసవైఖరి. దానికే వారు ముగ్ధులయ్యేవారు. ఆమె వాడే అలంకారప్రాయమైన విశేషణాలు, చెప్పినమాటనే, ఆ పదబంధాన్నే మళ్ళీ ఒకసారి నొక్కిచెప్పే పద్ధతి, మృదుమధురమైన కంఠస్వరం, చెప్పేది కవిత్వం అనిపించేట్లుగా చెప్పడం — యీ లక్షణాలన్నీ వింటున్న మాబోటి వాండ్లను ఒళ్ళుమరిచే తన్మయత్వంలో ముంచివేసేవి. వింటుంటే, ఆమె మాలో ప్రతి ఒక్కరితోనూ విడిగా మాట్లాడుతున్నటే వుండేది. ఒక అసామాన్య వ్యక్తిత్వ లక్షణంతో ఆమె మా అందరిముందు నిలిచి, యిదుగో యిదీ మీరు అనుసరించవలసిన ఆదర్శం అని చెప్తున్నట్లుండేది. ఇదీ ఆ ఆదర్శం: "ఆత్మ జీవనం మనం సాధించుకుంటే వచ్చేదికాదు. అది మన ఉనికి అనే వస్త్రంలో అల్లిన బంగారపు నూలు పోగుల్లా అంతర్భూతంగా వుండనేవుంది. మిత్రులారా! ఒక విషయం మాత్రం గుర్తించమని కోరుతున్నాను. ఏమంటే మనిషి పొంద దానికి సాధ్యమైన ఉన్నత దేవతాంశ అనేది ఒకటి వుంది. మనిషిలోని మంచిని ప్రజ్వలింపచేసి దానిని అందుకునేటంత ఎత్తుగా మనం పెరగాలి."[1] ప్రజలపట్ల ఆమె చూపే నిరంతర శ్రద్ధాశక్తులు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం వేస్తుంది. ముఖ్యంగా ఆమె భారతీయ విద్యార్థుల పరిస్థితులను గురించీ, మహిళా విమోచన కార్యక్రమం గురించీ ఎక్కువగా పట్టించుకునేది. 1903 లోనే భారతదేశానికి ప్రథమ శత్రువు అనైక్యత ఒక్కటే అనే విషయాన్ని గుర్తించి, యువలోకం సమైక్యంగా మాతృదేశానికి సేవచేయాలని పిలుపు యిచ్చింది. ఒకసారి మద్రాసులో యువజనుల సమావేశంలో ప్రసంగిస్తూ "మీరు అందరూ సంకుచిత రాష్ట్రాభిమానులు. మళ్ళీ మాట్లాడితే, యింకా అంతకంటే సంకుచితమైన అభిప్రాయాలు కలవారు. మీ ఆలోచనా పరిధి మీ నగరం, మీ కులం, వ్యక్తిగతంగా మీ స్వార్థం అనే విషవలయాలను దాటిపోవడం లేదు (బిగ్గరగా హర్షధ్వనులు) నేను చెప్పేది అక్షరాలా నిజం. ఎందుకంటే నేను కూడా చిన్నప్పుడు మీలాగా సంకుచిత దృష్టితోనే ఆలోచిస్తూండేదాన్ని. ఆ తరువాత ప్రపంచంలో ఎక్కడెక్కడో తిరిగాను, చూశాను, ఆలోచించాను. ఆశలు పెంచుకున్నాను. మనిషిని ప్రేమించడం నేర్చుకున్నాను సానుభూతి అలవరచుకున్నాను. వివిధ జాతులు,

---

1. సరోజినీదేవి ప్రసంగాలు, రచనలు. పే. 11

నాగరికతలు, మతాలు, కులాలకు చెందిన ప్రజలతో సంబంధాలు ఏర్పడిన ఫలితంగా నా ఊహావలయం పెరిగింది. దృక్పథం విశాలమైంది."[2]

మహిళావిమోచనోద్యమంలో సరోజినీదేవి వహించిన పాత్రగురించి మళ్లీ ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరంలేదు. అది అందరికి బాగా తెలిసిన విషయమే. దీనిలోకూడా ఆమె మృదువైన ఉపన్యాసధోరణి, "లేవండి" "మేలుకోండి" వంటి మహిళలను ఉద్రేకపరిచే ప్రబోధగేయాలు, బాగా ఉపయోగపడ్డాయి. తప్పుచేసినవారిని మంచి మార్గంలో పెట్టాలనే ఆమె పట్టుదలా, మహిళ లందరూ బిడియపు ముసుగుల్ని చించివేసి ధైర్యంగా బైటికివచ్చి, తమ మేలుకోసం, దేశం మేలుకోసం కృషిచేయాలనే ఒక ఆశయాన్నీ, ఆశనూ వారిలో కల్పించడానికి ఆమె చేసిన కృషీ చెప్పుకోదగినవి. వీటి ఫలితంగానే 1917 లో లార్డ్ మాంటేగునూ, 1926 లో అఖిలభారతమహిళామహాసభస్థాపకుల్ని కలుసుకున్న రాయబార వర్గాలకు నాయకత్వం వహించే అవకాశం ఆమెకు లభించింది. సమాజంలో మహిళాలోక విమోచనానికి, వారికి గౌరవస్థానం కల్పించడానికి ఎటువంటి ఉద్యమం జరిగినా, దాని వెనుక సరోజినీదేవి తప్పనిసరిగా వుండేది.

హిందూ ముస్లిం సఖ్యతకోసం సరోజినీదేవి బ్రతికి ఉన్నంతకాలం పట్టుదలతో పోరాడింది. ఈ రెండు మతాలవారినీ ఆమె గాఢంగా ప్రేమించింది, అభిమానించింది. "అనేక శతాబ్దాలక్రితం యిస్లాం సైన్యం భారతదేశానికి వచ్చినప్పుడు గంగానది ప్రాంతంలోనే వారు విడిది చేశారు. గంగానదిలోని చల్లని పవిత్ర జలాల్లోనే కత్తులు కడుక్కొని గుండెమంట చల్లార్చుకున్నారు. ఆ భాగీరథీ మాతే వారిని-దండయాత్రకు వచ్చిన ముస్లింలను భారతీయులుగా మార్చి హృదయపూర్వకంగా స్వాగతం చెప్పింది. నాటినుండి ఎన్నోతరాలు మారి వారందరు భారతదేశం బిడ్డలైనారు"[3] అనే విచిత్రమైన విశేషార్థంతో ముస్లిం దండయాత్రలకు సొంత వ్యాఖ్యానం చెప్పి ఆమె యీ రెండు మతాలవారినీ దగ్గరకు చేర్చడానికి కృషిచేసింది.

సరోజినీదేవి ఉపన్యాసాల్లో వెలిబుచ్చేభావాలు నిత్యనూతనమైనవి. అంతకు ముందెవరో చెప్పినవి కావు. ఆమె సృష్టించినవి. వాటిని ప్రత్యేకంగా పరిశోధించ

---

2. సరోజినీదేవి ప్రసంగాలు, రచనలు. పే. 6

3. అదే గ్రంథంలో పే. xvi, xxvii

వలసిన అవసరం కూడా వుంది. అందువల్లనే అచిరకాలంలో భారతదేశమంతటా సరోజినీదేవి ధీరవనితగా, వీరకేసరిగా పేరు ప్రతిష్ఠలు పొందింది. స్వాతంత్ర్య సంగ్రామ యోధుల్లో ఆమెదే ప్రథమస్థానం. ఎందుకంటే అప్పటికి దక్షిణాఫ్రికాలో మహాత్మాగాంధీకూడా పేరులోకి రాలేదు. 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమంలో కూడా సరోజినీదేవి పూర్తిగా పాల్గొన్నది.

సరోజినీదేవి మంచి శక్తివంతురాలు, ఒకవైపు ఉపన్యాసాలుచేస్తూ దేశమంతటా తిరుగుతూనే మరొకవైపు ఎక్కువగా కవితావ్యాసంగం కూడా కొనసాగించింది. "కాలవిహంగం" అనే పేరుతో 1912లో ఆమె రెండవ కవితా సంపుటి విలియంహాసిమన్ ప్రకటించాడు. ఈ మృదుమధుర గేయ సంపుటిని సరోజినిదేవి "బ్రతికి వున్నంతకాలం నా ప్రేమ గౌరవాలకు చిహ్నంగా" తల్లిదండ్రులకు అంకితం చేసింది. సంకలనానికి ఎడ్మండ్‌గూస్ పీఠిక రాస్తూ "ఇంతకు ముందు రాసిన కవితల్లో కొట్టవచ్చినట్లు కనిపించిన" చిన్న పిల్లతరహా భావాలు యిందులో కనిపించవని వ్యాఖ్యానించాడు. ఆ దశ గడిచిపోయింది. ఇప్పుడు "ఆమె అత్యున్నత జీవిత క్రమంలో నూతనాధ్యాయం ప్రారంభమైంది - దుఃఖాన్ని సైదోడుగా చేసుకున్న కొత్తదశ. ఆమె ఆనందాన్ని రుచిచూసింది. ఓదార్పుతో కూడిన నిస్పృహను కూడా అనుభవించింది. లోకంలోని ప్రజల బాధానుభూతులు చూసిన తర్వాత, బహుశః ఆమె అల్లుతున్న మల్లెపూదండలు పలచబడిపోయి వుంటాయి. భావాంబర వీధుల్లో కారుమేఘాలు క్రమ్ముకుని వుంటాయి. ప్రజాహితరంగంలో ఆమె చేస్తున్నకృషి, పడుతున్న శ్రమవల్ల శరీరారోగ్యం బాగా దెబ్బతింటున్నదనే విషయం లోకానికి తెలిసిందే. అయినా యీ పరిస్థితి ఆమెలోని గేయరచనా శక్తిని కొంచెం కూడా వంచలేకపోయింది. పైగా దాన్ని పెంచి పెద్దదాన్ని చేసింది. నిజమైన కవికి ఉన్నత స్థాయిగల సత్కాంక్ష వుండితీరాలి. అటువంటి ఆకాంక్ష సరోజినీదేవికి వుంది. చిన్నతనంలో ఆమె పెద్ద పెద్ద కలలు కన్నది. భారతదేశానికి ఒక గోథేగానో, ఒక కీట్స్‌గానో తాను కీర్తి ప్రతిష్ఠ లార్జించాలని ఆమె ఆరాటపడింది. అనేకమైన యితర కోర్కెలవలె యీ కోర్కెకూడా గుండె పట్టుకోలేనంత బరువైనదే కావచ్చు. ఎందుకంటే ఆమె హృదయం,

"తూర్పుగాలి పీల్చుకున్న తీయని నేర్పుతో
దట్టమైన రంగుల్తో, దర్జాతో, ఠీవిగా

తెలివిగా తెరుచుకున్న పురాకృత పుష్పమాల''

అయినప్పటికి ప్రజ్వలిస్తున్న జ్యోతివంటి సరోజినీదేవి ఆత్మలో సౌందర్యదిదృక్ష, కీర్తికాంక్ష అనే మనోహరమైన ప్రేరణలు మాత్రం యింకా లోలోపల శక్తివంతంగా పనిచేస్తూనేవున్నాయి.''4

"కాలవిహంగం" అనే యీ శీర్షిక ఉమర్‌ఖయాం (ఆంగ్లానువాదం)లోని "బర్డ్ ఆఫ్ టైం" అనే పదబంధాన్ని అనుసరించి పెట్టినది.

"కాలవిహంగం ఎగిరేందుకు వున్న మార్గం చిన్నదే
అరే! అదిచూడు, అప్పుడే రెక్కవిప్పిపోతున్నదే!"

ఈ రెండవ సంపుటాన్నికూడా పాఠకులు, బాగానే ఆదరించారు. కాని ప్రథమ సంపుటానికి వచ్చినంత హృదయస్పందనతోనూ, స్పష్టంగానూ, దీనికి ప్రశంసలు రాలేదు. బహుశః దీనికి కారణం - గూస్ తన పీఠికలో సరోజినీదేవి రచనల్లో ఏదో కొంత పరిపక్వత వచ్చిందనే అభిప్రాయం ప్రకటించినప్పటికీ— యింకా ఆమె తన ప్రథమ సంపుటమైన 'స్వర్ణప్రాంగణం'' లో అనుసరించిన పద్యశైలుల బంధంలో యిరుక్కుని వుండడమేనేమో. నిజానికి ఆ పరిధులు దాటి ఆమె బైటికి రానేలేదు. అంతేకాక అంతకుముందు తనకు బాగా పరిచయమై, కవితలో చేసిన భారత దేశచిత్రణ క్రమంగా సన్నగిల్లిపోయింది. అయినప్పటికీ ఈ సంపుటిని ''యార్క్‌షైర్ పోస్ట్'' అనే పత్రిక యిలా సమీక్షించింది. ''శ్రీమతి సరోజినీనాయుడు మా భాషను బాగా పుష్టివంతంచేసి మెరుగులు దిద్దడమేకాదు, మాకు ఆత్మసాన్నిహిత్యం హృదయావేశాల అవగాహన, ఆధ్యాత్మిక రహస్య పరిశోధనాదృష్టి, ప్రాచ్యదేశాల మహోన్నతభావవైభవస్ఫూర్తి కలిగించింది కూడా."

ఈ సంపుటి బాగా అమ్ముడు పోయింది. భారతదేశం సరోజినీదేవిని ఒక దేవతగా సంభావించి గౌరవించింది.

---

4. "కాలవిహంగం" పే. 6, 7

# గోఖలేతో సాహచర్యం

ప్రేమాభిమానాల లోతుల్లోకి తొంగిచూసే సరోజినీనాయుడి స్నేహశక్తి అవధుల్లేనిది. గాంధీజీని తనకు ఆరాధ్యదైవమైన 'పరమగురువు' గా భావించక ముందు ఆధునిక దేశభక్తి భావాలకు మూలస్తంభమైన గోపాలకృష్ణగోఖలే ఆమెకు ప్రథమ స్నేహితుడు, ప్రథమ గురువు. నలభైతొమ్మిది సంవత్సరాల వయస్సులో 1915 ఫిబ్రవరి 19వ తేదీన గోఖలే పరమపదించాడు. సరోజినీ నాయుడు ఆయనను "వీరరసైకమూర్తి" గా వర్ణించింది. ఈ యిరువురు స్నేహితుల మధ్య వయస్సులో తేడా 13 సంవత్సరాలు మాత్రమే. అయినా గోఖలే ముందుగానే నాయకుడుగా పేరెన్నిక గాంచినవాడు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా ఉద్యమంలో మహాత్మునికి నిగ్రహం బోధించిన సలహాదారుడుగా ఆయనకు పేరు వచ్చింది. నిజానికి గోఖలే అనేక మంది భారతీయ వీరశిఖా మణులను తీర్చిదిద్దినవాడు. సరోజినీనాయుడు ఆయనను గౌరవనీయుడైన గురువుగా భావించి ఆదరించింది. సరోజినీదేవిని మాతృదేశ సేవాదీక్షకు జీవితం అంకితం చేయవలసిందిగా 1902లో మొట్టమొదటిసారిగా ప్రబోధించింది ఆయనే.

గోపాలకృష్ణగోఖలే చిత్పావనబ్రాహ్మణ వంశీకుడు, రనడే, తిలక్, పరంజపేలతోపాటు ఒక దృక్పథానికీ, ఒక నాయకత్వానికీ చెందినవాడు. ఈ దృక్పథమూ, యీ నాయకత్వమే ఆనాటి స్వాతంత్ర్యోద్యమానికి పునాదులు, కొంతమంది నిస్స్వార్థులైన కార్యకర్తలను ప్రోగుచేసి "సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ" సంస్థను స్థాపించాడు గోఖలే. స్వార్థత్యాగంతో, దారిద్ర్యంతో, దేశ సేవకోసం తమ జీవితాలను ఒడ్డిన కార్యకర్తలు వారందరూ. 1912లో, ఒక రోజున సరోజినీనాయుడు లక్నోలో ముస్లింలీగ్ జరిపిన "నూతన చరిత్రాత్మక మహాసభ" లో ప్రసంగించిన తర్వాత పూనా వెళ్లింది. పరంజపేతో కలిసి ఫెర్గూసన్ కళాశాల నుండి సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ కార్యాలయానికి

నడిచి వెళ్ళింది. ఆ సమయంలో గోఖలే చాలా బలహీనంగా వున్నాడు. మధుమేహ వ్యాధితో బాధపడుతున్నాడు, అయినా పనిచేయడంలోనే నిమగ్నుడై వున్నాడు. ముస్లింలీగ్ ప్రకటించిన కొత్త ఆదర్శాలను లోతుగా పరిశీలిస్తున్నాడు. స్నేహితురాలైన సరోజినీదేవిని చూడగానే "నీ దూరదృష్టి నిజమైందని నాతో చెప్పడానికి వచ్చావా?" అని ఆశ్చర్యంతో అడిగాడు. ఆరోజునుండి గోఖలే, సరోజినీనాయుడు, ఉభయులు హిందూ ముస్లిం సమైక్యతా రథసారథులుగా ప్రసిద్ధి చెందారు.

గోఖలే, సరోజినీనాయుడు లిద్దరూ పరస్పరం ఎంతగానో అభిమానించుకునేవారు; ఒకరి నొకరు మెచ్చుకునేవారు. 1906లో సరోజినీదేవి కలకత్తాలో మహిళా విద్యను గురించి చేసిన ప్రసంగం విని ఆమె వాగ్ధాటికి, ఉపన్యాస ధోరణికి సమ్మోగ్ధుడయ్యాడు గోఖలే. ఆమె ప్రసంగాన్ని, ఆలకించడం "ఉన్నత స్థాయి విజ్ఞాన వీథీవిహారం"గా వుంటుందని వర్ణించాడు. "ఇటువంటి ఆదరణ పూర్వకమైన సానుభూతితో ప్రారంభమైన మా ప్రథమ పరిచయం పెరిగి పెద్దదై చివరకు సన్నిహిత సాహచర్యంగా పరిణమించింది. ఈ సాహచర్యాన్ని నేను నా జీవిత సంఘటనల్లో మకుటాయమానమైనదిగా భావించుకుంటాను" అని సరోజినీదేవి రాసుకుంది. "మహాత్మా గాంధీ గోఖలేను గంగానదితో పోల్చాడు. ఆయన అంత పవిత్రుడు, అంతటి మనీషి. ఈ పవిత్ర భాగీరథిలో ఎవరైనా పరిశుభ్రంగా జలకమాడవచ్చు. పడవనడుపుకుంటూ ఆ నదిలో ప్రయాణం సాగించడం మహానందకరమైన విషయం." 1890లో గోఖలే భారతజాతీయ కాంగ్రెసు మహాసభలో ఉప్పుపన్నును తగ్గించాలనే విషయంమీద ఉపన్యసించాడు. ఆనాటినుండి యీ మహాసంస్థలో ఆయన సభ్యత్వం స్థిరంగా నిలిచిపోయింది. ఆయనను తరువాత కాలంలో "ప్రపంచప్రసిద్ధ భారత జాతీయ కాంగ్రెసు నాయకుడు" అని సరోజినీదేవి వర్ణించిందంటే అది ఏ మాత్రం అతిశయోక్తి కాదు. బెంగాలు విభజనను గోఖలే హృదయపూర్వకంగా ప్రతిఘటించాడు. కార్మికలోకాన్ని కదిలించాడు. బెంగాల్ విభజన దుశ్చర్యను సరోజినీదేవి కూడా ఖండించి ప్రచారం చేసింది

1907-11 సంవత్సరాల మధ్యకాలంలో సరోజినీదేవి, గోఖలేల స్నేహం బాగా పరిపక్వదశనుచేరుకుంది "ప్రతిసారి కలుసుకుని మాట్లాడుకున్నప్పుడు ఆయనచేసే ప్రబోధంలో ఏదో ఒక ఘాటైనమాట నాకువచ్చి తగిలి దేశసేవా

పరాయణురాలుగా రూపొందడానికి నా జీవితం మెడలు వంచుతున్నట్లుండేది.''
బహుకార్యనిమగ్నుడై వుండి కూడా గోఖలే తరచుగా యీ యువకవయిత్రికి ప్రోత్సాహకరంగానో, అంగీకార సూచకంగానో ఏదో ఒక కబురుపంపి వెన్ను తట్టుతుండేవాడు. 1912 సంవత్సరం ప్రారంభంలో, సరోజినీదేవి తన తండ్రి వద్ద ఆ సంవత్సరంలో చాలా భాగం గడిపిన సమయంలో గోఖలేతో సన్నిహిత స్నేహానికి పునాదులుపడ్డాయి. ''ఇంతకాలంగా నేను నిన్ను రెక్కలు పట్టుకుని మాత్రమే దగ్గర వుంచుకునేవాణ్ణి. ఇకముందు నీ ఆత్మలక్షణాన్ని పూర్తిగా తెలుసుకోవడానికి వీలుగా చాలా కాలం నిన్ను పంజరంలో బంధించివుంచుతాను'' అన్నాడు గోఖలే. గోఖలే అనే ఆ బహుముఖప్రజ్ఞాశాలిని, ఆ చైతన్యపర్వాతాన్ని, ఆయన గొప్పదనాన్ని సరోజినీదేవి క్రమక్రమంగా అర్థం చేసుకుంది. 'గొప్ప మనీషి, వైరుధ్యాలతో కూడిన స్వభావం, ఒకవైపు 'సాధ్యాసాధ్యాలెరిగి కృషి చేసే కష్టజీవి' మరొకవైపు 'లక్ష్యాలు కలలు కనే ధ్యానయోగసంపన్నుడు.' ఆయనకు తన పూర్వీకుల నుండి అబ్బిన బ్రాహ్మణ సంప్రదాయ క్రమశిక్షణ యీ రెండింటినీ సమన్వయపరిచింది. సరోజినీదేవి తన రెండవ కవితా సంకలనం 'కాలవిహంగం' ప్రతిని గోఖలేకు యిచ్చినప్పుడు ఆయన అడిగాడు, ''ఇంకా యీ జ్యోతి ఉజ్వలంగా ప్రకాశిస్తోందా?'' ''మహోజ్వలంగా'' అని జవాబు చెప్పింది సరోజినీదేవి. ''ఈ ప్రశంసా వర్షాలజోరుతో, విజయోత్సాహాల జల్లులతో యీ తుఫాను యింత దీర్ఘకాలం ఎలా నిలువగలిగిందో'' అని ఆయన ఆశ్చర్యం ప్రకటించాడు.

ఈ వీరపురుషుడు, వీరనారీ యిద్దరూ మహోన్నత భావనాబల సంపన్నులే. ఒకసారి యిద్దరూ ఒక మేడమీద వుండగా గోఖలే సరోజినీదేవితో అన్నాడు ''ఇక్కడ నాతోపాటు నిలబడు. ఈ నక్షత్రాలు, పర్వతాలే సాక్షులు. వాటి సమక్షంలో నీ జీవితాన్నీ, నీనైపుణ్యాన్నీ, నీ కవితనూ, నీ వాగ్ధాటినీ, నీ భావనా బలాన్నీ, నీ లక్ష్యాన్నీ మాతృభూమికి అంకితం చెయ్యి. ఓ కవయిత్రీ! పర్వత శిఖరాగ్రాలమీదెక్కి లోకాన్ని దర్శించు. క్రింద లోయల్లో శ్రమైకజీవనులైన కష్టజీవులకు నీ ఆశాసందేశాన్ని అందించు.''

1912 మే నెలలో సరోజినీదేవి, గోఖలే ఇంగ్లాండులో కలుసుకున్నారు. గోఖలేను అప్పటిస్థితిలో చూసి సరోజినీదేవి చాలా ఆశ్చర్యపడింది. గోఖలే నూతన పాత్ర ధారణచేసిన ట్లనిపించిందామెకు. పాశ్చాత్యుల దుస్తులు వేసుకున్నాడు.

"విందులకు వెళ్లుతున్నాడు. బ్రిడ్జి (పేకాట) ఆడుతున్నాడు. నేషనల్ లిబరల్ క్లబ్ డాబామీద డిన్నర్లలో స్త్రీలతో కాలక్షేపం చేస్తున్నాడు'' అని రాసింది సరోజినీదేవి.

లండన్‌లోవున్న సమయంలో గోఖలే జబ్బు మనిషి. తరచుగా సరోజినీ దేవితో కలిసి కెన్సింగ్‌టన్ గార్డ్‌న్స్‌కు కారుమీద వెళ్లేవాడు. ఆమెతో ఒకసారి గోఖలే అన్నాడు. "నీ మెదడులో నుండి నాది అనినాకు అనిపించే ఒక ముక్క కోసి యివ్వు.'' అని. "తనదని ఆయన భావించే ఆ ముక్కలోనే స్మృతియోగ్య మైన అనేక బోధలను నేను భద్రంగా దాచుకున్నాను'' అని రాసుకుంది సరోజినీదేవి. చివరి దశలో లండన్‌లో గోఖలే సరోజినీదేవితో తనకు కలిగిన స్నేహాన్ని ఎంతో అమూల్యంగా భావించుకునేవాడు. ఒకసారి ఆమె తనను చూడడానికి వచ్చినప్పుడు, "తాను యిచ్చిన మందులన్నింటిలో యిది ఉత్త మోత్తమమైనది'' అని ఆమెను వర్ణించాడు. 1914 అక్టోబరులో యీ స్నేహితులు చివరిసారిగా విడిపోయారు. "హేమంతంలోని మంచు ముసుగులో, ఆకురాలు శిశరర్తు దుఃఖావేశమో ఆయన మనసును కప్పివేశాయి. బహుశః ఆయనకు తన వేపు రెక్కలుచాచి పరుగెత్తుకొస్తున్న మృత్యువిహంగపు నీలినీడలు కనిపించి వుండవచ్చు.'' సరోజినీదేవికి వీడ్కోలుచెప్తూ "మళ్లీ మనం కలుసుకుంటామని నేననుకోను. నీవు జీవించివుంటే దేశసేవకు నీ జీవితం అంకితం అయిందనే విషయం మాత్రం మరచిపోవద్దు. నేను వచ్చిన పని పూర్తి అయింది'' అని నిట్టూర్చాడు గోఖలే మహాశయుడు.

# గాంధీజీ గారాబు సన్నిధిలో...

విరుద్ధ మనస్తత్వాలు పరస్పరాకర్షణకు లోనవుతాయని సాధారణంగా ప్రజల్లో ఒక నమ్మకం. గాంధీజీ, సరోజినీ నాయుడు పూర్తిగా వ్యతిరేకమైన అభిప్రాయాలతో కూడిన వ్యక్తిత్వాలు కలవారు. అయినా ఒక విచిత్రమైన అనుబంధం ఏదో వారిద్దరినీ చేరదీసింది. గాంధీజీ నిష్ఠాగరిష్ఠుడైన మునీశ్వరుని వంటివాడు. నిత్య జీవితంలో నిరాడంబరుడు. కర్తవ్య ధ్యాన ముద్రా శోభితుడు. అహింసా తత్వానికి అవతారమూర్తి వంటివాడు. సరోజినీనాయుడేమో హాయిగా, ఆనందంగా కాలం గడిపే కవయిత్రి: దర్జాగా డాబుగా జీవించడానికి ఉవ్విళ్లూరే మనస్తత్వం గలది, ఆభరణాలూ అలంకారాలపై మోజుగల వ్యక్తి. రంగు రంగుల చీరెలూ, రవికలతో, అనేక ఆకర్షణలతో గడుపుతూ దేహనే మాట ఎరుగని మనస్తత్వం గలది. అనారోగ్యం వున్నప్పటికీ ఆమె జీవిత భోగాలను పుష్కలంగా అనుభవించింది. అయినా యీ ఋషికి, కవికి సామాన్యలక్షణాలు చాలా వున్నాయి. వారి ఆశయాలూ, ఆదర్శాలూ ఒకటే. ఇద్దరూ శాంతి, సమైక్యతా భావాలకు దివినుండి దిగివచ్చిన దేవతామూర్తులే. ఇద్దరూ జాతీయ సమైక్యత కోసం తమ ప్రాణాలనైనా త్యాగం చేయడానికి సిద్ధపడినవారు. మహాత్మునివలె సరోజినీదేవి శాకాహారి కాకపోయినప్పటికీ అహింసాధర్మంపట్ల ఆమెకు గాఢమైన విశ్వాసం ఉంది. జీవితంలో ఎదురైన ఎంతటి కష్టనష్టాలనైనా చిరునవ్వుతో పలకరించగల నేర్పూ, నిగ్రహం వీరిద్దరి సొత్తు. గడ్డుపరిస్థితులు ఎదురైనప్పుడూ ఆశాభంగాలకు లోనైనప్పుడూ కూడా వీరి ముఖాలలో దరహాసం చిందులు త్రొక్కుతూనే వుంటుంది; ఒకరి మీద ఒకరు ఛలోక్తులు విసురుకుంటూనే కాలం గడిపేవారు. "దారిద్ర్యంతో గడపడానికి తాను ఎంత వ్యయ ప్రయాసలకు లోనవుతున్నాడో బాపూ తెలుసుకుంటే బావుణ్ణు" — అని సరోజినీదేవి ఒకసారి అన్నది. ఇంతకంటే పరమసత్యమైన వాక్యం మరొకటి ఉండదు. ఇది అక్షరాలా

నిజమైన మాట. మహాత్మాగాంధీ ప్రచారంచేసి, అనుసరిస్తున్న దారిద్ర్య పద్ధతిని సరోజినీదేవి సంపూర్ణంగా అర్ధం చేసుకున్నది—ఉన్నవారికీ లేనివారికీ మధ్య వ్యత్యాసాలు తొలగించి సేతువు నిర్మించడానికి ఉద్దేశించిన ఒక నూతన జీవిత విధానం అది.

సరోజినీదేవికి రంగులంటే మహా యిష్టం. మహాత్ముడు నివసించే ఆశ్రమ ప్రపంచంలో తెలుపురంగూ, బూడిదరంగు మాత్రమే కనిపిస్తాయి. కాని సరోజినీ దేవి ఇంద్రధనుస్సులోని సప్తవర్ణాలలోనూ మునిగి తేలుతూంటుంది. అయితే మహాత్ముడు కూడా నియమాలతో నిష్ఠలతో నిండిన తన సన్నిహిత సహచర బృందంలో ఆమెను సంతోషంతో మనస్ఫూర్తిగానే చేరనిచ్చాడు. ఎందుకంటే ఆమె వస్తూ తనతో ఆనందాన్ని వెంటబెట్టుకుని వస్తుంది. నవ్వుపువ్వుల్ని నలుగురి మీదా విరజిమ్ముతుంది. జీవితానికి యివి కూడా వుండవలసిన లక్షణాలేనని మహాత్ముని విశ్వాసం.

సరోజినీదేవి 1879లో పుట్టింది. మహాత్మునికంటే పదేండ్లు చిన్నది. తన వయస్సు 30 లలో వున్నప్పుడు ప్రారంభంలోనే ఆమె 1914 లో లండన్‌లో మహాత్ముణ్ణి తొలిసారిగా కలుసుకుంది. తరువాతి కాలంలో తన జీవిత చరిత్ర వ్రాస్తున్న రచయితతో, మహాత్ముడితో తన ప్రథమ సమావేశం గురించి ఆమె యిలా చెప్పింది. "నేను ఆయన్ను మొదటిసారిగా 1914 లో కలుసుకున్నాను. అప్పటికే ఆయన్ను మహాత్ముడు అంటున్నారు." 1914 ఆగస్టు 6వ తేదీన, మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభంకావడానికి రెండురోజులు ముందుగా మహాత్ముడు దక్షిణాఫ్రికానుంచి ఇంగ్లాడు వచ్చాడు. ఆయన్ను లండన్ రావలసిందిగా గోఖలే కబురుపెట్టాడు, కాని తన ప్రయాణమే పారిస్‌లో ఆలశ్యం అయినందువల్ల తానే రాలేకపోయాడు. శిష్యుణ్ణి కలుసుకోలేకపోయాడు. ఆ మహారాజధాని నగరంలో గాంధీజీకి రాగానే నా అనేవాడులేకుండా అయిపోయింది. గురువుగారు వచ్చేవరకూ చేయగలిగిందేమీ లేకుండా పోయింది. భారతీయులు బానిసత్వంలో మ్రగ్గుతున్నందున యుద్ధానికి సహాయం చేయకూడదని ఇంగ్లండు లోని భారతీయులు అభిప్రాయపడుతున్నారు. కాని గాంధీజీ, భారతీయులు బానిసత్వస్థాయికి దిగజారలేదని వాదించాడు. అంతేకాకుండా ఇంగ్లాడు కష్ట పరిస్థితిలో చిక్కుకుని వున్నప్పుడు స్వరాజ్యం కావాలని కోరి భారతదేశం దానిని యిబ్బంది పెట్టకూడదని కూడా గాంధీజీ అభిప్రాయం. "ఇంగ్లాండుకు కలిగిన

అవసరాన్ని మనం ఒక అవకాశంగా తీసుకోకూడదనీ, యుద్ధం జరిగినంతకాలం మన కోర్కెలను గురించి పట్టుపట్టకుండా వుండడమే మర్యాదగానూ దూరదృష్టి గల చర్యగానూ వుంటుందని నేను భావించాను.'' అందువల్ల దక్షిణాఫ్రికాలో వున్న కాలంలో బోయర్ యుద్ధమూ, జూలూ యుద్ధమూ జరిగిన సందర్భాలలో చేసినట్లు యిప్పుడుకూడా భారతీయ ఐచ్ఛిక వైద్యచికిత్సా సేవాదళాన్ని ప్రారంభించారు. తాము యీ విధంగా సహాయం చేయదలచినట్లు సూచిస్తూ మహాత్మా గాంధీ, సరోజినీనాయుడు, మరికొందరు భారతీయులు కలిసి రాసిన లేఖను బ్రిటిష్ ప్రభుత్వపు అధికారులకు పంపారు. మొదట్లో కొంత తటపటాయించినా చివరకు బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీ చిత్తశుద్ధిని విశ్వసించింది. శిక్షణ కార్యక్రమం ప్రారంభించింది. సేవాదళాన్ని ఏర్పాటు చేశారు. ఈ విధంగా ఒకే లక్ష్యంకోసం కలిసి పనిచేసే సందర్భంగా గాంధీజీ సరోజినీనాయుడు ఒకరికొకరు సన్నిహితులైనారు. సరోజినీదేవి "లీసియం'' అనే బాగా ప్రసిద్ధమైన ఒక మహిళల క్లబ్‌లో సభ్యురాలు. అందులోని సభ్యురాండ్రు భారతీయ సేవాదళం వారికి కావలసిన దుస్తులు కుట్టియివ్వడానికి సిద్ధమైనారు. తనకు మహాత్మా గాంధీతో కలిగిన ప్రథమ పరిచయాన్ని యీ కవయిత్రి మంచి నాటకీయమైన ఫక్కీలో యిలా వర్ణించింది. "మహాత్మునితో నా ప్రథమ పరిచయం కథ వినడానికి వింతగొల్పుతుంటుంది. 1914 లో ప్రారంభమైన యూరప్ యుద్ధానికి కొంచెం ముందుగా లండన్‌లో మేం కలుసుకున్నాం. అప్పుడే ఆయన దక్షిణాఫ్రికాలో తన అహింసాత్మక ప్రతిఘటన సిద్ధాంతాన్ని ప్రయోగించి, భయంకరమైన జనరల్‌స్మట్స్ ప్రభుత్వంమీద అప్పట్లో ప్రధానంగా కాంట్రాక్టు కూలీలుగావున్న భారతీయుల తరపున విజయం సాధించి వీరుడై తిరిగివచ్చాడు. ఆయన్ను చూడడానికి ఓడ దగ్గరకు పోలేకపోయాను. కాని మరుసటిరోజు సాయంత్రమే ఆయన బస వెతుక్కుంటూ వెళ్ళాను. కెన్సింగ్టన్‌లో ఒక మారుమూలప్రదేశంలో అందమూ చందమూ లేని ఒక పాత యింట్లో అయన మకాం. పైకి మెట్లెక్కి పోయిచూద్దును గదా, తలుపు తెరిచేవుంది. ఫోటోఫ్రేమ్‌లాంటి ద్వార బంధంలో గుండా ఒక కదుల్తున్న బొమ్మ — నున్నగా క్షవరం చేయించుకున్న గుండుతో, జైళ్ళలో వాడే నల్లటి దుప్పటి పరుచుకుని నేలమీద కూచున్న ఒక సన్నని వ్యక్తి --- కనిపించాడు. జైళ్ళల్లో ఉండే చెక్కపళ్లెంలో నలిపిన టమాటోముక్కలూ, ఆలివ్ నూనెతో తయారైన వంటకం ఏదో నంజుతున్నాడు. ఈ పళ్లెం చుట్టూ వేరుశెనగపప్పులూ, ఎండిన అరటి పండు వాసనకొడుతున్న రుచిలేని బిస్కట్లూ వేసిన సొట్టడబ్బాలు

పెట్టివున్నాయి. భారతదేశంలో యింటింటా తెలిసిన ఆ మహానాయకుని హాస్యాస్పదమైన అనూహ్యామైన విచిత్ర పరిస్థితిని చూస్తే అప్రయత్నంగా సహజ ధోరణిలో నాకు పొట్టఉబ్బ నవ్వొచ్చింది. ఆయన కళ్లెత్తి నావైపు చూశాడు. మళ్ళీ నవ్వాడు, "ఆఁ .... నువ్వు అక్షరాల సరోజినీ నాయుడువే. కాకపోతే యింత చిలిపిగా మరెవరు ప్రవర్తిస్తారు? లోపలికిరా. భోజనం చేద్దాం" అని ఆహ్వానించాడు. "వద్దు స్వామీ, థ్యాంక్స్" అన్నాను చీదరించుకుంటూ. "అబ్బ ఎంత కంపు కొడుతున్నదండీ, మీ భోజనం." ఈ విధంగా సమాధానం చెప్పిన క్షణంలోనే మా యిద్దరి మధ్య స్నేహపుష్పం మొగ్గతొడిగింది, క్రమంగా సమిష్టి సాహచర్యంగా వికసించింది. దీర్ఘకాలం నిలిచివుండే విశ్వాసపూరితమైన శిష్యత్వ ఫలంగా పరిణమించింది. తరువాత భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామరంగాలలో సమిష్టి సేవా కార్యక్రమం నడిచిన 30 సంవత్సరాలపైచిలుకు కాలంలో ఒకరోజు కాదు, ఒక గంట సేపు కూడా యీఫలం కళ తగ్గలేదు, యీ విశ్వాసం సడలిపోలేదు.

దుర్బల శరీరులైన తమ యిద్దరు లండన్ సందర్శించిన సమయంలో ఆహ్వానించ వచ్చిన అసంఖ్యాక ప్రజానీకాన్ని గురించికూడా సరోజినీదేవి రాసింది. తరువాత కొన్ని రోజులకు సరోజినీదేవి భారతదేశానికి తిరిగివచ్చేలోగానే మహాత్మునిలో ఎంత మాహాత్మ్యం వుందో ఆమె కళ్ళారా చూసి గ్రహించింది. "ఆయన యింటికి దేశదేశాల ప్రజలు - పాశ్చాత్యులు - వచ్చిపోతుండడం చూస్తుంటే నాకు ఒళ్లు గగుర్పొడిచేది. ఒక వ్యక్తిలోని నిజమైన మాహాత్మ్యం సర్వసామాన్యమై, విశ్వప్రజాభిమానం చూరగొంటుందనడానికి యిదే నిదర్శనం."

భారతదేశం తిరిగివచ్చిన తర్వాత సరోజినీనాయుడు దేశమంతటా ఉపన్యాసాలు యిచ్చే కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించింది. గాంధీజీ లండన్‌లో జబ్బున పడ్డాడు. పూర్తిగా విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. 1915 లో భారతదేశానికి తిరిగివచ్చిన తర్వాతకూడా, ఏ కార్యక్రమమైనా ప్రారంభించేముందు ఒక ఏడాది పాటు విశ్రాంతి తీసుకోవలసిందని గోఖలే ఆయన్ను ఆదేశించాడు, గాంధీజీ అలాగే విశ్రాంతి తీసుకుంటూ కాలం గడిపాడు. అందువల్ల మహాత్ముడికంటే కొన్ని సంవత్సరాలు ముందుగానే సరోజినీదేవి పేరు పెద్ద నాయకురాలిగా దేశంలో బాగా ప్రచారంలో వుండేది. అయినప్పటికీ దక్షిణాఫ్రికాలో ఆ అహింసా తపస్వి సాధించిన విజయం ఆయనపట్ల ఆమె అభిమానాన్ని కొండంత ఎత్తుగా పెంచింది.

"తెగిన రెక్క" (ది బ్రోకెన్ వింగ్) అనే తన గ్రంథంలో గాంధీజీని ప్రస్తుతిస్తూ ఆమె ఒక గేయం రాసి ప్రకటించింది.

1916 లో గాంధీజీ కాంగ్రెసు మహాసభలకు హాజరైనాడు. అప్పటినుండి ఆయన రాజకీయరంగ ప్రవేశం చేశాడు. అప్పటికే సరోజినీనాయుడు కాంగ్రెసులో ప్రధానమైన పాత్ర నిర్వహిస్తూండడం మహాత్ముడు గమనించాడు. అంతకు ముందు సంవత్సరం బొంబాయి కాంగ్రెసు మహాసభలో "మేలుకో, మేలుకో" అనే గేయం చదివి సరోజినీదేవి సభికులను ఉద్రూతలూగించింది. బొంబాయి నగరాన్ని ఒక ఊపు ఊపింది.

1916 నుండి భారత స్వాతంత్ర్యోద్యమానికి ఒక స్థిరమైన స్వరూప స్వభావాలు వచ్చాయి. చాంపరాన్ సంఘటనలవల్ల మహాత్మా గాంధీ పేరుకూడా బాగా ప్రచారంలోకి వచ్చింది. దక్షిణాఫ్రికా విషయాలమీద ఆసక్తి తగ్గించి ఆయన క్రమంగా మాతృదేశంవైపు దృష్టిసారించాడు. స్వపరిపాలన, కంట్రాక్టు కూలీల సమస్యలు, హిందూ ముస్లిం సమైక్యత వంటి ముఖ్యవిషయాలు సరోజినీనాయుడు గాంధీజీలను ఒకరితో ఒకరు బాగా కలిసిమెలిసి కృషిజేయడానికి ప్రోద్బల పరిచాయి. తమ దేశంలోని సామాన్యప్రజల యిక్కట్లను తొలగించాలనే ఏకైక మహదాశయంతో వారు కృషిచేయసాగారు. 1919 లో నల్ల బిల్లుగా పేరుపొందిన రౌలత్ బిల్లు దేశంలో విస్తృతంగా అసంతృప్తినీ అశాంతినీ రెచ్చగొట్టింది. బలమైన ప్రజాందోళనలు ప్రారంభమయ్యాయి. ఈ బిల్లులు ప్యాసై చట్టరూపంలో రాకుండా వుండడానికి చాలా విధాలుగా గట్టి ప్రయత్నాలు జరిగాయి. 1919 మార్చి నెలలో మహాత్మాగాంధీ సబర్మతి ఆశ్రమంలో ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. ఈ సభకు కేవలం ఒక డజను మందిని మాత్రమే ఆహ్వానించారు. వారిలో సరోజినీ నాయుడు ఒకరు. ఇక్కడే సత్యాగ్రహ ప్రతిజ్ఞ పాఠం తయారైంది. సరోజినీనాయుడు కూడాదానిమీదసంతకంచేసింది. ఏప్రియల్ నెలలో హర్తాలు జరుగకముందు సరోజినీ నాయుడు దేశం పలుప్రాంతాలు తిరిగి ఉపన్యాసాలు యిచ్చి ప్రజల్లో ప్రచారం చేసింది. అపూర్వమైన ఆమె ఉపన్యాస వాగ్ధోరణి ప్రజల్లో చైతన్యవాహినులు ప్రవహింపచేసి, ముందుకు ఉరికే ఉత్సాహాన్ని కలిగించింది. 1919 మార్చిలో మద్రాసులో ఒక బ్రహ్మాండమైన సభలో ప్రసంగిస్తూ గాంధీజీపట్లా, సత్యాగ్రహ విధానంపట్లా తన భక్తివిశ్వాసాలను ప్రకటించింది. "సత్యాగ్రహం నిత్యపరిణామ శీలమైన జీవధర్మం గలిగినటువంటిది. అది తప్పని సరిగా పెరుగుతుంది. వ్యాపి

స్తుంది. ఎందువల్లనంటే దానిలో శాశ్వతమైన జీవలక్షణాలు యిమిడి వున్నాయి. అందువల్లనే దేవాలయాల్లోనూ, ఆశ్రమాల్లోనూ, సత్యాగ్రహజ్యోతి వెలుగుతూనే వుంది. మహాత్మాగాంధీయే, మనకు నిర్దేత, మన గురువు.'' "సత్యం పలకడం మంచిదే, కాని సత్యం ఆచరిస్తూ బ్రతకడం మరీ మంచిది'' అంటూ ఆమె ప్రజానీకాన్ని ప్రబోధించింది.

1919 ఏప్రియల్ 6 వ తేదీన దేశవ్యాప్తంగా బ్రహ్మాండమైన హర్తాల్ జరిగింది. బొంబాయిలో యీ హర్తాలు ఉద్యమం సంపూర్ణ విజయం సాధించింది. ముస్లింలు, హిందువులు ఒకే బృందం సభ్యులుగా కలిసిమెలసి పనిచేశారు. మహాత్మాగాంధీనీ, సరోజినీదేవినీ ప్రజలు ఒక మసీదుకు తీసుకెళ్ళారు. అక్కడ నాయకులు యిద్దరూ ప్రసంగించారు. మరుసటిరోజే, గాంధీజీ అమృత్‌సర్‌కు తిరిగి వస్తూండగా ఆయన్ను ప్రభుత్వం మధ్యలోనే అరెస్టు చేసింది. ఆ తరువాత ప్రభుత్వం జలియన్‌వాలాబాగ్ ఘోరదురంతాలు జరిపించింది. జలియన్‌వాలాబాగ్‌లో జరిగిన భయంకర పైశాచిక కృత్యానికి దేశమంతా అట్టుడికినట్లుడికిపోయింది. రవీంద్రనాథ్ టాగూర్ తన "నైట్‌హుడ్'' బిరుదాన్ని విసర్జించాడు. తరువాత కొంతకాలానికి గాంధీజీ తనకు ప్రభుత్వం యిచ్చిన "కైజర్-ఇ-హింద్'' బంగారు పతకాన్ని త్రిప్పిపంపివేశాడు. భారత స్వాతంత్ర్యోద్యమ పురోగమనయాత్ర అప్రతిహతంగా సాగిపోతున్నది. అహింసాయుత సత్యాగ్రహ సేవాదళంలో సైనికుల సంఖ్య ప్రతిరోజు పెరిగిపోతున్నది. మాంట్-ఫర్డ్ సంస్కరణలు, బ్రిటిష్ యువరాజు ప్రిన్స్ ఆఫ్ వేల్స్ భారత సందర్శన, యుద్ధకాలంలో బ్రిటిష్ ప్రభుత్వానికి అంతగానిలిచి ఎంతో మంది భారతసైనికులు ప్రాణాలు అర్పించినప్పటికీ బ్రిటిష్‌వారు భారతదేశంపట్ల ప్రదర్శిస్తున్న చిన్నచూపు యివన్నీ కలిసి ప్రజల్లో కోపోద్రేకాలు విజృంభించడానికి కారణాలయ్యాయి. ప్రభుత్వం అంటే ప్రజలు పండ్లు పటపట కొరుకుతున్నారు. ఈ ప్రజోద్యమంలో ముస్లింలుకూడా భాగస్వాములే. ముఖ్యంగా మధ్యప్రాచ్యదేశాలలోని ముస్లిం లక్ష్యాలపట్ల హిందువులు ఎంత గాఢమైన సానుభూతి ప్రదర్శిస్తున్నారో భారత ఖిలాఫత్ ఉద్యమంలో ప్రత్యక్షంగా చూసిన తర్వాత ముస్లింల భాగస్వామ్యం బాగా ఎక్కువయింది.

ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాకసందర్భంగా జరిగిన హింసాకాండ, చౌరీచౌరాలో జరిగిన హింసాత్మక సంఘటనలు చూసినతర్వాత "ఈ స్వరాజ్యం దుర్గంధపు కంపు కొడుతున్న'' దని గాంధీజీ వ్యాఖ్యానించాడు. శాంతిని సంరక్షించవలసిందని

ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేసినా ఫలితం కనిపించలేదు. ప్రజానీకం అప్పటికే మంచి చెడుల విచక్షణాజ్ఞానం కోల్పోయి ప్రవర్తిస్తున్నారు. హింసాత్మక సంఘటనలు జరిగిన ప్రాంతాల్లో తిరుగుతూ సరోజినీదేవి అర్జంటు కబురు పంపింది, "తక్షణం ఒక సర్జన్ను పంపండి .... మనుషులు మరణించారు, మరణించబోతున్నారు, గాయపడినవారు రోడ్లమీద దొర్లాడుతున్నారు" అని. తన ప్రజలు చేసిన పాపాల పరిహారంగా గాంధీజీ నిరాహారదీక్ష పూనారు. తిరిగి శాంతిని నెలకొల్పడానికి ఆయన అనుయాయులందరూ అహోరాత్రులు కృషి చేశారు. ఈ సందర్భంలో ఒక రచయితయిలా రాశారు: "సరోజినీనాయుడు గుండె ధైర్యాన్ని ఏమని వర్ణించేది? కల్లోలాలు జరుగుతున్న ప్రదేశాల్లోకి క్రోధోద్రిక్తులై ఎగబడుతున్న ప్రజల్లోకి తడవ తడవకూ ధైర్యంగా పోతుంది. తిరిగివచ్చి ప్రతిసారీ, తనుచేసిన ఘనకార్యాలను మహాత్మునికి నివేదిస్తుంది. కొందరు ప్రజలు చేస్తున్న మూర్ఖపు పనులనుగురించి, కొంచెం హాస్యంకూడా రంగరించి, నాటకీయ ఫక్కీలో వర్ణించి నవ్విస్తుంది. ఆ విధంగా దుఃఖతప్తుడై ఆదుర్దా చెందుతున్న మహాత్ముని పెదవులమీదా అనుచరులందరిలోనూ ఆమెవల్లనే అప్పుడప్పుడైనా ఒక సన్నని చిరునవ్వు తొంగిచూస్తుండేది."

## 'తెగినరెక్క' తో నక్షత్రలోకానికి

1917 లో సరోజినీదేవి "తెగిన రెక్క" (ది బ్రోకెన్ వింగ్) అనే కవితా సంకలనం ప్రకటించింది. దీనితో ఆమె కవితాభ్యాసం దాదాపుగా ముగిసినట్లే అప్పుడప్పుడు చెదురుమదురుగా తరువాత కాలంలో రాసిన ఒకటీ అరా తప్ప. ఇంత హఠాత్తుగా కవితావ్యాసంగం ఆపివేయడానికి చాలా కారణాలు ఉండివుండవచ్చు. కాని అన్నింటిలోనూ బహుశః ఆమె అప్పటి ఆధునిక కవితాభావ ప్రపంచంలో యిమడలేకపోవడమే సరైన కారణమేమో అనిపిస్తుంది. 20 వ శతాబ్దంలో రెండవ

దశాబ్ద ప్రారంభ కాలంనుంచే ఆంగ్లంలోని జార్జియన్ సంప్రదాయ కవితాపద్ధతి బాగా ప్రచారంలోకి వచ్చింది. అయితే తనకాలంలో ముక్తచ్ఛందోమార్గంలో స్వేచ్ఛా కవితలు రాస్తున్న ఆధునిక కవుల బృందంలోకి తాను అడుగైనా పెట్ట లేదనే విషయం ఆమెకు బాగా తెలుసు. అప్పటికే తాను అనుసరిస్తున్న కవితా మార్గం పాతదైపోయింది. కొత్త ఆలోచనతో కొత్తపద్ధతి ప్రారంభమై ప్రచారంలోకి వస్తున్నది. మొదటి ప్రపంచయుద్ధం ముగిసినతర్వాత, రసానంద స్పర్శలేని నిరాశా నిస్పృహల అయోమయపు ఆలోచనలతో యీ కొత్తపద్ధతి పుట్టి పెరుగుతున్నది. సరోజినీదేవి, గీతికా రచనలకు ఉండే ఛందోనియమాలూ, నిబంధనలకూ, కవితా రూపాలకూ కట్టుబడిన సంప్రదాయ కవితామార్గానికి చెందినదాయె. మరి యీ విశృంఖల మైన ఆధునిక రచనాలోకంలోకి ఎలా ప్రవేశిస్తుంది?

'తెగిన రెక్క' కావ్యంలో ఆమె తాత్విక చింతనతోకూడిన కవిత్వం రాయ డానికి ప్రయత్నం చేసింది. కాని బలమైన తాత్విక కవితారచనలో తాను విఫల మైనట్లు గ్రహించడం ఆమె కవితా సన్యాసానికి బహుశః మరో కారణం కావచ్చు. 1915 లో తాను ప్రకటించబోయే కవితాసంపుటి శీర్షిక ఫలానా అని ఆమె గోఖలేతో చెప్పినప్పుడు ఆయన అడిగాడు: "నీవంటి సంగీత విహంగానికి రెక్క తెగడం దేనికి?" అని. తాను రాస్తున్న భావకవితా (లిరిక్) సంబంధమైన కావ్య వస్తువు అయిపోయిందనీ, యిక తాను చెప్పవలసిందేమీ లేదనే ఊహ ఆమె మన స్సులో కలిగివుంటుంది. ప్రపంచంమీద రానురాను విషాదచ్ఛాయలు అలము కుంటున్నాయి, జీవితం కఠినంగా తయారవుతున్నది. తానేమో హాయిగా సంగీతం పాడుతూ ఎగిరే విహంగస్వభావం కలది. ప్రపంచం యుద్ధపుకోరల్లో నలుగుతూన్న బీభత్స దృశ్యాలమధ్య తనవంటి స్వేచ్ఛానందజీవులకు తావెక్కడ? కాని గోఖలే వేసిన ప్రశ్నకు జవాబు తటాపటాయింపు లేకుండా గట్టిగానే చెప్పింది. ఆత్మ విశ్వాస బలంతోనే చెప్పింది.

"ఈ 'తెగినరెక్క' తోనే వసంతం గుండెలో మొలుస్తాను
నక్షత్రగీతాల నాదాల ఎత్తులు కొలుస్తాను."

సూర్యుని చేరబోయి రెక్కలు కాల్చుకున్న సంపాతి రాముడికి సహాయం చేసినట్లు, తానుకూడా బ్రతుకులో బాధపడినా, భయపడినా, తన సమస్యలూ, తన యిబ్బందు లన్నింటినీ అధిగమించి ఉన్నతాదర్శాలవైపు దూసుకుపోవలసిందేనని

భావం. 1947 లో ఆసియా జాతుల మహాసభలో ప్రసంగించినప్పుడుకూడా ఆమె యిటువంటి భావాలనే వెల్లడించింది.

'తెగినరెక్క' సంకలనాన్ని అంకితంచేస్తూ ఆమె పెట్టుకున్న ఆదర్శం నిజానికి సవ్యమైన భావనకాదు. తాత్విక చింతనతోపాటు, భారతీయ మహిళా విముక్తి, దేశసేవలోకూడా కవిగా తాను పాల్గొనాలనే లక్ష్యంకూడా పెట్టుకుంది. నిజానికి యీ రెండూ ఒకదానితో ఒకటి అతికేవికావు. ఈ సంకలనంలో కవితలు జీవన మరణాలను గురించి కొన్ని వున్నాయి. కొన్ని స్మృతిగీతాలు, కొన్ని పాటలు, చివరకు (ది టెంపుల్) గుడి అనే శీర్షికతో (మూడు భాగాలుగా "ప్రేమ యాత్ర") కావ్యం వుంది. వేరువేరుగా రాసిన పాటలన్నీ, అంతకుముందు కాలంలో ఆమె రాసిన పాటల్లా మనోహరంగానే వున్నాయి. కాని యీ మూడు భాగాల "ప్రేమ యాత్ర" కావ్యం మాత్రం అనుకున్న ఆదర్శాన్ని అందుకోలేకపోయిందేమో అనిపిస్తుంది. ప్రేమించిన ఒక యువతి తన హృదయాన్ని ప్రియుడికి అర్పించుకోవడం యిందులోని కథావస్తువు- జీవాత్మ పరమాత్మలో ఐక్యం కావడానికి చేసే కృషిని సాంకేతికంగా చిత్రించడమే యీ కావ్యంలో ఆమె ఉద్దేశించి వుంటుంది. కావ్యాన్ని అంకితంచేస్తూ రాసిన దానిని గురించి మొదట్లో పరిశీలిద్దాం. కేవలం ప్రచార దృక్పథం ఒక్కటే ఆధారంగా పెట్టుకుని, లోపల భావావేశం ఏ మాత్రం లేకుండా తన వాదాన్ని లోకంమీద రుద్దాలని ప్రయత్నించే కవి విజయం పొందలేడు. 1916 లో యీ కావ్యం రాసింది సరోజినీదేవి. దీనిని "నేటి కలలకూ, రేపటి ఆశలకూ" అంకితం చేసింది. సరోజినీదేవి అనుసరించే కవితాశైలి యీ పదబంధాలలో స్పష్టంగా కనిపిస్తూనే వుంది. కాని కళ అనేదాన్ని "ఒక సిద్ధాంతం క్రిందికి, ఒక సూత్రం క్రిందికి దిగజార్చిచూడడం కష్టం"[1] అందువల్ల మామూలుగా తన భావాలు ప్రకటించుకోవలసిన కవిమీద పీఠికలో యింత సిద్ధాంతభారం ఎందుకు వేయవలసి వచ్చిందో సాధారణ పాఠకుడు అర్థంచేసుకోలేడు. ఆమె రాసుకున్న పీఠిక కేవలం ఒక ఫార్ములా లాగానే వుంది — గత వైభవాన్ని గుర్తించాలనే వీరోత్సాహపు ముసుగుమాత్రం దానికి వేసింది. భారతీయ రచయితలు చాలా మందిలో యీ దోషం కనిపిస్తూనే వుంటుంది.

పీఠిక మాట అటుంచితే, అసలు కావ్యం చదువుతుంటేనే ఎప్పుడెప్పుడు మూసివేద్దామా అనిపిస్తుంటుంది. కాని యింతకుముందు సరోజినీదేవి కలంనుండి జాలువారిన ఎన్నో మంచిగీతాలు చదివి ఆనందించినవాళ్ళం గదా. అందుకని

1. 'కిటు మాడరన్ పొయిట్రీ'—లారెన్స్ డర్రెల్.

యీ కావ్యంలోని కవితలు కూడా పరిశీలిద్దాం. కవయిత్రి ఏ విధమైన సందేశం యిచ్చిందో చూద్దాం.

జీవిత మరణాలను గురించి రాసిన గీతాలూ, యింకా అప్పుడప్పుడు రాసిన యితర గీతాలూ పోను "తెగిన రెక్క" కావ్యంలో చివరి "గుడి" అనే పేరుతో (ప్రేమ యాత్ర) వున్న మూడు భాగాల్లో 24 గీతాలు వున్నాయి, ప్రతిభాగంలో ఎనిమిది వంతున. ఈ మూడు భాగ లకూ మూడు ప్రత్యేక శీర్షిక లున్నాయి. మొదటిది "ఆనంద ద్వారము". ప్రేమఫలించిన పరిస్థితి యిందులో కథావస్తువు. ఒక అమ్మాయి తన జీవితాన్ని ప్రియుడికి అంకితం చేస్తుంది. తన సమస్తాన్ని ప్రేమాగ్ని కుండంలో ఆహుతిచేయడానికి సిద్ధమవుతుంది. రెండవభాగం "అశ్రు పథం." క్రమంగా యింద్రియావేశాలు చల్లబడి నిరాశా నిస్పృహలు అలముకున్న పరిస్థితి యిందులో వర్ణించబడింది. చివరిభాగం "శరణాలయం." ప్రేమ విషాదాంత నాటకంగా ముగుస్తుంది. తిరస్కృత అయి విచారసాగరంలో మునిగిపోయి గర్భగుడి అనే శరణాలయంలో చేరిపోతుంది. ఈ కావ్యం చదివితే యిందులో నాకు కొట్టవచ్చినట్లు కనిపించేది కేవల మోహావేశం, పరిత్యాగ భావన. ఆ సమయంలో సరోజినీదేవి జీవితంలో కలిగిన అనుభూతి వాసనలు యిందులో చోటుచేసుకున్నాయేమో తెలియదు. తాను ఏదో ఒక ప్రేమకోసం సమస్తాన్ని త్యాగంచేసినట్లూ, చివరకు తీరని ఆశాభంగం పొందినట్లూ సూచనలు కనిపిస్తున్నాయి. అందువల్ల యింద్రియ భోగాపేక్షను పూర్తిగా విసర్జించి పూర్తిగా కొత్తజీవితాన్ని దర్శించడానికి పూనుకుంటుంది. మానవమాత్రుడైన తన ప్రియునిపై చూపే యీమోహావేశం పరమాత్మసాన్నిధ్యాన్ని కోరుతున్నట్లుగా సాంకేతికంచేసి సరోజినీదేవి వేదాంత భావనా శిఖరాలను అందుకోబోతుంది. కాని అందక వెల్లికిల పడిపోతుంది. ఎందుకంటే యీ కావ్యంలోని గీతాలు అంతకుముందామె రాసిన తత్వసంబంధ కవితల్లా హృదయంలోనుండి ఉప్పొంగి బైటికివచ్చిన ఊహలుగా వుండవు. అంతకుముందు రాసిన అటువంటి మూడు తాత్విక గీతాలను 1917 లో ప్రకటించిన ఆక్స్‌ఫర్డ్ బుక్ ఆఫ్ ఇంగ్లీష్ మిస్టికల్ వెర్స్ అనే కవితా సంకలనంలోగూడా చేర్చారు. "ప్రేమయాత్ర" అనే భాగంకూడా సాంకేతికమైన భావన కలదే. దేవాలయ వాస్తు శిల్పము, ఆలయద్వారము, దేవునిదగ్గరకు వెళ్లే త్రోవ, చివరకు గర్భగుడిలో శరణాగతి"[2]. గుడి అనేది ప్రేమికుల నివాసస్థానమనీ, వేదాంతపరంగా అది

2, ది టూ ఫోల్డ్ వాయిస్ (రెండు గొంతులు) డి. వై. కె. రాఘవాచార్యులు సరోజినీనాయుడు మీద వ్యాసం, రచన ఆర్

సృజనాత్మక ప్రపంచమనీ, యాత్ర అంటే జీవి చేసేయాత్ర అని ఒక విమర్శకుడు వ్యాఖ్యానం చెప్పాడు. చివరకు మొత్తంమీద యీ కావ్యభావన వైష్ణవభావనలోని రాధాకృష్ణ ప్రేమసిద్ధాంతంలో పర్యవసిస్తున్నది. "ఆ భాగాలు సుకన్య, సావిత్రి, అనసూయవంటి మహాపతివ్రతా శిరోమణుల గాథలనుగూడా స్ఫురింపజేస్తున్నవి.'[3] ఇటువంటి యిన్ని భావాలను 24 చిన్నచిన్న కవితల్లో యిమిడించాలంటే ఎంత అయోమయం. క్లిష్టత ఏర్పడుతుందో చెప్పలేము. నిజానికి వీటి నన్నిటినీ పెట్టి ఒక మహాకావ్యం రాయాలి!

"ప్రేమయాత్ర" భాగంలో ముఖ్యంగా చివరి కవితల్లో సరోజినీదేవి తన పరిస్థితికి తానే జాలిపడుతుంది. మొదటిభాగంలో కూడా యీ బలహీనతా ప్రదర్శన లేకపోలేదు. సరోజినీదేవి యీ కవితలన్నింటిలో మొదటినుంచి చివరిదాకా యీ భావం ప్రసరిస్తూనే వుంటుంది. రెండవభాగంలో "జీవితహుంకారం" శీర్షికతో వున్న గీతాల్లో కోపతాపాలు, చీకాకు ప్రదర్శిస్తుంది.

కోర్కెలయీాక ముక్కుల్తో పొడుస్తూ
కొరడాలు ఝళిపిస్తూ
నిద్రాభంగ నిశీథంలో నీ కటిక గుండె కోలహాల ధ్వనులే
నీ మీద దాడిచేస్తాయిలే
నీ నరాల్లో దాగిన ఆకలే నీ మీద పడి కరుస్తుందిలే
కఠినంగా గాయపరిచి కుక్క కోరల కొరువుల్తో
నీ యౌవన వేళావికాసం వాసంత మోహావేశం
కాలాగ్ని కుండంలో పడి కాలిపోయిన తర్వాత
నీ తిరుగుబాటు గర్వంమీద అపజయం అల్లుకున్నప్పుడు
నేను నిన్ను క్షమించి విడుస్తానో
కత్తిపెట్టి పొడుస్తానో ఆ దేవుడికే తెలుసు
హే ప్రియా! కరిగిన కొవ్వొత్తిలా వచ్చి
సెప్పు నా కాళ్లమీద పడినప్పుడు!

---

3. ది టూ ఫోల్డ్ వాయిస్ (రెండు గొంతులు) డి. వై. కె. రాఘవాచార్యులు

ఇందులో 'కరుస్తుంది' అనే క్రియావాచకం వాడడం "కుక్క కోరలతో" పోలిక తీసుకురావడం కవిత్వ గౌరవానికి భంగకరంగా వున్నాయి. సరోజినీదేవి కూడా ఆధునిక కవుల్లా స్వేచ్ఛగా ఏమాటైనా వాడుకోడానికి ప్రయత్నించిందా? ప్రయత్నించి తన విక్టోరియా యుగపు కవితాచక్ర పరిధిలో వాటిని యిమడ్చలేక తికమక పడిందా?

ప్రేమయాత్రలో తన ప్రియుణ్ణి పూర్తిగా ధిక్కరించింది "ప్రేమఫలం" అనే గీతంలో కోపంతో కేకపెట్టినట్లు రాసింది.

పోయిన సౌఖ్యం పోతే పోనీ
వద్దు వద్దు అహ్లాదమైకం మళ్లీ వద్దు
అరిగిపోయిన ఆశలువద్దు విరిగిపోయిన కలలువద్దు
వద్దు వద్దు మళ్ళీ వద్దు
నలిగిపోయిన నాలక్ష్యం తొలగిపోయిన గర్వరేఖ
పోయిన సౌఖ్యం పోతేపోనీ
వద్దు వద్దు మళ్ళీ వద్దు
ఒక గంటసేపు విరామంగా కడివెడు కన్నీళ్ల యివ్వు
కడుక్కుంటాను గుండెలో కలతపెట్టే గాయాలు.
నీ పెంపుడు కుక్కలకు కడుపార పెట్టుకో
కావలిస్తే నా కండలు కోసి
నీ తోటలో చెట్లకు నిండుగా నీళ్లు పెట్టుకో
కావలిస్తే నా రక్తం తీసి
నా గుండెను పిండిగా కొట్టుకో
కలలు కాల్చి బూడిద బొట్టుపెట్టుకో
నీ దాన్నే కదా ప్రభూ!
చంకలోపలి కెత్తుకున్నా, చంపి గుండెకు హత్తుకున్నా?

నా గుండెను గొంతు పిసికి నిప్పుల్లో విసిరేసుకో!
భయంలేదు బాధలేదు – నా ప్రేమ కాదనిచెప్పదు
నీ గుండెలో ఒక పూవునై పరిమళిస్తాను ప్రభూ!
కలుపు మొక్కనై, నీ గుండెమంటలో
కాలిపోతాను ప్రభూ!

"ది టెంపుల్ (గుడి) అనే యీ కావ్యంలోని గీతాలు బ్రహ్మాండమైన విజయాన్ని సాధించాయి .... మిస్ బ్రౌనింగ్ రాసిన పోర్చుగీస్ సానెట్ల తర్వాత ఒక ప్రియుణ్ణి ఉద్దేశించి మోహావేశాన్ని యింత గాఢంగా క్రుమ్మరించిన కవితా ఖండం మరొకటిలేదు"4 అని ఒక విమర్శకుడు శ్లాఘించాడు. కాని ఈ పొగడ్తతో నేను ఏకీభవించలేను. ఇంతకంటే జేమ్స్ హెచ్. కజిన్స్ వెలిబుచ్చిన అభిప్రాయం ఉచితంగానూ, ఆమోదయోగ్యంగానూ వుంది. "ప్రేమలోపడి యింత కొట్టుకులాడడం రెండువైపులా దారిమూసిన ఒక యిరుకు సందులో ప్రయాణంలా వుంటుంది. ఆమె కళాసృష్టిలో యీ దశలో ఒక్కొక్కప్పుడు సాధించిన విజయం చిత్తశుద్ధిలేని చింతనగా భాసిస్తుంది. భావావేశం కృత్రిమపు ఊబిలోపడి ఆమె కళానైపుణ్యాన్ని గాయపరస్తుంది". "ఈ కవయిత్రి ఒకానొక భావావేశపు అతిశయోక్తి లోకంలోకి పరుగెత్తుకుంటూపోయి పడిపోయింది. ఆ ఆవేశం ఆత్మ సాక్షాత్కారానికి అడ్డుగోడై నిలుస్తుంది. ఫలితంగా భావన జుగుప్సాకరంగా తయారవుతుంది"5. "తెగినరెక్క" కవితా సంకలనంలోని మొదటి కవితలు (ది టెంపిల్ ప్రేమయాత్ర - లలో చేరనివి) సరోజినీదేవి పూర్వరచనల్లా ఆహ్లాదకరంగా హృదయంగమంగా వుంటాయి.

తన తండ్రి మరణించిన సందర్భంగా సరోజినీదేవి 1915 జనవరి 28 వ తేదీన "నాన్నగారి ఆత్మకు నా విన్నపం" అనే శీర్షికతో ఒక సానెట్ రాసింది.

---

4. ఆంగ్లంలో భారతీయ కవిత (ఇండియన్ రైటింగ్ ఇన్ ఇంగ్లీషు) కె. ఆర్. శ్రీనివాస అయ్యంగార్ రచన పే. 184.

5. రినయజాన్స్ ఆఫ్ ఇండియా (భారత పునరుజ్జీవనం) జేమ్స్ హెచ్. కజిన్స్ రచన.

మనోహరమైన యీగీతంలో సరోజినీదేవి ప్రైవేటు జీవితపు లోతుల్లోకి మనం తొంగిచూడ గలుగుతాం.

ఒకవైపు తన హృదయానికి సన్నిహితుడైన మిత్రుడు గోఖలే, మరొకవైపు తాను పూలల్లోపెట్టి పూజించుకున్న తండ్రీ యిద్దరూ కొన్నిరోజుల వ్యవధిలోనే మరణించడంవల్ల సరోజినీదేవి గుండె చెరువైనంతగా పరితాపంలో పడిపోయింది. గోపాలకృష్ణ గోఖలే 1915 ఫిబ్రవరి 19 వ తేదీన పరమపదించాడు. ఆయనపై తాను రాసిన గీతం క్రింద సరోజినీదేవి గోఖలేను ప్రశంసిస్తూ యీ విధంగా రాసుకుంది. "గోపాలకృష్ణ గోఖలే : యోగీశ్వరేశ్వరుడు: జాతీయ నీతికి నిలిచిన సైనిక యోధుడు. ఆయన జీవితం ఒక భీష్మప్రతిజ్ఞ. ఆయన మరణం భారతీయ సమైక్యతా యజ్ఞంలో ఒక మహాహుతి."

గోఖలేకంటే ఒకనెల రోజులు ముందుగా అఘోరనాథుడు మరణించాడు. ఈ వార్త విని సరోజినీదేవికి గోఖలే లేఖ రాశాడు. "నేను దగ్గరలోవుంటే స్వయంగా వచ్చి కలుసుకొని పలకరించేవాణ్ణి. యిప్పటి యీ శోకం శాశ్వతంగా లోకంలో నిలిచే శ్లోకాలై పారాలని నా ఆకాంక్ష." పాపం గోఖలేకు తనకే మరణం ఆసన్నమై వుందని తెలియదుగదా! తరువాత సరోజినీదేవి రాసుకుంది! "ఆయన యీ మాటలు ఫిబ్రవరి 12 వ తేదీన రాశాడు. తనకే మృత్యువు ఆసన్నమవుతున్నదనే సూచనకూడా లేని సమయంలో."

అతి సున్నిత మనస్కురాలు, గాఢానుభూతులకాణాచి అయిన సరోజినీదేవికి 1915 చాలా సంతాపకరమైన సంవత్సరం. ఆ కాలంలో క్రమ్మిన విచార నిస్పృహావేశ మేఘాలు కురిసిన కన్నీటి వర్షధారలు "తెగిన రెక్క" కవితా సంకలనంలో గీతాలై వెలిశాయంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఈ కావ్య సంకలనంతో ఆమె వ్యక్తిత్వం విశ్వైక వేదాంతభావనలో పూర్తిగా లీనమై పోయింది. కాళీమాతను గురించి సరోజినీదేవి రాసిన కవితలో అనంతత్వంలో కలిసిపోవాలనే ఆకాంక్ష కట్టలు తెంచుకుని ప్రవహించింది.

### కా ళీ మా త

అందరూ : కాళీమాతా, కరుణా సమేతా!
ఓ భయంకర జగజ్జననీ,
దయాపూర్ణ ప్రభాభాసినీ!

త్యాగకర్మల భోగవల్లీ
పుణ్యపురుషుల కన్నతల్లీ!
నీ మూర్తిని నిలుపుకున్న
పూజా వేదికలమీద

అలంకరణల మెరుపు పూశాం
అనుగ్రహప్రార్థనలు చేశాం

ఎర్రన్నపు పళ్లాలతో
వెసిలి ఆకుల తోరణాల్తో

ఉమామాతా హైమజాతా
దయోపేతా జగన్నేతా!

కన్యలు : పూమొగ్గలు రేగుబండ్లు
అడవిలోంచి కోసితెచ్చాం

వధువులు : గుర్రమెక్కి మేం చేసిన
ప్రార్థన పరమార్థం తెచ్చాం

తల్లులు : ప్రసవకాల బాధలోని
తీయని తలపులు తెచ్చాం

విధవలు : ఆశతెగిన బ్రతుకులోని
పూసలేరుకొని తెచ్చాం

అందరూ : ప్రజలందరి ఆనందం
దుఃఖం కలుపుకు తెచ్చాం

చేతివృత్తులవారు : పుడమి తల్లి ప్రశంసలను
మూటగట్టుకుని వచ్చాం

రైతులు : నిన్నవుట్టిన మేకపిల్ల
క్రొత్తనూర్చిన పంట తెచ్చాం

విజేతలు : విజయమిచ్చిన కత్తి తెచ్చాం
గర్వరేఖల మచ్చు తెచ్చాం

పరాజితులు : ఓడిపోయిన పరువు తెచ్చాం
దుఃఖఘోషల బరువు తెచ్చాం

అందరూ : ప్రజలందరి జయగాథలు
కన్నీళ్లలు కలిపి తెచ్చాం

విద్వాంసులు : ప్రాచ్యకళా పరమార్థపు
రహస్యాలు రాసి తెచ్చాం

పురోహితులు : పురాధర్మ మతాచార
మణిరాసులు మోసుకొచ్చాం

కవులు : మా గుండెల సంగీతపు
పదబంధా లల్లి తెచ్చాం

దేశభక్తులు : మాతృభూమి సేవాగత
వీరగాథలు తీసుకొచ్చాం

అందరూ : ప్రజలందరి వైభవోన్నతి
ప్రాగనంతప్రభలు తెచ్చాం

'తెగినరెక్క' కావ్యసంకలనంలోని ది టెంపుల్ (ప్రేమయాత్ర) కావ్యంలో గర్భగుడి (శరణాగతి) అనే మూడవభాగం లోని ప్రేమావేశ భ్రాంతి చిత్రణ తాను రాసిన కవిత లన్నిటిలో ఉత్తమోత్తమమైనవని సరోజినీదేవి 1935 మే 1 వ తేదీన అమర్‌నాథ్ ఝూతో చెప్పుకున్నది.

అందరూ అంటున్నట్లు ఓ ప్రభూ! నీవు
మట్టి ప్రమిదలో ఊగే దీపంలోంచి
వేరుపడి ఆరిపోయే వెలుగు రవ్వవే కానీ –
నాకేం బాధ లేదు ...
ప్రతిరోజూ పగటికాంతుల తళ త్తళల దర్పంతో
నా చీకటి మార్గంలో రోచిస్సులు పరుస్తున్నావ్.
అందరూ అంటున్నట్లు ఓ ప్రభూ నీవు
తరంగాల తాకిడికి జలధి వీడి ఒడ్డుపట్టిన
చిల్లిగవ్వలా విలువ లేని జీవిమాత్రుడవే కానీ –
నాకేం బాధ లేదు...
శాశ్వతత్వం విరజిమ్మే సన్నని రహస్యధ్వనులు
నా చెవిలో మార్మోగే వీచులఃగా చేస్తున్నావ్.
అందరు మానవమాత్రుల్లా ఓ ప్రభూ! నీవుకూడ
నొసటివ్రాత నుడివినట్లు మృత్యువు నోట్లో
దూరే మట్టి ముద్దవే కావచ్చు
నాకేం బాధ లేదు ...
స్వర్గధామమై వెలిసిన సర్వేశ్వర నివాసాన్ని
నా గుండెకు దగ్గరగా నడిపించుకు తెస్తున్నావ్.

# స్వాతంత్ర్యోద్యమ శంఖారావం

సరోజినీదేవికి మనస్ఫూర్తిగా ప్రియమైన కాలక్షేపం కవిత్వం రాయడం. దానిని యిప్పుడు దాదాపుగా వదిలేసి స్వాతంత్ర్యోద్యమ రంగంలోకీ, మహిళా విముక్తి ఉద్యమంలోకి దూకింది. అయినా ఆమె ఎన్నడూ తాను గాయనిననే విషయం మరిచిపోలేదు. ఇంకా ఎక్కువగా కవిత్వం రాయాలనే వాంఛ ఆమెలో ఎప్పటికప్పుడు కొత్తగా పుడుతూనే వుండేది. "ఫెదర్స్ ఆఫ్ డాన్" అనే పేరుతో ఒక కావ్యం రాయాలని అనుకుంటున్నట్లు 1928 లో తన మిత్రుడు అమరనాథ్ ఝూతో చెప్పింది. ఝూ యిలా రాశాడు, దీనిని గురించి. "ఈ సంకలనం మాట ఏమైందో తెలియదు, ఆ కవితలు పోయాయేమో అనిపిస్తుంది"[1] కాని 1961 లో ఒక ఆసక్తికరమైన సంఘటన జరిగింది. "ది ఫెదర్ ఆఫ్ డాన్" అనే పేరుతో సరోజినీదేవి అప్రకటిత రచనలతో ఒక చిన్న సంకలనం హైదరాబాదు పొయిట్రీ సొసైటీ వారు ప్రకటించారు. దీనిని గురించి ఝూ యిలా రాశాడు. "చాలా ఆకర్షణీయంగా చూడడానికి యింపుగా వుంది. ఒక అజంతా కుడ్య చిత్రాన్ని ఫోటోతీసి కవరు డిజైను తయారుచేసి ప్రకటించారు. హైదరాబాదులో చేతితో తయారైన కాగితంమీద యీ పుస్తకం ముద్రించారు"[2] ఈ కావ్యంలో లోగడ ప్రకటించని సరోజినీదేవి కవితలు రెండున్నాయి. తరువాత "సెప్టర్డ్ ఫ్లూట్" (మురళీ దండం) అనే పేరుతో ఆమె కవితలన్నీ కూర్చి ప్రకటించిన సంకలనంలో కూడా యీ రెండు కవితలు చేర్చలేదు. హైదరాబాదు పొయిట్రీ సొసైటీవారు ప్రకటించిన కావ్యంలో చేర్చిన ఆ రెండు కవితలూ 'ది ఫ్లూట్ ప్లేయర్' (మురళీ మోహనుడు) 'లిటిల్ కృష్ణా' (చిన్ని కన్నయ్య) ఈ రెండూ కృష్ణభగవానుణ్ణి

---

1. సరోజినీనాయుడు, అమర్‌నాథ్ ఝూ రచన పే. 11.
2. అదే గ్రంథంలో పే, 21,

గురించి రాసినవే. అంటే తాను రాజకీయ మహాసముద్రంలో, దేశస్వాతంత్ర్య సాధన కృషిలో నిండా మునిగివున్నాననే విషయం తెలిసికూడా ఆమె కవితా జ్యోతి ఆరకుండా కొంతవరకు కాపాడుకుంటూనే వున్నదన్నమాట. పాద యాత్రలూ, జైలు జీవితాలూ, ఊరేగింపులూ, బహిరంగ సభలూ, హర్తాళ్ళూ, హడా విడులూ, యివేవీ కవితా సరస్వతి అనుగ్రహించడానికి పనికివచ్చే సాధనాలు కావు. అందుకే ఆమె తనకు సహజంగా సంక్రమించిన యీ కళాకౌశలానికి తిలోదకాలు యివ్వవలసి వచ్చిందే అని మనస్తాపం ప్రకటించింది. బ్రోకెన్ వింగ్ (తెగినరెక్క) సంకలనంలో యీ పంక్తులు చూడండి.

నీ దగ్గర కొలతవుందా నా కన్నీరు కొలవడానికి
నాకాపలాకాలపు దుఃఖానికి గణనగా నిలవడానికి ?
గుండెలో నిస్పృహను కూల్చే గర్వరేఖ గుర్తించడానికి
ప్రార్థనావేదనలు మాన్పే ఆశ జ్యోతిగా నర్తించడానికి ?
చినిగిన విజయ పతాకల జీర్ణారుణరేఖమీద
కదిలే నా శోకార్తులు, ఉజ్వలదాశామూర్తులు
తెలుసుకునే గుండె వుందా ?
నీ దగ్గర కొలత వుందా?

స్వదేశీ ఉద్యమం దేశమంతటా వడివడిగా వ్యాపిస్తోంది. ముఖ్యంగా 1905 లో బెంగాల్ విభజనను కాంగ్రెసు ప్రతిఘటించిన తర్వాత యీ ఉద్య మానికి యింకా జోరెక్కువయింది. 1915 లో జాతీయ కాంగ్రెసు సంస్థ నూతన విధానాలను స్వీకరించింది. 916 లో హిందువులు, ముస్లింలు కలిసి కృషిచేసి కొత్తసంస్కరణలు కావాలని కోరారు.

లోకమాన్య బాలగంగాధరతిలక్ 1916 లో హోం రూల్ లీగ్ స్థాపించాడు. అనీబిసెంట్ జాతిని మేల్కొల్పి సంపూర్ణరాజకీయ స్వాతంత్ర్య చైతన్యాన్ని దేశమంతటా వెదజల్లింది. మహాత్మాగాంధీకూడా కత్తులు నూరడం ప్రారంభించాడు. సరోజినీదేవి సంతోషంగా ఉద్యమంలోకి ఉరికింది.

1917 లో జరిగిన ఒక విచిత్రమైన సంఘటనను గురించి అమర్‌నాథ్‌ఝా రాశాడు. "సరోజినీనాయుడు ఒక సభలో ప్రసంగించబోతున్నది. గాంధీజీకి ఆంగ్ల ప్రసంగాలమీద అయిష్టం. 'నేను హిందూస్థానీభాషలో ఎలా మాట్లాడగలనో అని భయంగావుంది. ఏం చేయ్యాలో చెప్తా విను. నేను మాట్లాడడానికి లేవగానే 'ఇంగ్లీషులో ఇంగ్లీషులో' అని విద్యార్థులచేత కేకలు వేయించు' అని తన స్నేహితుడితో ముందే చెప్పింది." "కాని తీరాసమయం వచ్చేసరికి ఆమె పర్షియన్ కలిసిన ఉరుదు పాండిత్యమంతా వెళ్లగ్రక్కుతూ మహోపన్యాసం చేసింది"[3] అని ఝా రాశాడు. సమాసభూయిష్టమైన ఉర్దూభాషగానీ, ఆంగ్లభాష గానీ దేశం అన్ని ప్రాంతాల్లోని ప్రజలకు అర్థంకాదు. అందుకనే బహుశః ఆమె ఇంగ్లీషులోనే చాలా సందర్భాలలో మాట్లాడుతుండేది. యీ రెండిటిలో ఏదైనా ఒకటేగదా అన్నట్లు. బీహారు విద్యార్థి మహాసభకు అధ్యక్షత వహించినప్పుడు కూడా ఉర్దూలోనే ప్రసంగించింది. ఆమెకు వ్యాఖ్యానం చెప్పిన వ్యక్తి, యిలా అన్నాడు. "ఆమె ప్రజలకు సులభంగా అర్థంకాని ఉర్దూభాషలో అధ్యక్షోపన్యాసం చేసింది."[4]

1916 లో లక్నో కాంగ్రెసు మహాసభలో సరోజినీనాయుడు మొదటి సారిగా పండిట్ నెహ్రూను కలుసుకుంది. అదే సమయంలో నెహ్రూ కూడా మహాత్మాగాంధీని కలుసుకున్నాడు. సరోజినీదేవిని గురించి రాస్తూ పండిట్ నెహ్రూ యిలా అన్నాడు. "ఆ రోజుల్లో సరోజినీనాయుడు చేసిన గంభీరోపన్యాసాలకు నేను బాగా చలించి పోతుండేవాణ్ణి అని గుర్తు. వాటినిండా జాతీయ భావాలూ, దేశభక్తి తొణికిసలాడుతుండేవి. నేనప్పటికే శుద్ధ జాతీయవాదిని. కాలేజీరోజుల్లో తలకెక్కిన అయోమయపు సోషలిస్టు భావాలు అప్పటికే నాలో వెనుకడుగువేశాయి."[5]

జాతీయతాచైతన్యం దేశమంతటా వ్యాపించి ప్రజలు మేల్కొంటున్న యీ కాలంలోనే మహిళావిముక్తి ఉద్యమంలో కూడా గణనీయమైన కృషి జరిగింది. మార్గరెట్ ఇ. కజిన్స్, అనీబీసెంట్, సరోజినీనాయుడు ప్రభృతులు యీ

3. సరోజినీనాయుడు అమర్‌నాథ్‌ఝా రచన పే. 7.

4. సరోజినీనాయుడు అమర్‌నాథ్‌ఝా రచన పే. 8.

5. జవహర్‌లాల్ స్వీయ చరిత్ర పే. 38.

రంగంలో కూడా దిగి మహిళాలోకాన్ని ప్రభావితం చేశారు. కాకతాళీయ న్యాయంగానే కావచ్చుగాని, యీ రోజుల్లోనే 1917లో మనదేశానికి తరువాత కాలంలో ప్రధానమంత్రి పదవి నధిష్ఠించిన మహిళామణి ఇందిరాగాంధీ జన్మించింది. ఒకనాడు సమాజంలో ఏమాత్రం స్థానంలేని మహిళదేశంలో అత్యున్నత పదవి నధిష్ఠించడం, 50 ఏండ్లకాలగమనంలో వచ్చిన మార్పును సూచిస్తున్నది. 1917 నవంబరు 19వ తేదీన నెహ్రూకు కూతురు పుట్టిన సందర్భంగా అభినందన లేఖ రాస్తూ సరోజినీనాయుడు "యీ నీ కూతురు భారతదేశపు నూతనాత్మగా" విలసిల్లుతుందని జోస్యంచెప్పి ఆశీర్వదించింది.

1919 లో సరోజినీనాయుడు మూడవసారి ఇంగ్లాండు వెళ్లింది. అప్పటికే ఆమెకు ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించిన నాయకురాలిగా గుర్తింపు వచ్చింది. అంటే భారతదేశ స్వాతంత్ర్యసమరంలో అహింసాదళనాయుకురాలని. 1920 లో భారతదేశానికి తిరిగివచ్చింది. తరువాత దేశంలో పోరాటాలూ, హర్తాళ్ళూ కోర్టువిచారణలూ శరపరంపరలుగా సాగాయి. 1922లో మహాత్మాగాంధీ కేసు విచారణ జరిగింది. కోర్టు విచారణకు సరోజినీదేవి కూడా హాజరైంది. 1922 మార్చిలో బాంబే క్రానికల్‌లో యిలా రాసింది. "చట్టరీత్యా నిందితుడు, నేరస్థుడు. అయితేనేం, మహాత్మాగాంధీ కోర్టులో అడుగుపెట్టగానే అక్కడివారందరూ అప్రయత్నబద్ధాంజలులై లేచి నుంచుని సగౌరవంగా స్వాగతమిచ్చారు. ప్రసన్న వదనుడూ, ప్రశాంతగంభీరుడు, మొక్కవోని ధైర్యశాలి అయిన రెబ్బవంటి ఆ సన్నని వ్యక్తి చాలీచాలని ఖద్దరు అంగవస్త్రం కట్టుకొని వచ్చాడు ప్రియశిష్యుడూ, జైల్లో సహచరుడూ అయిన శంకర్‌లాల్ బ్యాంకర్‌తో కలిసి. 'నేను మూర్ఛవచ్చి పడిపోతే పట్టుకోడానికా నా ప్రక్కనే కూర్చున్నావ్?' అంటూ నావైపుచూస్తూ ఒక హాస్యోక్తి విసిరివేశాడు, పసిపిల్లవాడి చిరునవ్వులోతుల్లో నుంచి లేచి ధగధగా మెరుస్తూ లోకం గుండెలమీదికి ప్రాకే కాంతి పుంజాలవంటి తన సహజ గంభీర మందహాసంతో. అక్కడచేరిన వారందరినీ ఒకసారి తేరిపారచూసి 'ఇది కుటుంబ సభ్యులందరూ ఒకచోట కలుసుకున్న సందర్భంగా వుందిగాని కోర్టులాగా లేదే' అన్నాడు గాంధీజీ. న్యాయాధిపతివచ్చి తన ఆసనంలో కూచోగానే ఆ గుంపులో వున్న ప్రజలందరి ముఖాలమీద ఒక భయరేఖ, ఒక గర్వస్ఫూర్తి, ఒక ఆశాకిరణం అన్నీ చిందులు త్రొక్కాయి.........న్యాయాధిపతి మెచ్చుకోదగినవాడు, ధర్మ నిర్వహణ దీక్షలో ధైర్యశాలి, స్థిరచిత్తుడు మా అందరికి ప్రశంసాపాత్రుడు. మాట

మర్యాదలు ఎరిగినవాడు. అపూర్వమైన యిటువంటి పరిస్థితి ప్రాధాన్యతను గుర్తించిన సమర్థుడు. సాటిలేని మేటియైన ఒక మహావ్యక్తి గొప్ప దనాన్ని గుర్తించి ప్రశంసించే నేర్పుకలవాడు....విచిత్రమైన ఆ విచారణ కొనసాగుతున్నది. నా హృదయానువర్తీ, పరమగురువైన మహాత్ముని రసనాగ్రంనుండి జాలువారుతున్న మాటలు-మాటలుకావవి, భవిష్యత్తులో యథార్థాలుగా వెలుగబోతున్న అనశ్వరమైన కాంతిపుంజాలమూటలు-విని గుండెగుడిలో పెట్టుకుని విప్పుకుంటున్నంతసేపూ నా ఊహలు విహంగాలై యుగయుగాల మానవ చరిత్రాకాశవీధుల్లో ఎగురుతూ ఎగురుతూ, మరోదేశం మీదికి వెళ్ళివాలాయి. మరో యుగంలో అక్కడకూడా యిటువంటి నాటకమే ప్రదర్శించింది చరిత్ర. దైవాంశసంభూతుడైన ఒక మహాప్రవక్తను, మానవజాతికి రక్తబంధువై పుట్టి ధైర్యంగా ప్రేమసిద్ధాంతాన్ని ప్రవచించినందుకు శిలువెక్కించి చిత్రవధచేశారు. ఇప్పటికి నాకు బాగా తెలిసింది పశువుల కొష్టంలో గుడ్డ ఉయ్యాలలో ఊగిన ఆ ఏసుప్రభువు ఒక్కడే యీ మహాత్మునికి చరిత్రలో సాటియైనవాడు. అజేయుడైన యీ భారత స్వాతంత్ర్య దేవతామూర్తి, తన ప్రేమభావప్రవాహాలను మానవజాతిమీద పారించిన మహనీయుడు, ఆయన చెప్పిన మనోహరమైన మాటల్లోనే చెప్పాలంటే 'పేద వారిని పేదవారిమనస్తత్వంతోనే సమీపించి' లాలించిన దరిద్ర నారాయణ ప్రభువు — యీ యిద్దరు ప్రభువులే ఒకరికొకరుసాటి''. మహాత్మాగాంధీకి ఆరేండ్లు జైలుశిక్ష వేశారు. గాంధీజీ అరెస్టుఅయిన తర్వాత, ఆయన కార్యక్రమాన్ని స్వీకరించి, సరోజినీదేవి ఖద్దరుధారిణియై దేశమంతటా పర్యటించింది.

1925 డిసెంబరులో జరిగిన కాన్పూరు కాంగ్రెసు మహాసభకు అధ్యక్షురాలుగా ఎన్నికైంది. ఎన్నికైన అధ్యక్షురాలిగా ఆమెను అక్టోబరులో ప్రకటించారు. అప్పుడు అధ్యక్షస్థానంలోవున్న మహాత్మాగాంధీ నాస్థానంలో వుండవలసిన వ్యక్తి సరోజినీదేవి అన్నాడు.

అధ్యక్షస్థానంలో ఒక మహిళామణి కూచోవడం ఒక కొత్త విశేషం. గాంధీజీ ఆమెకు చార్జీ అప్పగించాడు, ''క్లుప్తంగా రెండు మాటలు చెప్పి'' ఆమె చార్జి తీసుకున్నది. ఆమె చేసిన అధ్యక్షోపన్యాసం, బహుశః అన్నిటికంటే, క్లుప్తంగా వుంది. రాజకీయపార్టీలలో ఐక్యత రావాలనీ, అసలు భారతీయులందరిలోనూ ఐక్యతరావడం అవసరమనీ ''స్వేచ్ఛకోసం జరిగే యీ సమరంలో

భయపడడం క్షమించరాని ద్రోహచర్య. నిస్పృహచెందడం క్షమించరాని అపరాధం"[6] అంటూ ఆమె ఉద్బోధించింది.

# స్నేహానికి సేతువు

వ్యక్తులతో స్నేహం కట్టడంలోనూ, దానిని అవిచ్ఛిన్నంగా కొనసాగించడంలోనూ సరోజినీదేవి మంచి నేర్పరి. ఆమె స్నేహితులలో చాలా మంది యిప్పటికి ఆమెను గురించి ఎంతో ఆదరణతో అప్యాయంగా మాట్లాడుతుంటారు. కాని ఆమె సాధించిన ఘనకార్యం ఏమిటంటే వివిధ జాతులు, మతాలు, కులాలమధ్య సామరస్యసేతువు నిర్మించడం, పరస్పర విశ్వాసం వారిలో పురికొల్పడం. మిస్ మేయో రాసిన "మదర్ ఇండియా" అనే గ్రంథం భారతదేశ పరిస్థితిని ప్రపంచానికి అపసవ్యంగా వర్ణించి చెప్పింది. దీనికి విరుగుడుగా యథార్థ పరిస్థితిని లోకానికి చాటడానికి గాంధీజీ భారతదేశపు అనధికార రాయబారిణిగా సరోజినీదేవిని పంపించాడు. ఆయనకు విశ్వాసపాత్రులైన అనేకమంది సహచరుల్లో నుండి సరోజినీదేవిని ఏరి నిర్ణయించడం నిజానికి ఆయన చేసిన నిర్ణయాలన్నింటిలో అత్యుత్తమమైనదని చెప్పవచ్చు. అమెరికాలో పర్యటిస్తూ సరోజినీదేవి రాసిన లేఖలు పేరుకు మాత్రమే లేఖలు. అవి సాహిత్యభాండారంలో చేర్చదగిన మణిపూసలు. ఆ లేఖలను పరిశీలిస్తేగాని ఆమెలోని మహా ప్రతిభాసంపద మనకు అర్థం కాదు. సజీవచిత్రణతో కూడిన సాహిత్యపు విలువలతో కలకాలం భద్రపరచుకోదగిన, మళ్ళీ మళ్ళీ ప్రకటించుకోదగిన ముఖ్యమైన, రాజకీయ పత్రాలను కూడా ఆమె సునాయాసంగా రాయగలదనడానికి ఆ లేఖలే ఋజువు.

---

6. భారతజాతీయకాంగ్రెసు చరిత్ర పే. 294.

ఆమె రాక అమెరికాలో ఒక పెద్ద సంచలనం కలిగించింది. ప్రజలామెను అభిమానించారు, ఆదరించారు, అభినందించారు. న్యూయర్క్‌టైమ్స్ పత్రిక సరోజినీదేవి అమెరికా పర్యటన వార్తను యీ విధంగా శీర్షికపెట్టి ప్రకటించింది.

భారతీయ కవయిత్రి అమెరికా పర్యటన: పురాతనాచారాలను ఎదుర్కొంటున్న భారతీయ మహిళాలోకంలో జరుగుతున్న మార్పులను గురించి సరోజినీదేవి విశదీకరిస్తుంది—

అమెరికాలోవున్న సమయంలో కొత్తగా మరొక కవితాసంకలనం ప్రకటన జరుగుతుందని అనుకున్నారు, కాని అనేకచోట్ల వరుసగా గ్రూపు సమావేశాలు జరుపుతూ ప్రసంగించవలసిన కార్యభారంవల్ల అటువంటి ప్రచురణజరిగే అవకాశం లేకపోయింది.

అమెరికాలోని అన్నిప్రాంతాల్లోనూ ఆమె కావ్యగానం చేసినప్పుడు శ్రోతలనుండి బ్రహ్మాండమైన ఆదరణ లభించింది. ఎక్కడికి వెళ్ళినా ఆమెకు ప్రజలు ఆదరపూర్వకంగా స్వాగతం పలికారు. రాయబారిణిగా వచ్చిన కవయిత్రి గౌరవార్థం జరిగిన అనేక విందుల్లో ఆమె పాల్గొన్నది. అనేక అమెరికన్ ప్రముఖుల యిండ్లకు గౌరవ అతిథిగా, స్నేహితురాలిగా వెళ్ళింది. పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చిన అనేక సభావేదికలనుండి ప్రసంగాలు చేసింది. అమెరికాలోని కొత్త జీవితం ఆమెను సమ్మోహపరిచింది. ఆమె తనకు రాసిన లేఖల్లో చాలా భాగం 'యంగ్ ఇండియా' పత్రికలో గాంధీజీ ప్రకటించాడు. ఆంగ్లభాషా శబ్ద జాలంమీద ఆమెకు ఎంత అధికారంవుందో ఆ లేఖలను చూస్తే తెలుస్తుంది. సిన్‌సిన్నతినుండి ఒక లేఖ రాసింది, ఆ ప్రాంతంలోనే నీగ్రోల స్నేహానికి పాత్రమైన ఒక రచయిత్రి పూర్వం వుండేది. ఆ లేఖలో ఆమె రాసింది. "మిస్టిక్ స్పిన్నర్ అనే గ్రంథంలోని సందేశానికి క్రొత్త వ్యాఖ్యానంచెప్పి ఒక బ్రహ్మాండమైన సభలో ప్రసంగించి యిప్పుడే తిరిగివచ్చాను." (ఈ సభకు వచ్చినవారి తండ్రులూ, తాతలూ హారియెట్ బీచర్‌స్టోవ్ అనే రచయిత్రిని ఎరిగినవారు. అంకుల్ టామ్స్ క్యాబిన్ నవలను ఆమె రాస్తున్న సమయంలో వారున్నారు.) సరోజినీదేవి 'ఒక వూనకం వచ్చిన మనిషి' గా ఆ సభలో ప్రసంగించిందిట. ప్రసంగం విన్నవారికి కాలకాలం ఉత్సాహం కలిగించే ఒక మహత్తర సందేశాన్ని ఆమె యిచ్చిందని అక్కడివారు అందరూ అన్నారుట. హారియెట్ బీచర్‌స్టోవ్ రచనలోని సందేశం లాగా సరోజినీదేవి సందేశంకూడా బానిసత్వం నుంచి విముక్తి — అయితే మరొక

దేశంనుండి వచ్చిన వ్యక్తిచెప్పిన మరొక పద్ధతి, మిస్టిక్ స్పిన్నర్‌లోని సందేశానికి ఒక రచయిత్రి చేసిన వ్యాఖ్యానం.

కాలిఫోర్నియాలో "పూలతోనిండిన" రోడ్లనూ, "సముద్రపు నురుగు పారిన పొలాలనూ" సరోజినీదేవి ఆనందంతో తిలకించింది. అక్కడికి వలసవచ్చి వుంటున్నవారు మొదట్లో స్వదేశానికి తిరిగి వెళ్ళేసంకల్పంతోనే వచ్చారు. "అందువల్ల అలా కాలక్షేపం చేసుకుంటూ రోజులు గడుపుతున్నారు. కాని ఒక స్థిరమైన సాంఘిక సంప్రదాయం ఏర్పాటుచేసుకోవాలనిగానీ, విద్యావిషయమైన ఘనత పొందాలనిగానీ వారికి తట్టలేదు. ఆ విషయాలువారు అంతగా పట్టించుకోలేదు. ఇతరజాతులనుండి వచ్చినవారు ఆ విధంగాచేసి అమెరికన్లు అనిపించుకొన్నారు. యీ కొత్తలోకంలో ఒక భాగంగా, అమెరికన్ జాతిలో భాగంగా పరిగణన పొందారు. ఇటువంటి ప్రయత్నమేదీ మనవారు చేయలేదు". "ఆఫ్రికాలో, అమెరికాలో పర్యటించిన తర్వాత నేను నిశ్చయించుకున్నదేమంటే, భారతదేశానికి కూడా ప్రపంచంలోని స్వతంత్రదేశాల బృందంలో సమాన గౌరవస్థాయి వస్తేగాని ఏప్రాంతంలో వలసవెళ్ళివున్నా, భారతీయులకు సంతృప్తికరమైన జీవనపరిస్థితులు ఏర్పడవు" అని సరోజినీదేవి రాసింది.

అమెరికాలో, కెనడాలో తను పంపిన రాయబారిణి, సరోజినీ దేవి పర్యటనలవల్ల కలిగిన సుముఖ వాతావరణం, ప్రజలపై దాని ప్రభావం చూసి గాంధీజీ చాలా సంతోషించాడు. 1929 జూలై నెలలో సరోజినీదేవి తిరిగి స్వదేశానికి వచ్చినప్పుడు ఆయన యిలా రాశాడు. "పశ్చిమదేశాలలో అనేక ఘనవిజయాలు సాధించి మన దేశద్రిమ్మరి గాయనీమణి స్వదేశానికి తిరిగివచ్చింది. ఆమె పర్యటన ప్రభావం అక్కడి ప్రజలమీద ఎంత గట్టిగా పడిందో చెప్పాలంటే దానికి రాబోయే కాలమే సాక్షి. అమెరికాలోని ప్రైవేటువ్యక్తులద్వారా అందిన సమాచారాన్నిబట్టి చూస్తేమటుకు ఆమె అక్కడ చేసినకృషి అమెరికా ప్రజల మనస్సులమీద, గాఢమైన ముద్రవేసినట్లు తెలుస్తున్నది. ఆమె తన అపూర్వ విజయయాత్ర ముగించుకుని దేశంలోకి వచ్చింది, మనం ఎదుర్కొంటున్న క్లిష్టమైన అనేక సమస్యల పరిష్కారకృషిలో పాలుపంచుకోడానికి. అమెరికా ప్రజలమీద విజయవంతంగా ఎంత గాఢమైన ప్రభావముద్రవేసిందో, అంతగా ఆమె మనలను కూడా ప్రభావితం చేయగలదని ఆశిస్తున్నాను."

గాంధీజీకి ఆమెరాసే లేఖలు తరచు సుదీర్ఘంగా వుండేవి. సరోజినీదేవి ఆ విషయంలో తనను క్షమించమని గాంధీజీని కోరింది. ఈ "సుదీర్ఘప్రేమ

లేఖలు'' ఆ "కోడిగిత్తలదస్తూరీ" అంటే తనకెంతో యిష్టమని గాంధీజీ జవాబు రాశాడు.

హైదరాబాదులోని 'గోల్డెన్‌త్రెషోల్డ్' భవనంలోతానున్న స్వల్పకాలంలో తన కుటుంబజీవితాన్ని వర్ణిస్తూ సరోజినీదేవి ఒకసారి పండిట్ నెహ్రూకు లేఖ రాసింది. "ప్రియమైన జవహర్, 'స్వర్ణప్రాంగణం' భవనంలో నల్లటేకులో నగిషీలు చెక్కిన నా మంచంమీద కూచొని నీకు రాస్తున్నాను. రస్తఫారీ, పావోనోర్మి, నికాలోపిశానో, డిక్‌డిక్ మహజంగ్-మా యింటిని పరిపాలించే యీ చతుష్పాదులు నాచుట్టూ మూగి ఆడుతున్నాయి. తోటలో గుల్‌మొహర్, ఎర్రరోజా చెట్లమీద పక్షులు కిలకిలారావాలు చేస్తున్నాయి'1 .... "బొంబాయినుండి యిప్పుడే వచ్చిన ఫియెట్‌కారు చూసి పద్మజ మోజుతో గంతులేస్తున్నది, గోవింద్ ఆలశ్యంగా వచ్చి వేళగానివేళలో భోంచేస్తున్నాడు. పదార్థాలు 'బైగారాబైగన్' 'ఫాల్సా షెర్‌బత్'. హాయిగా రాళ్ళరప్పల్లో నీళ్లల్లో ఆడుకోవచ్చుగదా అని మేం పోదలచుకున్న చోటికి ప్రయాణానికి భంగంకలిగించవద్దు దేవుడా అని లోలోపల ప్రార్థనచేస్తూ భోంచేస్తున్నాడు''2. స్వేచ్ఛ తాణికిసలాడే యిటువంటి కుటుంబ జీవితం అంటే సరోజినీదేవికి చాలా యిష్టం. అది ఆమె మనస్సుమీద టానిక్‌లా పనిచేసేది. ఈ విధంగా యింటిపట్టున అప్పుడప్పుడు కాలక్షేపంచేసే అవకాశం లేకపోతే ఏంచేసేది ఆమె? తానే రాసుకుంది! "ఒక్కముక్కలో చెప్పాలంటే 1921 నుండి చూస్తే మొట్టమొదటిసారిగా యింటిపట్టునవుండి హాయిగా కాలం గడుపుతున్నాను. ఇది నిజంగా మనస్ఫూర్తిగా నేను అనుభవిస్తున్న సెలవు. ఎవరిపట్లనో శ్రద్ధలూ, బాధ్యతలూ, విధులు అన్నీ అవతలు పెట్టేశాను. ఈ బాధల సర్పాలేవీ యీ స్వర్గంలోకి రాకూడదు. తప్పేకావచ్చు కాని ధైర్యంగా కొన్నాళ్ల పాటు పదవిని వదలి వచ్చేశాను. ఎందుకంటే అందం, ఆనందం నిండిన సుఖ వాతావరణంకోసం నా ఆత్మపరితపిస్తున్నది — మొలుచుకొస్తున్న మొక్కలకోసం, గూళ్ళుకడుతున్న పక్షులకోసం, పాటలురాసిన కవులకోసం, పిల్లలు, పెంపుడు కుక్కలు, పాత స్నేహితులకోసం, మన తలనొప్పి రాజకీయాల్లో ఆత్మ విధ్వంస కరమైన కార్యక్రమాలనుండి, నిర్మాణకార్యక్రమాలనుండి కాస్త విశ్రాంతికోసం, కొంచెంసేపు దూరంగా వుండడంకోసం.''

---

1. ఎ బంచ్ ఆఫ్ ఓల్డ్ లెటర్సు (పాతలేఖలు) పే. 112.
2. అదే గ్రంథం పే. 42.

దేశ విభజన సమయం దగ్గరపడుతున్నకొద్దీ సరోజినీదేవి గుండెల్లో విషాద చ్ఛాయలు గూడుకట్టుకున్నాయి. ఆ సమయంలో తూర్పు బెంగాల్లో గ్రామ గ్రామానికి తిరుగుతున్న గాంధీజీ దగ్గర ఆమె మనస్సు వ్రాలి వుంది. ఆయనతోనే తిరుగుతోంది. 1946 లో గాంధీజీకి లేఖ రాసింది శాంతినికేతనం నుండి: "స్వామీ యిది లేఖకాదు, ప్రేమభావప్రదర్శన, విశ్వాసప్రకటన. ఏ మాత్రం వీలున్నా రెక్కలు కట్టుకునివచ్చి నీముందువాలి వుండేదాన్ని, ఒక్కక్షణం పాటైనా. ఆ ప్రయత్నం కూడా చేయకుండా బెంగాలువదలిపోవలసి వచ్చినందుకు నన్ను క్షమించు. నిజానికి నిన్ను నేను ప్రత్యక్షంగా చూడనూ అక్కరలేదు, మాట్లాడనూ అక్కరలేదు. ఎందుకంటావా, నా కళ్ళల్లో నీవెప్పుడూ కాపురం చేస్తూనేవుంటావు. నీ సందేశం నా గుండెలో ఎప్పుడూ కూనిరాగాలుతీస్తూ లోకానికి వినిపిస్తూనే వుంటుంది.

ప్రియమైన యాత్రికప్రభూ! ఆశారథం మీద మానవప్రేమ భావనా పథంలో సాగించు నీ యాత్ర. స్పెయిన్ భాషలోవున్న నుడికారం ప్రకారం "దేవునితో పో." నీకేమో అవుతుందని నాకు భయంలేదు. ఉన్నది నాకు ఒక్కటే: నీ లక్ష్యంలో విశ్వాసం." —సరోజిని 3

అమర్‌నాథ్ ఝా తాను ఇంగ్లాండు ప్రయాణమై వెళ్ళుతున్నప్పుడు తనకు సరోజినీదేవి అక్కడి ప్రముఖులకు పరిచయలేఖలు రాసి యిచ్చి పంపిందని చెప్పాడు. బెర్నార్డ్‌షా, వాల్టర్‌డీలామేర్, హంబర్ట్ ఉల్ఫ్, మిసెస్‌మన్రో, లారెన్స్ బిన్యన్‌లకు ఝాను పరిచయంచేస్తూ లేఖలు రాసింది. ఝా అంటాడు, "ప్రతి పరిచయలేఖలో ఆహ్లాదకరమైన భాషా సౌష్ఠవం వెల్లివిరిసింది." ఇంగ్లాండు వెళ్ళి కలుసుకున్నప్పుడు బెర్నార్డ్‌షా శ్రీమతి నాయుణ్ణి గురించి కుశల ప్రశ్నలడిగాడనీ, భారతదేశం వచ్చినప్పుడు సరోజినీదేవి జైల్లో వున్నందున తాను ఆమెను కలుసుకో లేకపోయినందుకు విచారం ప్రకటించాడనీ ఝా చెప్పాడు. అమర్‌నాథ్ ఝా స్వదేశం తిరిగి రాగానే సరోజినీదేవి వాల్టర్‌డీలామేర్, హెచ్. జి. వెల్స్‌ల కుశలాన్ని గురించి అడిగింది. వీరిద్దరినీ ఝా ఇంగ్లాండులో కలుసుకున్నాడు.

మౌంట్‌బ్యాటన్ దంపతులతో సరోజినీదేవి చాలా స్నేహంగా వుండేది. 1948 లో ఒకసారి మౌంట్‌బ్యాటన్ కాశీలో విద్యార్థుల సభలో ప్రసంగించ

---

3. గాంధీతో గడిపినరోజులు: నిర్మలకుమార్‌బోస్ రచన. పే. 139 ఆసియా పబ్లిషింగ్ హౌస్, 1953.

డానికి వచ్చాడు. విద్యార్థులవేపు వేలు చూపించి ఊపుతూ "అల్లరికుంకలు, అల్లరికుంకలు" అని అనమని సరోజినీదేవి మౌంట్ బ్యాటన్‌కు సలహా యిచ్చింది.

"స్త్రీ అయినందున ఆమెకు వుండే అలుసుగానీ, ఆమెకు దేశంలోవున్న ప్రతిష్ఠగాని నాకు లేదామె. నేనా మాటలంటే మర్యాద దక్కుతుందా?" అని వ్యాఖ్యానించాడు మౌంట్‌బ్యాటన్.

1947 లో అలన్ క్యాంప్‌బెల్—జాన్సన్‌కు ఒక లేఖ లభించింది. అది "సుప్రసిద్ధ రచయిత్రి సరోజినీనాయుడు మౌంట్‌బ్యాటన్ సతీమణికి రాసిన చిత్రమైనలేఖ." స్వరాజ్యం వచ్చిన తర్వాత ఉత్తరప్రదేశ్ రాష్ట్రగవర్నర్ పదవిని అంగీకరించిన తర్వాత సరోజినీదేవి "మామూలు గవర్నరు, గవర్నరు జనరల్ సతీమణికి" రాసిన లేఖలో మౌంట్‌బ్యాటన్ సతీమణి భారతదేశానికి చేసిన సేవలను ప్రశంసించింది. ఆ లేఖ చివరిలో యిలా రాసింది. "నేను ఎంతకాలం యీ రాష్ట్రంలో వుంటానో చెప్పలేను, కాని నా అదృష్టం ఏమిటంటే పూర్తి అవకాశం లభించడం, దానిని నేను ఫలవంతం చేసుకోవడం—అంటే నాలోని స్నేహ వాతావరణం. ఏండ్లూ పూండ్లూ ఒకరి మొగం ఒకరు చూడని శత్రువులుగా వుండే స్త్రీలూ, పురుషులూ, ప్రతిరోజూ మా యింటికివచ్చి—ఒక క్షణంపాటు తటపటాయించి తిరిగి తేరుకుని—హాయిగా కలిసి కాలక్షేపం చేస్తారు. అవును.........మా తోటలోని పచ్చగడ్డిమీద పులులూ, మేకలూ కలిసి మెలిసి పడుకుని వుంటాయి. మనం యిద్దరం వీలున్నంత వరకే మేలుచేయగలం. బ్రౌనింగ్ చెప్పినట్లు మంచికి ఎప్పుడూ వంచనలేదు." ఎంత గొప్ప విశ్వాసం ![4]

సరోజినీదేవి స్నేహంలోవుండే రహస్యం ఆపదలో అక్కరలో వున్నవారిని వెళ్ళి చూసినప్పుడు ఆమె వారిపట్ల చూపే ప్రేమాభిమానాలు, శ్రద్ధాసక్తులే.

అన్నికులాలూ, జాతులకు చెందిన వారితో ఆమె స్నేహంగా వుండేది. ఆలీ సోదరులు, మహమ్మదలీజిన్నా, సర్ సి. పి.రామస్వామి అయ్యర్, శ్రీనివాస శాస్త్రి ప్రభృతులు సరోజినీదేవికి తొలికాలపు స్నేహితులు. సరోజినీదేవిని స్మృతి పథంలోకి తెచ్చుకుని సర్ సి. పి. రామస్వామి అయ్యర్ ఒకలేఖ నాకు యిలా రాశాడు. "సరోజినీదేవి జిన్నాతోనూ, భారత రాజకీయ నాయకుడుగా ఆయన

4. మౌంట్‌బ్యాటన్‌తో మంతనాలు (మిషన్ విత్ మౌంట్‌బ్యాటన్) పే. 195.

కార్యక్రమాలతోనూ చాలా సన్నిహితంగా వుండేది. గాంధీజీ తర్వాత ఆమె జీవితంమీద ప్రముఖంగా పడిన ప్రభావం బహుశః జిన్నాదే అనుకుంటాను. బుద్ధి బలంలోనూ ఆత్మశక్తిలోనూ ఆమె జిన్నాకంటే చాలా ఎత్తులోనే వున్నప్పటికీ యిద్దరి మధ్య తేడా స్వయంప్రతిభకూ, బుద్ధిబలానికీ వుండేతేడా, జిన్నా అత్యంత స్వయం ప్రతిభావంతుడని సరోజినీదేవి భావించినట్లు కనిపిస్తుంది. ప్రధాన భారతీయ నాయకులను గూర్చి రాసిన ఒక గ్రంథంలో జిన్నానుకూడా చేర్చివుండ వలసిందని ఆమె నాతో అన్నది. అతడు నాయకాగ్రేసరులలో ఒకడని కూడా ఆమె వ్యాఖ్యానించింది.''

సరోజినీదేవికి మరొక ముఖ్యస్నేహితుడు దీనబంధు సి. ఎఫ్. ఆండ్రూస్. ఇద్దరికీ కాంట్రాక్టు కూలీల సమస్యలలో ఆసక్తి మెండు. మిస్. మేయో గ్రంథం లోని విషయాలను ఖండించడానికి సరోజినీదేవి అమెరికా దర్శించిన కాలంలోనే ఆండ్రూస్ కూడా అమెరికా వెళ్ళాడు. ఆయన గాంధీజీతో సరోజినీదేవిని గురించి యీ విధంగా అభిప్రాయం చెప్పాడు.

''సరోజినీనాయుడు అమెరికా పర్యటన అద్భుతంగా వుంది. ప్రజలందరి హృదయాలనూ ఆమె ఆకట్టుకుంది. ఎవరినోటవిన్నా, ఎక్కడ చూసినా ఆమెను గురించి పొగడ్తే కాని మరోమాట వినిపించలేదు.''

సరోజినీదేవి తన స్నేహంతో సమకాలికులైన అనేకమంది రచయితల హృదయాలను ఉర్రూత లూగించింది, ''జెస్టింగ్ పిలేట్'' అనే తన రచనలో అల్డస్ హక్స్లీ ఆమెను గురించి ప్రముఖంగా రాశాడు. 1925 లో ఆమెను బొంబాయిలో కలుసుకున్నప్పుడు హక్స్లీ యిలా అన్నాడు. ''బొంబాయిలో వున్నప్పుడు కొత్తగా అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఎన్నికైన సరోజినీ నాయుణ్ణి కలుసుకోవడం మా అదృష్టం. గొప్పధీశక్తి, ఉల్లాసం, మధురభాషణ, గుండెధైర్యం అనే లక్షణాలన్నీ మూర్తీభవించిన వనితామణి. స్వోపజ్ఞకమైన సంస్కృతి, హాస్యోక్తితోకూడిన శ్రద్ధాసక్తులు ఆమె సొమ్ము. భారత రాజకీయ నాయకులందరూ శ్రీమతి సరోజినీనాయుడువంటి వారైతే, యీ దేశం నిజంగా అదృష్టవంతమైన దేశం అవుతుంది.'' 5

5. జెస్టింగ్ పిలేట్—డెయిరీ ఆఫ్ ఎ జర్నీ : ఆల్డస్‌హక్స్లీ, పే. 12.

సరోజినీ దేవి మహాత్మాగాంధీతో కలిసి రెండవ రౌండ్‌టేబిల్ కాన్ఫరెన్సుకు లండన్ వెళ్ళినప్పుడు అనేకమంది రాజనీతివేత్తలనా, ప్రముఖ రచయితలు కూడా ఆమె ఆకర్షణకు లోనయ్యారు. "నా గాంధీ" (మైగాంధీ) గ్రంథం రాసిన జాన్ హేన్స్ హోమ్స్ ఆమెను "భారతదేశ మహిళాలోక నాయకమణి"గా వర్ణించాడు. ఒక ఆంగ్లేయ రచయిత యిలా రాశాడు. "కవయిత్రీ, రాజకీయవేత్త అయిన సరోజినీనాయుడు నడుస్తున్న మానవ జీవిత సర్వస్వంలా ప్రతి ఒక్కరి విషయాలు సమగ్రంగా తెలిసినవ్యక్తి. ఆమెలో వయసువల్ల వచ్చిన విజ్ఞతా, చిన్నపిల్లల చురుకుదనం పెనవేసుకున్న విచిత్ర లక్షణంవల్ల, యితర రాజకీయ నాయకుల కంటే ఆంగ్ల ప్రజలకు అభిమానపాత్రమైంది. ఇతరులను హేళనచేయడమేకాక (కొద్దోగొప్పో దురుద్దేశం వుండకపోదు) తనమీద తానే ఛలోక్తుల వర్షం కురిపించు కుంటూ సభల్లో శ్రోతలను కడుపు చెక్కలయ్యేట్లు నవ్విస్తుంది. సరోజినీనాయుడులో ఆత్మన్యూనతాభావం మందుకైనాలేదు. భారతీయుల్లో ఎవరిలోనైనా యీ లక్షణం కనపడిందా, ఆమె మండిపడుతుంది. చీవాట్లు పెడుతుంది. రౌండ్‌టేబిల్ సమావేశంలో ఒకరోజు సభ ముగిసిన తర్వాత గాంధీజీ ఎక్కడున్నాడా అని అటూ యిటూ చూసి "ఏడీ, ఎక్కడా మన చిట్టెలుక సింగడు?" అని అడిగింది. ఇంత మర్యాద తప్పిన మాట మరిచిపోదామన్నా మరువలేము. అందరికీ జ్ఞాపకం వుండే మరొక సంఘటన. ఒక ప్రతినిధి తన అభిప్రాయాలు పాడిందే పాటగా మాటమాటకీ చెప్తూ వింటున్నవాళ్ళకు విసుగుపుట్టేటట్లు చేశాడు. పార్లమెంటులో రెండవ సభ (ఛేంబర్స్) కావాలని అనుకూలంగా ఆయన ప్రసంగంచేశాడు. "రెండోసభ ఏంఖర్మ నాయనా?" అని సరోజినీనాయుడు నిట్టూర్చింది. కొంత మంది రాజకీయవేత్తలకు మూడోసభ (లేథల్ ఛేంబర్—అంటే బాధలేకుండా పశువులను చంపేకబేలా) ఏర్పాటుకుకూడా అనుకూలంగా తాను ఆ మాట అన్నా నని తరువాత వివరించింది.

లండన్‌లో ఫ్రండ్స్ మీటింగ్ హౌస్‌లో సభ జరిగింది. భారత నాయకుల రాకకోసం వేలాది ప్రేక్షకులు వేచివున్నారు. సుప్రసిద్ధ ఆంగ్లకవి ఎ. ఇ. హౌస్ మన్ సోదరుడు లారెన్స్ హౌస్‌మన్‌కూడా అక్కడే వున్నాడు. ఆయన సరోజినీ దేవిని గురించి వ్యాఖ్యానిస్తూ, "మహిళాలోకానికి ఆదర్శప్రాయమైన మహావ్యక్తి. కొట్టవచ్చినట్లు అందరినీ ఆకర్షించే నిలువెత్తు విగ్రహం; సిల్కుచీరల సింగారంతో శక్తినీ సౌందర్యాన్నీ వెదజల్లుతుంటుంది." అన్నాడు. అంతగా ప్రహాదరణ

పొందని గ్రంథం "వెర్డిక్ట్ ఆన్ ఇండియా" రచయిత బీవర్లీ నికొలస్‌కు సరోజినీదేవి అంటే చాలా ఇష్టం. తన పెంపుడు నల్లపిల్లిని మెచ్చుకున్నాడని అతనంటే తనకు చాలా యిష్టమని హాస్యోక్తులాడుతుంది సరోజినీదేవి.

ఈ విధంగా నదురూ బెదురూ లేని యీ మహావ్యక్తి గుండె ధైర్యంతో సాహసోపేతమైన తన జీవయాత్ర కొనసాగించింది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలో ప్రజలామెను అభిమానించారు, గౌరవించారు. అయినా ఆమె జీవితం నిండా దుఃఖమూ, బాధా పరుచుకునే వున్నాయి. స్నేహితులంటే చెవికోసుకునేది. వారిలో ఏ ఒక్కరు మరణించినా ఆమె శోకభావాన్ని తట్టుకోలేకపోయేది. మహాత్మాగాంధీ మరణించినప్పుడు హెచ్. ఎస్. ఎన్. సోలక్, హెచ్. ఎన్. బ్రైల్స్‌ఫర్డ్, లార్డ్ పెథిక్ లారెన్సులు సంయుక్త సంపాదకులుగా ఒక స్మృతిగ్రంథం ప్రకటించారు. దానికి సరోజినీదేవి పీఠిక రాసింది.

"దీపాల పండుగ దగ్గరలో పడింది. కాని యీయేడు దీపావళినాడు మా దేశం గ్రామాల్లో మట్టిప్రమిదలూ వెలగవు, నగరాల్లో విద్యుద్దీపాలూ వెలగవు. మహాత్ముని మరణ సంఘటన ఇంకా మా జాతిప్రజల గుండెల్లో కలతపెడుతూనే వుంది. శతాబ్దాల దాస్యాంధకారాన్ని తొలగించి ప్రజలకు స్వాతంత్ర్యం, జాతికి జెండా ప్రసాదించిన మహనీయుని మరణం భరింపరాని బాధగా మనసు లోతులు తొలుస్తూనే వుంది." సరోజినీదేవి మరణానికి 13 నెలలు ముందుగా గాంధీజీ మరణించాడు. 1948 జనవరి 30 వ తేదీన ఆ మహనీయుడు 'హేరామ్' అంటూ ఎప్పుడు నేలకొరిగాడో, నిజానికి ఆనాడే సరోజినీదేవిలో లోపల ఏదో మరణించింది. ఆనాడే ఆమెలో అంధకారం అలముకుంది. మూడున్నర దశాబ్దాలకాలం సరోజినీదేవికి కరదీపికగా దారిచూపిన జ్యోతి ఆరిపోయింది. ఆ పీఠికలో ఆమె చెప్పుకున్నట్లు అనేక సంవత్సరాలుగా ఆ జగద్గురువుతో ఆమె సన్నిహిత సాహచర్యం నెరపింది. భారతజాతి విముక్తికి ఆయన చేసిన జైత్రయాత్రల్లో "జాతీయజెండా చేతిలో ధరించి చేసిన జైలుయాత్రల్లో" నూతను ప్రేమించిన వారి పాపాల పరిహారంకోసమో, తనను ద్వేషించినవారికోసమో ఆయన చేసిన నిరాహారదీక్షా శిబిరాల నీడల్లోనూ, ఆమె ఆయన వెంటే వుండి కంట్లో ఒత్తిలా మెలగింది. అంత సన్నిహితంగా అడుగుజాడల్లో నడిచిన వ్యక్తి కనుకనే ఆమెకు ఆయనపట్ల అంతభక్తి, అంత విశ్వాసం. అందుకే అంత ఉద్రేకంతో ఆమె రాసింది. "అపూర్వమైన అసామాన్యమైన ఆ మహనీయుని వ్యక్తి

త్వాన్ని, మనోవిలసనాన్ని, ఆత్మలక్షణాన్ని విశ్లేషించి చూడాలన్నా, వ్యాఖ్యానించుకోవాలన్నా, శరీరాన్ని కోసిచూసే ప్రయత్నం లాగే వుంటుంది. ఆయన మాకు నాయకుడూ, స్నేహితుడూ, పితృతుల్యుడే కాదు అక్షరాలా ఆయన మానవ జీవితంలో, జీవలక్షణంలో విడదీయరాని ఒక భాగం.''

మరుసటి సంవత్సరం సరోజినీదేవి కూడా కన్నుమూసింది. గురుదేవుడైన ఆ మహాత్ముని ఆత్మలోనే యీ భారత కోకిల శాశ్వతంగా తన మృదు మధుర సంగీతనాదాల పేటికను పదిలంగా భద్రపరచుకుంది.

## స్వాతంత్ర్య రణరంగంలో...

1929 లో సరోజినీదేవి అమెరికా నుండి తిరిగి వచ్చిన తర్వాత దేశంలో తాడోపేడో తేల్చుకోవలసిన తీవ్రమైన రాజకీయ పరిస్థితుల్లో పూర్తిగా మునిగి పోయింది. ఎక్కడ చూసినా హర్తాళ్ళు, ఏరోజు చూసినా అరెస్టులూ, జైలు శిక్షలూ.

1930 మార్చి 12 వ తేదీన మహాత్ముడు ఉప్పు సత్యాగ్రహోద్యమంలో దండియాత్ర ప్రారంభించాడు. ఆయన ఏరికోరిన 75 మంది అనుచరులతో పాద యాత్ర ప్రారంభమైంది. పాదయాత్రలో స్త్రీ లెవరూ పాల్గొనగూడదని ఆయన ఆజ్ఞ. పాదవారి బృందం రోజుకు సుమారు 12 మైళ్ళ వంతున యాత్ర సాగిస్తు న్నారు. సముద్రప్రాంతం దగ్గర పడుతున్న కొద్దీ పాదచారుల సంఖ్య వడివడిగా పెరిగి పోతున్నది. 200 మైళ్ళ దూరానగల దండిగ్రామం ఏప్రియల్ 5 వ తేదీన చేరుకున్నారు—24 రోజుల పాదయాత్ర. దండిగ్రామంలో వేచివుంది సరోజినీదేవి మహాత్మునికి స్వాగతం పలకడానికి. ప్రార్థన కార్యక్రమం తర్వాత

గాంధీజీ సముద్రతీరాన గుప్పెడు ఉప్పు తీసుకుని ఉప్పుచట్టాన్ని బహిరంగంగా ధిక్కరించాడు. అప్పటికే ఆ అహింసా యుద్ధపు వలంటీర్ల సైన్యంలోకి వేల సంఖ్యలో స్త్రీలు వచ్చి చేరిపోయారు. వారందరూ సముద్రజలం యింటికి తీసుకు పోవడానికి కుండలతో సహా వచ్చారు. వృధాగా పడివున్న ఉప్పుమూట కట్టుకుని పోవడానికి ఉద్యుక్తులై వచ్చారు. ఇంతకు ముందెన్నడూ యిల్లుకదలని ఆ స్త్రీ జనం ధైర్యసాహసాలను మహాత్ముడు వేనోళ్ళ ప్రశంసించాడు. వారు నిర్వ హించిన పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖిస్తారని ఆయన ఆశీర్వదించాడు. అప్పటితో ఆయన ప్రారంభించిన యీ మహోద్యమంలో చేరే అవకాశం భారత మహిళా లోకానికి కూడా దక్కింది.

గాంధీజీ గుప్పెడు ఉప్పు పట్టుకొని చేయెత్తగానే "స్వరాజ్యదాతకు జేజేలు" అంటూ సరోజినీదేవి నినాదం యిచ్చింది. అందరూ చేయెత్తి జైకొట్టారు. వేలాది యువతీమణులు సముద్రపు నీటిలోకి దిగారు కుండలతో, గుండెలతో ముంచుకో డానికి. పోలీసులు వెంటనే అరెస్టులు ప్రారంభించారు. దేశమంతటా గగ్గోలు పుట్టింది. గాంధీజీ ప్రవచించిన అహింసా సిద్ధాంతానికి ఎవరూ భంగకరంగా ప్రవర్తించలేదు. గాంధీజీ అరెస్టు అయి జైల్లో వున్నాడు. ఆయన ముఖంమీద సంతృప్తిరేఖలు తారాడుతున్నాయి. సరోజినీదేవి జైలుకు వెళ్ళి ఆయనను చూసింది. అబ్బాస్ త్యాబ్‌జీ అరెస్టు అయిం తరువాత ఆమెను ఉద్యమానికి నాయకత్వం వహించమని గాంధీజీ ఆదేశించాడు. హుటాహుటిగా సరోజినీదేవి ధార్శనకు వెళ్ళి బ్రహ్మాండమైన అహింసా సేనకు నాయకత్వం చేపట్టాలి. ఆమెనూ అనుచరులనూ ధార్శనలోనే ఆపివేశారు. మండిపోతున్న ఎర్రని ఎండలో వారందరూ రోడ్డుమీదే కూచున్నారు. దాహం వేస్తున్నది. నీళ్ళబండ్లు వస్తూన్నా యని ఆశపెట్టి పోలీసులు వారిని ఆపివేశారు. కాని తీరాబండ్లు వచ్చిం తర్వాత వారిని తాగనిస్తేగదా పోలీసులు. వద్దన్నారు. ఒక అమెరికన్ పౌరుడు ఆ సంద ర్భాన్ని వర్ణిస్తూ యిలా రాశాడు. "దుమ్ములేస్తున్న రోడ్డు....ఒకస్త్రీచుట్టూ గుంపుగా చేరి రోడ్డునిండేట్లు జాతీయవాదులందరూ కూచున్నారు. ఆమె పడక కుర్చీలో కూచుని ఉత్తరాలు రాసుకుంటూ, కదుమవడుకుతూ కాలక్షేపం చేస్తోంది. వారి కెదురుగా దాదాపు అంతమంది పోలీసులు నుంచున్నారు చేతుల్లో లాఠీలు, తుపా కులు పట్టుకుని. పోలీసులు మర్యాదగానే మాట్లాడుతున్నారు కాని ధార్శన ఉప్పు

కొటార్ల మీదికి దండెత్తిపోతున్న జాతీయవాదుల్ని, అక్కడినుంచి ఒక్క అడుగైనా ముందుకు వేయనీయకూడదనే దృఢ నిశ్చయంతో ఉన్నారు." [1]

"శాంతిలేదు" (ఐ ఫౌండ్ నో పీస్) అనే తన గ్రంథంలో మిస్టర్ వెబ్ మిల్లర్ యీ చరిత్రాత్మక మహోద్యమాన్ని పూసగ్రుచ్చినట్లు వివరించాడు. అంతు లేని ఆనందంతో ఆయన దాన్ని మెచ్చుకున్నాడు. "ప్రసిద్ధ భారతీయ కవయిత్రి సరోజినీనాయుడు ధార్శన దగ్గరవున్న ఉప్పు కొటార్ల మీద జరుగుతున్న అహింసాత్మక దండయాత్రకు నాయకత్వం వహించింది. అక్కడికి దగ్గరలోవున్న రైలు స్టేషను డుంగ్రి. అది చాలా మారుమూల ప్రాంతం. కావలసిన తిండీ, నీళ్ళూ కూడా వెంటబెట్టుకు పోవలసిందే. అక్కడ ఏం దొరకదు. డుంగ్రినుండి ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయమని శ్రీమతి నాయుడుకు టెలిగ్రాం పంపు. లేకుంటే మైళ్ళు మైళ్ళు నడవవలసి వస్తుంది. కావలసినంత నీరు మాత్రం సీసాల్లో పట్టుకు వెళ్లు. ఎందుకంటే అక్కడ ఊళ్ళల్లో దొరికే నీళ్ళు తెల్లవాళ్ళకు పడవు. జబ్బులు వస్తాయి."

"దండయాత్ర ప్రారంభించే ముందు శ్రీమతి నాయుడు పార్థన చేసింది ఆమె వారిని ఉద్బోధిస్తూ ఉపన్యసించింది." గాంధీజీ దేహమే జైల్లోవుంది. ఆత్మ మీ దగ్గిరే వుంది. ఇప్పుడు మాతృదేశ ప్రతిష్ఠ మీ చేతుల్లో వుంది. ఏ పరిస్థితుల్లోనైనా సరే మీరెవరూ హింసాచర్యలకు పూనుకోకూడదు. మిమ్మల్ని కొడతారు (పోలీసులు), కాని మీరు మాత్రం ఎదురు దెబ్బ కొట్టకూడదు. దెబ్బలు తప్పించుకోడానికి చేతులు కూడా ఎత్తకూడదు." ఆమె మాటలు విన్న ప్రజాసమూహాల్లు భూనభోంతరాళాలు దద్దరిల్లేటట్లు హర్షధ్వనాలు చేశాయి."

మిస్టర్ మిల్లర్ యింకా యిలా రాశాడు. "నేను శ్రీమతి నాయుణ్ణి చూడడానికి వెళ్ళాను. అప్పుడామె వలంటీరు దళనాయకులకు ఆదేశాలు యిస్తున్నది, ప్రజాసమూహాలు పోలీసులమీద పడి చేయి చేసుకోకుండా గుంపుల్ని వారించమని. మేమిద్దరం మాట్లాడుకుంటున్న సమయంలోనే ఒక బ్రిటిష్ అధికారి ఆమె దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకుని "సరోజినీనాయుడు, నీవు అరెస్టు అయినావు" అన్నాడు. ఆమె నవ్వుతూ అతని చేతిని లాగి దులిపికొట్టి "వస్తాను కాని నన్ను తాకకు"

---

1. మహాత్ముని ఉద్యమంలో మహిళామణులు (వుమెన్ బిహైండ్ మహాత్మా) పేజీ 158.

అన్నది. ఆ బ్రిటిష్ అధికారి వెంట ఆమె వెళ్తున్నప్పుడు కోప ప్రదర్శనవంటి ఆవేశోత్సాహంతో అక్కడి ప్రజానీకం ఒక్కుమ్మడిగా హర్షధ్వనాలు చేసింది. ఆమెను అక్కడి విశాలమైదానం గుండా ఇనుపముళ్ల కంచెతో నిర్మించిన ఒక ఆవరణలోకి తీసుకెళ్ళి అక్కడే బంధించారు. తరువాత ఆమెకు జైలుశిక్ష విధించారు. మణిలాల్ గాంధీని కూడా అరెస్టు చేశారు, "తొందరగా తెములవయ్యా, నీటూత్‌బ్రష్‌లన్నీ కట్టగట్టినడువు, త్వరగా వ్యాన్ దగ్గిరికి" అంటూ శ్రీమతి నాయుడు మణిలాల్‌గాంధీని హాస్యోక్తులతో త్వరపెట్టింది.

దేశమంతటా అరెస్టుల పరంపర. ఒక మహానదికిలాగా భారతదేశానికి అన్ని ప్రాంతాల్లో అరెస్టుల వరదొచ్చినట్లుంది. ఈ పరిస్థితుల్లో 1931 ఫిబ్రవరి 6 వ తేదిన పండిట్ మోతీలాల్ నెహ్రూ మరణించాడు. సరోజినీ దేవికి యిది చాలా సంతాపకర సంఘటన. తరువాత ఆ సంవత్సర ప్రారంభంలోనే దేశపరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. "క్రైస్తవ వైస్రాయి" అని పేరు పొందిన లార్డ్ ఇర్విన్‌కి మహాత్మాగాంధీకి మధ్య స్నేహం కలిసింది. ఆగస్టులో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి గాంధీజీతో సరోజినీదేవికూడా లండన్ వెళ్ళింది. అక్కడ ఆమె మహాత్ముడికి కుడిభుజంగా వుండడమేకాక స్త్రీల హక్కులకోసం గట్టిగా కృషిచేసింది. సమావేశం ముగిసిం తర్వాత సరోజినీదేవి యూరప్‌లో పర్యటించి శ్రీనివాసశాస్త్రితో కలిసి కేప్‌టౌన్ కూడా వెళ్ళింది. రెండవ రౌండ్ టేబిల్ సమావేశం విఫలమై నాయకులు దేశానికి తిరిగి వచ్చిం తర్వాత దేశంలో మళ్ళీ మూక ఉమ్మడి అరెస్టుల వెల్లువ ప్రారంభమైంది. సరోజినీదేవిక్కూడా జైలు తప్పలేదు. మీరాబెన్ ఉన్నజైల్లోనే సరోజినీదేవిని కూడా పెట్టారు. కవయిత్రి రాకముందే జైలుకు ఆమెకు కావలసిన అనేక సౌకర్యాలు వచ్చాయని మీరాబెన్ రాసింది. "ఒక పరుపూ, బ్రష్షూ, దువ్వెనావున్న డ్రెస్సింగ్‌టేబిలూ, ముఖం కడుక్కునే వాష్‌స్టాండూ, స్నానాల తొట్టీవగైరా.... యింకా కర్టెన్లుకూడా. అవన్నీ చూసి జైలు అధికారిణి మండిపడింది. మర్నాడు వచ్చింది సరోజినీదేవి నడుస్తున్న జీవశక్తిలా దారిపొడుగునా హాస్యపుజల్లులు చిలకరించుకుంటూ. దేశంలో రాజకీయరంగంలో హడావిడి చాలా ఎక్కువగా వుంది. జరుగుతున్న అనేక సంఘటనల్లో, కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆమె చాలా అలసిపోయింది. అయినా వయస్సువల్లగానీ, అనుభవిస్తున్న కష్టాలు, బాధలవల్లగానీ ఆమె గుండె ధైర్యం ఏ మాత్రం చెక్కుచెదరలేదు. బైట జరుగుతున్న సంఘటనలను గురించి

పూర్తి వార్తలు ఆమె ద్వారా నేను తెలుసుకున్నాను. నాకు తెలియని వార్తలు ఎన్నో ఉన్నాయి. జైల్లో ఉన్నవాళ్ళకు చదువుకునేందుకు టైమ్స్ ఆఫ్ ఇండియా వారపత్రిక మాత్రమే యిస్తారు. అందులో కూడా అప్పుడప్పుడు కొన్ని వార్తలు కత్తిరించి యిస్తారు. మేమిద్దరం కలిసివున్న మూడు నాలుగు రోజులు సరిపోనే లేదు బయట జరుగుతున్న వార్తలన్నీ తెలుసుకోడానికి, అనేక సంఘటనలు, కథలూ ఆమె నోటినుండి విని తెలుసుకోడానికి.'' 2

ఒకసారి దెబ్బతింటూ, మరొకసారి దెబ్బకొడుతూ, సమయానుకూలంగా ఆరంభిస్తూ, ఆపుచేస్తూ బ్రిటిష్‌వారిమీద జరుగుతున్న స్వాతంత్ర్యయుద్ధం ఆ విధంగా కొన్ని సంవత్సరాల దాకా జరుగుతూనే వుంది. 1942 లో కాంగ్రెసు వారు 'క్విట్ ఇండియా' తీర్మానంచేసిన ఫలితంగా మళ్ళీ దేశంలో మూక ఉమ్మడిగా అరెస్టులు ప్రారంభమయ్యాయి. మహాత్మాగాంధీ, యింకా అనేకమంది జాతీయనాయకులతోపాటు సరోజినీదేవిని ఆగాఖాన్ భవనం జైల్లో పెటార్టు.

ఆగాఖాన్ భవనం బ్రహ్మాండమైన రాజప్రాసాదం. అందులో రాజ వైభవం ఉట్టిపడుతూనే ఉంటుంది. కాని తలుపులు మూసి ఉంచిన మహాప్రాసాదాలలో ఉండే ఏకాంత భయంకర పరిస్థితికూడా తొంగి చూస్తూనే ఉంటుంది. ఈ విశాల భవనంలోనే గాంధీజీ, ఆయన భార్యా, సుశీలానాయర్, మహదేవ దేశాయి, ప్యారీలాల్, మీరాబెన్, సరోజినీనాయుడు ప్రభృతులందరినీ ఉంచారు. గాంధీజీ దంపతులు 70 ఏండ్లు దాటినవారు.

1942 లో 'క్విట్ ఇండియా' తీర్మానం జరిగిం తర్వాత వైస్రాయిని కలవడానికి మీరాబెన్‌ను పంపించారు. కాని ఆమెకు ప్రవేశం దొరకలేదు. ఆగస్టు 8 వ తేదీన గాంధీజీ బొంబాయిలో బ్రహ్మాండమైన సభలో ప్రసంగించి బిర్లా హౌస్‌కు తిరిగి వచ్చారు. ఆయనతోపాటు తరువాత అరెస్టు అయిన సహచరులు కూడా ఆ యింట్లోనే వుంటుండేవారు. ఒకరోజు అర్ధరాత్రి మహదేవ దేశాయిని ఫోన్ దగ్గరకు పిలిచి గాంధీజీని అరెస్టుచేయబోతున్నామని ప్రభుత్వం వారు కబురు చేశారు. ఆగస్టు 9 వ తేదీ తెలతెలవారే సమయంలో పోలీసుబృందం ఆ యింటి దగ్గిరకు వచ్చింది. గాంధీజీని, ఆయన సహచర బృందంలోని నాయ

2. ఆత్మయానం (దిస్పిరిట్స్ పిల్గ్రిమేజ్)—మీరాబెన్ రచన.... పే. 161

కుల్ని అరెస్టుచేసి తీసుకువెళ్ళారు. వెళ్లబోయేముందు కాస్సేపు ప్రార్థన చేసుకుని వారు పోలీసులతో వెళ్ళారు. గాంధీజీ, సరోజినీదేవి, ప్యారీలాల్ మహదేవదేశాయ్, మీరాబెన్లను మాత్రమే పోలీసులు అరెస్టుచేసి తీసుకువెళ్ళారు మొదట్లో. తరువాత కస్తూర్బాయి తన భర్త చేస్తున్న పనిలో తానుకూడా పాల్గొనవలసిందే అని పట్టు పట్టిన ఫలితంగా ఆమెనూ, సుశీలానాయర్‌ను కూడా అరెస్టుచేసి ఆ జైల్లోనే వుంచారు.

శిక్షపడినవారు ప్రయాణం చేస్తున్న రైల్లోనే కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యుల్ని కూడా తీసుకుపోతున్నారు. వీరికి తమ గమ్యస్థానం కూడా తెలియదు. ఎక్కడో ఏదో ఒక జైలుకే వారి ప్రయాణం కూడా.

మహదేవదేశాయిని జైల్లో పెట్టిన తర్వాత దాదాపు వెంటనే గుండె జబ్బుతో ఆయన మరణించాడు. నాయకులందరూ దుఃఖసముద్రంలో మునిగి పోయారు. సరోజినీదేవిది దుఃఖానికి బాధకు లొంగిపోయేతత్వంకాదు. గుండె నిబ్బరానికి ఆమె పెట్టింది పేరు. ఎదుటి వారిలో కూడా క్షణంలో విశ్వాసం పురికొల్పే నేర్పున్న వ్యక్తి. ఆమె అప్పుడక్కడ లేకుండా వున్నట్లయితే ఆ దుఃఖ సముద్రంలోనుంచి లేవలేక నాయకులందరూ నానా అవస్థలు పడేవారే. ఆమెను కూడా ఆ మహారాజభవన ఏకాంత భీకరత్వం అప్పుడప్పుడు బాధిస్తూనే వుండేది. కాని వెంటనే మళ్ళీ మనసు కుదుర్చుకునేది. ధైర్యం వహించేది. నిజానికి అక్కడ చేరిన నాయక బృందానికి ఆమె జీవం అంటే అతిశయోక్తికాదు. మీరాబెన్ యిలా రాసింది, "ఆగాఖాన్ భవనంలో బంధించబడిన నాయకుల్లో, చివరకు బాపుకూడా సరోజినీదేవి స్వభావంలోని వైశిష్ట్యాన్ని పూర్తిగా యింతవరకు గుర్తించలేదు. ఆమె వాక్కులో అనుక్షణం హాస్యోక్తి చిందులు త్రొక్కుతూనే వుంటుంది. తనలోని మాతృస్వభావంచేత తల్లిలాగా అందరిమీద ప్రేమాభిమానపు జల్లులు చిలకరిస్తుంది."

ఆరునెలల తర్వాత గాంధీజీ నిరాహారదీక్ష పూనాలని నిశ్చయించాడు. మొదట్లో ప్రభుత్వం యీ వార్తప్రజలకు తెలియకుండా రహస్యంగా వుంచింది. ఈ అగ్నిపరీక్షలో గాంధీజీ ఏమైపోతాడోనని జైల్లోవున్న స్వాతంత్ర్యయోధులు ఆందోళనపడ్డారు. నాలుగోరోజున గాంధీజీకి కండ్లు తిరగడం, ఒళ్ళు త్రిప్పడం ప్రారంభమైంది. బెంగాలునుండి డాక్టర్ బి. సి. రాయ్ కోసం కబురు పెట్టారు. అప్పటికే ఆరుగురు డాక్టర్ల సంతకాలతో గాంధీజీ ఆరోగ్యపరిస్థితిని గురించి

నివేదికలు విడుదలచేయడం ప్రారంభించారు. ఫిబ్రవరి 21 వ తేదీన ఆయన ఆరోగ్యం మరీ క్షీణించింది. కాని పరిస్థితి మళ్ళీ కుదుటపడింది. నిరాహారదీక్ష విరమించేరోజుకు సరోజినీదేవిలోని ఉత్సాహం కూడా చల్లబడిపోయింది. మళ్ళీ తెలివి తెచ్చుకుని నారింజరసం పుచ్చుకుని నిరాహారదీక్ష విరమిస్తున్నవేళకు వంగపండు రంగుచీరె ధరించి ఆమెకూడా ఉల్లాసంగా అక్కడికి వచ్చి డాక్టర్లతో హాస్యోక్తులాడింది. కాని అప్పటికే మృత్యుముఖంలో వున్నట్లు కనిపిస్తున్న కస్తూర్బాపరిస్థితి అక్కడ చేరిన వారందరికీ లోలోపల ఆందోళనకరంగానే వుంది.

తరువాత సరోజినీదేవి మలేరియాతో బాగా జబ్బున పడింది. 1943 మార్చి 21 వ తేదీన జైలునుండి ఆమెను స్ట్రెచర్ మీద ఆస్పత్రికి తీసుకువెళ్ళారు. మీరాబెన్ యిలా రాసింది. "ఆమె లేకపోతే ఎంతో లోటుగా వుంది. ముఖ్యంగా నాకు." సంవత్సరం తర్వాత 1944 ఫిబ్రవరిలో కస్తూర్బా భర్త చేతుల్లో జైల్లోనే మరణించింది. గాంధీజీని మే 6 వ తేదీన ఆరోగ్యకారణాలమీద జైలు నుండి విడుదల చేశారు. స్వాతంత్ర్యపోరాటం క్రమంగా చివరిదశకు చేరుకుంటున్నది. స్వరాజ్యం కనుచూపు మేరలో వుంది. కాని దానితోపాటే రక్తపాతపు మరకలతో మతకలహాల మహమ్మారికూడా రహస్యంగా ప్రయాణం చేసి వస్తున్నదని ఎవరికి తెలుసు ?

ఇంక కొన్ని నెలలకు స్వరాజ్యం వస్తుందనగా దేశంలో పరిస్థితి ఆశాజనకంగానే కనిపించింది. అంతకుముందు గడిచిన గడ్డు కాలంకూడా యీ శుభ పరిణామాన్ని ఊహించి, దీనికి దోహదం చేసినట్టిదే.

# హాస్య – అలంకార – స్వేచ్ఛాప్రియ

1917 తరువాత సరోజినీనాయుడు కవిత్వంరాయడం దాదాపుగా మానుకున్నది. అయినా ఆమె కవితల్ని ప్రజలు మరచిపోలేదు, దేశంలో అన్నిప్రాంతాల్లోనూ ఆమె కావ్యగానాలు చేసింది. అప్పటికే విలియంహానిమన్ ప్రకటించిన సరోజినీదేవి మూడు కవితా సంపుటాల ప్రతులు మార్కెట్‌లో లభ్యంకావడం లేదు. అందువల్ల ఆమె రాసిన సర్వకవితా సంకలనం ప్రకటిస్తే ఆ గ్రంథానికి భారతదేశంలోనూ, పశ్చిమదేశాల్లోనూ మంచి గిరాకీ వుంటుందనే ఊహ కలిగింది. 1937 లో యీ పని జరిగింది. అమెరికాలోని డాడ్, మీడ్ కంపెనీ వారు సరోజినీదేవి సర్వకవితా సంకలనం "సెప్టర్డ్‌ఫ్లూట్" (మురళీదండం) అనే పేరుతో ప్రకటించారు. దానికి జోసెఫ్ ఆస్లెండర్ చేత పీఠిక రాయించారు. ఈ కావ్యం ప్రతిని మిత్రుడు అమర్‌నాథ్ ఝాకు బహూకరించిన సమయంలో సరోజినీదేవి తన లేఖల్లో కొన్ని భాగాలు చదివి ఆయనకు వినిపించింది. "నా జీవితమో, మానసిక స్వభావమో నాకు ప్రసాదించిన అన్ని లక్షణాల్లోనూ హాయిగా నవ్వేలక్షణం అన్నిటికంటే మిన్నగా నేను భావిస్తాను." "అవును. నన్నుచూసి నేనే నవ్వుకుంటాను కూడా కదూ?"[1] అని అడిగింది. ఈ సంకలనం గూడా త్వరలోనే అమ్ముడు పోయింది. అందువల్ల అదే శీర్షికతో—"సెప్టర్డ్ ఫ్లూట్; సాంగ్స్ ఆఫ్ ఇండియా" (మురళీదండం భారతీయగీతాలు)—అనే పేరుతో మరో సంకలనం ప్రకటించారు. అమెరికాలో ప్రకటించిన సంకలనంలో లాగా దీనిలోకూడా హానిమన్ ప్రకటించిన మూడు సంకలనాల్లోని కవితలు చేర్చారు. "జీవించి ఉన్న యీ మా మహాకవయిత్రి" సర్వకావ్య సంకలనం

1. సరోజినీనాయుడు. అమర్‌నాథ్ ఝా రచన పే, 15.

మొదటిసారిగా మన దేశంలో ప్రకటించి ప్రజలకు అందించగలిగినందుకు తమకు చాలా సంతోషంగా వుందని ప్రకాశకులు సగర్వంగా ప్రకటించుకున్నారు.

సరోజినీదేవి జీవితంలో ప్రధానంగా చెప్పుకోదగిన విశేషం ఆమెలోని హాస్యప్రియత్వం, చతురసంభాషణాకౌశలం. ఆమె ఎక్కడ వుంటే అక్కడ నవ్వులు పువ్వుల వానలై కురుస్తుండేవి. ముఖ్యంగా ఎక్కడికి వెళ్ళినా నలుగురినీ కలుసు కోడానికి ఆమె ఏర్పాటుచేసే సాయంపరిచయ సమావేశాల్లో. ఆమె స్నేహితుల యిండ్లల్లో బసచేస్తూ అక్కడే యీ సమావేశాలు నడిపేది. ఆమె అభిమాన, మిత్ర కోటి అసంఖ్యాకంగా వచ్చి ఆమెచుట్టూ మూగేవారు. ఆ ఇండ్లవారుకూడా అందరినీ, ఓపికతో సహనంతో స్వాగతంచెప్పి మర్యాదచేసేవారు. వారి మధ్యలో కూచుని నవ్వుతూ, నవ్విస్తూ తనను గురించీ, తా నెరిగిన మహాపురుషుల, మహిళామణులను గురించిన కథలు, సంఘటనలు చెప్తూ వారితో సరోజినీదేవి హాయిగా కాలక్షేపం చేస్తుండేది.

మిసెస్ మార్గరెట్, ఇ కజిన్స్ యిలా రాసింది. "నాకు బాగా గుర్తు. ఆ రోజు బాగా ఆలోచించి ఏరిఏరి ఆ రంగుచీర కట్టుకు వచ్చానని చెప్పింది. ఎందుకంటే, ముదురునీలపు ఆకాశపు ఒంపుల్లో ఒదిగే వెండి వెన్నెల వెలుగురేఖల తళతళల ధావళ్యంతో కనులు జిగేలు మనిపించాలని—సాంఘిక న్యాయ, సమానత్వ వాంఛలను ప్రకోపింపజేస్తున్న యీ మహిళామణి, యీ కవయిత్రి, యీ నాటక ప్రయోక్త" 2. ఒకసారి అమెరికాలో 'సుడిగాలివేగంతో' జేసిన రైలు ప్రయాణాల అనుభూతులను గురించి సరోజినీదేవి మహాత్మాగాంధీకి లేఖ రాస్తూ "మధ్య–పశ్చిమ రాష్ట్రాలలోని వజ్రధావళ్యపు వన్నెలు మెరిసే మంచు ముద్దల ప్రాంతాలనుండి దక్షిణాన నీలమణికాంతులు నింగికి చిమ్ముతూ వే వెలుంగుల దొర నిర్మించిన వెలుగులోకాలదాకా ప్రయాణం చేశాను. ఉష్ణమండల సంబంధియైన యీ నా శరీరంలోని ఎముకలు చలి కొరికిన గాయాలు నయమై విముక్తి పొందినంత ఆనందంతో కేరింతలాడుతున్నాయి. నామాట నమ్మండి.

---

2. ఆసియాలో మహిళాచైతన్య వికాసోద్యమం (ది ఆవేకెనింగ్ ఆఫ్ ఏషియన్ ఉమెన్‌హుడ్) మార్గరెట్ ఇ. కజిన్స్ రచన 120, 121 పే.

మన పురాతన ఋషీశ్వరులుకూడా దేహంలో యింత ఆనందంతో గాయత్రీ మంత్రోచ్చారణ పూర్వకంగా। సూర్యదేవునికి అర్ఘ్యాంజలి సమర్పించి వుండరు"[3].

మరోసారి సరోజినీదేవియొక్క జీవితచరిత్ర రాయడానికి పూనుకుని ఆమెతో కొంతసేపు మాట్లాడడానికి అవకాశం కోరుతూ వచ్చిన ఒక రచయితను గురించి కథ చెప్పింది. అతను రైలుపెట్టె మెట్లమీదనుంచునే ప్రయాణం సాగిస్తున్నాడట. తరువాత స్టేషను రాకముందే, మధ్యలోనే సరోజినీదేవి ఉన్న పెట్టెలోకి ప్రవేశించాడుట.

"ఏం కావాలి బాబూ ?"

"నేను మీ జీవితచరిత్ర" (బయాగ్రఫీ) రాయాలని అనుకుంటూన్నాను..

"నా బయాలజీ (దేహశాస్త్రం) దాన్ని గురించి నే నెవరికీ చెప్పను."

డాక్టర్ బి. సి. రాయ్ గొంతు పెద్దది. ఖంగుమని మ్రోగుతుంది. ఒక సారి సరోజినీదేవి రాయ్‌ని "మెగాఫోన్" అని సంబోధించి మేలమాడింది.

ఒకసారి బొంబాయిలో టాజ్ హోటల్లో సరోజినీదేవి ఉంటున్నగదికి కొంతమంది చిన్నపిల్లలు వెళ్ళారు. నగరంలో చూడదగిన ప్రదేశాలు చూడడానికి బొంబాయికి వచ్చామని చెప్పారు.

"నేనుకూడా చూడదగిన ప్రదేశాన్నేనా ?"

కొందరు అభిమానంతోనూ, కొందరు విసుగ్గానూ, అందరూ ఆమె కథలు చెప్తూనే వుంటారు. ఆమెలోని దయా స్వభావము, ఔదార్యము జ్ఞాపకం లేనివారు బహుకొద్దిమంది ఉంటారేమో,

ఆ విధంగా హాయిగా ఆమెకు కాలం గడించింది. ఒక రంగంనుండి మరో రంగంలోకి దూకుతూ ఆమె కృషి చేసింది. చివరకు దేశానికి స్వరాజ్యం వచ్చిన సంవత్సరం, 1947 మార్చిలో, స్వరాజ్యానికి 6 నెలలు ముందుగా, ఆసియా సంబంధాల మహాసభ (ఏషియన్ రిలేషన్స్ కాన్ఫరెన్సు) జరిగింది. దానికి అధ్యక్షత వహించమని ఆమెను కోరారు. అధ్యక్ష హోదాలో ఆమె భారత ప్రతినిధివర్గానికి నాయకత్వం కూడా వహించింది. మార్చి 23 వ తేదీని ఢిల్లీలో పురానాఖిల్లా (పాతకోట) లో మహాసభ ప్రధాన సమావేశం జరిగింది. పెద్ద

---

3. యంగ్ ఇండియా 1929 ఏప్రిల్ 11 వ తేదీ సంచిక.

సంఖ్యలో ప్రతినిధులు హాజరైనారు. వెనుక భాగంలో ఆసియా ఖండాన్ని చూపే ఒక పెద్ద చిత్రపటాన్ని అమర్చి వేదిక నలంకరించారు. అధ్యక్షురాలు సరోజినీ నాయుడు, ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ శ్రీరామ్ అగ్రభాగంలో నడుస్తుండగా ఒక పెద్ద ఊరేగింపు సాగిపోయింది. పండిట్ నెహ్రూ మహాసభకు ప్రారంభోత్సవం చేశాడు. సరోజినీదేవి అధ్యక్షోపన్యాసం చేసింది. ప్రసంగ ప్రారంభంలో అధ్యక్ష స్థానానికి ఒక "స్త్రీని" ఎందుకు ఎన్నుకున్నారని ఆమె ఆశ్చర్యం ప్రకటించింది. ఆ మహాసభలో ఆమె అప్పుడు చేసిన ప్రసంగం తన జీవిత కాలంలో చేసిన ప్రసంగాలన్నింటిలో ఉత్తమోత్తమమైనదీ, ఉద్వేగపూరితమైనదీ. మండిపోతున్న జ్వాలలా అది సభకుల చెవుల్లో నిండి గుండెల్లోంచి దూసుకుపోయింది.

'మిత్రులారా, ఆసియావాస సోదర సోదరీమణులారా,

"ఈనాడు యింతటి గౌరవస్థానం కేవలం ఒకస్త్రీకి ఎందుకు యిచ్చారా అని మీరు ఆశ్చర్యపడుతూ వుండవచ్చు. దీనికి జవాబు వెదకడం సులభమే. భారత దేశం స్త్రీ జాతిని ఎప్పుడూ గౌరవిస్తూనే వుంది. ఆసియా ఖండంలోని వివిధజాతి ప్రతినిధులు పాల్గొంటున్న ఈ మహాసభను చూస్తుంటే నా శరీరం గగుర్పొడుస్తున్నది. ఆనందంలో మునిగి ఏం మాట్లాడాలో తెలియడంలేదు. దాదాపు మూగదాన్ని అయిపోయాను. ఎంతో ఆవేశపడితేగాని స్త్రీలకు యిటువంటి పరిస్థితిరాదు. ఇరుకైన పర్వతాల కనుమలగుండా ప్రాకుతూ, సముద్రతరంగాలమీద ఊగుతూ, తూగుతూ, వెలుతుర్లో చీకట్లో వినువీధి మబ్బుల మధ్యలో ఎగురుతూ రకరకాల ప్రయాణ మార్గాలలో యీ సభకు వచ్చిన మీలో ఎందరు, యీనాడు మనం ఆసియాఖండ మధ్యభాగంలోనే కాదు, భారతదేశపు హృదయపీఠంమీద సమావేశమైనామని గుర్తించగలిగారో నాకు తెలియదు. ఏ నాటికి చెక్కుచెదరని విధంగా ఆసియాఖండసమైక్యతా ప్రతిజ్ఞ తీసుకోడానికి మనం యిక్కడ చేరాము. ఈనాడు శిథిలావస్థలోఉన్న ప్రపంచంలో తాండవిస్తున్న దుఃఖం, బాధ, పీడన, హైన్యం, దారిద్ర్యం, అజ్ఞానం, వినాశం, మృత్యువు—వీటినుండి విముక్తి సాధించడానికే సమైక్యతారథంమీద ప్రయాణం సాగించదలచుకున్నాం.

ఏ లక్ష్యసాధనకోసం ఆసియాఖండం కంకణం కట్టుకున్నది? ఆసియాలో జరిగిన అనేక ఆనాగరిక ఘోరకృత్యాలను గురించి మనం చరిత్రలో చదివాం. వాటి మంచి చెడు అంతా మన చరిత్రను ఎవరు రాశారు అనేదానిమీద ఆధారపడి వుంటుంది. కాని ఒకటి మాత్రం నిజం. మన ఖండ లక్షణమని సాధి

కారంగా చెప్పదగిందదే. ఆసియాలోని ప్రతిజాతినీ యీ ఏకైక సమానాశయమైన శాంతిస్థాపన కృషిలో పాలుపంచుకోమని పిలిస్తున్నదాలక్షణమే. యుద్ధాలు లేక పోవడమే శాంతి అనే వ్యతిరేకార్థంలోకాదు, శాంతి అంటే యుద్ధంలో ఓడిన తర్వాత సాధించుకునేదీకాదు. శాంతి అంటే పిరికిపందల లక్షణంకాదు, మరణ శాంతికూడా కాదు. శక్తిసామర్థ్యాలతోకూడి చైతన్యవంతమూ, సృజనాత్మకమూ అయిన మానవత్వంలో వికసించే శాంతి....

ఆసియాఖండం పునరుజ్జీవనం పొంది ఏం చెయ్యబోతుంది ? సాయుధ బలాలతో యితర దేశాలను జయించి లోబరుచుకుంటుందా ? వాటిని ఆక్రమించుకుని అక్కడి ప్రజల్ని దోపిడిచేస్తుందా ? లేక పురాతన ఆదర్శాల ప్రకారం కొత్త రకం ఆయుధాలను తయారుచేసుకుని, ఆయుధాగారలక్షణాలను పూర్తిగా మార్చేసి శాంతిసైనికులతో మానవతా ప్రేమభావ లక్ష్యాలను అందుకుంటుందా? మా ప్రియతమ మహానాయకుడు మహాత్మాగాంధీ కోపతాపాలవల్లా, అసూయా ద్వేషాలవల్లా, సంఘర్షణలూ, సమరాలవల్లా ప్రపంచ విముక్తి సాధ్యంకాదనీ, దయ, ప్రేమ, క్షమ మొదలగు వాటివల్లనే యీ మహత్తరకార్యం సాధ్యమనీ మాకు నేర్పాడు. ఇదేమీ సరిక్రొత్త సందేశం కాదు. ఇది ఆసియా ఖండానికి సుపరిచితమైందే. కాని భారతీయుల అనుభవాలు, సాహసాలు, బాధలూ, ఆశలూ, ఆశయాలతో జోడించిన ఫలితంగా దీనికి సరికొత్తరూపం వచ్చింది. అందుకే భారతదేశం ఆహ్వానిస్తున్నది. "ఆసియావాసులైన సహోదరులందరినీ ప్రపంచానికే ఆశాజ్యోతి అయిన యీ నూతన సందేశాన్ని స్వీకరించమనీ, అర్థం చేసుకోమనీ."

దేశానికి స్వరాజ్యం వచ్చిన తర్వాత సరోజినీదేవిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి గవర్నరుగా నియమించారు. పదవీప్రమాణ స్వీకారంచేస్తూ ఆమె చేసిన ప్రసంగం వచనంలోనే వుందికాని నిజానికి అది వచనం కాదు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సంగీతరూపకం. "ఓ స్వతంత్రజాతుల మహాప్రపంచమా ! మాకు స్వాతంత్ర్యం వచ్చిన యీ సందర్భంలో భవిష్యత్తులో నీ స్వాతంత్ర్యం కూడా నిలిచి వుండాలని కోరుతున్నాం. మేముచేసింది చరిత్రాత్మక మహాసంగ్రామం, ఎన్నో ఏండ్లపాటు జరిగింది. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది అజ్ఞాత వీరులు, యోధానుయోధులు పాల్గొన్నయుద్ధం, అబలలైన స్త్రీలందరూ సబలలై వీరవనితలై లేచిచేసిన మహాసమరం. యువజనులు అప్రయత్నంగా ఒకమహా

శక్తిగా మారి, త్యాగానికి మారుపేరై లక్ష్యసాధనలో లీనమైపోయిన పోరాటం. యువకులూ, వృద్ధులూ, ధనికులూ, నిరుపేదలూ, అక్షరాస్యులూ, అజ్ఞానులూ పీడితులూ, బహిష్కృతులు, కుష్టువారు, యోగీశ్వరులు - అందరూ కలిసిచేసెన అపూర్వజాతీయ సంగ్రామం.

బాధానుభూతుల పొదుల్లోనుండి యిప్పుడు మేం కొత్తగా మొలకెత్తాం. ప్రపంచజాతుల ప్రజలారా! నా మాతృభూమి పేరుమీద మీ అందరికీ అభినందన లర్పించుకుంటున్నాను. ఈ నా మాతృభూమి నివసించే యింటికి చూడండి, మంచుతో పైకప్పు వేశాం. సముద్రజలాలతో గోడలు కట్టాం. ఎప్పుడూ యీ యింటి తలుపులు తెరిచే వుంటాయి, మీకు స్వాగతం చెప్పడానికి. ఆశ్రయం కావాలా, అభయంకావాలా, మానవప్రేమ, అవగాహన కావాలా, దయచేయండి మాయింటికి, మామీద విశ్వాసంతో, ఆశతో, నమ్మకంతో, యివ్వదగినవన్నీ మావద్దే వున్నాయనే నిశ్చయంతో — రండి దయచేయండి. మాదేశం సాధించిన స్వాతంత్ర్యాన్ని యిదుగో అందరికీ పంచుతున్నాను. ఈ నాదేశం గతంలో ఎన్నడూ చావలేదు. భవిష్యత్తులో చావబోవడంలేదు. నాదేశం చిరంజీవి. ప్రపంచమంతటినీ శాంతి లక్ష్యంవైపు నడిపించేనావ, ఏ నాటికీ చెడని చేవ.”

## చివరి రోజుల్లో

ఇప్పుడు లక్నోలో రాజభవన్ ఒక సంస్కృతికేంద్రంగా మారిపోయింది. ఎటుచూచినా హడావిడి, సాంస్కృతిక వినోదకార్యక్రమాలు, అంతర్జాతీయ అతిథి సమావేశాలు. నవజీవం తొణికిసలాడుతున్నది. స్నేహపూర్ణమైన ఆతిథ్యమర్యాద లకు పెట్టింది పేరైన సరోజినీనాయుడు దేశంలోని యితర రాష్ట్రాల గవర్న ర్లందరకూ ఆదర్శప్రాయమూ, అనుసరణీయమూ అయిన నూతన సంప్రదాయాన్ని

నెలకొల్పుతున్నది. శోభాయమానంగా కళామయంగా తీర్చిదిద్దిన రాజభవన్‌లో ఉదారంగా అతిథిమర్యాదలు జరపడం ఎలాగో అందరికీ యిప్పుడు తెలుస్తున్నది.

సరోజినీనాయుడు అనేక ప్రసంగాలు ఆంగ్లంలోనే చేస్తున్నప్పుడు చాలా ఉల్లాసంగా, హుషారుగానే వుంటుంది. ఒక పోలీసు పెరేడ్‌లో ప్రసంగిస్తూ యిలా అంది. "తప్పుల తడికగా నేను హిందీలో మాట్లాడడం విన్నారుగదా. ఇక యిప్పుడు చూడండి శుద్ధమైన ఇంగ్లీషులో మాట్లాడతాను." మహాత్మాగాంధీ 78 వ జయంతి సభలో, ఒక పురాతన మహాకావ్యం పఠిస్తున్నంత భక్తి ప్రపత్తులతో మాట్లాడుతూ "ఈ మహనీయమూర్తిని లోకమంతా గౌరవించుగాక" అన్నది.

1948 జనవరిలో మహాత్ముని హత్య జరిగినప్పుడు, భయంతో, బాధతో, ఆశ్చర్యంతో, ఆగ్రహంతో గుండెపగిలిన కొండలాగా ఢిల్లీకి పరుగెత్తుకుంటూ వచ్చింది. రాజధాని దుఃఖావేశంతో బొటబొటా కన్నీళ్ళు కారుస్తున్నది. ముఖం శోకసముద్రంలో మునిగినట్లే ఉందిగాని సరోజినీదేవి మాత్రం కంట నీరుపెట్టలేదు. తన సహజ గంభీరకంఠంతో అక్కడివారితో అన్నది. "ఎందుకీ ఏడుపులూ పెడ బొబ్బలూ? మంచానపడి పీక్కుంటూనో, తిన్నది అరక్క అజీర్ణంతోనో చావ మంటారా ఆయన్ని? ఇటువంటి మనిషికి అటువంటిచావే గొప్ప" 1. రేడియో ప్రసంగంలోకూడా అదే విధంగా జాతికి పిలుపిచ్చింది. "దీనికోసం మనం వ్యక్తిగతంగా దుఃఖపడే సమయం అయిపోయింది. గుండెలు బాదుకుంటూ జుట్టు పీక్కుంటూ ఏడ్చేకాలం వెళ్ళిపోయింది. ఇప్పుడేం చెయ్యాలంటారా? ధైర్యంతో నిటారుగా లేచినిలబడాలి. మహాత్మాగాంధీకి ద్రోహం చేసినవారు విసిరిన సవాలును అందుకుంటున్నామని అరిచి బిగ్గరగా గొంతెత్తి చెప్పాలి!"

పడే యిబ్బందులు పడుతూనే అంత్యకర్మ జరిగినంతసేపూ అక్కడనుంచి కదలలేదు సరోజినీనాయుడు. పేటికలో వుంచిన మహాత్ముని చితాభస్మాన్ని అలహాబాద్ త్రివేణి సంగమంలో కలిపారు. జాతిపితకు చివరిసారిగా నివాళు లర్పించడానికి ప్రముఖ భారతీయ నాయకులందరూ ఆనాడు అక్కడ చేరారు. అస్థినిమజ్జన కార్యక్రమానికి హాజరుకావడానికి సరోజినీదేవి ఢిల్లీనుండి బైలుదేరి వెళ్ళింది. ఫిబ్రవరి 12 వ తేదీన ప్రత్యేక రైలు అలహాబాదు చేరినప్పుడు ఆమె అక్కడ సిద్ధంగావుంది. నెహ్రూ, పంత్‌లుకూడా ఆమెవెంటే వున్నారు. అక్కడనుంచీ త్రివేణి సంగమానికి

---

1. ప్రిజన్ అండ్ చాక్‌లెట్ కేక్ : నయాంతర సెఘాల్ రచన. పే. 220.

ఊరేగింపు ప్రారంభమైంది. 20 లక్షలమంది ప్రజలు రోడ్డు కిరువైపులా బారులు తీరి నుంచున్నారు. చర్చిముందు "తమసోమా జ్యోతిర్గమయా" అంటూ వేద మంత్రోచ్చారణ చేశారు. అది మహాత్మునికి అతి ప్రియమైన వేదమంత్రం. సరోజినీ దేవి, యితర నాయకులు అస్థిభాండంతో సహా సంగంలో 'డక్' మీద ప్రయాణం చేశారు. వేదోక్తంగా అస్థినిమజ్జనం జరిగింది. ఫిబ్రవరి 13 వ తేదీ సంచికలో లీడర్ పత్రిక సరోజినీదేవితో ప్రత్యేకంగా చేసిన యింటర్వ్యూ ప్రకటించింది. "ప్రేమ, సత్య అహింసా సూత్రత్రయ కాంతులతో మానవజాతి చరిత్రను, ధగద్ధగాయమానంగా వెలిగించే ఆ మహనీయుని అంత్యక్రియల మహోత్సవం అపూర్వ శోభాయమానమైన సంఘటనగా ప్రపంచ చరిత్రకు వన్నెతెస్తుంది" అని వర్ణించింది సరోజినీదేవి.

"గంగా యమునలు మన పవిత్ర పురాతన నదీమతల్లులు. ఈ సంగమంలో తుదిమునుకవేయాలని ఆకాంక్షించిన కోట్లాది భారతీయ స్త్రీ పురుషుల చితాభస్మరాసులను యుగయుగాలుగా యీ పవిత్రజలాలు తమ గర్భంలో ధరిస్తూనే వున్నాయి. కాని భారతదేశ చరిత్రకు తెలిసినంతలో. ఏ మహనీయుని చావు బ్రతుకులు మనందరికీ భక్తిప్రపత్తులతో అనుసరణీయాలో, అంతటి గొప్పవ్యక్తి చితాభస్మాన్ని పొందేభాగ్యం యీ నదీజలాలకు యీనాటివరకు కలుగనేలేదు." 2.

సరోజినీనాయుడు ఆరోగ్యంకూడా బాగాలేదు. మహాత్ముని మరణాన్ని గురించిన మనోవేదన. తనవిధి నిర్వహణలోని భారం మొదలైనవాటివల్ల అసలే ఎప్పుడూ అంతంతమాత్రంగానేవుండే ఆరోగ్యం యిప్పుడు మరీ చెడింది. గుండె బలహీనంగా వుందనీ, రక్తపు పోటు వచ్చిందనీ, కాల్లో గాయమైందనీ అమరనాథ్ ఝూతో ఆమె చెప్పుకుంది. 1949 ఫిబ్రవరి 13 వ తేదీనాటికి ఆమెకు 70 ఏండ్లు నిండాయి. ఆమరునాడే జబ్బున పడింది. ఢిల్లీ వెళ్ళవలసిన పనిపడింది. వెళ్ళవలసిందేనని పట్టుబట్టింది. ప్రయాణం మధ్యలో తలమీద గట్టిదెబ్బ తగిలింది. అయినా తన కార్యక్రమాలేవీ రద్దుకావడం ఆమెకు యిష్టంలేదు. ఢిల్లీనుండి నాలుగు రోజుల్లోనే తిరిగి లక్నో వచ్చింది. అప్పటికే భరించలేని తలనొప్పితో బాధపడుతున్నది. రక్తపుపోటు బాగా పెరిగింది.పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు

---

2. లీడర్ 1948 ఫిబ్రవరి 14 వ తేదీ సంచిక.

సలహా యిచ్చారు. ఫిబ్రవరి 18 వ తేదీనాటికి శ్వాస ఆడడం కష్టంగావుండి ఆక్సి జన్ పెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. కాని ఆక్సిజన్ పెట్టినా నిద్రపట్టలేదు. మార్చి 1 వ తేదీ రాత్రి నర్సును పిలిచి ఏదైనా పాటపాడమని కోరింది. ఆ పాట వింటూ చివరిసారిగా "ఎవరూ నాతో మాట్లాడకండి" అంటూ నిద్రపోయింది. కాని తెల్లవారుఝామున 3-30 గంటలకల్లా శాశ్వతంగా కన్నుమూసింది. ఆ సంగీత సామ్రాజ్ఞి సరోజినీనాయుడు మరణవార్త విని భారతజాతి నిర్ఘాంతపోయింది. దుఃఖసముద్రంలోకి దూకింది. రాజభవన్ దిశగా ప్రజాప్రవాహం కదిలింది. సాయంత్రం 4-15 గంటలకు శ్మశానవాటికకు ఊరేగింపు ప్రారంభం. సరోజినీ దేవి శవాన్ని మువ్వన్నె పతాకంతో కప్పివేశారు. వేదపఠనాలతో, ప్రార్థనగీతాలతో బైటికి తీసుకువచ్చారు. పండిట్ నెహ్రూ, యితర ప్రముఖులూ శవాన్ని శతఘ్ని శకటంమీదికి ఎక్కించారు. ఆమె పిల్లలు చుట్టూ కూచున్నారు. లేడీ మౌంట్‌బేటన్, భారత జాతీయనాయకులు, అనేకమంది మంత్రులు ఆమె మరణానికి దుఃఖా వేగంతో సానుభూతి ప్రకటించారు. గోమతీ నదీమతల్లి గర్భం చీల్చుకుంటూ వెళ్ళింది చివరిసారి సైనికవందన సూచనగా మ్రోగిన శతఘ్ని ధ్వని. వేదోక్త కర్మకాండ జరిగిపోయింది. సరోజినీదేవి జ్యేష్ఠపుత్రుడు జయసూర్య తలకొరివి పెట్టాడు. సి. రాజగోపాలాచారి ప్రజలనుద్దేశించి శ్మశాన వాటికలో ప్రసంగిం చాడు. నిండైన ఆనందానుభూతి పండిన ఒక మధురజీవితం, భారతమాత ముద్దు బిడ్డ సరోజినీదేవి జీవితం అంతటితో ముగిసింది. ప్రశంసలతోకూడిన సానుభూతి ప్రకటనలు ప్రవాహమైపారాయి. ఆనాడేకాదు, నేటికీ భారతదేశం పరితపిస్తూనే వుంది. ఆ మహనీయురాలి మరణానికి - ఆ ధైర్యశాలిని, కవయిత్రి, శాంతి ప్రియ, మహిళా విముక్త్యుద్యమనేత, స్నేహబాంధవి, తత్త్వవేత్త, మార్గదర్శిని, మరణానికి. అహింసాత్మక స్వాతంత్ర సమరయోధురాలిమరణానికి సరోజినీనా యుడు జీవితంలో ఎన్నో గౌరవాలు పొందింది. హైదరాబాదులో ఆమె చేసిన సేవకు గుర్తింపుగా చిన్నవయస్సులోనే ఆమెకు కైజర్-ఇ-హింద్ బంగారు పతకం యిచ్చారు. తరువాత ఆమె దానిని బ్రిటిష్ ప్రభుత్వానికి తిరిగి యిచ్చేసింది. రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్ విశిష్ట సభ్యత్వ గౌరవం పొందింది. మద్రాసు, కలకత్తా, కరాచీలలో "నగరస్వేచ్ఛా" గౌరవంతో ఆమెను ఆదరించారు. అలహా బాద్ విశ్వవిద్యాలయం డాక్టరేటు యిచ్చి గౌరవించింది. ఇలాంటివి యింకా ఎన్నో లెక్కలేనన్ని.

# భారతీయ ఆంగ్ల కవితా వ్యాసంగం

మనదేశంలో ఇండో-ఆంగ్లియన్ (భారతీయులు ఆంగ్లభాషలో రాసే) కవితా వ్యాసంగం 150 ఏండ్ల నాటిది. హెన్రీ లూ యీవివియన్ డిరోషియో (1809 - 1831) తో యీ ప్రయత్నం ప్రారంభమైంది. నిజానికి రాజారామమోహనరాయ్ (1772 - 1831) కాలంనుంచీ ఆంగ్లభాష మనదేశంలో వ్యాప్తిలోకి వచ్చింది. ఆ భాషతో ముడిపడివున్న మితవాదభావాలూ, జరిగిన గొప్ప సాహిత్య కృషీ, అందులోని సాంస్కృతిక సహనశీలం మనదేశంలోని మేధావివర్గాలను బాగా ఆకర్షించాయి. హెన్రీడిరోషియో తల్లి భారతీయవనిత, తండ్రి పోర్చుగల్ జాతీయుడు 'జంఘీరాసన్యాసి, యితర కవితలు' (ది ఫికీర్ ఆఫ జంఘీరా అండ్ అదర్ పొయెమ్స్) అనే పేరుతో ఆయన ప్రచురించిన కవితా సంకలనం పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది. అప్పటినుండి విదేశీయమైన ఆంగ్లభాషలో రచనలు చేయడం భారతీయులకు ఒక మోజుగా పరిణమించి వ్యాపించింది. ఆంగ్లంలో రాసే అనేక మంది భారతీయ కవులు బైలుదేరారు. మొట్టమొదటి బెంగాలీ ఆంగ్లకవి కాశీ ప్రసాదఘోష్. ఆ తరువాత వెల్లువలా అనేకమంది యీ రంగంలో తలదూర్చి రచనలు చేశారు. కొందరు కేవలం పుట్టగొడుగుల్లా పెరిగారు. మరికొందరు, తోరు దత్తు మొదలైనవారి కవితలు పాఠకులు యీ నాటికి చదివి ఆదరిస్తూనే వున్నారు. ఆరంభంలో వచ్చిన ఇండో ఆంగ్లియన్ కవుల్లో మోహన్‌లాల్, హసన్ అలీ, పి. రాజగోపాల్, రాజ్‌నారాయణ్ దత్తాప్రభృతులతో పాటు తోరుదత్తు తండ్రీ, తండ్రి సహోదరులు, యితర దత్తు కుటుంబీకులు పేర్కొనదగినవారు. "దత్తు కుటుంబం ఆల్బం" ను లాంగ్‌మన్స్ గ్రీన్ కంపెనీవారు ఇంగ్లాండులో ప్రకటించారు. ఈ దత్తు కుటుంబంతో బంధుత్వంలేని మైఖేల్ మధుసూదనదత్తు "బంధిత వనిత" (ది కేప్టివ్ లేడీ) అనే పేరుతో తన కవితా సంకలనం ప్రకటించి ఆంగ్ల కవితారంగంలో కాలుపెట్టాడు. కాని ఆయన త్వరలోనే మాతృభాష బెంగాలీ

వైపుకు మొగ్గిపోయాడు. ఈనాడు బెంగాలీలు ఆయన్ను తమజాతి ప్రముఖ పూర్వ కవిగా గుర్తించారు. ఆయన 1843 లో క్రైస్తవమతం తీసుకున్నాడు.

దేశంలో ఆంగ్లభాష క్రమక్రమంగా వ్రేళ్లూని నిలద్రొక్కుకుంటున్నది. చాలామందికి దానితో పరిచయం ఏర్పడుతున్నది. మనదేశంలో ఆంగ్లభాషకు అధికారస్థాయిలో రాజభాషా గౌరవం కలిగింది 1835 లోనే అయినా, అంతకు ముందు 16 వ శతాబ్దంలోనే గోవాకు చెందిన ఒక క్రైస్తవ మిషనరీ థామస్ స్టివెన్సు (1549 - 1619) ద్వారా అది దేశంలో ప్రవేశించింది. విద్యావిషయిక మైన నిధులన్నీ ఆంగ్లభాషా విద్యాభ్యాసానికి మాత్రమే వినియోగించాలనీ ఆంగ్ల భాషాధ్యయనం నిర్బంధం చేయాలనీ సూచించిన మెకాలే నివేదికను లార్డ్ బెంటింక్ ఆమోదించిన తర్వాతనే 1835 లో ఆంగ్లభాషకు అధికార భాషగా దేశంలో ప్రాధాన్యం లభించింది. 1817 లో బెంగాలీలు, బ్రిటిష్‌వారూ కలిసి కలకత్తాలో హిందూకళాశాల ప్రారంభించారు. ఇదే మనదేశంలో మొట్టమొదటి ఆంగ్లో-బెంగాలీ సంస్థ. మరుసటి సంవత్సరం విలియంకారీ, వార్డ్, మార్ష్‌మన్‌లు సెరంపూర్ కళాశాల ప్రారంభించారు. ఆ రోజుల్లో డాక్టర్ డఫ్ మొదట్లోనూ, తరువాత డేవిడ్ లెస్టర్ రిచర్డ్‌సన్ ప్రిన్సిపాళ్లుగా పనిచేశారు. వీరిలో రిచర్డ్‌సన్ కలకత్తా లిటరరీ గెజెట్‌కు సంపాదకుడుగా కూడా వుండేవాడు. ఆయన "లిటరరీ లీవ్స్" (సాహిత్య పత్రాలు) అనే సంకలనంకూడా ప్రకటించాడు. ఈ గ్రంథం అనేక మంది భారతీయ యువరచయితలు ఇంగ్లీషు రచనలు చేయడానికి ప్రోత్సాహకారి అయింది. బెంగాలు మేగజీన్, కలకత్తా రివ్యూ వంటి పత్రికలు ఆంగ్లంలో కొత్తగా రాస్తున్నవారి రచనలు ప్రకటించి ప్రోత్సహించాయి. కలకత్తా రివ్యూ పత్రికలో 1874 లో తోరుదత్తు డిరోషియో కవిత్వాన్ని గురించి పరిశీలనాత్మక వ్యాసంరాసి ప్రకటించింది. ఈ రెండు పత్రికల్లోనూ తోరుదత్తు తాను రాసిన అనేక ఆంగ్ల కవితలు అచ్చువేసింది కూడా. తోరుదత్తు పినతండ్రి రెండో కుమారుడు రమేష్ చంద్రదత్తు కొన్ని సంస్కృత మహా కావ్యాలను ఆంగ్లంలోకి తర్జుమా చేశాడు. ఆయన పేరెన్నికగన్న భారతీయ శాస్త్రవేత్త, పండితుడు. ఈ విధంగా భారతీయులు చేస్తున్న ఆంగ్లకవితా వ్యాసంగం క్రమంగా పెరుగుతూ, పలువురి దృష్టిని ఆక ర్షిస్తూ వ్యాప్తి చెందడం ప్రారంభమైంది. మన్‌మోహనదాస్ కవిశేఖరుని కూతురు లోతికఘోష్ 1933 లో ఆంగ్లంలో భారతీయ రచయితలు అనే గ్రంథం రాసింది. అంతకుముందే, 1918 లో మద్రాసులోని లాంగ్‌మన్ గ్రీన్ కంపెనీవారు

"బెంగాలీ బుక్ ఆఫ్ ఇంగ్లీష్ వెర్స్" అనే కవితా సంకలనం ప్రకటించారు. దీని సంపాదకుడు థియోడార్ డగ్లాస్ డన్.

ఆంగ్ల కవిత్వంలోవున్న లిరిక్, సానెట్, ఎలిజీ, ఓడ్ వంటి సంప్రదాయ కవితా రీతులనే ఎక్కువగా భారతీయ కవులు అనుసరిస్తుండేవారు. కాని 1913 లో రవీంద్రనాథ టాగూర్ తన బెంగాలీ కవితలను ఆంగ్లభాషలో స్వేచ్ఛా కవితలుగా అనువదించుకుని గీతాంజలికి నోబిల్ బహుమతి పొందిన తరువాత యీ కొత్త కవితా పద్ధతికూడా రంగంమీదికి వచ్చింది. కాని తరువాత వచ్చిన కవులు దానిని అంతగా కొనసాగించలేదు. శ్రీ అరవిందులు, టాగూరు, కొంతవరకు తోరుదత్తు, సరోజినీనాయుడు తమతమ ప్రత్యేక కవితాశిల్ప రీతులను ప్రదర్శించి ఇండో — ఆంగ్లియన్ కవితా రచనకు పేరు ప్రతిష్ఠలు చేకూర్చారు. "సరోజినీనాయుడూ ఆమెతరం రచయితలతో అనుభూతి ప్రధానమైన భావకవితావేశాన్ని ప్రకటించే ఒక ప్రత్యేక శబ్దవిన్యాస వైఖరి ముగిసివుండవచ్చు. కాని యింతమాత్రాన అనుభూతి ప్రధానమైన భావనా చైతన్యమే తొలగిపోయిందని అర్థంకాదు."[1].

పందొమ్మిదవ శతాబ్దంలో ప్రాచ్య, పాశ్చాత్య భావసమ్మేళనం, సాహిత్య పరిశీలనకృషి బాగా ఎక్కువగా జరిగాయి. సంస్కృతభాష అనేకమంది యూరోపియన్ పండితులను తనవైపు ఆకర్షించుకోగలిగింది. సర్ విలియంజోన్స్ ప్రోత్సాహంతో కలకత్తాలో రాయల్ ఏషియాటిక్ సొసైటీ స్థాపన జరిగింది. యూరప్ ఖండానికి చెందిన అనేకమంది మహామహా పండితులు—వీరిలో చాలామంది జర్మన్లు — మాక్స్‌ముల్లర్ వంటివారు ఒకనాడు వైభవోపేతంగా విలసిల్లిన భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యసంపదను వెలికితీసి లోకానికి ప్రదర్శించి చూపే కృషి దాదాపు ఒక శతాబ్దం ముందుగా ప్రారంభించి చివరకు విజయం సాధించారు. భారతదేశ సాంస్కృతిక వైభవం చూసి యూరప్‌ఖండవాసులు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు, వారి కండ్లు జిగేలు మన్నాయి. జాన్ విల్సన్, సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్, సర్ విలియం హంటర్ మొదలగువారు కళలు, కవిత, మత ధర్మాలు మొదలైన విషయాల్లో భారతీయ సంస్కృతిని బాగా జీర్ణించుకుని కృషి చేస్తుండేవారు.

---

1. భారతీయ ఆంగ్లకవితా స్వర్ణపేటిక (ది గోల్డెన్ ట్రెజరీ ఆఫ్ ఇండో ఆంగ్లియన్ పొయెట్రీ)

మరొకవైపు భారతీయులుకూడా ఆంగ్లభాషలోనూ, దాని సాహిత్యంలోనూ మునకలువేస్తూ అంతవరకే ఆగిపోలేదు. పాశ్చాత్యభావనా ప్రపంచం "అంతవరకు స్తబ్ధంగావున్న భారతీయ మేధోవిలసనాన్నీ, సదసద్వివేకాన్నీ మేలుకొలిపింది. జీవితాన్ని పునర్వికసింపజేసి నూతన సృష్టిపథం వైపుకు మళ్ళించింది. మేలుకున్న భారతీయాత్మ, నూతన పరిస్థితులనూ, భావాలనూ అవగాహన చేసుకుని, వాటిని జీర్ణింపజేసుకుని వాటిమీదనే విజయం సాధించవలసిన ఆవశ్యకతను గుర్తించే పరిస్థితికి దోహదకారి అయింది" 2 ఈ ప్రభావం తొలిసారిగా బెంగాలీలమీద పడింది. కొత్తగా వచ్చిన యీ ఆంగ్ల సంస్కృతిని విమర్శించడం కూడా భారతీయులు ప్రారంభించారు. ఆంగ్లేయుల విద్యావ్యవస్థలో పుట్టిపెరిగి ప్రకాశించిన సరోజినీ నాయుడుకూడా ఆంగ్లసంస్కృతి "జాతీయతను కోల్పోయిన భారతీయ యువ తరాలను పాశ్చాత్య భావదాస్యానికి బానిసలుగా అమ్మివేసింది" అంటూ అసమ్మతి వ్యక్తం చేసింది. అయితే దానివల్ల కలిగిన ప్రయోజనాలనుకూడా భారతీయులు నిర్లక్ష్యం చేయలేదు. టాగూరు "విశాలహృదయంతో 19 వ శతాబ్దపు విముక్తి"ని గురించి ప్రస్తుతించాడు.3

పాశ్చాత్యులనుండి మత, మతాతీత లౌకిక, శాస్త్రీయ మానవత్వ విషయాలకు సంబంధించిన సాహిత్యం దేశంలోకి కుప్పతెప్పలుగా వచ్చిపడుతున్నది. భారతీయ మేధావులుకూడా క్రీస్తునూ, ఆయన ప్రవచించిన ప్రేమ, సేవాభావాల బోధలను, వేదప్రవచనాలతోనూ, పురాతన హైందవ వేదాంత సూత్రాలతోనూ సమన్వయపరచి ఆలోచించడం ప్రారంభించారు. రాజారామమోహనరాయ్ విగ్రహారాధనమీద ధ్వజమెత్తి నానాబాధల ననుభవించి, 1828 లో బ్రహ్మ సమాజమతాన్ని స్థాపించాడు. ఎంతో ప్రతిఘటన వచ్చినప్పటికీ, అనేకమంది మహనీయులు సంస్కరణ ప్రధానమైన యీ నూతన హైందవ మత సిద్ధాంతాన్ని బలపరచి కృషిచేశారు. అదే సమయంలో క్రమక్రమంగా సంఘ సంస్కరణలు కూడా అమల్లోకి వచ్చాయి. సతీసహగమన నిషేధం, క్రమక్రమంగా మహిళా విముక్తి, కులవ్యవస్థ అనర్థాలను గురించిన చైతన్యం, భారతీయులు విదేశాలకు వెళ్ళే అవకాశం మొదలైనవి రంగంలోకి వచ్చాయి. పాశ్చాత్య భావసంపర్కంగల విద్యావిధానం ప్రారంభమైంది.

---

2. శ్రీ అరవిందుల "రినైజాన్స్ ఇన్ ఇండియా" - పే. 26.

3. ఇండో- ఇంగ్లీష్ పొయెట్రీ, పి. సి కోటోకీ రచన, పే. 5 - 6.

దేవేంద్రనాథ టాగూరు, కేశవ చంద్రసేన్ పదేండ్లపాటు కృషిచేసి రామ మోహన్‌రాయ్ స్థాపించిన బ్రహ్మసమాజ మతంలో ఒక శాఖకు గట్టి పునాదులు నిర్మించారు. కేశవసేన్ బోధలు చాలావరకు క్రైస్తవ ఆదర్శాలు, రూపాలమీద ఆధారపడి వుండేవి. అందువల్ల అవి బ్రహ్మసమాజ మతంలో ఒక ప్రత్యేక శాఖగా ఏర్పడ్డాయి. చివరకు బ్రహ్మసమాజ మతవ్యవస్థలో చీలిక వచ్చింది. 1886 లో మాతృసంస్థ ఆది బ్రహ్మసమాజం అనే పేరుతో వచ్చి తరువాత సాధారణ బ్రహ్మసమాజంగా వ్యవహరించబడింది. కేశవచంద్రసేన్ నిర్మించిన శాఖకు నవవిధాన్ అనే పేరు వచ్చింది. ఆనాటి మేధావుల్లో కొందరు దేశంలో యితర ప్రాంతాల్లోకూడా సంస్కరణయుక్తమైన మతశాఖలను స్థాపించారు. పశ్చిమ భార తంలో ప్రార్థనసమాజం, ఉత్తరాన ఆర్యసమాజం, దక్షిణదేశంలో థియోసాఫికల్ సొసైటీవంటివి ప్రారంభమయ్యాయి. బెంగాల్లో బ్రహ్మసమాజానికి తోడు, రామ కృష్ణ పరమహంస ప్రవచించిన మతధర్మాలూ, మానవసేవా దృక్పథం మీద ఆధారపడి రామకృష్ణ మిషనరీలు విరివిగా ధర్మప్రచారం చేస్తుండేవారు. ఇది కూడా ప్రజల్లో అత్యంత ఆకర్షణీయమైన మతంగా ప్రచారంలోకి వచ్చింది. ఈ మతాలు, శాఖలన్నీకూడా వేరే ఏదో ఒక మతాన్ని ఖండించడానికి పుట్టినవికావు. అన్ని మతాలను గౌరవించడానికి, సహనశీలమైన తమ తమ మతాలలోకి యితర అన్నిమతాలభావాలనూ సమన్వయించి చేర్చుకోడానికి ఉద్దేశించినవే.

ఆంగ్లభాషలో రచనలు చేస్తున్న భారతీయులకూ కూడా యీ లక్షణమే అబ్బింది. ఇదే వారూ అనుసరించారు. కవులు ఆంగ్లభాషను చేపట్టి దానిని భార తీయం చేసుకున్నారు. ఆంగ్లభాషలో రాస్తున్న ఐర్లండు, వేల్సు, పోలండ్, ఫ్రాన్సు యింకా యితర దేశరచయితలలాగా, భారతీయులుకూడా, భాష ఒకటే ఆంగ్లంగాని, మిగిలిన అలంకారాలు, కవిసమయాలు, భావచిత్రాలు మొదలైన కవితాసామగ్రి, అంతా భారతీయమైనదానినే వాడుకొన్నారు. అయితే యీ ఇండో - ఆంగ్లియన్ కవిత్వాన్ని గురించి వచ్చిన విమర్శ ఏమంటే, అది "చాలావరకు జీవితానికీ సృష్టికీ సంబంధించి బాహ్యప్రకృతిని మాత్రమే దర్శించింది. అంచులమీదే తేలాడు తున్నది. అందులో చాలావరకు చెప్పుకోదగిన శక్తి కనిపించదు. శ్రీ అరవిందుని మాటల్లో చెప్పాలంటే యీ కవితల్లో 'శాశ్వతత్వంమీద సమకాలీనతదేపైచేయి'

అయింది.''4. ఇండో ఆంగ్లియన్ కవులు తీసుకున్న వస్తువులు పౌరాణిక, చారిత్రిక, జానపద గాథలు, లేదా కేవలం సమకాలీనమైన అనుభూతులు. చాలామంది కవులు కొత్తగా చేతికందిన యీ భాషను, పిల్లలు ఆటబొమ్మతో ఆడుకున్నట్లు పైపైన వాడుకున్నారు. ఆ భాషలోని కవితారూపాలకు అనుకరణలు తయారు చేసే ప్రయోగాలతో సంతృప్తిపడి భాషా పాటవం యింత బాగా ప్రదర్శించాంగదా అని పొంగిపోయారు. కానీ చాలా భాగం యీ కవితలు ఉన్నతస్థాయికి చేరలేక పోయాయి. ఐర్లండుకో, వేల్సుకో, యింకా యితరదేశాలకో చెందినవారైనా, ఒక ఈట్స్, ఒక డిలాన్ థామస్ రాసిన స్థాయిలోనో, యింకా యితరుల స్థాయిలోనో రాయలేకపోయారు

19 వ శతాబ్దంలో ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల మధ్య యిచ్చిపుచ్చుకునే ధోరణి, దాని ఫలితంగా ఒక నూతన ఆలోచనా విధానమూ, సంస్కృతి దృక్పథమూ ఏర్పడ్డాయి. వీటి నాయకుడు కేశవచంద్ర సేన్. ఆయన సన్నిహిత స్నేహబృందంలో అఘోరనాథ్ చటోపాధ్యాయ ఒకరు. చటోపాధ్యాయ అప్పుడే విదేశాల నుంచి తిరిగివచ్చారు. ఆయన ఆలోచనా రీతి దేశభక్తి పూరితమైన సంఘ సంస్కరణోత్సాహంతో నిండిపోయింది. కేశవచంద్ర సేన్ నాయకత్వానగల బ్రహ్మసమాజపు నవవిధానసభలో ఆయనకూడా చేరాడు. చటోపాధ్యాయను బ్రహ్మానంద సేన్ స్వయంగా దానిలో చేర్పించాడు. ఈ సేన్ కుటుంబంలో వరదసుందరికూడా సభ్యురాలే. ఆవిధంగా సరోజినీదేవి తల్లిదండ్రు లిద్దరూ జాగృత భారతదేశంలో వెలిసిన ఒక చైతన్యవంతమైన సంస్థతో సంబంధం పెట్టుకున్నవారే. ఆమె పుట్టి పెరిగిన వాతావరణం, సంప్రదాయం మితవాద భావాలతో, కులాలు, మతాలు, జాతులపట్ల సహనశీలంతో కూడుకుని వుండేది, చిన్నతనంనుంచీ ఆమెకు ప్రాచ్య - పాశ్చాత్య స్నేహ సంప్రదాయంలో విశ్వాసం గలిగేట్లు అభిప్రాయాలు నూరిపోశారు. 1879 లో ఆమె జన్మించిన కాలం భారతీయులు ఆంగ్ల రచనలు చేయాలని ఉవ్విళ్ళూరుతూ కలలుకంటున్న కాలం. అఘోరనాథుడు బెంగాలునుంచి హైదరాబాదుకు మకాం మార్చిన తర్వాత వాతావరణమంతా మారిపోయింది. హైదరాబాదు హిందూ, ముస్లిం, బ్రిటిష్ సంస్కృతుల సమ్మేళన స్థానం. ఆ పరిస్థితిలో ఆమె పెరిగింది. సరోజినీదేవిని గురించి ముల్కరాజ్ ఆనంద్ యిలా

---

4. ఇండియన్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్ పే. 40.

రాశాడు. "తన భావాలు ప్రకటించడానికి సరోజినీదేవి ఒక పాశ్చాత్య భాషనూ, దాని శిల్పాన్నీ చేపట్టినప్పటికి, గాలిబ్, జోక్‌మీర్, హాలీ, ఇక్బాల్ ప్రభృతుల లాగా నాకామెకూడా ప్రధానంగా హిందూస్థానీ సంప్రదాయానువర్తిగానే కనిపిస్తుంది."[5] సరోజినీదేవి బ్రహ్మసమాజ సిద్ధాంతం, సహనశీలం, మానవజాతి ప్రేమభావన వాతావరణంలో పుట్టి హైదరాబాదులోని హిందూ - ముస్లిం సోదర వ్యవస్థలో భాగంగా పెరిగిన బిడ్డ. పర్షియన్ కవిత కూడా ఆమెను చాలావరకు ప్రభావితం చేసింది. ఆమె జీవిత దృక్పథంకూడా చాలావరకు ఆంగ్లేయ దృక్పథమే. ఒక విమర్శకుడు ఆమెను గురించి యిలా వ్యాఖ్యానించాడు. "విదేశీభావాల, అనుభూతుల వాసనలతో ఆమె కవితలు ఒకానొక ఆంగ్లేయ రచయిత ప్రాచ్య సంస్కృతిని గురించి ఎవరో చెప్పగా విన్నది ఆధారంగా అభిప్రాయాలు వెలిబుచ్చినట్లు వుంటాయి." కాని సరోజినీదేవి భారతీయ భావనలోనే జీవించి, అందులోనే మహదానందం పొందిందని నాకనిపిస్తుంది. తప్పెట్లూ, తాళాల ధ్వనులు విని, ఆమె మనసారా అనుభవించి ఆనందించింది. జానపదగీతాల్లోని లయవిన్యాసాలు తిలకించి పులకరించింది. వీధివిక్రేతల అరుపులూ, పెడబొబ్బలూ చెవిసోకి చిందులు త్రొక్కింది. మహానదులు దాటించే పడవపాటల్లో ప్రతిఫలించే బ్రతుకు తత్వం ఆలకించింది. పాములవాడు మోకాలిమీద కూచుని ఊదే నాగస్వరనాదానికి త్రాచులు తలలూపి ఆడడం చూసింది. గాజుల మలారం గలగలలూ, పల్లకీ బోయీల పల్లవులూ విన్నది. పరదాలోకంలోని పరమత సంప్రదాయాల అందచందాలలో మునిగితేలే సుందరాంగనలను చూసింది. తాను కవితల్లో స్తుతించిన సమకాలిక మహనీయమూర్తులను అభిమానించి ఆనందించింది. ఇటువంటి అనేక అనుభూతులను పొందనట్లయితే ఆమె అంత రసవంతమైన హృదయంగమమైన గీతాలను కావ్యాల గోతాలకెక్కించ గలిగేదే కాదు. భారతదేశంలో పాదుకునివున్న యిటువంటి భావానుభూతి లోకాన్నే ఆంగ్లపాఠకుల ముందామె ఆవిష్కరించింది. ఈ లోకానుభూతులను కవితలో చిత్రిస్తూ ఆమె అమందానందాన్ని పొందింది. మాతృదేశ మర్యాదలకు ఆమె గుండె పొంగులెత్తింది. ప్రేమతో, సేవాభావంతో యీ దేశాన్ని హృదయపీఠంమీద పెట్టి పూజించింది. తనకు ప్రియమైన యీ దేశ వాతావరణాన్నే ఆమె యితర ప్రపంచానికి తెలిసేట్లు ప్రదర్శించింది. తన దేశానికి

5. ది గోల్డెన్ త్రెశ్. పే. 102 "ఇండో - ఇంగ్లీష్ పొయిట్రీ" 42 వ పేజీలో ఉదహరించినది.

సంబంధించిన లోటుపాట్లను, బలహీనతలను బహిరంగపరచడం ఆమెకు యిష్టం లేదు. అలా ఎందుకు చేయాలి నిజానికి? కవిత్వం అంటే ఆమె దృష్టిలో అందాల ఆవిష్కరణ. అంతేకాని జీవితం గురించి అసహనం గలిగించే, విసుగు పుట్టించే అవాస్తవికమైన మోటుభావాల ప్రదర్శనంకాదు. ఇవన్నీ జీవితంలో కనిపించే యథార్థాలే కావచ్చు. కాని అటువంటివి ఆమెకు కవితాప్రేరణ కలిగించవు.

సరోజినీదేవి కవిత్వం రాసిన కాలంలో భారతదేశం పరాయివారిక్రింద బ్రతుకుతున్న బానిసదేశం. మాతృదేశ మహనీయతను చూపి యితరదేశాలముందు దాని ప్రతిష్ఠను ప్రదర్శించడం ఆమె అభిమతం. తన తప్పులను ఒప్పుకోకుండా దాచిపెట్టగలిగినందుకే యింగ్లండు అంత గొప్ప దేశమైందని సరోజినీదేవి మాఅమ్మ గారితో అంటుంటే నేను విన్నాను. మనదేశాన్ని ఒక స్వతంత్రదేశంగా, బలమైన జాతిగా నిర్మించాలని కలగంటున్న మనం మాత్రం లోపాలను ఎందుకు ప్రదర్శించుకోవాలి? అందుకే ఆమె ఆంగ్లభాషలో దేశాన్ని గురించి దాని ఔన్నత్యాన్ని స్ఫురింపజేసే సుందరగీతాల మందారమాలలతో దేశమాతను అలంకరించింది. ఆమె కాలంలో ఆంగ్లభాషే దేశంలో అధికార భాష. జాతీయ భాష హిందీ, యింకా 13 యితర రాష్ట్రభాషలతోపాటు, ఇప్పటికీ ఆంగ్లభాష మనదేశంలో అధికారభాషగానే వుంది. అందువల్ల ఆంగ్లంలో రాసిన భారతీయ సాహిత్యమంతా భారతదేశంలో భాగమే. భారతదేశం వృద్ధిచెందడంలో ఇంగ్లాండుకూడా గణనీయమైన పాత్ర నిర్వహించింది. అంతకు ముందున్న పాలకు లందరికంటే ఎక్కువగానే చేసింది. మన సంస్కృతం ఆర్యభాష. దేశాన్ని ఆక్రమించుకున్న ఆర్యులు కొత్తగా తెచ్చి మనమీద రుద్దినభాషే. అది ఈనాడు భారతీయ భాషగా గణన కెక్కింది. గ్రీకులు, మొగల్ పాదుషాలు, యింకా యితరుల ప్రభావాలు మన దేశంమీద పడ్డాయి. మనలో కలిసిపోయాయి. భారతదేశపు గొప్పతనం అంతా యిందులోనే వుంది. ఎవరితో కలిసినా దేనిని స్వీకరించినా మనదేశం తన వ్యక్తిత్వాన్ని కోల్పోదు. భారతదేశానికి బయటనుండి అబ్బిన ఏ భాషలో మాట్లాడినా రాసినా మన ప్రత్యేకతలకు భంగంకలుగలేదు. భారతీయులు ఆంగ్లభాషలో సహజసుందరంగా ప్రావాహికంగా రచనలు చేయగల నేర్పు అబ్బిన పరిస్థితికి సరోజినీ

దేవి ఒక సంకేతం. "భారతీయ ఆంగ్లసాహిత్యం, వైవిధ్యంలో ఐక్యత అనే భారతీయ జీవిత దృక్పథానికి నిండైన నిదర్శనం."[6]

మాతృభాష కాని పరభాషలో రాసే కవుల్నిగానీ, నవలాకారుల్ని గానీ సంకుచితదృష్టితో చూసి విమర్శించడం ప్రమాదకరమైన లక్షణం. మాతృభాషలోనే పసలేని కవిత్వం రాసిన కవులెందరో వున్నారు, అలాగే యితర భాషను స్వీకరించి చక్కని కవిత్వం రాసినవారూ వున్నారు. కవులుగా చెలామణి అయిన ఆంగ్లకవుల్లోనే చాలామంది చెత్తకవిత్వం రాశారు. ఆంగ్లభాష "ఒక సాహసోపేతమైన భాష. ఆంగ్లేయులకే అది కొరకరానికొయ్య"[7] అనికూడా తరచుగా భావిస్తుంటారు. ఇదిలావుండగా, కొంతమంది భారతీయులు అనేకమంది ఆంగ్లేయులకంటే మంచి ఇంగ్లీషు మాట్లాడతారని చాలామంది తెలిసినవారు అంటుంటారుకూడా. అంతేకాకుండా భారతీయుల ఆంగ్లరచనలను చాలామంది రాజకీయ దృష్టితోనే అంచనావేస్తారు. కనీసం జాతీయస్థాయిలోనైనా చూడకుండా, కేవలం ప్రాంతీయ దృక్పథంతోనో లేదా కేవలం దేశభక్తి ప్రమాణాలతోనో మాత్రమే చూస్తారు, ఉదాహరణకు పూర్వకవులందరూ - అంటే సరోజినీనాయుడు, తోరుదత్తు, శ్రీ అరవిందులు మొదలైనవారు ఆంగ్లభాషా వ్యామోహవ్యాధి పీడితులనే అభాండం వేస్తుంటారు. "ఊహించలేనంతగా మాతృభాష యీవిధంగా మాయమై పోవడానికి ఏవ పరిస్థితులు దారితీశాయి?"[8] ఆమాటకువస్తే, ఆంగ్లకవిత్వం రాసే ఆధునిక భారతీయ కవులుకూడా అదే వ్యాధికి లోనైనవారేగదా! అంతేకాకుండా బెంగాలీ (భాష) పిచ్చి, ఒరియా పిచ్చి, తమిళ పిచ్చి, హిందీ పిచ్చి పెంచుకునే తత్వంకూడా కనిపిస్తుంటుంది. ఈ విధంగా దిగిదిగి కవిత్వం అనేది కేవలం ప్రాంతీయవ్యవహారం అయిపోతుంది. అలా అయినా మంచిదే, కాని మంచిమంచి అనువాదాలతో అది యితరచోట్లకూ్కడా ప్రాకే శక్తిసామర్థ్యాలు కలిగివుండాలి. ఉదాహరణకు చెప్పాలంటే శ్రీ అరవిందులు, సరోజినీనాయుడుకంటే ఎక్కువగా

---

6. 19 వ శతాబ్దంలో భారతీయ - ఆంగ్ల సాహిత్యం, జాన్ అల్ఫోన్సో కర్కాలా రచన పే. 1.

7. ది స్వాన్ అండ్ ది ఈగిల్ పే. 2.

8. ఆంగ్లంలో ఆధునిక భారతీయ కవిత. పే. 5.

జాతీయభావాలు, దేశభక్తిగల భారతీయాంగ్ల రచయితలు మరెవరూ వుండరను కుంటాను. అయితే ఆంగ్లంలో కవిత్వం పేరుతో చెత్తా చెదారం గిలకరిస్తూ తాము మహాకవులమనే భ్రాంతిలోపడి కొట్టుకుంటున్న పిల్లకవులందరూ యీ రంగం నుంచి విరమించుకుంటే మంచిదనే విషయం అంగీకరించక తప్పదు. వారిలో చాలామందికి ఆంగ్లకవిత్వం రాసే మెళుకువల్లో ఒక్కటికూడా ఒంటబట్టలేదు.

నిజానికి కళ అనేది ఏ బంధాలకూ లొంగని సర్వతంత్ర స్వతంత్ర వ్యవస్థ గదా, ఇండో - ఆంగ్లియన్ అంటూ ఒక జాతిని, ఒక భాషనూ కలిపి తయారు చేసిన తోకలాంటి యీ బిరుదు తగిలించుకోవడం అవసరమా? తన స్వేచ్ఛకు ఎటువంటి నిర్బంధాలనూ, పరిమితులనూ సహించలేని, విహంగ స్వభావంగల సరోజినీనాయుణ్ణి ఇండో - ఆంగ్లియన్ కవులనే యీ తరగతిక్రింద జమకట్టినా ఆమె యిందులో యిమడనే యిమడదు. ఈట్స్‌ను ఐరిష్-ఆంగ్లోకవి అని ఎవరైనా పిలుస్తారా? డిలాన్ థామస్‌ను వేల్స్—ఆంగ్లియన్ కవిగా ఎవరైనా వర్ణించగా విన్నామా? ఇలా యింకా ఎందరో వున్నారు. సరోజినీనాయుడిది ఆనందోల్లాసాలతో నిండి చైతన్యవంతమైన వ్యక్తిత్వం. జీవితాన్ని ఉల్లాసకరమైన దృక్పథంతో అర్థం చేసుకుని ఆమె బాధలనూ, దుఃఖాలనూ అధిగమించింది, అనారోగ్యకరమైన అభిప్రాయం, లక్షణం మందుకైనా పైకికనిపించకుండా. అటువంటి వ్యక్తి, యీనాడు తనకు పూర్తిగా విరుద్ధమైన జీవిత దృక్పథంతో కవితలు రాస్తున్న ఇండో - ఆంగ్లియన్ కవుల సరసన కూచోబెడతామంటే అంగీకరిస్తుందా? తాము సరోజినీదేవి కంటే ఘనమైన కవులమని తరుచు వారు విర్రవీగుతుంటారు. ఆమె రాసిన కవితల్ని "రుమ్ - తి - కమ్" అని హేళనచేస్తుంటారు. సరే కానివ్వండి. సరోజినీ దేవి, తోరుదత్తు, శ్రీ అరవిందులు మొదలగువారు వివిధ కాలాలలో, వివిధదృక్పథాలతో రాసిన కవితలు మనముందువున్నాయి. జీవితంలో కళారంగంలో వారిస్థానాలు వారికి వున్నాయి. వారిని అలాగే వేరుగా వుండనిద్దాం. వారికేవో బిరుదులూ, తోకలూ తగిలించవద్దు. ఆవిధంగా మనం వారి స్వేచ్ఛను అపహరించనూ వద్దు.

# కవిత - జీవితతత్వం

సరోజినీనాయుడు తన కవితాజీవితంలో ప్రారంభదశలోనే ఆంగ్ల కవితా చరిత్రలో ప్రత్యేకంగా తనకొకకీర్తి లోకాన్ని, నిర్మించుకున్న కవయిత్రి. ఆంగ్లంలో కవితరాసిన ఒక భారతీయవనితగా మాత్రమేకాక, ఆ భాషాసౌందర్యం అతి సహజంగా రచనలో ప్రతిబింబింపజేసిన కవయిత్రిగా, ఆంగ్లభాషా పాండిత్యపు పెన్నిధిగా ఆమెకు గౌరవం కలిగింది. అయితే ఆమె భారతీయ భావనారీతికి దూరంకాలేదు. అచ్చం భారతీయ వనితగా దేశభక్తిగల పుత్రికారత్నంగా, ఈ మహోన్నతజాతి జీవనంలో విడదీయరాని భాగంగా వుండి ఆమె కవితావ్యాసంగం కొనసాగించింది. ఈ విషయం యథార్థం అని ఎంతగా చెప్పినా అతిశయోక్తి కాదు. ఆంగ్లపాఠకులు ఆమెపట్ల అత్యంత ఆదరభావాన్ని ప్రదర్శించారు. ఆంగ్ల సాహిత్యంలో ఆమెకు ఈనాటికీ ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. సరోజినీదేవి రాసిన కొన్ని తాత్విక, సాంకేతిక గీతాలలో కనిపించే సత్యాన్వేషణా కుతూహలం పాఠకులను బాగా ఆకట్టుకుంది. "ఆక్స్‌ఫర్డ్ బుక్ ఆఫ్ ఇంగ్లీష్ మిస్టిక్ వెర్స్" అనే కవితా సంకలనంలో చేరడం ద్వారా ఆమెకు ఆంగ్లకవితాలోకంలో శాశ్వత స్థానం లభించింది. ఆంగ్లసాహిత్యంలో ఆమెకొక స్థానం వున్నదని చెప్పడానికి ఇదే నిదర్శనం.

ఈ సంకలనంలో చేర్చిన సరోజినీదేవి మూడు కవితలలో మొదటిది :

## ఆత్మావేదన

బాల్యగర్వరేఖమీద నడుస్తూ నిన్నడిగాను,
నిశ్వాసపవనంలోంచి నన్ను పుట్టించిన ఓ ప్రభూ!

జననమరణ సిద్ధాంతాల లోతుల్లోని రహస్యాలు
ఒకసారి నా చెవిలో ఊదు స్వామీ!

ప్రతి సుఖం నాకు పంచు, దాన్ని నేను మనసార తింటాను
ప్రతిదుఃఖగీతం వినిపించు, దాన్ని నేను చెవులార వింటాను
భూమ్మీద పుట్టిన తీపి అంతా తినేదాక
చేదంతా మింగేదాకా నా ఆత్మకు తృప్తిలేదు

ఏ ఆనందమైనా బాధైనా
భూషణగానీ, దూషణగానీ
జీవితపరమార్థం విప్పిచెప్పే
మృతిజ్ఞాస వేదాంతమైనా ...
ఏదీ నాకందకుండా దూరంగా పెట్టకు ప్రభూ!

అప్పుడు నువ్వన్నావు, ప్రభూ!
అనంత గంభీరమైన సుతిమెత్తని నాదంతో
బిడ్డా! విన్నాను నీ ప్రార్థన —
ప్రసాదిస్తున్నాను నీకు ప్రపంచంలోని
సమస్త ఇంద్రియ భోగాల సౌఖ్యసంతోష భవనాలు
నిరాశా నిస్పృహలు, దుఃఖాతిశయ గహనాలు

ఆనందాన్నీ కీర్తినీ అంతులేకుండా తాగుతావు నువ్వు
కార్చిచ్చులా ఎప్పుడూ నిన్ను దహిస్తుంటుంది ప్రేమాగ్ని
బాధజ్వాలలు నిన్ను పవిత్రం చేస్తుంటాయి
నిస్పృహావేశంలోని నీడల్ని నశింపచేస్తుంటాయి

నేననే మహాప్రశాంతతకై నీ ఆత్మ ఉవ్విళ్లూరుతుంటుంది
ప్రార్థిస్తుంటుంది, పడిపోతుంటుంది, లేస్తుంటుంది
మైలపడుతుంటుంది, పవిత్రమౌతుంటుంది –
పలవరిస్తుంటుంది పరమశాంతి రహస్యం కోసం

ఆకాశమంతెత్తువాణ్ణి నేను
నీ చెవిదాకా వంగి బోధిస్తుంటాను
బ్రతుకంటే నాతేజోరేఖలు ప్రతిఫలించే పట్టకం
చావంటే నేలమీద పడుతున్న చల్లని నా నీడ.

సరోజినీదేవి రాసిన అనేక యితర పాటల్లోకంటే ఈ పాటలో వాడిన చంధస్సు చాల సులభంగా వుంటుంది. ఈ నిరాడంబర సౌలభ్యంవల్ల నాలుగు భావగణాల (సిలబిల్స్) ఈ పంక్తులు హృదయాన్ని శక్తివంతంగా సూటిగా తాక గలుగుతున్నాయి. అదేవిధంగా ఈ పాటలలోని అంత్యప్రాసల సంగీత సౌలభ్యం పుష్పాల సహజపరిమళంలా ఆహ్లాదకరంగా వుంటుంది. ఆమె రాసిన మరికొన్ని ఇతర కవితలలో అంత్యప్రాసల లయలో ప్రయత్నపూర్వకంగా సిద్ధించిన కృత్రిమత గోచరిస్తుంది. ‘‘ఆత్మావేదన’’ అనే ఈ గీతంలోని తాత్విక చింతనారీతి సుస్పష్టమైనదే. దేవుని పిలుపు ఆమెకు వినిపించింది. తన ప్రశాంత రహోలోకం లోని సౌందర్యాన్ని చూపుతానని ఆయన వాగ్దానం చేశాడు. కవితాభావదర్శనం ఈ గీతంలో స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఈ భావన అంతా జీవన్మరణాల చుట్టూనే పరిభ్రమిస్తుంది.

అదే సంకలనంలోని సరోజినీదేవి రెండవ కవితలోకూడా ఆమె శాశ్వత శాంతి కోసం ఉవ్విళ్ళూరుతుంది. ఇహలోకపు శ్రమలు, దుఃఖాలనుండి విముక్తి చెంద దానికి ఆ శాశ్వతశాంతి అవసరమని భావిస్తుంది.

భయద్వేషాల పాముల పుట్టగా
మనుషులు భావిస్తారీ లోకాన్ని

జీవితం పండడమంటే కోతకువచ్చిన పొలాలు
విధి కొడవలి పదునుకోసం వేచిచూడడంగా –
అయితే నేనుఆత్మను; పుట్టినందుకు నాకు పుట్టెడు సంతోషం
ఎత్తుగా ఒత్తుగా పెరిగిన ధాన్యం కంకుల సందుల్లోంచి
ఉదయకాంతి ఉయ్యాలల్లో ఊగే పక్షుల సంగీతం
వింటున్నపుడు –
ఈలోకపు కోర్కెలతో, గర్వంతో ఏం పని నాకు ?
సాయం సాహస యాత్రలో యింటిమొగం పట్టిన బంగారు
పావురాళ్ళను
నడిపిస్తున్న వెండి రెక్కల తళ తళలు తెలిసినదానికి –
పెద్దగా ఆయాసపడుతున్న యీలోకంతో నాకేం పని ?
ప్రతిసంధ్యలో నీ అనంత ఆశీస్సులతో
సమకూర్చుకుంటున్న నిశ్శబ్దాల ధాన్యపు రాసులను
కలగంటున్నదానికి –

చెప్పవయ్యా ప్రభూ నువ్వే
చప్పటి విధివ్రాతను ఊహించి చతికిలపడమంటావా?
ఏకాంతజీవితం గడపాలనే మాటవిని ఏడవమంటావా ?
సమాధిగోడలు చూచినట్లు భ్రమపడి భయపడమంటావా?
నాగుండె సంతోష జలధిలో నిండామునిగే వుంది
నీ లోతుల్లోనే చిక్కుకుని నిశ్చలంగా వుంది
ఓ జీవితానంద మహాసౌఖ్యజలధీ !
ఓ అనంతత్వ సారభూత సౌందర్యశీలీ !
చెప్పవయ్యా ప్రభూ ! నువ్వే చెప్పు !

ఈ కవితలోని భావచిత్రాలు చాలా స్పష్టంగా తెలుస్తుంటాయి. సరోజినీదేవి తన భావనాగవాక్షాలనుండి బయటపడి శాశ్వతత్వ సరిహద్దులు దాటి ఒక మహా తన్మయత్వపు లోకంలోకి ప్రవేశించిన దృశ్యాలు మనకు కనిపిస్తాయి. ఈ కవిత లోని లోతైన భావాలు నిజాయితితో కూడిన ఆలోచనా పరంపర ఆమెను ఆంగ్ల భాషలోని తాత్విక మహాకవుల హృదయపీఠాలదాకా తీసుకుపోగలుగుతుంది. ఇటువంటి గొప్పకవితలు ఆమె స్వల్పసంఖ్యలో మాత్రమే రాసిందికదా అనే చింత మనకు కల్గుతుంది. మూడవ కవితలో ఇతరుల అనుభూతి ప్రదర్శించడం జరిగింది. అంటే బుద్ధభగవానుని అనుభూతి వర్ణితమైంది.

## కమలాననుడైన బుద్ధభగవానుడు

హే, బుద్ధభగవాన్ !
నీ పద్మాసనగతముకుళిత నేత్రపద్మాలలో
నీ అభయహస్త ముద్రలో, ధ్యాననిద్రలో
ఏ పారమార్థిక మహాసౌఖ్యచింతన మేలుకొన్నది ప్రభూ !
ఏ శాశ్వతమహాశాంతిపథం యీ లోకాన్ని ఏలుకున్నది
ప్రభూ !

జ్ఞానచక్షువుముందు భాసించే ఏ మహాశాంతి
ఈ నిరంతర పథికుల్ని గమ్యం చేరుస్తుంది ?
మేం నడిచే దారిపొడవునా మార్పుగాలి వీస్తున్నది
రేపు రాబోయే దుఃఖాలు గడచిన బాధాగాథల్ని వెక్కి
రిస్తున్నాయి
ఒక కలగడిచి యింకోకల; ఒక బాధల వంతెన దాటితే
ఇంకో వంతెన ఎదురవుతుంది

బ్రతుకు దారాల్ని మృత్యువు పుటుక్కున తెంచేస్తున్నది
ప్రసవవేదనలాంటి యీ నిరంతర జీవిత దుఃఖాలు
ఈ వేడిమి, యీ గగుర్పాటు, త్రుళ్ళింతలు
చీలి చితికిన గర్వరేఖలు, అణగిన అహంకారం
పరాజయం నేర్పిన పాఠాలు పుష్కలంగా వున్నాయి
పూవుకోద్దామంటే అందదు, కాయ నోటిదాకా రానేరాదు
అయితేనేం! నీ పద్మాసన సింహాసనం కొనలు కొరికి
శాంతిని మాత్రం సంగ్రహించుకున్నాం, పవిత్రత పాడు
చేసుకున్నాం.

చీకట్లోకి చేతులు చాచి,
అందని కోర్కెల ద్రాక్షలు అందుకోబోతాం మేము
దివ్యపర్వతశిఖరాలు చేరుకోవాలనుకుంటాం
విశ్వాసంలేని మనసుతో, తిరిగి తిరిగి అలసినకాళ్లతో
ఎక్కుతూ –
కాని స్వర్గద్వారంలో దూరాలనే ఆత్మ ఆరాటాన్ని
అదుపులో పెట్టలేక పోతున్నాం.
దూరంగావున్న గమ్యం త్వరగా పరుగెత్తుకొస్తున్నట్లు
భ్రమ పెడుతోంది, భయపెడుతోంది
మనిషిచేసే ప్రతిఅశాశ్వతకార్యం శాశ్వతత్వంలోభాగమే!
అయితే ఎలా మేం చేరుకునేది
ఆ మహాపవిత్ర నిర్వాణ గమ్యానికి?

ఆక్స్‌ఫర్డ్ బుక్‌లో చేర్చిన యీ మూడు కవితలూ, సరోజినీదేవి లోగడ ప్రకటించిన కవితా సంకలనాలనుండి సేకరించినవే. కాని ఆమె రాసిన తాత్విక సాంకేతిక గీతాలు యీ మూడుమాత్రమే కాదు. నిజానికి ఆమె ప్రకటించిన మూడు సంకలనాల్లోనూ యిటువంటివి అక్కడక్కడ మెరుస్తూనే వుంటాయి. వాటిలో ఒక లోతైన జీవిత తత్వచింతనా, పరలోక దార్శనికభావనా కనిపిస్తుంటాయి. ఇంగ్లండులోవున్న సమయాల్లో సరోజినీదేవి సైమన్స్, గూస్ మొదలగు ప్రసిద్ధ కవివరేణ్యులతోనూ, సాహిత్య విమర్శకులతోనూ కలిసి మెలిసి వుండడమే కాక అనేకమంది రైమర్స్ క్లబ్ సభ్యులతోకూడా కలిసి తిరుగుతుండేది. అప్పుడే బహుశః ఆమె ఆంగ్లభాషలోని పదవిన్యాస వైఖరులలో సంపూర్ణత సాధించుకోగలిగింది. "శబ్దసాధుత్వము, ప్రయోగశిల్ప నైపుణ్యమూ, పదబంధ నిర్మాణ కౌశలమూ, భాషలోని లయజ్ఞానమూ, ఆమెకు అబ్బినవి. ఇవే చేతికి అంద నట్లయితే ఆమె తన ఊహలనూ అనుభూతులనూ అంత మనోజ్ఞమైన కవిత్వంగా మలుచుకోగలిగి వుండేదికాదు" 1. ప్రేమ, విశ్వాసము, దేశభక్తి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మొదలగు వివిధోహల విశాల కవితా ప్రపంచ పరిధిలో ఆమె ఎన్నో కావ్యయాత్రలు చేసింది. ఇవన్నీ ఆత్మీయమైన హృదయానుభూతులు హఠాత్తుగా కుమ్మరించినట్లుగా కవితలలో దర్శనమిస్తాయి. లోపలనుండి బైటికి ఉబికివస్తున్న శబ్దసౌందర్య వేగవాహినిలో అవి మునకలు వేస్తుంటాయి, పరస్పర సంబంధంగల కవితాభావాలను క్రమపద్ధతిలో అల్లాలని ఆమె ప్రయత్నించనేలేదు. ఒక చెట్టుమీద నుండి మరొక చెట్టుమీదికి ఎగిరినట్లు ఆమె రచనలు "స్వల్పకాల విహంగ యాత్రలు". ఇటువంటి సందర్భాలలోనే కవితా రచనలో ఆమె సంపూర్ణ విజయం సాధించింది. "తెగిన రెక్క" కావ్య సంకలనంలోని "గుడి, ప్రేమ యాత్ర" మొదలగు కావ్యఖండాలలో ఒకానొక తాత్విక భావనా పథకాన్ని తయారుచేసుకున్నప్పుడు తన వ్యక్తిత్వాన్ని మరచిపోయి, తనను ఎవరికో అంకితం చేసుకున్నప్పుడు, మానవ దైవికప్రేమ భావనలను ఏకసూత్రంతో బంధించ దలచినప్పుడు - పాఠకుణ్ణి నమ్మించలేకపోయింది. ఎందుకంటే ఆమెలోని మానవభావావేశం అంత ఎక్కువగా తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకుంటూ ముందుకు దూకేది.

ఆమె అనేకసార్లు మృత్యువును ఆహ్వానించేది. కాని యీ భావన ఇలియెట్ రాసిన జిరోంటేయన్ లోలాగా లోతైన భావనగా వుండేదికాదు.

---

1. ఆంగ్లంలో భారతీయ కవిత పే. 175.

ఇలియట్ శైలి సంభాషణ స్థాయిలో వుండేది. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకుని రచనసాగేది. సరోజినీదేవి మృత్యువుతో ముఖాముఖి మాట్లాడిన సమయాల్లో అటువంటి పదచిత్రాలు నిర్మించడంలో కృతకృత్యురాలు కాలేదు. ఆమె గత జీవితాన్ని "శూన్యంలో" గడిపింది. "ప్రయోజన రహితంగా" గడిపింది. కాని అంతమాత్రాన తాను లొంగిపోదు. రాజీపడదు. ఆ "నిశ్చితమహాదర్శాన్ని" అందుకోవాలనే ఆకాంక్ష వ్యక్తంచేస్తుంది. ఆమె కవితల్లో "అంతటి వెలుగుటూహలలో అంతర్గర్భితంగా దుఃఖపు చీకటి రేఖలు" ఎందుకు తొంగిచూస్తుంటాయని ఒకసారి గోఖలే మహాశయుడు ఆమెను అడిగాడు. "మృత్యువు నీడలు మీదపడేటంత దగ్గరగా నీవు వెళ్ళుతున్నావా" అని ప్రశ్నించాడు. ఆమె కాదని జవాబు చెప్పింది: "నేను జీవితానికి అత్యంత సమీపంలోకి వెళ్ళాను, కాని దానిలోని మంటలు నన్ను కాల్చేశాయి" అని. అయితే మానవజీవిత వాస్తవికతా చిత్రణ టి. ఎస్. ఇలియట్‌లో లాగా సరోజినీదేవి కవితల్లో స్ఫురించదు. ఆమె కవితల్లోని భావయాత్రలు జీవిత వాస్తవానికి ఎన్నడూ సన్నిహితంగా వుండవు. అయితే జీవితంలోని అనేక సంకటాలనూ, ఆటంకాలనూ దాటిపోవాలనే తపన మాత్రం, నిజాయితీతో కూడిన యీ ఆకాంక్షమాత్రం అంతటా అల్లుకునే వుంటుంది. ✽

సరోజినీదేవి కవితలకు సాహిత్యలోకంలో మంచి ఆదరణ లభించింది. స్వర్ణప్రాంగణం సంపుటి 1905 లో మొదటిసారిగా అచ్చుపడింది. కాని త్వరత్వరగా వరుసగా 1906 లో, 1909 లో, 1914 లో, 1916 లో (రెండు సార్లు) విలియమ్ హినిమన్ దానిని తిరిగి ముద్రించాడు. అంత చిన్న వయస్సులోనే యింతబాగా అమ్ముడయిన కవితలను రాయగలగడం - అదీ పరాయి భాషలో రాయడం చెప్పుకోదగిన ఘనకార్యమే. 1905 లో ప్రకటించిన సంపుటిలోని కవితలు ఆమె 17 - 26 సంవత్సరాల మధ్యవయస్సులో రాసినవి. ఇందులోని "పద్మాసనుడైన బుద్ధదేవునికి" అనే గీతాన్ని "ఆక్స్‌ఫర్డ్ బుక్ ఆఫ్ ఇంగ్లీషు మిస్టిక్ వెర్స్" లో చేర్చారు. అంటే సరోజినీదేవికి ఆ విధంగా ఆంగ్లమహాకవుల సరసన పీటవేసి కూచో బెట్టారన్న మాట. "మోడరన్ మ్యూజ్" అనే దానిలో కూడా యీ గీతం మళ్ళీ ప్రకటించడం ద్వారా యీ భారతీయ కవయిత్రికి ఆంగ్ల సాహిత్యలోకం మరొకసారి నివాళి ఎత్తింది స్వర్ణప్రాంగణంలోని కవితలన్నీ "చెట్లమీద తళుక్కుమంటున్న మిణుగురుల" వంటి ప్రేమగీతాలు, భావగీతాలే అంటూ వాటిని సాహిత్యలోకం కొట్టిపారవెయ్యనూ లేదు. ఇంగ్లాండులోని పత్రికలు వాటిని గురించి గొప్పగా పొగుడుతూ సమీక్షలు ప్రకటించాయి. ఆ కాలపు మహా

కవులుకూడా స్వాప్నికలోకంలో విహరిస్తూ యీ భారతీయ కన్య రాసిన భావ గీతాలను ప్రశంసించడానికి ఏ మాత్రం వెనుకాడలేదు. ఒక విమర్శకుడు యిలా రాశాడు. "ఊహాచిత్రాలన్నీ ప్రాచ్యసంప్రదాయానికి చెందినవే. అయినా వాటిలో అంతర్గతంగా కనిపిస్తున్న ప్రాథమిక మానవతా దృక్పథం, నిజమైన కవిత్వానికి ప్రాచ్యసంస్కృతి అనీ, పాశ్చాత్య సంస్కృతి అనీ విభేదం అడ్డురాదనే సత్యాన్ని ఋజువుచేస్తున్నది". తమ చుట్టూవుండే లోకాన్నీ, అప్పటి పరిస్థితులనూ కవులు గ్రంథస్థం చేయాలి. ఆ దృష్ట్యాచూస్తే సరోజినీదేవి తన కాలపరిస్థితులను పూర్తిగా వినియోగించుకుంటూ కవితా రచనలో సంపూర్ణ విజయం సాధించిందనే చెప్పాలి. అయితే ఆమె దర్శించిన లోకం ప్రేమ భావనా ప్రేరితమైన లోకమే. నిత్యజీవిత యాథార్థ్యాలను స్పృశించిన లోకంకాదు. సమకాలికమైన విషాదసంఘటనలనూ, ఆచారాలనూ ఆమె తన కావ్యవస్తువులుగా స్వీకరించినప్పటికీ, ఆమె ప్రధానంగా చూసినది ప్రేమలోకమే. ఆమె రాసిన ప్రేమగీతాలచుట్టూ ఎప్పుడూ ఒక ఊహా జగత్తు అల్లుకునే వుంటుంది. జె. బి. ఈట్స్ ఆమెను "శుద్ధ ప్రేమ కవితావాది" అని వర్ణించాడు. ఎడ్వర్డ్ థామస్ "ఆమె భావనలో కవితాలక్షణాలు కుప్పలు తెప్పలుగా" వున్నాయన్నాడు. 1912 లో కాలవిహంగం ప్రకటించినప్పుడు ఆమె "ఒక అసాధారణమైన బాహ్యసౌందర్యమూ, అంతర్భావనా వైభవమూ" అందుకోవడంలో విజయం సాధించిందని వ్యాఖ్యానించాడు ఎడ్వర్డ్ థామస్. మరొక విమర్శకుడు యిలా అన్నాడు: "మనోరంజకమైన పదబంధాలను ఆమె పేజీలనిండా నక్షత్రాలలాగా వెదజల్లుతుంది. అయినా పద్యాంతంలో తళుక్కున మెరిపించడానికి సౌందర్యాన్ని దాచిపెట్టుకోవడంకూడా ఆమెకు బాగాతెలుసు. ఆమె భారతదేశానికి ఎలిజబెత్ బ్యారెట్ బ్రౌనింగ్ వంటిది"2. ఇటువంటివన్నీ ఊకదంపుడు మాటలుకావు; హృదయపూర్వకంగా చేసిన ప్రశంసలు. డెన్నిస్ స్టోల్, ఇ. యం. ఫాస్టర్, హెర్మన్ హౌల్డ్, గ్లాస్ వర్త్ వంటి ప్రముఖులు కూడా సరోజినీదేవి కవితలు చదివి ఆనందించారు.

సరోజినీదేవి కవిత్వంలో వాడే భాష అద్దంలో చూసుకున్నట్లు అందరికీ అర్థమయ్యేది. వ్యాఖ్యానం చెప్పవలసిన అవసరమే ఉండదు. చిన్న పిల్లలుకూడా చదువుకుని-అర్థంచేసుకోవచ్చు. అయితే ఆ పిల్లలు భారతదేశంలోని వారైవుండాలి. అటువంటివారికి అంతా సులభంగానే అర్థం అవుతుంది. భావప్రకటనలో అయో

---

2. ఇండియన్ రైటింగ్ ఇన్ ఇంగ్లీషు పే. 176.

మయత్వం కోసం సరోజినీదేవి ఎన్నడూ ప్రయత్నించలేదు. ఈ కారణంచేత సాహిత్యంలో జార్జియన్ దృక్పథం కలిగిన వారి బృందంలో ఆమె యిమడదు. సాహిత్యంలో జార్జియన్ దృక్పథం రచనలో స్వాతంత్ర్యాన్ని వరించడమేకాక అన్ని రకాల ఛందోబంధాలనూ లయవిన్యాసాలనూ త్రోసిరాజన్నది. చివరకు అర్థాన్ని, అన్వయాన్నికూడా వదలివేసింది. ఈ దృక్పథంగల రచయితలు 1911-12 లో యీ కొత్తదృక్పథాన్ని కవితలో ప్రవేశపెట్టి రినయజాన్స్ (పునరుజ్జీవన), రొమాంటిక్ (భావవాద) యుగాలవలె తామొక కొత్త సాహిత్య యుగాన్నే స్థాపించాలని ప్రయత్నించారు. విక్టోరియా, ఎడ్వర్డ్ కవితాయుగాలలో సంప్రదాయానుసరణ మరీ మితిమీరి, స్తబ్దత ఏర్పడిన కారణంగా దానినుంచి బైటపడటానికి వీరు ఒక నూతన యుగాన్ని ఆవిష్కరించాలని కృషిచేశారు. అయితే యీ దృక్పథంకల కవులుకూడా స్వాప్నికలోక విహారులే. ఈ విషయంలో మాత్రం సరోజినీ దేవికి వీరితో కలిసే లక్షణం పూర్తిగా వుంది. ఈ సాహిత్య దృక్పథం ప్రారంభమైంది 20 వ శతాబ్దం రెండవ దశాబ్దంలో. అప్పటికింకా మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కాలేదు. అందుకే వారికి కాలం ఎడతెగని వసంతంగానే కనిపించింది. 'గాలి స్వచ్ఛంగా వుంది. ఉదయం 7 గంటలు' గా వుంది. ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న యీ యువకవులకు కష్టాలు గంపలతో మోసుకొస్తున్న భవిష్యత్తు యింకా దర్శనం యివ్వలేదు. క్షీణ సాహిత్య యుగం గడిచిపోయింది. కలల జబ్బునపడి కాలం గడిపిన సింబాలిస్టులుకూడా వెనుకంజవేసి పూర్తిగా సాహిత్య రంగంనుండి తప్పుకున్నారు, ఇప్పుడు కొత్తజీవితం కనిపిస్తుంది - కొత్తయుగాన్ని ప్రారంభించాలి. అందుకే యీ బృందం కవులు "లార్క్" లను గురించి, "నైటింగేల్స్" గురించి కవితాగానం చేశారు.

భారతదేశంలోకూడా స్వాతంత్ర్య భావన ఉషోదయపు తొలిరేఖలు తొంగి చూస్తున్న సమయం. సరోజినీదేవి యీ వసంత సంతోషలోకాన్ని యిదివరకే దర్శించిన కవయిత్రి. ఇంతకుముందే ఆమె ఒక ప్రాచ్య - ఆంగ్ల పద్ధతి కవితా రచనకు పునాదులు వేసింది. నిజమైన ప్రతి కవికీ యీ కొత్త శైలి తప్పనిసరిగా వుండవలసినట్టిదే. ఆ విధంగా ఒక నూతన కవితా దృక్పథం ఆమె ప్రారంభించింది. ముందుముందు కవిత్వం వృద్ధి పొంది వికసించడానికి గట్టి పునాదులు నిర్మించింది. నేటి క్లిష్టపరిస్థితుల కృత్రిమ జీవితరంగంలో, కటిక వాస్తవానికి అంటిపెట్టుకుని కలల లోకం చూడలేని నేటి వికారపరిస్థితుల్లో ఆమె స్థాపించిన కవితారీతి పాఠకలోకానికి హాయి సమకూరుస్తూనే వుంటుంది. ఒక ఇంగ్లీషు విమర్శ

ండు ఆమెను "మహిళ రూపంలో వచ్చిన మాథ్యూ ఆర్నాల్డ్" అని కొట్టి పార వేస్తే, దానికి జవాబుగా ఒక భారతీయ విమర్శకుడు తిరిగి ప్రశ్నించాడు. "ఆర్నాల్డ్ మహిళ అయితే సాహిత్యలోకంలో అతని స్థానం మాత్రం యింతకంటే తక్కువ అసందర్భంగా వుండేదా?"

ఇంగ్లండులో సరోజినీదేవికి అంత పేరు ప్రతిష్ఠలు వచ్చినప్పటికీ, ఆంగ్ల సాహిత్యలోకంలో స్థానం సంపాదించుకోవాలని చూస్తున్న ఒక భారతీయ వనిత గానే ఆమెను చూసేవారు. ఎందుకంటే జేమ్స్ జాయిస్, ఈట్స్, సీన్ ఓకేసి, ఫాక్నర్, యింకా యితర ఐరిష్, అమెరికన్ రచయితలతో పోల్చినప్పుడు ఆమె వారి అంతస్థుకు పెరగలేకపోయింది; సమకాలికమైన ఒక కొత్త ఆలోచనారీతినీ, దృక్పథాన్నీ సాహిత్యంలో సృష్టించలేకపోయింది. ఉదాహరణకు ఈట్స్ కొంత వరకు సింబాలిస్టు. ఆంగ్ల రచయితలను ప్రభావితం చేసిన ఫ్రాన్సుదేశపు సింబాలిస్టుల గ్రంథాలను అనుసరించి రచనావ్యాసంగం సాగించాడు. సింబాలిజంతో విక్టోరియా అనంతరకాలపు క్షీణ సాహిత్యయుగం కూడా ప్రారంభమైంది. కాని యీ దృక్పథాలను సరోజినీదేవి తెలిసి, కావాలని ఏ నాడూ అనుసరించలేదు. రచనలో సర్వస్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న జార్జియన్ రచనా సంప్రదాయానికి గానీ, నిరాశా నిస్పృహలతోకూడి, అరాచక విషాద సంఘటనల ఆవేదనలో మునిగి తేలుతూ, వాస్తవికతలో కూరుకుపోయిన ఆధునిక దృక్పథానికిగానీ ఆమె లోనుకాలేదు. కాని భారతదేశానికి కూడా దాని దృక్పథాలు దానికి వుండనే వున్నాయి. ప్రళయం వంటి విధ్వంసకర భావనారీతులు ప్రచారమవుతూనే వున్నాయి. "ఇంజనురైలు పట్టామీదవుండే వంపులను విధిగా అనుసరిస్తూ ఎలా పోతుందో, అదే విధంగా (ఆమె కవిత) సొంతరైలు పట్టాలమీద పోతున్నట్లు కనిపిస్తుంది." 3

కావ్య వస్తువుల ఎన్నికలో సరోజినీ నాయుడుకు విశాలమైన ప్రాచ్య పౌరాణిక గాథా ప్రపంచం అంతా దర్శనమివ్వటానికి సిద్ధంగానే వుంది. కాని ఆమె మాత్రం ఎన్నడూ కథాకావ్యరచనా ధోరణిలో ప్రయత్నం చేయలేదు భారతదేశ పరిస్థితిని తన అనన్య సాధ్యమైన ప్రత్యేక పద్ధతిలో అంటే తన పాఠకులను రంజింపచేసి ఆశ్చర్యనిమగ్నులను కావించే ప్రతిభావంతమైన పాటల రూపం

3. ద గోల్డెన్ ట్రెజరీ ఆఫ్ ఆంగ్లో - ఇండియన్ పొయిట్రీ—వి. కె. గోకక్ పే. XXII.

లోనే ప్రదర్శించింది. ఆమె కావ్యగానం చేస్తున్న సమయంలో శ్రోతలు ఆనంద తన్మయత్వంలో ఊహల ఉయ్యాలలూగేవారు. ముఖ్యంగా "పల్లకిబోయీలు" వంటి జానపద సరళిలో రాసిన పాటలు పాడుతున్నప్పుడు శ్రోతలకు అటువంటి రసానంద అద్వైతస్థితి కలుగుతుండేది.

ఆమె పాటలలో ఒక్కొక్కసారి మామిడితోపులు, కొబ్బరి వృక్షాల మధ్యలో కళకళలాడే గ్రామ జీవితంలో ప్రచారంకోసం టముకు వేస్తున్న ధ్వనులు వినిపించేవి. లేదా మృదంగం, తబలా వాయిస్తున్న శబ్దాలు వింటున్నట్లుండేది. గ్రామాలలో పల్లెకారులను నిద్రలేపి చేపల వేటకు పొమ్మని సుప్రభాతగీతాలు పాడుతున్నట్లుండేది. బహుశా వారు ఒక విందులోనో, పెళ్ళిసందడిలోనో నిమగ్నులై ఉండగా ఆమె పాటలు వారిని ప్రబోధిస్తూ టాంటాం వేస్తున్నట్లుండేవి.

### కోరమాండల్ పల్లెకారులు

మేలుకోండి మేలుకోండి, అన్నలారా మేలుకోండి !
ఉదయకాంతుల ఉయ్యాలలో ఆకాశం నిద్రలేచి
ప్రభాత గానాలు చేస్తున్నది
చైతన్యం వెలుగులై లేస్తున్నది
మేలుకోండి అన్నలారా మేలుకోండి
గాలి యింకా కదలడం లేదు
తెల్లవార్లు గుక్కపట్టి యేడ్చిన శిశువులా
సొమ్మసిలి పడుకునేవుంది
ఒడ్డున పడేసి వుంచిన వలలన్నీ ఏరుకోండి
సాగించండి మనతెప్పలు, ప్రతిరోజు ఆర్జనకు తిప్పలు
మేలుకోండి, మేలుకోండి అన్నలారా మేలుకోండి
సాగరపుత్రులు మీరు, జలదేవతవారసులు మీరు
అలలు తెచ్చే అనంత సంపద

వలల చేతుల్తో అందుకోవాలి–
మేలుకోండి మేలుకోండి అన్నలారా మేలుకోండి!

తరువాత సరోజినీదేవి పల్లెకారుల గుడిసెల్లోకి తొంగిచూసి ఉయ్యాల ఊపులాగా లయాన్వితంగా పాడుతుంది.

రమలాల సెలయేటి చేపులో
వాసన ఘుమాయించు తోపులో
వరిచేల గుసగుసల చూపులో ...
ఒక తీపికల మీకు తెచ్చాను
పొగమంచులో ముంచుకొచ్చాను
మేలుకోండి మేలుకోండి అన్నలారా మేలుకోండి.

మనోహరమైన చిన్నచిన్న గీతాలలో సరోజినీదేవి గ్రామీణజీవితంలోని అలవాట్లనూ, ఆచారాలనూ ప్రదర్శించేది. అవి పరదాస్త్రీల ప్రైవేటు జీవితంలోకి కూడా తొంగి చూస్తూ పాఠకుల హృదయాలను హత్తుకుంటుంటాయి.

గోరింటచెట్ల గుబురుల్లోంచి
కోకిలమ్మ కూస్తున్నది
కుహూ కుహూ ... కుహూ కుహూ
రండి రండి కన్యలారా, గోరింటాకు కోసుకుందాం
నవ వధువుల నుదుటి మీద
తిలకరేఖ దిద్దుకుందాం
మధురమైన అధరాలమీద
తాంబూల అరుణిమ ధరించి
నునులేత తెల్లని గోళ్ళకు
గోరింటాకు పెట్టుకుందాం
రండి రండి కన్యలారా గోరింటాకు కోసుకుందాం.

దుఃఖమూ విచారమూ ఆమె మనస్సును పెనవేసుకొని వున్నప్పటికీ కవితలో భావనలో వసంతం ఎప్పుడూ ఇల్లు కట్టుకొనే వుండేది. పూవులూ రంగులూ వసంతోదయపు పరిమళాలు దర్శనమిస్తూనే వుండేవి. వర్షానికి కొట్టుకుపోయిన మట్టిలాగా ఆమె విచార. భావనలను ఇవి తుడిచివేస్తుండేవి.

"జేబున్నీసా సౌందర్యగీతాలు" వంటి రచనలలో సరోజినీదేవి సృష్టించిన భావ చిత్రాలలో ఒకవైపు భారతీయత, మరొకవైపు పర్షియన్ సంస్కృతి చ్ఛాయలూ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంటాయి.

భావచిత్రాల నిర్మాణంలో సరోజినీదేవి మీద ఉమర్ ఖయాం ప్రభావం చాల ఎక్కువగా వుంది. కాని సరోజినీదేవి పర్షియన్ ఉర్దూ భాషలలో గొప్ప విదుషీమణి. ఇస్లామిక్ ప్రపంచంలో నుండి అనేక విషయాలను సంగ్రహించి ఆమె తన భావచిత్రాలను నిర్మించుకుంటుంది.

పర్షియన్, ఉర్దూ, హిందీ కవులవలె ఒక గాఢమైన తాత్విక దర్శనం సరోజినీదేవికి లేదు. ఆమె కవితలో లోతైన తాత్విక చింతన కనిపించదు. తన కవితా ప్రతిభాధనాగారం నుండి కొల్లగొట్టుకొని తెచ్చిన మనోజ్ఞమైన అనేక రూపకాలంకారాలు ఉపమానాలంకారాల ప్రదర్శనతోనే ఆమె కవితా హృదయం తృప్తిపొందింది. మనోహరమైన రెండు పంక్తులలో సరోజినీదేవి చంద్రుణ్ణి ఆకాశపు నుదుట దిద్దిన అందాలతిలకంగా అభివర్ణించింది.

పసిడిలా మెరుస్తున్న చందమామ ముక్క
ఆకాశం నొసటిమీద ప్రకృతి దిద్దిన తిలకం చుక్క

సరోజినిదేవి తన జీవితంలో ఎల్లవేళలా కవిత్వం రాయడానికే అంకిత మైనట్లయితే, తనకున్న కవితా ప్రతిభ లోతులను ఇంకా ఎక్కువగా త్రవ్వుకు న్నట్లయితే కావ్యలోకంలో ఇంకా ఎంత ఎక్కువ పైకి ఆమె ఎగురగలిగేదో చూపడానికి ఈ రెండు పంక్తుల ఉదాహరణ ఒక్కటే చాలు.

సరోజినీదేవి కవితలోని పదవిన్యాసం, శాబ్దికలయ మరీ విపరీతమై విసుగు పుట్టించేట్లుంటాయి. అయినా వాటిని అదుపులో పెట్టుకునే శక్తి కూడా ఆమెకు పుష్కలంగానే వుంది. ఆమె ఆంగ్లఛందస్సులు అనేకం వాడుతుంది. ఛందో భంగాలు వుండవు. "అయాంటిక్" వృత్తాల్లో "అనాపెస్టిక్" గణాలను మధ్యలో

ప్రవేశపెట్టి రాయడం ఆమెకు యిష్టం. అయినా శ్రవణపేయమైన శబ్దలయను మాత్రం ఏ మాత్రం భంగపరచదు. ఒక ఉదాహరణ. *

మన పాటలు నగరాల శిథిలాల మూటలు
కాంతిలేని నగరాల గాజు కండ్ల కన్నీటి ఊటలు
అందం ఆనందం చచ్చిన నగర సుందరీమణుల నిర్జీవపు బాటలు

ఇవీ మన పాటలు—
మన పాటలు పాతకాలపు యుద్ధాల్లో కత్తుల వేటులు
బూజుపట్టిన రాజ కిరీటాల బొంగరాల ఆటలు
సంతోషం దుఃఖం సమంగా కలిసిన పొడి పొడి మాటలు
ఇవీ మన పాటలు —

అనర్గళంగా విశేషణాలను వాడడంలో కూడా సరోజినీదేవి ప్రతిభ గోచరిస్తుంది. "మెరుపులా ఒక్కవిశేషణాన్ని విసరికొట్టి ఊహల, అనుభూతుల కొత్తప్రపంచంమీద వెలుగులు విరజిమ్ముతుంది. ఆభరణంలా మెరిసే ఒక పదబంధం వాడడంలో ఆమెలోని కల్పనా సౌందర్య చమత్కృతి తటాలున మెరుస్తుంది." 4

రచనలో తాను అనుసరిస్తున్న పాతపద్ధతులతోనే ఆమె చాలా వరకు సంతృప్తి చెందినట్లు కనిపిస్తుంది. తన సొంతం అని చెప్పుకోదగిన ఒక ప్రత్యేక శిల్పాన్నీ, శైలినీ ఆమె పోషించుకోగలిగినప్పటికీ, ఆ పాతపద్ధతుల పరిధిలోనే గిరి గీసికొని కూచొని సంతృప్తి చెందింది. కొంతకాలం తర్వాత ఆమె చేపట్టిన కథాంశాలు కూడా కట్టె విరిచి పొయిలో పెట్టినట్లుండేవి. పూర్వసంస్కృత కవులు వాడినట్లుగా మిలమిల మెరిసే విశేషణాలు కుప్పించినప్పటికీ అదుపు తప్పిన ఆవేశంతో పడికట్టురాళ్ళుగా పడినట్లు పాదపూరకాలుగా కనిపించేవేగాని అవసరమై వాడినట్లుండేవి కావు. ఒక దృశ్యం, ఒక నాయకుడు, నాయిక, ఒక ఆచారం, మతం

---

* ఆంగ్లఛందస్సు తెలిసి సరోజినీదేవి రాసిన ఆంగ్ల పద్యం చదివితేగాని యీ మార్పు అర్థంకాదు.

4. సరోజినీనాయుడు ప్రసంగాలు, రచనలు పేజి. XVIII.

ఏదైనా సరే దేనిని వర్ణించే విశేషణమైనా అతిగానే వుండేది. వాడివాడి అరిగినట్లే వుండేది. భారతీయ జానపదగాథాసాహిత్యాన్ని ఆమె అంతగా పట్టించుకోలేదు. ఒకవేళ పట్టించుకున్నా వాటిలోని వీరత్వ లక్షణాలను మరీ నమ్మలేనంత అతిగా చిత్రించేవి.

రైటర్స్ వర్క్‌షాప్ తరఫున "ఆంగ్లంలో ఆధునిక భారతీయ కవిత్వం"[5] అనే సంకలనాన్ని ప్రకటించారు. అందులో 1947 కు పూర్వం ఉన్న కవుల్లో విశేషప్రతిభవున్నవారుగా ఆరుగుర్ని అంగీకరించారు. తోరుదత్తు, మన్మోహన్ ఘోష్, సరోజినీనాయుడు, ఆర్. సి. దత్తు, శ్రీ అరవిందులు, హరీంద్రనాథ్ చటోపాధ్యాయులను ఆమోదించారు. ఈ కవులందరూ ఆంగ్లభాషను తమ "ప్రథమ భాషగా" గుర్తించి, దాని ద్వారా కవితారచన చేసినవారే. కాని మనకు అందరికీ తెలిసిన విషయమే; వారు మన దేశంలో భాగంగా జీవించిన వారు. విదేశీ భావాలను వెదజల్లినవారు కాదు.

విశేష ప్రతిభా సంపన్నులైన యీ ఆరుగురి కవితా రీతులను గురించి తమ అభిప్రాయాలు ప్రకటించవలసిందని ఆ గ్రంథంలో ఆధునిక కవులను కోరారు కూడా. భాషలోని నుడికారాలు, రచనారీతులు, పదబంధాలు మొదలైన వాటిని పోల్చిచూసి పాతకవితారీతులను బయలుగా ఉపయోగపడే కొత్తకవుల మేనిఫెస్టో ప్రకటించారు. అయితే యీ పాతకొత్తల పోలిక ప్రయత్నం కూడా పాత మూసలో పోసినట్లేవుంది; ద్వేషభావపూరితంగానూ ఉంది. ఈ పోలిక ప్రయత్నం లేకుండానే యీ కవితా సంకలనం కూర్చి ప్రకటించవచ్చుగదా. సరోజినీదేవి దీని మీద చేసిన వ్యాఖ్యానం నాకు వినిపించింది. "ఆధునిక" ప్రమాణాల ప్రకారం నేనెందుకు రాయాలి? నాకు యిష్టం వచ్చిన రీతిలో రాసు కుంటాను" అని. ఆత్మ (సోల్), ఆధ్యాత్మిక (స్పిరిచువల్), అంతులేని అగాథాలు (సటిల్ డెప్త్స్), అమర (డెత్‌లెస్) మొదలైన మాటలు పూర్వకవితలో (ఆంగ్లంలో) పదే పదే వస్తూ రోతపుట్టించేవిగా తయారయినవని ఆ గ్రంథంలో విమర్శించారు. కవులను ఒక ప్రత్యేక వ్యక్తిత్వం వుంటుందనీ, ఆధునిక కవిత్వం యీ చెత్తపదాలనుండి విముక్తి కావాలనీ వారు అందులో ఉద్బోధించారు. కాని పూర్వకవులు రాసిన సమయంలో వారి భాషలో యిటువంటి మాటలే రసవంతంగా

5. పి. లాల్ సంపాదకత్వాన.

హృదయోల్లాసకారకంగా వుండేవి గదా. మరి వారిని వారి త్రోవన పోనివ్వ కూడదూ. ఆధునిక కవిత్వం మనం రాసుకోకూడదూ! ఆడెన్, ఇజ్రాపౌండుల కవితలు చదివి ఆనందించడానికి వారిని వర్డ్స్ వర్త్‌తోనూ టెన్నిసన్‌తోనూ పోల్చ వలసిన అవసరం ఏముంది? ప్రతి కవీ, నిజానికి ఒక యుగంలో జీవిస్తాడు. ఆ యుగం వారి కోసమే రాస్తాడు. సరోజినీదేవి జీవించిన కాలం ప్రాచ్య వైభవాలను ప్రపంచానికి చాటిచెప్పవలసిన కాలమని ఆమె భావించింది. ఆ సంకలనంలో యింకా యిలా రాశారు. "కవిత్వం మూర్ఛలాగా దానంతట అది హఠాత్తుగా బైటికి పొంగే ఆవేశపు కుమ్మరింతకాదు. మానసిక ఉద్వేగం సమన్వయ స్థితిని పొందిన దశలో నుండి ఒక పద్ధతి, పథకం ప్రకారం సున్నిత మైన యింద్రియజ్ఞానం నిర్మించుకునే భవనం అది. అందమైన విశేషణాలు, పద బంధాలు దొర్లించడం ఒక కళాఖండం మీద దాన్ని కొరుక్కుతినే ద్రావకం పోసి నట్లే వుంటుంది. భాషలో వుండే శక్తినీ, నడకనూ చాలా జాగ్రత్తగా వాడు కోవాలి. కాని జాతర్లలో తాగి తందనాలాడినట్లు యిష్టం వచ్చినట్లు దాన్ని పాత కుడి మీదకి గుప్పించకూడదు. భాషనూ, దాని అందాలనూ ప్రయోజనకరంగా వాడుకోవాలి."

అయితే చచ్చిపోయిన వాళ్ళకి బ్రతికి వున్న మనం యిట్లా చేయాలి, అట్లా చేయాలి అని ఆదేశాలివ్వలేంకదా! మనం వేటిని గురించి తప్పులు పడుతున్నామో నిజానికి వాటివల్లనే పూర్వకవిత మహాకవిత్వంగా ఆనాడు చెలామణి అయింది. తూర్పుదేశాల్లోని కవిత్వంలోనూ చివరకు గ్రీకు కవిత్వంలో కూడా ఉపమానాలూ ఉత్ప్రేక్షలూ, రూపకాలూ, కుప్పతెప్పలుగా వుండేవి.

కవులందరికి "తప్పనిసరిగా" వుండవలసినవంటూ, ఆదేశపూర్వకంగా చేసిన బోధల తర్వాత ఆ గ్రంథంలో ఆ ఆరుగురు పూర్వకవుల రచనల మీద నేరుగా దాడి ప్రారంభమైంది.

శ్రీ అరవిందులను భాషా భేషజంతో కూడిన మార్మిక వేదాంతి అని త్రోసి పుచ్చారు. సరోజినీ నాయుడు విరజిమ్మిన మిణుగురులు కవిత్వాన్ని మింగేటంత పెద్దవన్నారు. "ఎవ్వెరిమాన్స్ లైబ్రరీ" వంటి ప్రతిష్ఠాకరమైన సంస్థ ప్రకటించి నందువల్లనే ఆర్. సి. దత్ రాసిన హెక్సా మీటర్ కవితలు ఆ మాత్రమైనా నిలిచాయని వ్యాఖ్యానించారు. పైగా ఆయన శైలి క్లిష్టంగా, అగమ్యంగా, అవ గాహనాతీతంగా వుంటుందనికూడా అన్నారు. ఈ అర్గురు కవులను మొత్తంమీద

తీసుకుని చూస్తే "భారతదేశంలో యూరప్‌ను తీసుకువచ్చి ప్రతిష్ఠించడానికి జరిగిన ప్రయాత్నమే కనిపిస్తుం" దని యీ ఆధునికులు ఆరోపించారు. ఇంకా యిటువంటి ఎన్నో ఆరోపణలు చేశారు. చనిపోయినవారు లేచి వచ్చి మాట్లాడ గలిగితే, తమ కవితను యిప్పటివారి కవితతో పోల్చుకుని వారుకూడా వీరి మీద ఎన్నో ఆరోపణలు చేయవచ్చు. ఈ కొత్త చెత్త కవిత్వం అంతా ఏమిటి బాబూ, దేన్ని గురించి, యిది యింత అయోమయంగా, రోతగా ఉందేమిటి అనివారూ అడుగుతారు ఆధునికుల్ని. వీరేమంటారంటే, అయోమయంలోనే కవితాశక్తి వుందని జవాబు చెప్తారు. వాడిన ప్రతి శబ్దంలో సత్యం, నిజాయితి గడ్డకట్టుకుని వున్నాయని వారికి బోధిస్తారు. అంతేకాదు, ఈ ఆధునిక కవులు తమ కవితల్లోకి తమతమ వ్యక్తిత్వాలనూ యుగసమస్యలనూ దించుతారు. "భవిష్యత్ కవితా భాషాస్వరూపాల అభివృద్ధికి యివి తోడ్పడతా"యని వాదిస్తారు. ఆధునిక కవుల రచనలు తమ కాలం వారితో మాట్లాడుతున్నట్లుంటాయి. ఛందోబంధాలకు అవి లొంగవు. యువతరం కవుల నూతన రచనా మార్గాలను స్పష్టంగా ఊహించి ఆ మార్గంలో రచనలు చేస్తారు ఆధునికులు. అంతేగాని మనసుకు తోచిన, కంటికి కనిపించిన విధంగా పలచని విషయాలను పట్టుకుని వ్రేలాడరు. చుట్టూ అరాజకత్వం, భయవాతావరణం, సందేహం, అస్థిమితత్వం అల్లుకునివున్న వాస్తవిక లోకంలో అధునికులు జీవిస్తున్నారు. మరి 'ఆంగ్లంలో ఆధునిక భారతీయ కవిత' అనే సంకలనంలో చర్చించిన ఆరుగురు కవులు పూర్తిగా భిన్నమైన మరొక కాలానికి చెందినవారు కదా. వారి కవితలు భారతీయ సాహిత్యం మీద శాశ్వతమైన, గాఢమైన ముద్ర వేశాయి. వారికి కృతజ్ఞతలు చెప్పకుండా చేయగలిగిందేముంది ?

*

సరోజినీదేవి వాడే ఉపమానాలన్నీ స్వాప్నికలోకాలకు చెందినవే; తరచుగా అవి దుఃఖసూచకంగానే ఉంటాయి. గతాన్నీ వర్తమానకాలాన్నీ గురించి చెప్పిన ఒక తొలి రచనలో ఆమె గతాన్ని పురాఋషిస్మృతులు భద్రపరుచుకున్న కొండ గుహతో పోలుస్తుంది. అయితే ఆమె జీవితంలో గడిచిన గతాన్ని ఒకసారి చూస్తే మటుకు అందులో గుహల్లో ఏకాంతవాస స్ఫర్శ ఏమీ కనిపించదు. ఈ కవిత రాసేనాటికి యింకా ఆమె పిన్నవయస్కురాలే. ఆమె స్వర్ణభవనాల్లో భోగభాగ్యాల్లో తులదూగుతున్న కాలమే. అనుభూతిలోనుండి కాక ఊహాలోకంనుండి తెచ్చుకున్న ఉపమానమే అది. మరి వర్తమానం అస్పష్టమైన దేని కోసమో వేచి

చూస్తూ, అది వచ్చిందీ రానిదీ యిదమిత్థంగా తేలక ఆందోళనచెందుతున్న ఆత్మ-భవిష్యత్తు "విచిత్ర విధి బంధంలో చిక్కుకున్న వధువు". పైగా చాలా లేత వయస్సులోనే ఆమె "తెగిపోయిన కలలు" గురించి ఊహించి రాస్తుంది. తన కలలు తెగిపోయాయి కాబట్టి మనోవేదనా భారం తప్పదు. కవిత్వంలో ఆమె జీవితం మీద తన విసుగుకూడా ప్రదర్శిస్తుంది. ఈ లోకంనుండి తప్పించుకు వెళ్ళిపోదామనే అనుకుంటుంది. కాని యీ "జీవితసంఘర్షణ" తప్పదు. దాని "దెబ్బల తాకిడి" భరించక తప్పదు. ఆమె కవితలో కనిపించే యీ దుఃఖసూచనలు, తెగిన కలల వర్ణనలు చూస్తుంటే, ఆమె వ్యక్తిత్వంలోని ద్వంద్వ వైఖరి మనకు కనిపిస్తుంది. ఒకటేమో లోకంలోని సుఖసంతోషాలన్నింటినీ పూర్తిగా, కనీసం పైకి చూడడానికి మనస్ఫూర్తిగా అనుభవిస్తున్న వ్యక్తిత్వం, మరొకటి ఎన్నాటికీ అందని ఏదో ఒక ప్రేమానందంకోసం నిరంతర దుఃఖమార్గంలో పయనిస్తూ, ఆ అందని దానిని ఆదర్శాల కలల్లోకి మార్చుకుని అంతర్ముఖీనమైన ఊహాలోకంలో విహరిస్తున్న వ్యక్తిత్వం. అనారోగ్యం ఆమెను ఎక్కడికి వెళ్ళినా వెంటాడుతూనే వుండేది. 20 సంవత్సరాలలోపు వయస్సులో, ఇంగ్లండులోవున్న సమయంలోనే అనారోగ్యకరమైన శరీరతత్వం బైటపడింది. అయితే ఆమె ఎప్పుడూ "జీవిత దుఃఖాన్ని కవితా దుఃఖంతో" జయిస్తూనే వుండేది. 'అడవిలో' అనే శీర్షికగల ఆమె తొలి రచనను గురించి రాస్తూ, 1902 లో 'ది ఇండియన్ సోషల్ రిఫార్మర్' అనే పత్రిక కవితా సౌందర్యం అందులో గడ్డకట్టుకుని వుందని వ్యాఖ్యానించింది. తోరుదత్తుకు వారసురాలు లభించిందనీ, "ఇది మొగ్గలోనే తునిగిపడేదికాదు. ఈ కవితాకన్య ఎంతో ఎత్తుకు ఎగరగలదు. ప్రకృతి ప్రసాదించిన దివ్యత్వమూ, సమ్యగ్దర్శనమూ కలవారికే యీ పంక్తులలోని కరుణరసావేశం సాధ్యమవుతుంది" అనీ ఆ పత్రిక రాసింది. సరోజినిదేవి కవితాగుణాలను గురించి చెప్పిన యీ మాటలు అతిశయోక్తులే కావచ్చు. కాని ఆమె కవితలో మనసుకు ఒక విచిత్రమైన తన్మయతాస్థితి, ఒక పారలౌకిక వేదాంతానుభూతి కలిగించే లక్షణం మాత్రం వుంది. కాని యిదైనా అంతటా వుండదు. అక్కడక్కడ వెతుక్కుంటే తళుక్కున మెరుస్తుంటుంది. అయినా యీ కాస్త వైలక్షణ్యాన్ని, సంప్రదాయబద్ధంగా, లోతు లేకుండా రాసిన యితర పంక్తులన్నీ కలిసి తుడిచిపారేస్తుంటాయి.

"మృత్యువేదాంత విజ్ఞాన" అన్వేషణలో ఎంత బాధనూ కష్టాన్నీ సహించడానికైనా ఆమె సిద్ధమే. భగవంతుడు ఆమె ప్రార్థనను మన్నించి "ఆనంద

లోకంలోకీ, నిస్పృహల నీడల్లోకి'' సరోజినీదేవికి ప్రవేశం కల్పిస్తాడు. అందువల్ల ఆమె ఆనందం అనుభవిస్తుంది. పేరు ప్రతిష్ఠలు పొందుతుంది. ప్రేమానుభూతి, బాధానుభూతులను కూడా పొందుతుంది. సరోజినీదేవిలోని యీ ద్వంద్వవైఖరి ఎప్పుడూ ఆమెను నిజమైన యోగినీత్వం పొందకుండా వెనక్కు లాగి వేస్తుంటుంది. ఒకసారి స్వప్నలోకాల్లోకి ఉవ్వెత్తుగా ఎగిరిపోతుంది. మరుక్షణం జీవిత పాతాళంలో పడిపోయి అక్కడి బాధలనూ, సంతోషాలనూ రుచి చూస్తుంది. దీనిని బట్టి చూస్తుంటే సరోజినీదేవి లోతైన ఆలోచనారీతిలో మానవప్రేమదాహావేశానికి మూలకారణమేదోనని అన్వేషణసాగిస్తూ, ఆత్మభావాన్ని జగద్వ్యాప్తంచేసే వేదానానుభూతితో మనోనేత్రాన్ని తెరిచి చూస్తున్న వేదాంతిగానైనా కనిపించవచ్చు; లేదా కేవలం మాటల గారడీతో మత్తెక్కి ప్రేమగీతాలు రాసుకుంటున్న కవయిత్రిగా కొట్టి పారేసే విధంగానూ కనిపించవచ్చు.

"శాశ్వత శాంతికి జేజేలు'' అనే గీతంలో యీ ద్వంద్వ వైఖరి కనిపిస్తుంది. ఒకవైపు భయం, ద్వేషం, "వీడని విధిరాత''ను గురించి చెప్తూనే క్షణంలో మళ్ళీ మారి సరోజినీదేవి ఆనందంతో గంతులు వేస్తూ అంటుంది:

అయితే నేను ఆత్మను
పుట్టినందుకు నాకు పుట్టెడు సంతోషం
ఎత్తుగా ఒత్తుగా పెరిగిన ధాన్యం కంకుల సందుల్లోంచి
ఉదయకాంతుల ఉయ్యాలల్లో ఊగే పక్షులసంగీతం
వింటున్నప్పుడు
పుట్టినందుకు నాకు పుట్టెడు సంతోషం —

ఇక్కడ సరోజినీదేవి మెరుపులా మెరిసిపోయే ఒక్కక్షణంలో టాగూరులాగా అనంతత్వాన్ని దర్శిస్తుంది, ఒక గంటలో అనంతత్వాన్ని దర్శించిన బ్లేక్‌లాగా. కాని మరుక్షణంలో పరుగులు తీసుకుంటూవచ్చి మళ్ళీ మన లోకంలో పడుతుంది. మామూలు నిత్యజీవిత వ్యవహారాల్లో మునిగిపోతుంది.

బహుశః యీ ద్వంద్వవైఖరి వ్యక్తిత్వంవల్లనే ఆమెకు మహాకవుల సరసన చోటులేకుండా పోయింది. వేదాంతి అయిన కవికిగానీ, కవులకుగానీ వుండే ఏకాగ్రత

ఆమెలో మృగ్యం. అయినప్పటికీ ఆమె రచనలు కలకాలం నిలువగలిగిన శక్తి గలవే.

మనసులోని భావాలు బాగా పరిపక్వం చెందని దశలోనే చనిపోయినప్పటికి తోరుదత్తు కలకాలం నిలిచే మధురమనోజ్ఞమైన కవిత్వం రాసింది. సరోజినీదేవి అలాకాక సంపూర్ణ జీవితం గడిపింది. కొన్ని మంచి గీతాలు రాసి అంతటితో ఆగి పోయింది. వీరిద్దరికీ వుండే పోలిక ఒక్కటే. ఇద్దరూ భారతీయులూ, యిద్దరూ స్త్రీలు, యిద్దరూ ఆంగ్లభాషలో కవిత్వం చెప్పినవారు. తోరుదత్తు విషయంలో "యింకా ఎంతరాసేదో" చాలకాలం బ్రతికి వుంటే అనిపించి, చిన్న వయసులో మరణం విషాదకర సంఘటనగా కనిపిస్తుంది. సరోజినీదేవి విషయంలో సంపూర్ణ జీవితం గడిపినా 3౮వ ఏటనే రచనకు స్వస్తిచెప్పి, రాజకీయాల్లో కాలం గడపడం కవితకు సంబంధించినంతవరకు ఒక లోపంగానే కనిపిస్తుంది. పైగా తోరుదత్తుకు ఆంగ్లంలో, ఫ్రెంచి, సంస్కృత భాషల్లో మంచి పాండిత్యం వుంది. నిజమైన కవితాహృదయం వుంది. అందువల్ల కవితా శిఖరాగ్రస్థాయికి చేరి యింకా ఉజ్వలంగా వెలిగే అవకాశం ఆమెకు లేకుండాపోయెనే అనే సానుభూతి భావన మనలో తప్పకుండా కలుగుతుంది. సరోజినీదేవి విషయంలో మనకు కలిగే భావం ఏమిటంటే, 1917 లోనే ఆమెలో కవిత్వపు జల యింకిపోయిందని. ఇతర కార్యక్రమాల ఒత్తిడివల్ల నైతేనేమి, తన పాతకాలపు కవితాశైలిని కొత్తకాలపు రీతుల్లో యిముడ్చుకోలేకపోతున్నాననే భావన ఆమెలోనే కలిగినందువల్ల నైతేనేమి, అసలు సరస్వతీదేవి కరుణాకటాక్షం తప్పి ఉత్సాహం సన్నగిల్లి పోయినందువల్లనైతేనేమి, అంత తొందరగానే ఆమె అస్త్ర సన్యాసం చేసిందనే భావన మనకు కలుగుతుంది. ఆమె ఆ విధంగా హఠాత్తుగా ఆగిపోవడానికి కారణం, తన కవితలు ఎన్నాళ్ళు రాసినా చిన్నపిల్ల తరహా కవితలుగానే వుంటున్నాయనే గ్రహింపు తనకే కలిగినందువల్ల కావచ్చు, కనీసం నలభయ్యో పడిలో పడిన తర్వాతనైనా యీ ప్రేమ గీతాల గొడవ వదిలేసి మరొక మంచిదారి త్రొక్కాలనే ఆలోచన ఆమెలో కలిగి వుండవచ్చు. ఆవిధంగా ఆమె ఒక కొత్తదారి వెతుక్కుంది.

ఈ యిద్దరు కవయిత్రుల మధ్య మరొక పోలికవుంది, యిద్దరినీ ఎడ్మండ్ గూసే ప్రోత్సహించి వెలుగులోకి తెచ్చాడు. ఇద్దరి కవితా సంపుటాలకు ఆయన పీఠికలు రాశాడు. గూసే తనకు "కవితా స్వర్ణప్రాంగణంలోకి తొలిసారిగా దారి చూపించా" డని సరోజినీదేవి రాసుకుంది. గూస్ తోరుదత్తును గురించి యిలా

రాశాడు. "మీ దేశపు సాహిత్య చరిత్రలో ఒక పేజీలో యీ విదేశీ కవితా పుష్ప పరిమళం తప్పని సరిగా ఘుమఘుమాయించి కొడుతూనే వుంటుంది." తోరుదత్తు, సరోజినీదేవి, యిద్దరి కవితలు నిరాడంబరంగానే వుంటాయి. కాని తోరుదత్తు కవిత ఎక్కువ సహజంగానూ, పరిపక్వమైనదిగానూ వుంటుంది. సరోజినీదేవి కవిత సాంప్రదాయికమైనది. పైగా దీనిలో సంగీత ఫణితి ఎక్కువ. తోరుదత్తు ఎప్పుడూ తన సంతోషాలు, బాధలను గురించి ప్రపంచానికి చాటిచెప్పదలచలేదు. కానీ సరోజినీదేవిలో వస్త్వాత్మకదృష్టి ఎక్కువగా వున్నా తన విషయాలు అంతకంటే ఎక్కువగానే చెప్పింది. తోరుదత్తు "సరివి చెట్టు" అనే ఒక గొప్ప గేయంలోనూ, తన తండ్రిని గురించి రాసిన స్మృతిగీతంలోనూ, మాత్రమే తన లోపలి భావనలను బైటికి వెళ్ళగ్రక్కింది. అంతకుమించి బాధలతోనిండిన స్వీయ, స్వల్ప జీవితంలోని విషాద పరిస్థితుల ప్రస్తావనే ఆమె కవితలో ఎక్కడా కనిపించదు.

ప్రకృతిలోని వస్తువులను పరిశీలించడంలోకూడా యీ యిద్దరు కవయిత్రులలో చాలా తేడా వుంది. చెట్లను గురించి తోరుదత్తు వర్ణించే విధానం సరోజినీదేవి పద్ధతికి పూర్తిగా వ్యతిరేకంగా వుంటుంది. తోరుదత్తుకు చెట్లు అంటే సహజంగా తన యెదుట దేశంలో కనిపిస్తున్న తాను ప్రేమిస్తున్న చెట్లే; సరోజినీదేవికి అలా కాదు. తాను వర్ణించే వస్తువులన్నీ తప్పనిసరిగా భారతీయమైనవై వుండాలి అనే దీక్షతో చేసే వర్ణన ఆమెది — గూస్ చేసిన బోధవల్ల కావచ్చు. ప్రాచ్య సంస్కృతి పరిధిలోనే, కావాలని వర్ణించినట్లుగా వుంటాయి ఆమె చెట్లు. ఉదాహరణలు చూద్దాం : తోరుదత్తు వర్ణన.

తూరుపుగా సాగిపోయిన యీ వెదురు వనం
నోరుతెరిచి అవులిస్తున్నట్లున్న సందులోంచి
వెనకాల చల్లని చంద్రుడు తొంగిచూస్తున్నప్పుడు,

తెల్లతామరలు వెండిగిన్నెలుగా ముడుచుకొనిపోయినప్పుడు
అంతకు మించిన సౌందర్యం అవనిలో మరెక్కడుంది?
మనిషికి ఆ అందం తాగితే మత్తురాక మరేమవుతుంది?
ఆశ్చర్యంలో ఆ పురాతనకాలపు 'ఈడెన్'తోట గుర్తొస్తుం
దేమో!

సరోజినీదేవి వర్ణన "సంపెంగ పూసింది" అనే కవితలో—

నీ పసుపు రంగుదళాలు, దంతపు దళాలు
ధవళ రత్నాల రాసులు తళతళా మెరిసే దళాలు
ఘుమ ఘుమల పరిమళంతో
కొల్లగొడుతున్నాయి వనాలు, పొలాలు –
ఈ మహర్దశ నిజంకాదు, నిలువదెంతో సేపు నీకు యీ
బంగారు కాలం
వాడిపోతావు నువ్వు, తొడిమ ఊడిపోతావు నువ్వు

"టెన్నిసన్‌కు లాగా ప్రకృతి సరోజినీదేవికి కూడా మానవ ఆవేశాలను చిత్రించడానికి పూర్వరంగం వంటి ఒక సాధనం". అని ఒక విమర్శకు డన్నాడు. కాని దీనితో నేను ఏకీభవించలేను. ఎందుకంటే, మానవ ప్రకృతిని అర్థం చేసుకోవడంలోగానీ, ఆవిష్కరించడంలోగానీ ఏ నాడూ సరోజినీదేవి ప్రతిభావంతమైన కవయిత్రిగా రాణించనేలేదు. ఆమె భావాలు ఎప్పుడూ స్వప్నలోకపు అస్పష్టత అనే ముసుగువేసుకునే వుండేవి. ఎప్పుడూ పూలరేకులమీద చిందులువేస్తూ, పక్షి సంగీతాలకు స్వరకల్పన చేస్తూనే వుండేవి. మత విషయిక సంకేతాల మధ్యలో యిరుక్కునే వుండేవి. ఆమె కవితలో కనిపించే మనిషి, యీ లోకంలోని సుఖ దుఃఖాలను అనుభవించడానికి జన్మమెత్తి, జీవిత వైవిధ్యాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ నిటారుగా నిలబడ్డ సజీవమైన వ్యక్తిగా వుండడు. బుద్బుదప్రాయంగా కనిపించే ఒక అభూత కల్పనాలోకంలో పుష్పవస్త్రాలు ధరించి, ఉపమానాల ఉయ్యాలలో ఊగుతుంటాడు. అయినా ఆమె చేసే యీ క్షణికరసోదయ గీతాలాపనంకూడా హృదయంగమంగా వుంటుంది. ఉల్లాసాన్ని కలిగించి, రసాబ్ధిలో మునకలు వేయిస్తుంది. ఆత్మానుభూతిని కలిగించి, ఆదర్శలోకాలవైపు నడిపిస్తుంది.

సరోజినీదేవి జీవితతత్వం ఆమె చేసిన ప్రసంగాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అవి ఏనాటికీ మరపురాని మహావ్యక్తిత్వకళాఖండాలు, వాటిని వినే భాగ్యం కలిగిన మాబోటివాండ్ల చెవుల్లో ఎప్పటికి అవి మార్మోగుతూనే వుంటాయి. ఆమె వాడే భాష శ్రవణపేయంగా, అలంకారికంగా, ప్రావాహికంగా వుంటుందనీ అందువల్ల అది ఏదో ఒక ఆనందానుభూతి కలిగించే స్వాప్నికలోకాలవైపు

యీడ్చుకుపోతుందనే ఆరోపణ వుంది. అయినా ఆమె చెప్పేదాంట్లో సరుకు వుందనే నాకు అనిపిస్తుంది. మన అందరం అనుసరించదగిన ఆదర్శాన్ని ఆమె మనముందుంచుతుంది. అందరం అందుకోవలసిన చందమామను చూపిస్తుంది. ఆకాశమంత పెద్దకృషి చేయాలని ప్రబోధిస్తుంది. జాతి శ్రేయస్సు జాతి ఐక్యతా సాధన మనకర్తవ్యం అని చెప్తుంది. ఇంకా ముందుకు తీసుకుపోయి ప్రపంచైక్యతా నినాదం కూడా యిస్తుంది. భారతదేశం జపించవలసినది 'ఐక్యతా మంత్ర' మని సరోజినీదేవి ప్రజలకు ప్రబోధం చేస్తుంది. ఇంకా ఆమె ప్రసంగాల్లో సంఘంలో సాధించవలసిన సంస్కరణలను గురించీ, తొలగించవలసిన లోపాలను గురించీ, దేశ స్వాతంత్ర్యాన్ని గురించీ, శాంతి ప్రచారాన్ని గురించీ, అన్ని కులాలు, మతాలు, జాతులపట్ల ప్రేమాభిమానాలు ప్రదర్శించవలసిన ఆవశ్యకతను గురించీ ఎన్నో విషయాలు ఉండనే వుంటాయి. ఎప్పుడు ఆమె ప్రసంగం విన్నా, తిరిగి వెళ్ళేటప్పుడు ఎత్తుగా ఎగరటానికి మనం ఉత్సాహంతో గట్టిగా కృషిచేసినకొలదీ రెక్కలు పెరుగుతాయనీ, ఆదర్శాలను అందుకునేశక్తి వస్తుందనే విశ్వాసం కలుగుతుండేది. మానవజాతి శ్రేయస్సుకోసం విరామం లేకుండా అహోరాత్రులు కృషి చేయాలని ప్రబోధించడమే ఆమె ఏకైక లక్ష్యం. ఆశాజనకమూ, వైభవో పేతమూ అయిన ఒకానొక నూతన ప్రపంచాన్ని నిర్మించుకోడం ప్రతి మానవుడి విస్యుక్త ధర్మమని సరోజినీదేవి ప్రబోధాల సారాంశం.

ఆ విధంగా అపూర్వమైన గుండె ధైర్యంతో ముందడుగు వేస్తూ మానవజాతి మంచికోసం కృషి చేస్తూ యీ కవయిత్రి జీవయాత్ర గడిపింది. జీవితాంతం తన కలలు ఫలించాలనే దీక్షతో పనిచేసి గౌరవప్రదమైన ఏకాంత జీవితం గడిపి పోయింది. ఇదీ ఆమె యిచ్చిన సందేశం: మనందరం జీవించాలి. "హింసావాతా వరణంలో కాదు, కోపంతోకాదు, కసితోకాదు, తూర్పుదేశాల నిజమైన బిడ్డల్లాగా చివరిక్షణందాకా ఓర్పుతో, ధైర్యంతో, ఆత్మసంస్కృతి సైనికదళంలో వీరభటు లుగా మనం విజృంభించాలి. హరిశ్చంద్రునివలె ఎన్ని అడ్డంకులనైనా ఎదు ర్కొంటూ, ఎన్ని అగ్ని పరీక్షలకైనా తట్టుకుంటూ మనం జీవించాలి. మన తరం వాళ్లు కూడా ఆత్మకు వినాశం లేదని ప్రపంచానికి చాటి చెప్పాలి. మా పూర్వీకులు యింత గొప్పవారని ముందుతరాలవారు మనలనుగురించి చెప్పుకునే యోగ్యత మనం సంపాదించుకోవాలి. ఈ యుగంలో సత్యానికి సంరక్షకులం మనమే. ధర్మాన్ని అవలంబిస్తున్నది మనమే. అందువల్లనే ఆ యోగ్యత మనకు లభించింది."

# గ్రంథ సూచిక


1. పాటలు (సాంగ్స్) అఘోరనాథ్ ఛటోపాధ్యాయ సొంత ప్రచురణ, 1896

2. స్వర్ణప్రాంగణం (ది గోల్డెన్ త్రెషోల్డ్) విలియం హినీమన్, లండన్, 1905

3. కాలవిహంగం (ది బర్డ్ ఆఫ్ టైమ్) విలియం హినీమన్, లండన్, 1912

4. తెగిన రెక్క (ది బ్రోకెన్ వింగ్) విలియం హినీమన్, లండన్, 1917

5. మురళీదండం (ది సెప్టర్డ్ ఫ్లూట్) డాడ్‌మీడ్ అండ్ కం. జోసెఫ్ ఆస్లండర్ పీఠికతో 1937

6. మురళీ దండం — కితబిస్తాన్, భారతదేశంలో ప్రథమంగా ప్రచురణ, 1946(ద్వితీయ ముద్రణ)

7. భారత బహూకృతి (ది గిఫ్ట్ ఆఫ్ ఇండియా) హైదరాబాద్ మహిళల యుద్ధ సహాయసంస్థ నివేదికనుండి పునర్ముద్రితము 1914 - 15

8. గోపాలకృష్ణ గోఖలే; మొదటిసారిగా బాంబే క్రానికల్‌లో ప్రకటితమైన చిన్న పుస్తకం

9. భారతాత్మ (ది సోల్ ఆఫ్ ఇండియా) ప్రథమ ముద్రణ. హైదరాబాదు, దక్కన్ 1917, ద్వితీయముద్రణ, ది కేంబ్రిడ్జ్ ప్రెస్, మద్రాసు 1919

[ ఈ తొమ్మిది శీర్షికలు సరోజినీదేవి రాసిన కవితా సంపుటాలు, రచనలు ]

10. సరోజినీనాయుడు ప్రసంగాలు, రచనలు పి. ఎ. నటేశన్ అండ్ కం. మద్రాసు, ద్వితీయ తృతీయ ముద్రణలు.

11. భారత మహిళామణులు (ది గ్రేట్ విమెన్ ఆఫ్ ఇండియా) కమలా సత్యనాథన్, లాంగ్‌మన్స్, ఇండియన్ రీడింగ్ బుక్స్, 1980

12. నేనూ నా జీవితం : ఉదయంనుండి మధ్యాహ్నం దాకా (లైవ్ అండ్ మైసెల్ఫ్, డాన్ అప్రోచింగ్ నూన్) హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ సంపుటం 1. నలందా ప్రచురణలు బొంబాయి

13. మహిళా పత్రిక (ది లేడీస్ మేగజిన్) 1901 – 1917 కె. సత్య నాథన్ సంపాదితం

14. భారత మహాపురుషులు, మహిళామణులు (మెన్ అండ్ విమెన్ ఆఫ్ ఇండియా), మే 1906

15. సరోజినీనాయుడు, అమర్‌నాథ్ ఝూ సొంత ప్రచురణ

16. ఆంగ్లంలో భారతీయ రచనా వ్యాసంగం (ఇండియన్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్) కె. ఆర్. శ్రీనివాస అయ్యంగార్, ఆసియా పబ్లిషింగ్ హౌస్, 1962

17. భారత పునరుజ్జీవనం (ది రిసయాజాన్స్ ఆఫ్ ఇండియా) జేమ్స్. హెచ్. కజిన్స్, గణేశ్ అండ్ కం. మద్రాసు

18. భారత నారీమణులు (విమెన్ ఆఫ్ ఇండియా) ప్రధాన సంపాద కులు, తారాఅలీబేగ్, పబ్లికేషన్స్ డివిజన్, 1958

19. మహాత్మాగాంధీ ఉద్యమంలో మహిళామణులు (విమెన్ బిహైండ్ మహాత్మాగాంధీ) ఎలినార్ మార్టన్. మాక్స్ రీస్ హోర్డ్, లండన్, 1954

20. పాత లేఖలు (ఎ బంచ్ ఆఫ్ ఓల్డ్ లెటర్స్) ఆసియా పబ్లిషింగ్ హౌస్, 1958

21. గాంధీతో గడిపిన రోజులు (మై డేస్ విత్ గాంధీ) నిర్మల్ కె. బోస్, నిషానా, 1953

22. మౌంట్‌బ్యాటన్‌తో మంతనాలు (మిషన్ విత్ మౌంట్‌బ్యాటన్) అలన్ క్యాంప్ బెల్ జాన్సన్

23. జెస్టింగ్ పిలేట్, అల్డస్ హక్స్‌లీ, ఛాటో అండ్ విండస్, 1931

24. దిగంబర సన్యాసి (ది నేకెడ్ ఫకీర్) రాబర్ట్ బెర్నెస్, విక్టర గోలాంజ్, లండన్, 1954

25. నా గాంధీ (మై గాంధీ) జాన్ హేన్స్ హోమ్స్, అలెన్ అండ్ అన్విన్. లండన్, 1954

26. ఆసియాలో మహిళాచైతన్య వికాసోద్యమం (ది అవేకనింగ్ ఆఫ్ ఏషియన్ విమెన్ హుడ్, మార్గరెట్, ఇ. కజిన్స్. గణేశ్ మద్రాసు, 1922

27. 'యంగ్ ఇండియా' పత్రిక 1929 ఏప్రిల్ 11 సంచిక

117708
20/12/04
SIMLA



28. ది లీడర్ పత్రిక, 1948 ఫిబ్రవరి 14 సంచిక

29. భారతీయ ఆంగ్ల కవితా స్వర్ణపేటిక 1829 - 1865 (ది గోల్డెన్ ట్రెజరీ ఆఫ్ ఆంగ్లో - ఇండియన్ పొయట్రీ) పి. కె గోకక్ సంపాదితం, సాహిత్య అకాడెమీ

30. భారతీయుల ఆంగ్ల కవితా వ్యాసంగం (ఇండో ఆంగ్లియన్ పొయట్రీ) పి. సి. కోటోకీ, ప్రచురణశాఖ, గౌహతి విశ్వవిద్యాలయం, 1969

31. 19 వ శతాబ్దంలో భారతీయ ఆంగ్ల సాహిత్యం (ఇండో-ఇంగ్లీషు లిటరేచర్ యిన్ ది నైన్‌టీన్త్ సెంచరీ) జాన్ బి. అల్ఫాన్సోకర్కాలా, అర్ధ సంవత్సర సాహిత్య పత్రిక, మైసూరు విశ్వవిద్యాలయం

32. ఆంగ్లంలో భారతీయ రచనలపై విమర్శ వ్యాసాలు (క్రిటికల్ ఎస్సేస్ ఆన్ ఇండియన్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్) సంపాదకులు ఎం. కె. నాయర్, ఎస్. కె. దేశాయ్, జి. ఎస్. అమూర్, కర్నాటక విశ్వవిద్యాలయం, ధార్వార్, 1968

33. హంస, గరుడపక్షి (ది స్వాన్ అండ్ ది ఈగిల్) సి. డి. నరసింహయ్య, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, సిమ్లా 1969

34. రెండు గొంతులు (ది టూ ఫోల్డ్ వాయిస్) భారతీయ ఆంగ్ల రచనలపై వ్యాసావళి, సంపాదకుడు డి. పి. కె. రాఘవాచార్యులు, నవోదయ పబ్లిషర్స్

35. ఆసియా సంబంధాలు — ప్రథమ ఆసియా సంబంధాల మహాసభ కార్యక్రమం, నివేదిక, (న్యూఢిల్లీ 1947) ఆసియా సంబంధాల సంస్థ ప్రచురణ, న్యూఢిల్లీ, 1948

36. ఆంగ్ల ఆధ్యాత్మిక కవిత (ఆక్స్‌ఫర్డ్ బుక్) క్లేరెండన్ ప్రెస్, ఆక్స్‌ఫర్డ్, 1917

37. భారత జాతీయ కాంగ్రెసు చరిత్ర, పట్టాభి సీతారామయ్య, పద్మా పబ్లికేషన్స్, బొంబాయి, 1946 - 47

38. ఆంగ్లంలో ఆధునిక భారతీయ కవిత (మోడరన్ ఇండియన్ పొయట్రీ ఇన్ ఇంగ్లీష్) కవితా సంకలనం, సంపాదకుడు పి. లాల్, రైటర్స్ వర్క్‌షాప్ - కలకత్తా

39. సరోజినీనాయుడు, పద్మినీ సేన్‌గుప్తా, ఆసియా పబ్లిషింగ్ హౌస్, 1966

సరోజినీనాయుడు (1879–1949) ఆంగ్ల కవితా చరిత్రలో ప్రత్యేకంగా తనకొక కీర్తిలోకాన్ని నిర్మించుకున్న కవయిత్రి. ఆంగ్లంలో కవిత రాసిన ఒక భారతీయ వనితగాకాక, ఆభాషా సౌందర్యం అతి సహజంగా రచనలో ప్రతిబింబింపజేసిన కవయిత్రిగా ఆమెకు గౌరవం కలిగింది. అయితే ఆమె భారతీయ భావనారీతికి దూరం కాలేదు. అచ్చం భారతీయ వనితగా, దేశభక్తిగల పుత్రికారత్నంగా ఈ మహోన్నత జాతిజీవనంలో విడదీయరాని భాగంగా వుండి ఆమె తన కవితా వ్యాసంగం సాగించింది.

బ్రహ్మసమాజ సిద్ధాంతం, సహనశీలం, మానవజాతి ప్రేమభావన వాతావరణంలో పుట్టి, హైదరాబాదులోని హిందూ - ముస్లిం సోదర వ్యవస్థలో పెరిగిన బిడ్డ సరోజినీదేవి. ఆంగ్లేయుల విద్యావ్యవస్థలోనే పుట్టి పెరిగి ప్రకాశించిన సరోజినీదేవి, జాతీయతను కోల్పోయి గుడ్డిగా పాశ్చాత్యభావదాస్యానికి లొంగిపోయిన భారతీయ యువకుల వైఖరిపట్ల అసమ్మతిని ప్రకటించింది. అయినా ఆమెకు బాల్యంనుండి కూడా ప్రాచ్య పాశ్చాత్య స్నేహవాతావరణమే ఉగ్గుబాలతో నూరిపోశారు.

సరోజినీదేవి దేశానికి యిచ్చిన సందేశం, అందుకోవలసిన చందమామ ఒకడున్నాడనీ, జాతిప్రజలు ఎగరవలసిన ఎత్తుకు ఆకాశమే హద్దనీ, సమైక్య విశ్వశ్రేయోకాంక్షతో కదలి కృషి చేయాలనీ.

"భారతదేశపు నైటింగేల్" అనే పేరును ఆమె సార్థకం చేసుకున్నది. ఆమె ప్రసంగ
చెవుల్లో పికిగీత పంచమస్వర
మ్రోగుతూనే వుంటుంది.

ఈ సంగ్రహ జీవిత
సెన్‌గుప్త తన తల్లి స్నేహితురాలిగా సరోజినీదేవిని బాగా ఎరిగిన వ్యక్తి. 'భారత కోకిల' ను గురించి, రాజకీయవేత్తగా కొంత తెలిసినా, కవయిత్రిగా ఎక్కువగా తెలియనివారికోసం ఆమె యీ గ్రంథం రాసింది.

Library IIAS, Shimla
TL 923.254 N 143 S
00117708

SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00